ఈనాడు

విజయవాడ 29-1-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 169
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మహా విషాదం



బారామతిలో దిగుతుండగా కూలిన విమానం • పొగ మంచే కారణం!

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా ఐదుగురి దుర్మరణం

బారామతి

మహారాష్ట్రలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ (66) దుర్మరణం పాలయ్యారు. ఆయనతోపాటు మరో నలుగురు చనిపోయారు. బుధవారం ఉదయం 8.45 గంటల సమయంలో బారామతి విమానాశ్రయం సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. విమానం రన్‌వేపై దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. దీంతో అందులోని వారంతా మరణించారు. మరణించిన వారిలో కెప్టెన్ సుమిత్ కపూర్ (15,000 గంటలపాటు విమానాలు నడిపిన అనుభవం), కోపైలట్ శాంభవి పాఠక్ (1,500 గంటలు విమానాలు నడిపిన అనుభవం), వ్యక్తిగత భద్రతాధికారి విదిప్ జాదవ్, ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి ఉన్నారు. మంగళవారం ముంబయిలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో పాల్గొన్న అజిత్ పవార్.. బుధవారం ఉదయమే బారామతికి బయలుదేరారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో భాగంగా 5 ప్రచార ర్యాలీల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. కానీ ఆయన ప్రయాణిస్తున్న విమానం కుప్పకూలి తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పవార్‌కు భార్య సునేత్ర పవార్ (రాజ్యసభ సభ్యురాలు), ఇద్దరు కుమారులు పార్థ్, జై ఉన్నారు. విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించడంపట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అజిత్ పవార్ మృతికి సంతాప సూచకంగా 3 రోజుల సంతాప దినాలను మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆయన అంత్యక్రియలు గురువారం బారామతిలో ప్రభుత్వ లాంఛనాలతో జరగనున్నాయి. (మిగతా 2లో)

ఎయిర్‌క్రాఫ్ట్ రాడార్ అందించిన వివరాల ప్రకారం.. ముంబయిలో 8.10 గంటలకు అజిత్ పవార్ ఎక్కిన విమానం బయలుదేరింది. 8.45 గంటల సమయంలో అది రాడార్ నుంచి అదృశ్యమైంది. ఆ తర్వాత నిమిషానికే అది కూలిపోయింది.



ప్రమాదఘటన స్థలంలో విమాన శకలాల్లోంచి వెలువడుతున్న మంటలు

చురుకైన యువ పైలట్.. శాంభవి పాఠక్

'మళ్లీ ఫోన్ చేస్తా నాన్నా..' కుమార్తె పింకీ మాలీ చివరి మాటలు ఇవే.. గుర్తు చేసుకుని విలపిస్తున్న విమాన అటెండెంట్ తండ్రి 11లో

మరాఠ్వాడా గడ్డపై రాజకీయ మాంత్రికుడు బాబాయిపైనే అజిత్ రాజకీయ తిరుగుబాటు



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. పాల్గొన్న మంత్రులు, ఉన్నతాధికారులు

జూన్‌కి లబ్ధిదారుల చేతికి 2.61 లక్షల టిడ్కో ఇళ్లు

- వీటికోసం హడ్కో నుంచి పొందే రూ.4,451 కోట్ల రుణానికి ప్రభుత్వ హామీ
- అథ్లెట్ యర్రాజి జ్యోతికి 500 చ.గజాల స్థలం, గ్రూప్-1 ఉద్యోగం
- పోలవరం నిర్మాణానికి రాయి కోసం హిల్ నంబరు 902లో తవ్వకాలు
- మదనపల్లె మండలం వలసపల్లిలో కేంద్రీయ విద్యాలయానికి 6.09 ఎకరాలు
- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లోని 2.61 లక్షల టిడ్కో ఇళ్లను జూన్ నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఆ ఇళ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల పనులకు ఏపీ టిడ్కో, రూ.4,451 కోట్ల మేర హడ్కో నుంచి తీసుకునే రుణానికి ప్రభుత్వ హామీ ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పిడుగురాళ్లలో బోధనాసుపత్రిని ప్రభుత్వం నిర్వహించనుంది. ఇందులో భాగంగా ప్రస్తుతమున్న 330 పడకల ఆసుపత్రిని 420 పడకలకు పెంచేందుకు, అవసరమైన పోస్టుల భర్తీకి, ఇతర కళాశాలల నుంచి సర్దుబాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. (మిగతా 2లో)

దేశమే అన్నిటికన్నా మిన్న
కొన్ని అంశాలు విభేదాలకు అతీతం
ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ముర్ము 11లో

పసిడి రూ.10,000.. వెండి 23,700 పెరిగాయ్
వివరాలు బిజినెస్ లో

హైకోర్టు న్యాయమూర్తిగా బాలాజీ మెడమల్లి

కేంద్రానికి సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం



బాలాజీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా న్యాయవాది బాలాజీ మెడమల్లి పేరును సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో బుధవారం సమావేశమైన కొలీజియం ఇందుకు ఆమోదం తెలిపింది. 37 న్యాయమూర్తుల పోస్టులు మంజూరైన ఏపీ హైకోర్టులో ప్రస్తుతం 32 మంది (మిగతా 2లో)

అనుమానమే లేదు.. అది కల్తీ నెయ్యే

- శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించారు..
- కోట్ల మంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారు
- భోలేబాబా డెయిరీలో 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి తయారీ
- నాటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ హోదాలో చిన్నప్పన్న జోక్యం
- తుది అనుబంధ అభియోగపత్రంలో సిట్ వెల్లడి



ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో 2019-24 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానానికి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నిగ్గు తేల్చింది. దీన్నే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించారని నిర్ధారించింది. తద్వారా కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొంది. తిరుమలకు నెయ్యి సరఫరా టెండర్లలో పాల్గొనేందుకు 2019 కంటే ముందున్న కఠిన నిబంధనల్ని వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత సడలించేసిన వైనాన్ని అభియోగపత్రంలో ప్రస్తావించింది. టెండర్లలో పాల్గొనే డెయిరీలు పాలు సేకరించాల్సిన పనిలేదని, వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేదని, డెయిరీ మూడేళ్ల కార్యకలాపాలు చేయక్కర్లేదని, ఏడాది చాలని, రూ.250 కోట్ల టర్నోవర్ అవసరం లేదని, రూ.150 కోట్లు ఉంటే చాలని తితిదే పాలకమండలి, ఉన్నతాధికారులు కలిసి నిబంధనలు మార్చేసిన వైనాన్ని, అదే అదునుగా కల్తీ నెయ్యి సరఫరా సంస్థలు చొరబడిన తీరును సమగ్ర ఆధారాలతో ప్రస్తావించింది. 'భగవాన్‌పూర్‌లోని భోలేబాబా ఓర్గానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ7)లో 2019 నుంచి 2024 వరకూ 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి తయారు చేశారు. అందులో 59.71 లక్షల కిలోలను అగ్‌మార్క్ స్పెషల్ గ్రేడ్ ఆవు నెయ్యి ముసుగులో తితిదేకు సరఫరా చేశారు. (మిగతా 3లో)

రెండేళ్ల నిరీక్షణకు తెర

- గ్రూప్-2 ఎంపిక జాబితా వెల్లడించిన ఏపీపీఎస్సీ
- 905 పోస్టుల్లో 891కి అభ్యర్థుల ఎంపిక
- హైకోర్టు ఆదేశాలతో 2 పోస్టులు పెండింగ్‌లో
- 12 పోస్టులకు రిజర్వేషన్ అభ్యర్థులు నిల్

ఈనాడు, అమరావతి: రెండేళ్ల నిరీక్షణ ముగిసింది.. గ్రూప్-2 తుది ఎంపిక జాబితాను ఏపీపీఎస్సీ మంగళవారం అర్ధరాత్రి విడుదల చేసింది. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ఆనందానికి అవధుల్లేవు. 2023లో 905 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. నాటి నుంచి ఎంపిక జాబితా విడుదలకు 25 నెలలకు పైగా సమయం పట్టింది. కోర్టు కేసులతో ఎంపిక ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. రిజర్వేషన్ రోస్టర్‌కు సంబంధించి కొంతకాలం, స్పోర్ట్స్ కోటాపై హైకోర్టులో కేసుల కారణంగా మరికొంత కాలం జాప్యం జరిగింది. క్రీడా కోటా సర్టిఫికెట్ల పరిశీలనకు శాప్ ఎక్కువ సమయం తీసుకుంది. పరీక్షలు పూర్తయినప్పటి నుంచి ఫలితాల కోసం అభ్యర్థులు ఏపీపీఎస్సీ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చింది. 905 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రాగా, 891 పోస్టులకు అభ్యర్థుల జాబితాను ఏపీపీఎస్సీ (మిగతా 13లో)

దీక్షగా చదివి... కొలువులు గెలిచి 13లో

ఏలూరు పోలీసుల 'ధర్మా'స్త్రం

- యాప్ సాయంతో పక్కాగా విచారణ, ప్రాసిక్యూషన్
- 15 నెలల్లో 51 మంది నేరగాళ్లు జైలుకు



ఈనాడు - ఏలూరు

హత్యలు, అత్యాచారాలు, యాసిడ్ దాడులు, సైనైడ్ ప్రయోగం.. వంటి తీవ్ర నేరాల్లో విచారణ లోపాల వల్ల నిందితులు తప్పించుకున్న ఉదంతాలెన్నో! నేరాన్ని నిరూపించేలా పోలీసులు సరైన సాక్ష్యాధారాల్ని కోర్టుకు సమర్పించకపోవడం, నేర స్థలంలో సేకరించిన ఆధారాలను భద్రపరచకపోవడం, వాటిని కోర్టుకు అందించకపోవడం, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టక పోవడం వంటి కారణాలతో శిక్షలు పడడం లేదు. ఇలాంటి కేసుల్లో నేరగాళ్లకు కచ్చితంగా శిక్షలు పడేలా కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో పక్కాగా వ్యవహరిస్తున్నారు ఏలూరు జిల్లా పోలీసులు. ప్రాథమికంగా హత్య ఆనవాళ్లే లేని కేసులోనూ లోతైన దర్యాప్తు చేసి, ఆధారాలు సేకరించి, నేరగాడికి శిక్ష పడేలా కోర్టులో నిరూపించారు. ఇందుకు 'ధర్మ' పేరిట పోలీసులు అంతర్గతంగా వినియోగిస్తున్న యాప్ సత్ఫలితాలిస్తోంది.

యాప్‌లో వడపోశాకే కోర్టుకు

ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆధ్వర్యంలో 'ధర్మ' పేరిట ప్రత్యేకంగా ఓ యాప్‌ను పోలీసుల అంతర్గత వినియోగం (మిగతా 2లో)



దిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సమావేశమైన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమిత్ షాతో పవన్ కల్యాణ్ భేటీ

- రాష్ట్ర అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు వెల్లడి

ఈనాడు, దిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. బుధవారం సాయంత్రం ఇక్కడి కృష్ణమీనన్ మార్గ్‌లోని హోంమంత్రి అధికారిక నివాసంలో ఈ సమావేశం జరిగింది. తమ మధ్య అర్థవంతమైన సమావేశం జరిగినట్లు పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'హోం మంత్రితో మంచి సంభాషణ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతమున్న విభిన్న అంశాలు, ప్రజా, పరిపాలనా ప్రాధాన్యమైన విషయాలపై మేం విస్తృతంగా చర్చించాం. ఉప్పాడ సముద్ర కోత రక్షణ గోడ నిర్మాణానికి (మిగతా 2లో)

పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా అభివృద్ధి చేయండి
అశ్వినీ వైష్ణవ్‌కు ఉపముఖ్యమంత్రి వినతి 10లో

న్యాయవ్యవస్థలో


ఏఐతో బహు జాగ్రత్త

- దానికి స్పృహ, విచక్షణ, సాక్ష్యాధారాల విశ్లేషణ తెలియవు
- న్యాయాధికారులను అప్రమత్తం చేస్తూ హైకోర్టు తీర్పు
- లేని తీర్పులను సృష్టించి ఇచ్చిన ఏఐ
- వాటిని ఉత్తర్వుల్లో ప్రస్తావించిన ఓ న్యాయాధికారి



ఈనాడు, అమరావతి: న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం కంటే మానవ మేధస్సుకే అధిక ప్రాధాన్యమివ్వాలని హైకోర్టు స్పష్టం చేసింది. తీర్పుల విషయంలో ఏఐని వినియోగించేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని దిగువ కోర్టుల న్యాయాధికారులను అప్రమత్తం చేసింది. సాంకేతికత ఎంత పెరిగినా న్యాయమూర్తుల విచక్షణే అంతిమమని తేల్చిచెప్పింది. మానవ మేధస్సుకు, విశ్లేషించే సామర్థ్యానికి ఏఐ ప్రత్యామ్నాయం కాదని పేర్కొంది. తీర్పులను తయారు చేసే సమయంలో ఏఐపై పూర్తిగా ఆధారపడవద్దని, అది ఇచ్చిన సమాచారాన్ని యథాతథంగా తీసుకోవద్దని హెచ్చరించింది. తీర్పులు చట్టబద్ధమైన (మిగతా 2లో)

ఇదీ సంగతి!



సారీ.. ఇది నా కుర్చీ!

సారలమ్మ ఆగమనం

- కన్నెపల్లి నుంచి దగ్గరుండి తీసుకొచ్చిన తెలంగాణ మంత్రులు సీతక్క, అడ్లూరి
- వనదేవతకు అడుగడుగునా నీరాజనాలు
- నేడు సమ్మక్క రాక

10లో



తెలంగాణలోని మేడారంలో జాతర మైదానం, పరిసరాల్లో వెలసిన దుకాణాలు, గుడారాలు. అంతరచిత్రంలో జంపన్న వాగులో నుంచి సారలమ్మను తీసుకొస్తున్న పూజారులు, మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పోలీసు ఉన్నతాధికారులు

ఏళ్ల నాటి రుణం.. వెంటాడుతోంది!

- కేవలం సెక్యూరిటీల భారమే.. రూ.4.33 లక్షల కోట్లు
- ఇది తీరాలంటే 2064 వరకూ కట్టాల్సిందే
- రాష్ట్రం ఏటా చెల్లించాల్సిన అప్పులపై ఆర్‌బీఐ నివేదిక



ఈనాడు - అమరావతి

ఉమ్మడి, విభజిత ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాలు రిజర్వ్ బ్యాంక్ నుంచి సెక్యూరిటీల వేలంలో తీసుకున్న రుణాలు తీరాలంటే 2064వ సంవత్సరం రావాల్సిందే! అంటే, ఈ అప్పు తీరేందుకు మరో 38 ఏళ్లు పడుతుందన్న మాట! రిజర్వ్ బ్యాంక్ వివిధ రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తాజాగా వెలువరించిన నివేదిక ఈ అంశాన్ని విశ్లేషించింది. ఏటా ప్రతి రాష్ట్రానికి రుణాలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులిస్తూ ఉంటుంది. ఆ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువను లెక్కించి, అందులో 3% వరకు రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు తీసుకునేందుకు కేంద్ర ఆర్థికశాఖ అనుమతి ఇస్తూ ఉంటుంది. తొలుత అర్ధ సంవత్సరానికి, తర్వాత రెండు త్రైమాసికాలకు వేర్వేరుగా ఈ అనుమతులు లభిస్తాయి. (మిగతా 2లో)

హైకోర్టు న్యాయమూర్తిగా బాలాజీ మెడమల్లి

(మొదటి పేజీ తరువాయి)

సేవలందిస్తున్నారు. ఈ నియామకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేస్తే ఆ సంఖ్య 33కు చేరుతుంది. న్యాయవాదుల కోటా నుంచి హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించే నిమిత్తం బాలాజీ, మరొకరి పేరును హైకోర్టు కొలీజియం సుప్రీంకోర్టుకు ఇటీవల సిఫారసు చేసింది. మెడమల్లి బాలాజీది వ్యవసాయ నేపథ్య కుటుంబం. వైఎస్సార్ కడప జిల్లా రాజంపేట మండలం శేషన్నగారిపల్లిలో లక్ష్మీనరసమ్మ, సుబ్బయ్య నాయుడు దంపతులకు 1972 మే 29న బాలాజీ జన్మించారు. తండ్రి సుబ్బయ్య నాయుడు కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో ఉద్యోగం చేసి, పదవీ విరమణ చేశారు. బాలాజీ పాఠశాల విద్య రాజంపేటలో, డిగ్రీ తిరుపతి శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని పడాల రామిరెడ్డి న్యాయ కళాశాలలో న్యాయవిద్యను అభ్యసించారు. 1998 ఏప్రిల్ 9న బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు ఆఫీసులో న్యాయవాదిగా చేరి ప్రాక్టీసు ప్రారంభించారు.

అమిత్ షాతో పవన్ కల్యాణ్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి జాతీయ ప్రకృతి వైపరీత్య నిర్వహణ ప్రాధికార సంస్థ సాంకేతిక సలహామండలికి ప్రతిపాదనలను సమర్పించడానికి కాకినాడ జిల్లా అధికార యంత్రాంగానికి అవకాశం ఇచ్చినందుకు హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు' అని పవన్ కల్యాణ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి వెంట జనసేన ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఉన్నారు. ఈ సమావేశం అనంతరం పవన్ కల్యాణ్ రాష్ట్రానికి తిరుగుపయనమయ్యారు.

ఏళ్ల నాటి రుణం.. వెంటాడుతోంది!

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు అనుగుణంగా ఆర్‌బీఐ సెక్యూరిటీల వేలం వేసి, ఆయా ప్రభుత్వాలకు రుణాలు సమకూరుస్తుంది. రాష్ట్ర విభజనకు ముందు నుంచీ వివిధ ప్రభుత్వాలు సెక్యూరిటీల వేలం రూపంలో చేసిన అప్పులు, విభజన సమయంలో ఏపీకీ వాటాగా సంక్రమించాయి. ఆ తర్వాతి ప్రభుత్వాలు కూడా ఏటా రుణాలు తీసుకుంటూనే, మరోవైపు పాత అప్పులకు అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తున్నాయి. ఇలా ఒక్క సెక్యూరిటీల రూపంలోనే ఏపీపై 2025 మార్చి 31 వరకు ఉన్న భారం రూ.4,33,443 కోట్లుగా ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ఈ అప్పు తీరాలంటే 2064 వరకు ఏటా కొంతమొత్తం చొప్పున చెల్లించాల్సి ఉంటుందని నివేదికలో పేర్కొంది.

ఈ ఐదేళ్లలోనే రూ.93,982 కోట్లు కట్టాలి!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి రుణాలు తీర్చాలంటే రూ.93,982 కోట్లు అవసరం. ఈ ఒక్క అప్పు తీర్చాలంటేనే రాష్ట్ర బడ్జెట్‌పై ఏటా సుమారు రూ.20 వేల కోట్ల భారం పడుతుంది. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇందుకు రూ.20,050 కోట్లు కేటాయించారు. వచ్చే ఏడాది రూ.18,109 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. 2028-29, 2029-30 ఆర్థిక సంవత్సరాల్లోనూ ఏటా రూ.20 వేల కోట్లకు మించి కేటాయించాల్సి ఉంటుంది. మొత్తం అప్పులో ఏడాది లోపు తీర్చగలిగేది 4.6%, ఐదేళ్ల లోపు కట్టగలిగేది 17.1%, 5-10 ఏళ్ల గడువులో చెల్లించేది 27%. 10-20 ఏళ్ల వ్యవధిలో తీర్చాల్సిన అప్పు 47.8 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ విశ్లేషించింది. ఇది కేవలం సెక్యూరిటీల వేలం ద్వారా సేకరించిన అప్పులకు సంబంధించింది మాత్రమే. ప్రావిడెంట్ ఫండ్, నాబార్డ్, ఇతర బాండ్లు, విద్యుత్ సంస్థల బకాయిలు, కార్పొరేషన్ల రుణాలు వంటివి కూడా భారంగా పరిణమిస్తున్నాయి. బడ్జెట్‌లో సింహభాగం సెక్యూరిటీ వేలం ద్వారా తీసుకున్న అప్పులు, వాటికి వడ్డీలు, ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకే సరిపోతుంది. వీటికితోడు గత ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతభత్యాలు, ఆర్థిక ప్రయోజనాలు సహా గుత్తేదార్ల బిల్లులు భారీగా బకాయిలు పెట్టింది.

■ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత లెక్కల ప్రకారం 2040 నుంచి 2064 మధ్య దాదాపు రూ.లక్ష కోట్ల సెక్యూరిటీ రుణాల భారం మోయాల్సి ఉంటుంది. ఆ 24 ఏళ్లలో రూ.99,293 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ లెక్క తేల్చింది. ప్రస్తుతం ఈ భారం.. మొత్తం అప్పులో 4.5%గా ఉంది. 2030 వరకూ దాదాపు ఇదే లెక్కన అప్పులు కడుతూ పోవాల్సిందే. ఆ తర్వాత అది ఏటా 5.5 శాతానికి పెరగవచ్చని అంచనా.



అజిత్ పవార్‌తో ఫ్లైట్ అటెండెంట్ పింకీ మాలి. ప్రమాదంలో ఆమె కూడా మరణించారు

మహా విషాదం



విమాన శకలాల నుంచి వస్తున్న మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

అట్టడుగు స్థాయి నుంచి ఎదిగిన నేత

అజిత్ పవార్ అట్టడుగు స్థాయి నుంచి ఎదిగిన ప్రజా నాయకుడు. పేద, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారు. ఆయన అకాల మరణం దిగ్భ్రాంతి కరం. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

- ప్రధాని నరేంద్ర మోదీ

(మొదటి పేజీ తరువాయి)

దీనికి మోదీ, అమిత్ షా హాజరయ్యే అవకాశముంది.

కూలిందిలా..

అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం కూలిపోవడానికి ముందు జరిగిన సంఘటనల వివరాలను ప్రభుత్వం వెల్లడించింది. బుధవారం ఉదయం వీఎస్ఆర్ వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన లీర్‌జెట్ 45 విమానం అజిత్ పవార్‌ను తీసుకుని ముంబయి నుంచి బయలుదేరింది. అది బారామతికి చేరుకున్నాక ల్యాండింగ్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) నుంచి అనుమతి లభించింది. అయితే దృశ్య స్పష్టత లేని కారణంగా రన్‌వే దగ్గరకు వచ్చిన విమానాన్ని పైలట్ మళ్లీ గాల్లోకి లేపారు. విమానాశ్రయం చుట్టూ కొంతసేపు తిరిగాక మరోసారి దిగేందుకు ఏటీసీ అనుమతించింది. దీనికి పైలట్ నుంచి ఎటువంటి తిరుగు సమాధానం (రీడ్ బ్యాక్) రాలేదు. ఆ వెంటనే రన్‌వే చివరన కూలిన విమానం మంటల్లో చిక్కుకుంది.

■ విమానం కూలిన వెంటనే అక్కడికి చేరుకుని అందులోని వారిని ఆసుపత్రికి తరలించామని ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపారు.

■ ప్రమాద ఘటనపై దర్యాప్తును విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) చేపట్టింది. ఇప్పటికే ఆ సంస్థ బృందం బారామతికి చేరుకుంది. బ్లాక్ బాక్స్‌ను విశ్లేషించాక ప్రమాదానికి కారణం తెలియొచ్చని అధికారులు పేర్కొన్నారు.

■ పైలట్‌కు దృశ్య స్పష్టత లేకపోవచ్చని, అందువల్లే అతడు రన్ వేను సరిగా గుర్తించలేకపోయి ఉండవచ్చని విమానయాన సంస్థ వీఎస్ఆర్ వెంచర్స్ అధినేత వీకే సింగ్ తెలిపారు.

ప్రత్యక్ష సాక్షులు ఏమంటున్నారంటే..

గాలిలో విమానం ఒడుదొడుకులకు లోనైందని, ఆ తర్వాత కూలిన వెంటనే పేలిపోయిందని ప్రత్యక్ష సాక్షి ఒకరు వెల్లడించారు. కూలిపోగానే మంటల్లో చిక్కుకుందని మరో ప్రత్యక్ష సాక్షి వివరించారు. 'అది గాలిలో చక్కర్లు కొట్టింది. అప్పుడు అస్థిరంగా కనిపించింది. రన్‌వేపై దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో నేలను గట్టిగా తాకి పేలిపోయింది. అప్పుడు భారీ శబ్దం వచ్చింది. మా ఇంటి వరకూ వినిపించింది' అని సమీపంలో ఉంటున్న మహిళ తెలిపారు. పేలిన తర్వాత విమానం శకలాలు ఎగిరిపడ్డాయని వివరించారు. తమ ఇంటివద్ద ఒక శకలం పడిందని తెలిపారు.

■ 'విమానం కిందకు దిగుతున్నప్పుడు కూలిపోతోందనే అనుకున్నాం. రన్ వేపై 100 అడుగుల ఎత్తు నుంచి అది కూలిపోయింది. మేం అక్కడికి వెళ్లేసరికే అది మంటల్లో చిక్కుకుంది. అనంతరం నాలుగైదుసార్లు పేలుళ్లు సంభవించాయి. దీంతో దగ్గరికి వెళ్లలేకపోయాం' అని మరో సాక్షి వివరించారు. అది భారీ ప్రమాదంగానే కనిపించిందని, తర్వాత అందులో అజిత్ పవార్ ఉన్నారని తెలిసి ఆందోళన చెందామని తెలిపారు.

'ప్రమాద తీవ్రతకు రెండు మృత దేహాలు బయటకు ఎగిరిపడినట్లుగా అనిపించింది. కళ్లద్దాలు, చేతి వాచీవల్ల అజిత్ పవార్‌ను గుర్తించి బయటకు లాగాం. కానీ అప్పటికే నష్టం జరిగిపోయింది. ఈ ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది' అని పేర్కొన్నారు.

బారామతి చేరుకున్న శరద్ పవార్, ఫడణవీస్

అజిత్ పవార్ దుర్మరణం వార్త తెలియగానే ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ దిల్లీ నుంచి బారామతికి చేరుకున్నారు. మృతదేహాన్ని ఉంచిన వైద్య కళాశాల ఆసుపత్రిని సందర్శించారు. ఇది ప్రమాదమేనని, రాజకీయం చేయవద్దని ఆయన సూచించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ బారామతి వచ్చారు. ఓ మంచి స్నేహితుడిని కోల్పోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

■ అజిత్ పవార్ మరణం.. ఎన్డీయే కుటుంబానికే కాదు, వ్యక్తిగతంగా నాకు కూడా పెద్ద లోటు.

- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి

రీడ్ బ్యాక్ కీలకం..

విమానయానంలో రీడ్ బ్యాక్ అనేది కీలక సురక్షిత విధానం. ఇందులో ఏటీసీ అందుకున్న సందేశంలోని కీలక అంశాలను రిపీట్ చేస్తారు. ఇది ఏటీసీ ఆదేశాలను పైలట్ సరిగా విని అర్థం చేసుకున్నారని నిర్ధారించడానికి కమ్యూనికేషన్ వ్యవస్థలో అత్యంత దగ్గరి మార్గం.

■ దృశ్య స్పష్టత లేని సమయంలో విమానం దిగేందుకు ప్రయత్నించిందని పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు తెలిపారు.

■ బారామతి విమానాశ్రయం ఒక నియంత్రణలేని ఎయిర్‌ఫీల్డ్. పట్టణంలోని శిక్షకులు, పైలట్లు విమానాల రద్దీ సమాచారాన్ని అందిస్తుంటారు. వీటీ ఎస్ఎస్‌కే పేరుతో రిజిస్టరైన విమానం.. తొలుత ఉదయం 8.18 గంటలకు బారామతి ఏటీసీని సంప్రదించింది. ఆ తర్వాత 30 నాటికల్ మైళ్ల దూరంలో ఉండగా.. మళ్లీ సంప్రదించింది. అయితే దృశ్య స్పష్టతను బట్టి పైలట్ విచక్షణతో దిగవచ్చని ఏటీసీ సూచించింది. అక్కడి గాలి, దృశ్య స్పష్టత గురించి పైలట్లు వివరాలు కోరారు. గాలులు లేవని, దృశ్య స్పష్టత 3,000 మీటర్ల వరకూ ఉందని ఏటీసీ తెలియజేసింది.

■ చివరకు రన్‌వే 11పై దిగేందుకు విమాన పైలట్లు ప్రయత్నించారు. అయితే వారికి రన్ వే కనిపించలేదు. దీంతో మళ్లీ గాల్లోకి లేపారు. విమానాశ్రయం చుట్టూ చక్కర్లు కొట్టాక రన్ వే కనిపిస్తుందా అని ఏటీసీని పైలట్లు అడిగారు. కనిపించడం లేదని వారికి సమాధానం వచ్చింది. రన్ వే కనిపించగానే సమాచారం అందిస్తామని ఏటీసీ తెలిపింది. కొన్ని సెకన్ల తర్వాత రన్ వే కనిపిస్తోందని పైలట్లు ఏటీసీకి తెలిపారు. దీంతో రన్ వే 11పై దిగేందుకు 8.43 గంటలకు అనుమతి వచ్చింది. అయితే పైలట్లు రీడ్ బ్యాక్ ఇవ్వలేదు. 8.44 గంటలకు రన్ వేపై మంటలను ఏటీసీ సిబ్బంది గమనించారు. అత్యవసర సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నా జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

■ పైలట్ల నుంచి ఆపదలో ఉన్నామని తెలియజేసే మేడే కాల్ రాలేదని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వర్గాలు వెల్లడించాయి.

అజిత్‌పవార్ మృతిపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందడంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, అనుచరులకు ఎక్స్ వేదికగా ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మహారాష్ట్ర అభివృద్ధికి అలుపెరగని కృషి

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ హఠాన్మరణంపై పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. 'ఆయన అంకితభావంతో కూడిన ప్రజాసేవ, మహారాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేసిన అలుపెరుగని కృషి చిరకాలం గుర్తుండిపోతాయి. ప్రజలపట్ల ఉన్న నిబద్ధతను ఎప్పటికీ స్మరించుకుంటారు. ఆయన మరణం తీరని లోటు. వారి కుటుంబసభ్యులు, అభిమానులు, కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు. ఎన్డీయే పార్టీల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీతో తాను, అజిత్ పవార్ ఉన్న ఫొటోను, ఇటీవల నాందేడ్‌లో గురు తేగ్ బహదూర్‌కు నివాళులర్పించే కార్యక్రమంలో అజిత్ పవార్‌తో కలిసి కూర్చున్న ఫొటోలను పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

దేశానికి తీరని లోటు: లోకేశ్

'అజిత్‌పవార్ మృతి మహారాష్ట్రతో పాటు దేశానికి తీరని లోటు' అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అజిత్‌పవార్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు లోకేశ్ గురువారం మహారాష్ట్రలోని బారామతి వెళ్లనున్నారు.

■ అజిత్‌పవార్ మృతిపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటన తీవ్ర బాధాకరమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అజిత్‌పవార్ మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఒక రాజకీయ దురంధరుడిని కోల్పోయామని, ఆయన మృతి మహారాష్ట్రలోని కూటమి ప్రభుత్వానికి తీరని లోటన్నారు.

జూన్‌కి లబ్ధిదారుల చేతికి 2.61 లక్షల టిడ్కో ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం బుధవారం సచివాలయంలో జరిగింది. ఇందులో తీసుకున్న నిర్ణయాలను పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకర్లకు తెలిపారు. వివరాలు ఇవి..

వ్యవసాయ మార్కెట్ కమిటీకి 33 ఎకరాలు

■ చిత్తూరు జిల్లా పలమనేరులోని పశు పరిశోధన సంస్థకు చెందిన 33 ఎకరాలను శ్రీవేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం నుంచి పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదలాయించేందుకు అనుమతి. పరిహారం చెల్లించి, ఆ భూమిని స్వాధీనం చేసుకొని అక్కడ కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఏర్పాటుచేస్తారు. ప్రస్తుతం పలమనేరులో ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీని రైతుబజార్ సొసైటీకి అప్పగించి, ఆధునిక రైతుబజారుగా అభివృద్ధి చేసేందుకు ఆదేశం.

గార్డెన్‌సిటీ రియాలిటీకి ఇచ్చిన ఎల్‌ఓఐ రద్దు

తిరుపతి శిల్పారామంలో కన్వెన్షన్ సెంటర్ విత్ గెస్ట్ రూమ్స్, స్పా ఏర్పాటు, విశాఖపట్నంలో బొటిక్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధికి గార్డెన్‌సిటీ రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్షియానికి భూములు కేటాయిస్తూ 2019లో ఎల్‌ఓఐ జారీచేయగా, ఇంతవరకు ఆ సంస్థ అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఆ ఎల్‌ఓఐ రద్దుచేసి, కొత్తగా టెండర్లు ఆహ్వానించేందుకు అనుమతిస్తూ నిర్ణయం.

■ గుంటూరు శిల్పారామంలో కల్చరల్ సెంటర్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్ అభివృద్ధికి 1.47 ఎకరాలను రఘురామ్ హ్యూమ్ పైప్స్‌కు ఎల్‌ఓఐ జారీచేసేందుకు అనుమతి. ఆ సంస్థ రూ.25 కోట్లతో వెయ్యిమంది సామర్థ్యంతో హాల్, పిల్లల ఆటస్థలం వంటివి నిర్మిస్తుంది.

రాజధానిలో వీధిపోటున్న ప్లాట్ల స్థానంలో కొత్తవి

రాజధాని అమరావతిలో వీధిపోటున్న ప్లాట్లు, వాస్తుపరంగా రైతుల అభ్యంతరాలున్న 112 ప్లాట్లను రద్దుచేసి, లాటరీ ద్వారా వేరే ప్లాట్లు కేటాయించేలా సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ తీర్మానం. ఆ ప్లాట్లు అసలు యజమానుల ఆధీనంలో ఉంటేనే వేరేవి కేటాయిస్తారు.

■ రాజధాని ప్రాంతంలో భూమిలేని పేదలకు ఇచ్చే పింఛన్‌ను.. తల్లిదండ్రులు మరణించిన కుటుంబాల్లో వారి మైనర్ పిల్లలకు బదిలీ చేసేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారం కల్పిస్తూ నిర్ణయం.

అథ్లెట్ జ్యోతికి గ్రూప్-1 ఉద్యోగం

అగ్రశేణి అథ్లెట్, అర్జున అవార్డు గ్రహీత యర్రాజి జ్యోతికి విశాఖపట్నంలో 500 చదరపు గజాల నివాస స్థలం, ఆమె డిగ్రీ పూర్తిచేసిన తర్వాత గ్రూప్-1 హోదాలో ఉద్యోగం ఇచ్చేందుకు అనుమతిస్తూ నిర్ణయం.

■ అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు వీలుగా 6.09 ఎకరాలు కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు ఉచితంగా కేటాయించేందుకు ఆమోదం.

■ ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ అదనంగా రూ.11,850 కోట్ల రుణం తీసుకోవడానికి, దీనికి ప్రభుత్వ హామీకి ఆమోదం తెలిపింది.

■ ద్వారకాతిరుమల మండలం జగన్నాథపురం పరిధిలోని రాఘవపురంలో షిర్డీ సాయిబాబా ఆలయం అభివృద్ధికి కొచ్చర్లకోట లలితమ్మకు 2 ఎకరాల ప్రభుత్వ భూమిని, ఎకరా రూ.30 లక్షల ధరతో కేటాయిస్తూ నిర్ణయం.

పోలవరం ప్రాజెక్టు పనులకు రాయి తవ్వకాలు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఉపయోగించే రాయి కోసం హిల్ నంబరు 902లో రాయిని తవ్వేందుకు అయ్యే ఆర్థిక భారానికి మంత్రిమండలి ఆమోదం. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రాజెక్టు పూర్తిచేయాలనే లక్ష్యం. మిగిలిన పనులు సకాలంలో పూర్తిచేయడంలో భాగంగా ఈ రాయి తవ్వకం పని రూ.247.12 కోట్లతో ప్రస్తుత గుత్తేదారు మేఘా ఇంజినీరింగ్‌కు అప్పగించేందుకు అనుమతి.

■ రాష్ట్రవ్యాప్తంగా పీఎంఏవై 1.0 కింద ఇళ్లు, స్థలాలు కావాలంటూ 10 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.

లడ్డూ తయారీ నెయ్యిలో కల్తీ నిజమేగా

తిరుమలలో లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందనేది నిజమే కదా? అయితే దేంతో కల్తీ జరిగిందనేది తెలియాలని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. కల్తీనెయ్యి అంశం విషయంలో ఇటీవల వైకాపా చేస్తున్న ప్రచారంపై.. విలేకరులు ప్రశ్నించగా, మంత్రి పైవిధంగా స్పందించారు. సిట్ నివేదికపై ప్రతిపక్షం కొద్దిరోజులుగా అల్లరి చేస్తోందని, ఆ నివేదికలో ఏముందో అధికారికంగా తెలియాల్సి ఉందని తెలిపారు. ఆ నివేదికను చూసి, తాము అధికారికంగా మాట్లాడతామని చెప్పారు. కల్తీ నెయ్యి అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగినట్లు మంత్రి తెలిపారు.

ఏలూరు పోలీసుల 'ధర్మా'స్త్రం

(మొదటి పేజీ తరువాయి)

నిమిత్తం రూపొందించారు. న్యాయపరమైన అంశాలు, కోర్టు కేసులపై అవగాహన కలిగిన హెడ్ కానిస్టేబుళ్లను ఎంపిక చేసి 'కోర్టు మానిటరింగ్ సెల్(సీఎంసీ)' ఏర్పాటు చేశారు. కోర్టుల్లో ఏ కేసు విచారణ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలుసుకొని, ఆ కేసుకు సంబంధించిన ప్రతి దస్త్రాన్నీ కోర్టు నుంచి నిర్దేశిత ఫీజు చెల్లించి సర్టిఫైడ్ కాపీలు తెప్పించుకుంటారు. సీఎంసీ విభాగం సీఐ, కోర్టు కానిస్టేబుల్ క్షుణ్ణంగా చదివి అందులో లోపాలేంటి? నేరగాళ్లకు శిక్ష పడాలంటే ఇంకా ఎలాంటి డాక్యుమెంటరీ, సాంకేతిక ఆధారాలు కావాలి? ఈ తరహా కేసుల్లో గతంలో కోర్టు ఇచ్చిన తీర్పులు ఎలా ఉన్నాయో పరిశీలించి ఓ రికార్డు తయారు చేస్తారు. ఈ వివరాలన్నీ 'ధర్మ' యాప్‌లో నమోదు చేస్తారు. విచారణలో లోపాలు, కావాల్సిన ఆధారాలు, సాక్షులను డిఫెన్స్ న్యాయవాదులు ఏం ప్రశ్నించవచ్చు? అని ప్రశ్నించగానే.. యాప్ ఆ వివరాలన్నీ అందిస్తుంది. ఆ మొత్తం సమాచారంతో తిరిగి పక్కాగా రికార్డులు తయారుచేసి దాన్ని విచారణ ప్రారంభం కావడానికి 15 రోజుల ముందే పీపీకి అందజేస్తున్నారు. కోర్టులో బలమైన వాదనలు వినిపించేలా, సాక్షులు తడబడకుండా సాక్ష్యమిచ్చేలా చేస్తున్నారు. కొందరు నిందితులు కోర్టు సమన్లు తీసుకోరు. విచారణలకు గైర్హాజరవుతారు. తరచూ చిరునామాలు మారుస్తారు. ఈ కారణాలతో విచారణల్లో జాప్యాన్ని నివారించడానికి ముద్దాయిలందరికీ సకాలంలో సమన్లు అందేలా పోలీసులు తరచూ వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగిస్తున్నారు.

మచ్చుకు కొన్ని

■ 2023లో ఏలూరులో పట్టపగలే నడిరోడ్డుపై ఓ మహిళపై యాసిడ్ దాడి జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు 2 మాసాల్లోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితుడికి దిగువ కోర్టు యావజ్జీవ శిక్ష విధించగా, హైకోర్టుకు అప్పీల్‌కు వెళ్లాడు. ఉన్నత న్యాయస్థానం కేసు పునర్విచారణకు ఆదేశించింది. పునర్విచారణలో పోలీసులు సమర్పించిన డాక్యుమెంటరీ, సాంకేతిక ఆధారాలతో కోర్టు నిందితుడికి రెండు యావజ్జీవ శిక్షలు విధించింది.

■ మరో కేసులో సింహాద్రి అనే వ్యక్తి ప్రసాదంలో సైనైడ్ కలిపి 10 మందిని చంపేశాడన్నది అభియోగం. అయితే, వారిని చంపినట్లు సరైన ఆనవాళ్లు లేవు. ఈ కేసులో నిందితుడు సైనైడ్ కలిపినట్లు ఓ సీసీ ఫుటేజీ ఆధారాన్ని దర్యాప్తులో గుర్తించి కోర్టుకు సమర్పించారు. ఇటీవల సింహాద్రికి యావజ్జీవ శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది.

■ సీఎంసీ ప్రారంభించిన 15 నెలల్లో 41 కేసుల్లో 51 మందికి శిక్షలు పడ్డాయి. వారిలో 8 మందికి రెండు యావజ్జీవ, 21 మందికి జీవితకాలం, ముగ్గురికి 20 ఏళ్లు, 11 మందికి పదేళ్లు, మిగిలిన 8 మందికి ఏడేళ్ల కంటే తక్కువ కాలం శిక్షలు పడ్డట్లు ఎస్పీ కిశోర్ తెలిపారు. సీఎంసీ, స్టేషన్ల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సాక్ష్యాధారాలు పక్కాగా అందజేయడం వల్లే శిక్షలు పడే కేసుల శాతం పెరిగిందన్నారు. గతంలో ఏడాదికి ఐదారు నేరాల్లోనే శిక్షలే పడేవని పేర్కొన్నారు.

ఒక రోజు ముందే పింఛను

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఫిబ్రవరికి సంబంధించిన పింఛను మొత్తాన్ని లబ్ధిదారులకు ప్రభుత్వం ఒకరోజు ముందే పంపిణీ చేయనుంది. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో జనవరి 31నే పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించింది. 62.94 లక్షల మందికి పింఛన్లు అందించేందుకు రూ.2,731 కోట్లను ఇప్పటికే విడుదల చేసింది.

గ్రహం అనుగ్రహం

29-1-2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్షం
ఏకాదశి: మ. 12-10 తదుపరి ద్వాదశి
మృగశిర: తె. 4-32 తదుపరి ఆర్ద్ర
వర్జ్యం: ఉ. 11-22 నుంచి 12-52 వరకు
అమృత ఘడియలు: రా. 8-19 నుంచి 9-49 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-21 నుంచి 11-06 వరకు తిరిగి మ. 2-50 నుంచి 3-34 వరకు
రాహుకాలం: మ.1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.49
భీష్మ ఏకాదశి, అంతర్వేది తీర్థం

న్యాయవ్యవస్థలో ఏఐతో బహు జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

సూత్రాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలంది. ఏఐ సాధనాలు.. లేని తీర్పులను సృష్టిస్తాయని, ఇది ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. పూర్తిగా ఏఐ సమాచారంపై ఆధారపడితే సమస్యలొస్తాయని, న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లే ప్రమాదం ఉందని పేర్కొంది. స్పృహ, నైతిక విచక్షణ, సాక్ష్యాధారాలను విశ్లేషించే సామర్థ్యం, మానవ ప్రవర్తనలోని సూక్ష్మ భేదాలను అర్థం చేసుకునే శక్తి ఏఐకి ఉండదని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి ఇటీవల ఈ మేరకు ఓ కేసులో తీర్పు ఇచ్చారు.

■ ఓ సివిల్ వివాదంలో విజయవాడ కోర్టు నియమించిన అడ్వొకేట్ కమిషన్ ఇచ్చిన నివేదికపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గుమ్మడి ఉషారాణి, సునీత అనుబంధ పిటిషన్ వేశారు. దీనిని కొట్టేస్తూ గతేడాది ఆగస్టు 19న విజయవాడ కోర్టు ఉత్తర్వులిచ్చింది. అడ్వొకేట్ కమిషన్ నివేదిక సాక్ష్యం మాత్రమేనని, దానిపై అభ్యంతరం ఉంటే విచారణలో తేల్చుకోవాలంది. ఈ సందర్భంగా నాలుగు తీర్పులను తన ఉత్తర్వుల్లో ఉదహరించింది. ఈ ఉత్తర్వులపై ఉషారాణి, సునీత హైకోర్టులో సివిల్ రివిజన్ పిటిషన్ వేశారు. వారి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. విజయవాడ కోర్టు న్యాయాధికారి ఇచ్చిన ఉత్తర్వుల్లో ప్రస్తావించిన నాలుగు తీర్పులు ఉనికిలో లేవన్నారు. లేని తీర్పుల ఆధారంగా ఉత్తర్వులిచ్చిన నేపథ్యంలో వాటిని రద్దు చేయాలని కోరారు.

పూర్తిగా ఏఐపై ఆధారపడటంతో తప్పు జరిగింది

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిల్హరి ఆదేశాలతో దీనిపై విజయవాడ కోర్టు న్యాయాధికారి నివేదిక ఇచ్చారు. తన ఉత్తర్వుల్లో పేర్కొన్న తీర్పులు ఏఐ ద్వారా వచ్చినవేనని అంగీకరించారు. తొలిసారి ఏఐను వినియోగించానని, అది ఇచ్చిన తీర్పులు సరైనవేనని విశ్వసించానని చెప్పారు. ఏఐపై ఆధారపడటం వల్ల ఈ తప్పు జరిగిందని, భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా తీర్పులను పరిశీలిస్తానని వివరణ ఇచ్చారు. అధికారిక తీర్పులపైనే ఆధారపడతానని నివేదించారు. తీర్పులను ప్రస్తావించడంలో తప్పు దొర్లినా. . తన ఉత్తర్వులు చట్టబద్ధమైన సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. ఈ వివరాలతో హైకోర్టు న్యాయమూర్తి సంతృప్తి చెందారు. లేని తీర్పులను ప్రస్తావించినంత మాత్రాన విజయవాడ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయలేమన్నారు. విజయవాడ కోర్టు న్యాయాధికారి అనుసరించిన సూత్రం చట్టబద్ధమైనదేనన్నారు. ఉషారాణి, సునీతల పిటిషన్‌ను కొట్టేశారు.

మూడు రూపాయల వడ్డీ ఇస్తానని ముంచేశాడు

రూ.8 కోట్లతో పరారైన మోసగాడు

తాడిపత్రి, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా తాడిపత్రిలో మాయమాటలతో ప్రజల నుంచి రూ.8 కోట్లు వసూలు చేసి పరారైన మోసగాడు చివరకు పోలీసులకు దొరికిపోయాడు. కడపకు చెందిన ఆరిఫ్ తాడిపత్రిలో ఉంటూ బంగారు వ్యాపారినని స్థానికులను నమ్మబలికాడు. లక్షకు నెలకు రూ.3 వేలు వడ్డీ ఇస్తానని వారి నుంచి డబ్బులు వసూలు చేశాడు. కొందరికి కొంత కాలం పాటు వడ్డీ చెల్లించి, అందరి నమ్మకం చూరగొన్నాడు. డబ్బు లేని వారి నుంచి బంగారాన్ని సేకరించి, దాన్ని బ్యాంకులో తనఖా పెట్టి నగదు తీసుకొన్నాడు. ఇలా ఒక్కొక్కరి దగ్గర రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు వసూలు చేసి, పరారయ్యాడు. బాధితులు నాలుగు రోజుల కిందట తాడిపత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆరిఫ్ వైఎస్సార్ కడప జిల్లాలోని కొండాపురం రైల్వే ట్రాక్ పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించి కొందరు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అతణ్ని అదుపులోకి తీసుకుని తాడిపత్రి పోలీసులకు అప్పగించారు.

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	28.0
విశాఖపట్నం	18.0	28.8
రాజమహేంద్రవరం	18.0	34.0
అనంతపురం	18.6	34.0
శ్రీకాకుళం	19.0	29.0
విజయవాడ	19.0	29.7
కడప	19.0	32.0
తాడేపల్లిగూడెం	19.0	32.0
కర్నూలు	19.3	33.5
నరసాపురం	20.6	29.0
గుంటూరు	21.0	32.0
ఒంగోలు	21.5	30.7
నెల్లూరు	22.4	30.8

ఈ దశాబ్దంలో రాష్ట్రంలో పనిచేసే చేతులు ఎక్కువే!

జనాభాలో మూడింట రెండొంతులకన్నా అధికం

- రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై రిజర్వు బ్యాంకు నివేదిక
- జనాభాతో అనుసంధానం చేస్తూ అధ్యయనం
- మరో 10 ఏళ్ల తర్వాత వృద్ధుల సంఖ్య 19 శాతానికి..
- వృద్ధులు పెరిగితే రాబడి, ఖర్చులపై ఆ ప్రభావం



రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు తగ్గిపోయి జనాభా వృద్ధి తగ్గిపోనున్నా రాబోయే 10 ఏళ్ల పాటు 'వర్క్ ఫోర్స్' (పని చేసే వారి సంఖ్య) అత్యున్నత ఫలితాలు ఇచ్చే స్థాయిలోనే ఉంటుంది. ఒక దేశ జనాభాలో పని చేసే వారి సంఖ్య అత్యధికంగా ఉంటే ఆ దేశం జనాభావల్ల అత్యధిక ప్రయోజనాలు పొందుతుందని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఈ దశాబ్దంలో ఆంధ్రప్రదేశ్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో మొత్తం జనాభాలో మూడింట రెండొంతులమంది పని చేసే స్థాయిలో ఉండబోతున్నారు. దేశంలో పని చేసే జనాభా సంఖ్య 2026లో 64.8% ఉండగా అది 2031 నాటికి 65.1 శాతానికి పెరగబోతోంది. 2036 నాటికి అది 64.9%కు చేరుతుంది. అయినా మూడింట రెండొంతుల మేర శ్రమ శక్తి ఉన్నట్లే. ఇతర దేశాలతో పోలిస్తే భారతదేశం ఎక్కువ కాలం ఈ ఫలాలను పొందబోతోంది (2021 జైన్, గోలి నివేదిక). మన రాష్ట్రంలో మొత్తం జనాభాలో ప్రస్తుతం పని చేసే వారి సంఖ్య 66.9%గా ఉంది. 2031 నాటికి అది 66.4 శాతమవుతుంది. 2036 నాటికి దాదాపు ఒక శాతం తగ్గినా 65.4%గా ఉంటుంది. ఈ విషయంలో దేశ సగటుతో పోలిస్తే మన రాష్ట్రం పరిస్థితి ఇంకా మెరుగ్గానే ఉంటుంది. రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తాజాగా రూపొందించిన నివేదికలో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై జనాభా ప్రభావం, వివిధ వయసులవారీ ప్రభావం అనే అంశంపై కూలంకషంగా చర్చించింది. రాష్ట్ర జనాభాలో ఏయే వయసుల వారు ఎంతమంది ఉన్నారనే అంశాల ఆధారంగా బడ్జెట్ ప్రణాళికలు రూపొందించుకోవలసి ఉంటుందని పేర్కొంది. దేశంలో భిన్నత్వంలో ఏకత్వం వల్ల ఈ ఫలాలు ఎక్కువ కాలం అందుకోబోతోందంటూ జైన్ గోలి నివేదికలను ప్రస్తావిస్తూ ఆర్‌బీఐ తన నివేదికలో విశ్లేషించింది.

వృద్ధుల శాతం పెరిగితే?



మరోవైపు మన రాష్ట్రంలో క్రమేణా వృద్ధుల సంఖ్య పెరగబోతోంది. సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడం వల్ల జనాభా వృద్ధి తగ్గిపోతోంది. ఆ ప్రభావం అనేకాంశాలపై పడబోతోంది. రానున్న కాలంలో క్రమేణా వృద్ధుల సంఖ్య పెరిగి రాష్ట్రంలో పని చేసే వారి సంఖ్య తగ్గబోతోంది. ఆ ప్రభావం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, రాబడి, పన్నుల వసూళ్లు ఇలా అనేక అంశాలపై పడనుంది. అంతేకాదు వృద్ధుల సంఖ్య పెరిగేకొద్దీ రాష్ట్రాలు తమ ఖర్చుల తీరు తెన్నులు మార్చుకోవలసి ఉంటుంది. వారి ఆరోగ్యం, బీమా, సంక్షేమం తదితర అవసరాలకే ఖర్చులు పెరిగిపోతాయి. అభివృద్ధి ఖర్చులు, ఇతర కీలక రంగాలపై ఖర్చులకు వనరుల కొరత ఏర్పడుతుంది.

2036 నాటికి 19% వృద్ధులే..

ఆంధ్రప్రదేశ్ జనాభాలో ప్రస్తుతం (2026) 14.1% 60 ఏళ్లు దాటిన వృద్ధులు ఉన్నారని నివేదిక పేర్కొంది. 2031 నాటికి 16.4%కు పెరుగుతుందని, 2036 నాటికి ఏకంగా 18.9 శాతానికి చేరుతుందని అంచనా. దేశంలో అత్యధిక వృద్ధులు ఉన్న రాష్ట్రాల్లో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉంది. 2036 నాటికి దేశంలో నాలుగో స్థానానికి చేరతాం. కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్ ఇప్పుడు మన కన్నా ఎగువన ఉన్నాయి. 2036 నాటికి పంజాబ్ మన తర్వాతి స్థానానికి వస్తుంది. దేశంలో ప్రస్తుతం మొత్తం జనాభాలో 11.4% వృద్ధులు ఉన్నారు. 2031 నాటికి ఆ సంఖ్య 13.1%కు, 2036 నాటికి 14.9%కు చేరుతుంది. అప్పటికి ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధుల జనాభా దేశ సగటు కన్నా ఎక్కువగా ఉంటుంది.

సంతానోత్పత్తి రేటు తగ్గిపోయి..




ఆంధ్రప్రదేశ్‌లో సంతానోత్పత్తి రేటు తగ్గిపోయింది. 2011-13 లెక్కల ప్రకారం సగటున ఒక్కో మహిళ 1.8 మందికి జన్మనివ్వగా 2021-23 నాటికి అది 1.5కు పడిపోయింది. సాధారణంగా జనాభా తగ్గకుండా ఉండాలంటే ఒక్కో మహిళ సంతానోత్పత్తి రేటు 2.1 ఉండాలి. ఐక్య రాజ్యసమితి ప్రపంచ సంతానోత్పత్తి రేటు నివేదిక ఆధారంగా ఈ ఫార్ములా ప్రస్తావించారు. బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, అస్సాంలలో మాత్రమే జనాభా తగ్గే ప్రమాదం లేదు. మిగిలిన అన్ని రాష్ట్రాల్లోనూ కొంత ఎక్కువ తక్కువగా ఈ సమస్య ఉంది.

- ఈనాడు, అమరావతి

కల్తీ నెయ్యి కేసులో సిట్ ఛార్జిషీట్‌పైనా దుష్ప్రచారమే

- పాలతో పనిలేకుండా నెయ్యి.. వాసన వచ్చేందుకు రసాయనాలు
- అయినా దొంగే దొంగ అనేలా ఆ పార్టీ నేతల నేరప్రవృత్తి
- వైకాపా నాయకుడే క్రిమినల్
- వాళ్ల అసత్య ప్రచారాల్ని ఆధారాలతో తిప్పి కొడదాం
- మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడలేదని సిట్ ఛార్జిషీట్‌లో పేర్కొందంటూ వైకాపా చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ సభ్యులకు సూచించారు. పాలతో పనిలేకుండానే రసాయనాలు ఉపయోగించి నెయ్యి ఎలా తయారు చేయొచ్చో వైకాపా నేతలకు బాగా తెలుసని పేర్కొన్నారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా, భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా వ్యవహరించినవారికి శిక్ష పడాలని స్పష్టం చేశారు. 'మొదట్నుంచి వైకాపా నేతల నేరప్రవృత్తి భిన్నంగా ఉంటుంది. ఆ పార్టీ నాయకుడే క్రిమినల్.. కోడికత్తి, గులకరాయి, బాబాయ్ గుండెపోటు, గొడ్డలి వేటు, పరకామణి దొంగతనం సహా అన్నీ వాళ్లే చేసి.. మనపై నెట్టేయాలని ప్రయత్నాలు చేశారు. దొంగలే దొంగ దొంగ అని అరిచినట్లు ఎదురుదాడి చేస్తుంటారు. ఇప్పుడు తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి విషయంలోనూ అదే చేస్తున్నారు' అని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం సుమారు 37 అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా తిరుమలలో లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడకం, సిట్ ఛార్జిషీట్‌పై సుమారు 1.20 గంటల పాటు చర్చ సాగింది. కల్తీ నెయ్యి కేసు వివరాల్ని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా మంత్రివర్గ సభ్యులకు వివరించారు. దీనిపై సిట్ ఛార్జిషీట్ ఇంకా అందలేదని చెప్పారు. ఛార్జిషీట్ అందాక వచ్చే మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చిద్దాం. వైకాపా అక్రమాలను ప్రజల ముందు పెట్టాలని చంద్రబాబు సూచించారు. 'లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడకంపై విచారణకు సిట్ ఏర్పాటైతే దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసింది వైకాపా వాళ్లే. సీబీఐ విచారణ కోరింది వాళ్లే. తన పేరు చేర్చుతున్నారంటూ ఆ పార్టీ నాయకుడు, తిరుమల మాజీ ఛైర్మన్ సుబ్బారెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జగన్ తిరుమల వెళ్తానని బయల్దేరారు. డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సి వస్తుందని ఆగిపోయారు. వైకాపా హయాంలో తిరుమలలో కల్తీ నెయ్యి వినియోగంపై పూర్తి వివరాలను మంత్రులు తెలుసుకోవాలి. దీనిపై మాట్లాడేటప్పుడు ఆధారాలు, పూర్తి సమాచారంతో మాట్లాడాలి' అని నిర్దేశించారు.

జంతువుల కొవ్వు కలిసిందనే

లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని సిట్ విచారణలో తేలిందని మంత్రివర్గ సభ్యులు కొందరు పేర్కొన్నారు. లోకేశ్ సహా కొందరు మంత్రులు కల్తీ నెయ్యిపై తమవద్ద ఉన్న సమాచారాన్ని చదివి వినిపించినట్లు తెలిసింది. నెయ్యి పరిమాణం చాలా తక్కువగా ఉందని, రసాయనాలతో నెయ్యి తయారుచేసినట్లు సిట్ విచారణలో వెల్లడైందని చెప్పారు. కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారని విషయం 2022లోనే తిరుమల అధికారులకు, ప్రభుత్వానికి తెలుసని కొందరు మంత్రులు ఈ సందర్భంగా చెప్పారు. వైకాపా అధికారంలోకి వచ్చాక 2019 నుంచి నెయ్యి సరఫరాలో ఎప్పుడేం జరిగిందో వివరిస్తూ.. తేదీలతో సహా చదివి వినిపించారు. కల్తీ నెయ్యికి వాసన వచ్చేలా రసాయనాలు కలిపారని కొందరు వివరించారు. 'తిరుమల కొనుగోళ్ల కమిటీలో బోర్డు సభ్యులుగా నేను, ప్రశాంతిరెడ్డి ఉండేవాళ్లం. మమ్మల్ని సమావేశానికి పిలవకుండానే నెయ్యి కొనుగోలు నిబంధనలు సరళీకరించి, కావాల్సిన వారికి టెండర్లు దక్కేలా చేశారు. అప్పట్లో కమిటీ సభ్యులుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఇంకో అధికారి కలిసి నిర్ణయం తీసుకున్నట్లు తర్వాత తెలిసింది' అని మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

★ విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ దుర్మరణం చెందడంపై రాష్ట్ర మంత్రివర్గం సంతాపం తెలిపింది.

★ తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరాపై వైకాపా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. మంత్రివర్గ సమావేశానికి ముందు పలువురు మంత్రులతో ఆయన క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు.

మంత్రులైనా, పార్టీ నాయకులైనా విషయ పరిజ్ఞానం ఉంటేనే

మంత్రులైనా, పార్టీ నాయకులైనా విషయ పరిజ్ఞానంతో మాట్లాడాలని సీఎం చంద్రబాబు సూచించారు. క్యాబినెట్ సమావేశం తర్వాత సీఎం చంద్రబాబు కొందరు మంత్రులతో గంటన్నరపాటు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 1985 నుంచి పార్టీలో పరిస్థితులు చర్చకొచ్చాయి. అప్పట్లో చంద్రబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడంతోపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేవారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. అన్ని అంశాలపై అవగాహనతో వెళ్లడం వల్లే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అసెంబ్లీలో గట్టి పోరాటం చేశామని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ అధికార పార్టీని దీటుగా ఎదుర్కొన్నామని చెప్పారు. 'గతంలో శాసనసభాపతిగా ఉన్న శ్రీపాదరావు కూడా సమావేశాల సమయంలో ఏం స్కామ్ ఈ రోజు సభలో ఏమైనా ప్రవేశపెడుతున్నారా? అని తరచూ అడిగేవారు' అని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.

గూఢచర్యం కేసులో నిందితుడికి జైలుశిక్ష

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: గూఢచర్యం కేసులో నేరం రుజువు కావడంతో ఓ నిందితుడికి ఐదున్నరేళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ విశాఖపట్నంలోని ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. 2021లో పాకిస్థాన్ నేవీ అధికారులు భారత మత్స్యకారులను అరెస్టు చేసి.. వారి నుంచి మొబైల్ సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని నిందితుడు అల్తాఫ్ హుస్సేన్ ఘంచిబాయ్ ఎలియాస్ షకీల్‌కు ఇచ్చి వినియోగించుకోవాలని సూచించారు. దీంతో పాకిస్థాన్ నుంచి వాట్సప్ నంబర్లు పని చేయటానికి వీలు కలిగింది. తర్వాత నకిలీ గుర్తింపులతో భారత రక్షణ సంస్థ సిబ్బందిని సంప్రదించడానికి ఉపయోగించారు. ఇలా నిందితుడు పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌కు సహకరించాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎన్ఐఏ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిమ్‌కార్డులను మోసపూరితంగా వినియోగించడంతో పాటు, సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచారు. కేసు విచారణలో 37 మంది సాక్షులను విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

3 నుంచి విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

ఈనాడు, అమరావతి: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 94,689 మంది విద్యార్థులకు ఉచిత కళ్లద్దాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నేత్ర సమస్యలున్న విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీకి ప్రభుత్వం రూ.2.25 కోట్లు వెచ్చిస్తోంది. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 3 నుంచి ప్రారంభం కానుంది. గుంటూరు జిల్లా తెనాలిలో ఈ కార్యక్రమాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ లాంఛనంగా ప్రారంభిస్తారు.

దళిత ఉపకులాలు కలిసిమెలిసి ఉండాలి

పల్నాడు జిల్లా పిన్నెల్లిలో ఎస్సీ కమిషన్ పర్యటన



సాల్మన్ కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎస్సీ కమిషన్ సభ్యులు

మాచవరం, న్యూస్‌టుడే: దళిత ఉపకులాలు కలిసి మెలిసి ఉండాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని ఎస్సీ కమిషన్ సభ్యులు పిలుపునిచ్చారు. పల్లెల్లో ప్రశాంత జీవనం గడపాలని, ఎస్సీ కులాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో హత్యకు గురైన మందా సాల్మన్ కుటుంబాన్ని ఎస్సీ కమిషన్ సభ్యులు సీతారాం రావాడ, బాబు శ్రీపతి, భిక్షం మేకల, పాకంటి గౌతమ్‌రాజ్, రామాంజనమ్మ బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. ఈ కేసులో నిందితులు పేతురు కుటుంబంతో వ్యక్తిగత తగాదాలు ఉన్నాయా? హత్యకు గురైనరోజు ఏం జరిగింది? అని అడిగారు. సాల్మన్ భార్య కుమారి మాట్లాడుతూ.. నిందితుడితో వ్యక్తిగత తగాదాలు లేవని, రాజకీయంగానే హత్య జరిగిందని చెప్పారు. గతంలో ఏడాదికిపైనే ఊరు వదిలి వెళ్లామని, 3 నెలల కిందట వచ్చినట్లు చెప్పారు. తన భర్తపై దాడి జరిగాక నిందితుడికి కాలనీలోని తెదేపా వారు ఆశ్రయం ఇచ్చారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం ఎస్సీ కమిషన్ సభ్యులు కాలనీలో పర్యటించారు. పేతురు ఇంటికి వెళ్లి, ఆయన భార్య మరియమ్మతో మాట్లాడారు. ఆమె కమిషన్ సభ్యులతో మాట్లాడుతూ.. 2019 ఎన్నికల ఫలితాల రోజు వైకాపా వారు తన భర్తపై దాడి చేసి, దుస్తులు లేకుండా పరుగెత్తించారని చెప్పారు. అప్పటి నుంచి 2024 ఎన్నికల వరకు పాలపాడులో ఉన్నామని తెలిపారు. నాటి దాడిలో సాల్మన్ ఉన్నారని, ఆయన కుటుంబంతో గొడవలు లేవన్నారు. సాల్మన్ కుటుంబానికి ఎస్సీ కమిషన్ అండగా నిలుస్తుందని సభ్యులు భరోసా ఇచ్చారు.

బాపూజీ సిద్ధాంతాలపై అవగాహనకు సందేశయాత్ర

సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి



యాత్రలో పాల్గొన్న రఘువీరారెడ్డి, ఆయన భార్య సునీత, నాయకులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: బాపూజీ సిద్ధాంతాలు, గొప్పతనంపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే 'మహాత్మాగాంధీ సందేశయాత్ర' నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. తన స్వగ్రామం శ్రీసత్యసాయి జిల్లా నీలకంఠాపురం గ్రామం నుంచి హిందూపురం వరకు 52 కిలోమీటర్ల మేర సందేశయాత్రను ఆయన బుధవారం చేపట్టారు.

'శాయ్'లో సహాయ శిక్షకుల నియామకానికి ఉత్తర్వులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్)లో దేశవ్యాప్తంగా 26 క్రీడాంశాల్లో 323 సహాయ శిక్షకుల (రెగ్యులర్) పోస్టుల భర్తీకి కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో అర్హత గల క్రీడాకారులు, శిక్షకులు వచ్చేనెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని శాప్ ఛైర్మన్ రవినాయుడు కోరారు.

అనుమానమే లేదు.. అది కల్తీ నెయ్యే

(మొదటి పేజీ తరువాయి)

తద్వారా రూ.234.51 కోట్ల నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని పేర్కొంది. తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా కేసులో నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు ఇటీవల దాఖలు తుది అనుబంధ అభియోగపత్రం (ఛార్జ్‌షీట్) తాజాగా వెలుగుచూసింది. గతేడాది మే 7న దాఖలు చేసిన ప్రధాన అభియోగపత్రంలో 11 మంది నిందితుల పాత్రపై అభియోగాలు నమోదు చేశారు. తుది అనుబంధ అభియోగపత్రంలో 21 మంది నిందితుల ప్రమేయంపై అభియోగాలు మోపింది. వీరిలో ఎక్కువ మంది తితిదే ఉద్యోగులే. ప్రధానాంశాలివీ.

పామాయిల్, పామ్‌కెర్నెల్ ఆయిల్ కలిపి..

◆ భోలేబాబా డెయిరీ ప్రతినిధులు, నిందితులైన పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు కల్తీ నెయ్యి తయారీ కోసం తమ అనుబంధ సంస్థలైన హర్షా ట్రేడింగ్ కంపెనీ, హర్షా ఫ్రెష్ డెయిరీ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా కల్తీ నెయ్యి తయారీ కోసం కోల్‌కతాలోని బుడ్జే బుడ్జే రిఫైనరీస్ లిమిటెడ్, ఇతర సంస్థల నుంచి పామ్ కెర్నెల్ ఆయిల్, రిఫైన్డ్ పామాయిల్, రిఫైన్డ్ పామోలిన్ ఆయిల్ కొన్నారు.

◆ అరిస్టో కెమికల్స్ నుంచి లాక్టిక్ యాసిడ్ (ఫుడ్ గ్రేడ్), సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్, శివాన్షి ట్రేడింగ్ కంపెనీ, జీఆర్ ఇంప్లెక్స్ నుంచి ఎసిటిక్ యాసిడ్ ఎస్టర్, మోనోగ్లిసరైడ్స్ వంటి రసాయనాలు సేకరించారు. పొమిల్ జైన్, విపిన్ జైన్‌లు వారి ఉద్యోగులైన మోహన్ రాణా (ఏ12), సంజయ్ చౌహాన్ (ఏ13), ఆశిష్ రోహిలా (ఏ14)లతో కలిసి కల్తీ నెయ్యి తయారు చేశారు. పాలు, వెన్న వంటివి సేకరించకుండా పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్, పామోలిన్ ఆయిల్ అతి తక్కువ పరిమాణంలో నెయ్యితో కలిపి రసాయనాలు జోడించి ఈ కల్తీ నెయ్యి తయారు చేశారు. ల్యాబ్ పరీక్ష విలువ సర్దుబాటు చేయటానికి, కల్తీ నెయ్యి వాసనలు వచ్చేలా చేయటానికి ఈ రసాయనాలు కలిపారు.

◆ గుజరాత్‌లోని ఎన్‌డీడీబీ కాఫ్, ఆనంద్ సంస్థ 2025 మార్చి 27న ఇచ్చిన నివేదిక ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. తితిదే సేకరించిన నెయ్యి నమూనాల్లో ప్రధానంగా పామాయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్ ఉందని, అందులో నెయ్యి పరిమాణం చాలా తక్కువని పేర్కొంది. ఈ నమూనాల్లో బుట్యరిక్ యాసిడ్ నిర్దేశిత ప్రమాణంకంటే తక్కువగా ఉందని, కొవ్వులు కనిపించలేదని, అందువల్ల జంతువుల కొవ్వు ఉండే అవకాశాలు చాలా తక్కువని వివరించింది.

◆ హర్షా ఫ్రెష్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ ప్రైవేట్ సంస్థలకు తితిదే నెయ్యి టెండర్లలో పాల్గొనే అర్హత లేదు. తప్పుడు, నకిలీ పత్రాలతో తితిదే టెండర్లలో పాల్గొన్నాయి.

సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న లంచాలు తీసుకున్నారు

◆ నాటి తితిదే ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి పీఏ హోదాలో కుదురు చిన్నప్పన్న (ఏ29) తితిదేకు నెయ్యి సరఫరా టెండర్ల విషయంలో కీలకంగా వ్యవహరించారు. కిలో నెయ్యికి రూ.25 చొప్పున లంచం తీసుకున్నారు. పొమిల్ జైన్ అలా చెల్లించటానికి నిరాకరించగా.. నాటి ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎం ఆర్ఎస్ఎస్‌వీఆర్ సుబ్రహ్మణ్యం (ఏ24)పై ప్రభావం చూపి ప్లాంట్ తనిఖీ సమయంలో భోలేబాబా డెయిరీపై అనర్హత వేటేయించారు.

◆ ఏపీ భవన్‌లో స్పెషల్ లైజాన్ ఆఫీసర్ పోస్టులో కొనసాగిన చిన్నప్పన్న 2015 నుంచి 2018 వరకూ వైవీ సుబ్బారెడ్డి ఎంపీగా ఉన్న సమయంలో ఆయన వద్ద పీఏగా పనిచేశారు. 2019 నుంచి 2023 వరకూ సుబ్బారెడ్డి తితిదే ఛైర్మన్‌గా కొనసాగినప్పుడూ ఆయన దగ్గర పీఏగా ఉన్నారు.

◆ 2022 ఏప్రిల్/మే నెలల్లో నాటి తితిదే ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రహ్మణ్యం నుంచి నెయ్యి సరఫరాదారుల వివరాలను చిన్నప్పన్న ముందే తీసుకున్నారు. కొనుగోళ్లకు సంబంధించి తితిదే బోర్డు నిర్ణయాలకు ముందే సంబంధిత అంశాలన్నీ సుబ్రహ్మణ్యం నుంచి చిన్నప్పన్న మెయిల్‌కు వెళ్లేవి.

◆ ప్రీమియర్ అగ్రిఫుడ్స్‌కు 35 శాతం సరఫరా ఆర్డర్లు అధిక ధరలకు దక్కేలా చేసి.. ఆ సంస్థ ఎండీ జగన్‌మోహన్ గుప్తా నుంచి చిన్నప్పన్న రూ.50 లక్షలు లంచం తీసుకున్నారు.

◆ నిందితులైన తితిదే అధికారులు సుబ్రహ్మణ్యం, నటేష్‌బాబు, అనిల్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డిలు సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ నివేదికల్లో కల్తీ నెయ్యి సరఫరా అయినట్లు తేలినా, ఆ నివేదికలు ఉన్నతాధికారులకు పంపించకుండా దాచిపెట్టారు. భోలేబాబా డెయిరీకి అదనంగా మరో 15 శాతం సరఫరా ఆర్డరు ఇచ్చారు.

ప్లాంట్ల తనిఖీలో తకరారు

◆ నిందితుల జాబితాలోని ప్లాంట్ తనిఖీ సభ్యులు దురుద్దేశపూర్వకంగానే డెయిరీ ప్లాంట్లను సరిగ్గా తనిఖీలు చేయలేదు. ఆయా సంస్థలకు తితిదే టెండరు షరతులకు అనుగుణంగా అర్హతలు లేవని తెలిసినా వాటికి అనుకూలంగా తప్పుడు నివేదికలిచ్చారు. కల్తీ నెయ్యి సరఫరాతో తితిదేకు భారీగా నష్టం, డెయిరీ సంస్థలకు అనుచిత లబ్ధి కలిగించారు.

◆ నిందితులైన తితిదే జూనియర్ అసిస్టెంట్ పల్లి ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ముద్ద వెంకట అనిల్‌లు కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్ ద్వారా లంచాలు తీసుకుని కల్తీ నెయ్యి సరఫరాను అనుమతించారు. ఆయా డెయిరీల బిల్లులను చెల్లింపు కోసం ఉన్నతాధికారులకు పంపించారు.

దేశ సమగ్రాభివృద్ధిలో 'స్థానిక' ప్రజాస్వామ్యం కీలకపాత్ర

- లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న జయప్రకాశ్ నారాయణ చిత్రంలో గీతం ప్రొ-వీసీ గౌతమ్‌రావు, డైరెక్టర్ సుష్మారాజ్, ప్రొఫెసర్ బి.నళిని తదితరులు

విశాఖపట్నం (సాగర్‌నగర్), న్యూస్‌టుడే: దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే స్థానిక సంస్థల పాలనలో ప్రజాస్వామ్యం కీలకపాత్ర పోషిస్తుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ అన్నారు. సంవాద్ ఉపన్యాస శ్రేణిలో భాగంగా బుధవారం గీతం డీమ్డ్ వర్సిటీ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం-అభివృద్ధి' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. స్థానిక సంస్థల్లో ప్రజలు తమ వ్యవహారాలను స్వయంగా నిర్వహించుకునే అధికారం ఇవ్వడం వల్ల సమగ్రాభివృద్ధి, మెరుగైన సేవలు, బాధ్యతాయుత పాలన సాధ్యమవుతుందని జేపీ పేర్కొన్నారు. 'కేంద్రీకృత పాలనతో పోలిస్తే ప్రాంతీయ సమస్యలను స్థానిక ప్రజాస్వామ్యం మరింత సమర్థంగా పరిష్కరిస్తుంది. భారత్ ప్రజాస్వామ్య దేశమైనా.. చైనాతో పోలిస్తే స్థానిక సంస్థలకు ఆర్థిక అధికారాల వికేంద్రీకరణ విషయంలో వెనుకబడి ఉన్నాం. భారతదేశం వేగవంతమైన ఆర్థికవృద్ధి సాధించినా పాఠశాల విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి రంగాలకు సరైన నిధులు కేటాయించకపోవడంతో వేగంగా మానవవనరుల అభివృద్ధి జరగడం లేద'ని పేర్కొన్నారు. పేదరికాన్ని తగ్గించి ఆర్థిక వృద్ధి, ఉత్పాదకతను పెంచడానికి దోహదపడే విధానాలను వివరించారు.

600 బీసీ హాస్టళ్లలో డిజిటల్ తరగతులు

- అన్ని జిల్లాల్లోనూ బీసీ భవన్‌ల నిర్మాణం పూర్తిచేయాలి
- శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 600 బీసీ సంక్షేమ వసతిగృహాల్లో డిజిటల్ తరగతుల నిర్వహణకు పరికరాలు, కంటెంట్ సహా అవసరమైన ఏర్పాట్లను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు పూర్తిచేయాలని అసెంబ్లీ బీసీ సంక్షేమ కమిటీ సంబంధిత అధికారులను ఆదేశించింది. ఇందుకోసం ఒక్కో హాస్టల్‌కు రూ.2.50 లక్షల చొప్పున మొత్తం రూ.15 కోట్లు అవసరమవుతాయని అధికారులు నివేదించగా.. ఈ నిధుల సమీకరణ బాధ్యతను తామే తీసుకుంటామని కమిటీ తెలిపింది. బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్లో ఈ కమిటీ సమావేశమైంది. కమిటీ ఛైర్మన్ బీద రవిచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులైన ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, కందికుంట వెంకటప్రసాద్, కాగిత ప్రసాద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సదుపాయాలపై ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న బీసీ సంక్షేమ వసతిగృహాల్లో కనీస సదుపాయాల్లేవనే ఫిర్యాదులు చాలా వచ్చాయని అధికారులను కమిటీ ప్రశ్నించింది. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు, విద్యుత్ సరఫరా సమస్య నివారణకు ఇన్వర్టర్ల వంటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలపగా.. వసతిగృహాల వారీగా సమస్యల జాబితా రూపొందించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిటీ స్పష్టం చేసింది.

ప్రతినెలా ఒక జిల్లా పర్యటన

జిల్లా బీసీ భవన్‌లు శ్రీకాకుళం, చిత్తూరుల్లోనే పూర్తయ్యాయని, మిగిలిన ఉమ్మడి జిల్లాల్లో ఈ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని కమిటీ సూచించింది. రెసిడెన్షియల్ పాఠశాలలకు డిమాండ్ ఉన్నందున.. వీటి సంఖ్య పెంపుదల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించింది. ప్రతినెలా ఒక జిల్లాలో పర్యటిస్తామని కమిటీ ఛైర్మన్ రవిచంద్ర తెలిపారు. 'ప్రభుత్వం బీసీలకు ప్రాధాన్యమిస్తూ, వారి సంక్షేమం, అభివృద్ధికి నిధులూ కేటాయిస్తోంది. ఈ పథకాల అమలుతో పాటు.. విశ్వవిద్యాలయాలు, విద్యుత్ సంస్థల్లో నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాటిస్తున్నారా లేదా అనేదీ పరిశీలిస్తాం. లోపాలను ప్రభుత్వానికి నివేదిస్తాం' అని చెప్పారు.


ఆర్థిక ప్రగతికి సరికొత్త ఆలంబన

సుంకాలూ ఇతరేతర అడ్డుగోడలను బద్దలుకొట్టే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు(ఎఫ్‌టీఏలు)- అంతర్జాతీయ వర్తకాభివృద్ధికి, భాగస్వామ్య దేశాల ఆర్థిక ప్రగతికి దోహదపడతాయి. వ్యాపారాలకు అవి కొత్త అవకాశాలను సృష్టిస్తాయి. వినియోగదారులకు వస్తుసేవలను సరసమైన ధరల్లో మరింత విస్తృతంగా అందుబాటులోకి తెస్తాయి. ఈ నెల పదమూడో తేదీ నాటికి ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో) సభ్యదేశాల నడుమ అలాంటి ఒప్పందాలు 380 వరకు అమలులో ఉన్నాయి. దేశీయ గిరాకీపైనే ఎక్కువగా ఆధారపడిన ఆర్థిక వ్యవస్థకు కొత్త జవసత్వాలను అందించేందుకు గత కొన్నేళ్లుగా ఇండియా సైతం ఎఫ్‌టీఏలపై ఎక్కువగా దృష్టిసారిస్తోంది. 2024లో భారత జీడీపీలో 21శాతం వాటా కలిగిన ఎగుమతులను ఎంతగా పెంచగలిగితే స్థానికంగా ఉపాధికల్పన అంతగా జోరందుకుంటుంది. ఆ ఉద్దేశంతోనే 2021లో మారిషస్‌తో సమగ్ర ఆర్థిక సహకార భాగస్వామ్య ఒప్పందాన్ని పట్టాలెక్కించింది మొదలు యూఏఈ, ఆస్ట్రేలియా, యూకే, యూరోపియన్ ఫ్రీట్రేడ్ అసోసియేషన్, ఒమన్, న్యూజిలాండ్‌లతో ఇండియా కీలక ఒడంబడికలను కుదుర్చుకుంది. తాజాగా 27దేశాల యూరోపియన్ యూనియన్‌తో ముడిపడిన చరిత్రాత్మక ఎఫ్‌టీఏ- భారతీయ ఎగుమతిదారులకు అతిపెద్ద విపణిని చేరువ చేయనుంది!

పెరుగుతున్న వయోధిక జనాభా కారణంగా దేశీయ గిరాకీలో వృద్ధి బలహీనం కావడం, అస్థిర ఏకపక్ష విధానాలతో ఆందోళన పెంచుతున్న అమెరికా, చైనా మార్కెట్లను నమ్ముకునే పరిస్థితి లేకపోవడంతో ఈయూ నేడు ఇండియాను విశ్వసనీయ వాణిజ్య భాగస్వామిగా భావిస్తోంది. ఐఎంఎఫ్ లెక్కల ప్రకారం, 2011లో 1.82 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్న భారత జీడీపీ ఇప్పుడు 4.5 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రపంచంలోనే వేగంగా ఎదుగుతున్న అతిపెద్ద ఆర్థికవ్యవస్థ అయిన ఇండియాతో వాణిజ్యం సురక్షితమని ఈయూ తలపోస్తోంది. స్వీయ ప్రయోజనాల వెంపర్లాటలో పడి మిత్రపక్షాలపైనా సుంకాల కత్తి దూస్తున్న డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం- ప్రపంచీకరణ విఫలమైందంటూ ప్రచారం చేస్తోంది. ట్రంప్ సారథ్యంలో అంతర్జాతీయ నియమాలను కాలరాస్తున్న అగ్రరాజ్యం ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో అర్థంకాని నేపథ్యంలో ఎగుమతి దిగుమతి మార్కెట్లను వైవిధ్యపరచుకోవడం ఇండియా, ఈయూలకు ఉభయతారకమవుతుంది. అనిశ్చిత భౌగోళిక రాజకీయాల్లో సరఫరా గొలుసులను సుస్థిరం చేసుకుని వ్యూహాత్మక ఆర్థిక స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకోవడానికి అది అక్కరకొస్తుంది!

అభివృద్ధికి సహాయ సహకారాల అందజేతతో మొదలైన వాణిజ్య రంగంలో సరికొత్త చివుళ్లు తొడుక్కున్న ఐరోపా, ఇండియా సంబంధాలు- ఉమ్మడి ప్రజాస్వామ్య విలువల పునాదులపై కాలక్రమంలో బలోపేతమయ్యాయి. ఇరుపక్షాల వాస్తవిక అవసరాల ప్రాతిపదికపై ఎఫ్‌టీఏతో ఇప్పుడవి ఇంకా పటిష్ఠమయ్యాయి. లక్షలాది మందికి ఉపాధి కల్పించే భారతీయ దుస్తులు, తోలు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు, ఇంజినీరింగ్ పరిశ్రమలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో లాభపడనుండటం శుభసూచికం. రెండు లక్షల కోట్ల డాలర్ల విలువైన ఈయూ పారిశ్రామిక విపణిలోకి సుంకరహితంగా ప్రవేశించగలగడం- దేశీయ యంత్ర సామగ్రి ఎగుమతుల విలువను 2030 నాటికి 30వేల కోట్లకు చేర్చాలన్న ఇండియా లక్ష్యాన్ని సాకారం చేయడంలో తోడ్పడుతుంది. ఇప్పటికిప్పుడు రూ.6.9 లక్షల కోట్ల మేర ఎగుమతులకు లబ్ధి చేకూర్చే ఎఫ్‌టీఏతో దీర్ఘకాలంలో మరిన్ని ప్రయోజనాలు పొందాలంటే- ముఖ్యంగా ఎంఎస్ఎంఈల సామర్థ్య పెంపుపై దృష్టిసారించాలి. పర్యావరణ హితకర పద్ధతుల్లో నాణ్యమైన వస్తువుల తయారీకి పెద్దపీట వేయాలి!

సమ్మిళిత అభివృద్ధే ప్రజాస్వామ్యానికి రక్ష!



ఇండియా 1950 జనవరి 26న గణతంత్ర రాజ్యంగా అవతరించినప్పుడు, ఈ దేశం ఒక ప్రజాస్వామ్యంగా దీర్ఘకాలం మనగలదా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. సామాజిక ఐక్యత ఉండి, ఆర్థికంగా కొంతైనా పురోగతి సాధించిన దేశాల్లోనే ప్రజాస్వామ్యం నిలిచి ఉంటుందని, భారత్‌లో ఆ లక్షణాలు లేవనే సూత్రీకరణలు అప్పట్లో వినవచ్చాయి. వాటిని వమ్ము చేస్తూ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంగా ఇండియా తన విశిష్టతను నిలబెట్టుకుంటూ వస్తోంది.

రెండో ప్రపంచ యుద్ధానంతరం ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో వలస పాలన నుంచి విముక్తమైన పలు దేశాలలో సైనిక తిరుగుబాట్లు జరిగి నియంతలు అధికారంలోకి వచ్చారు. కొన్ని దేశాలు అంతఃకలహాలలో మునిగితేలాయి. చివరికి అవి ముక్కలయ్యాయి. అలాంటి పరిస్థితుల్లో దారిద్ర్యం, తక్కువ అక్షరాస్యత, తీవ్రమైన సామాజిక అంతరాలు, దేశ విభజన మిగిల్చిన చేదు జ్ఞాపకాలతో స్వతంత్రమైన భారతదేశం ప్రజాస్వామ్య పంథాలో ఎంతకాలం సాగగలుగుతుందనే ప్రశ్నలు ఆనాడు మార్మోగాయి. పేదరికానికి, ప్రజాస్వామ్యానికి పొసగదనే సిద్ధాంతాలు అప్పట్లో వినవచ్చాయి. కానీ, ఇండియా తనదైన పంథాలో ముందుకు సాగింది. ఇండియా ప్రజాస్వామ్యాన్ని కాలదన్ని సైనిక పాలనకు పట్టం కట్టలేదు. భిన్నత్వంలో ఏకత్వానికి సహజంగా కట్టుబడింది కానీ, దానికోసం బలవంతంగా ప్రయత్నించలేదు. ఈ విధానాలను భారత్ ఎన్నాళ్లో సాగించలేదనీ భావించినవారున్నారు. కానీ, వారి అంచనా విఫలమైంది. భారత ప్రజానీకం చురుకైన భాగస్వాములుగా ప్రజాస్వామ్యాన్ని నిలబెడుతున్నారు.


అస్థిరతకు తావు లేకుండా...

భారతదేశం రాజకీయంగా సుస్థిరతను సాధించడం అతి పెద్ద విజయం. భాష, ప్రాంతం, మతం, సాంస్కృతికంగా ఎంతో భిన్నత్వం ఉన్న ఇండియా బలప్రయోగంతో కాకుండా ఇచ్చిపుచ్చుకునే వైఖరితో ఏకత్వం సాధించింది. 1950ల్లో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సంఘర్షణలకు, ఉద్రిక్తతలకు తావులేని సమాఖ్య స్ఫూర్తిని ప్రతిబింబించింది. స్వాతంత్ర్యానంతరం అనేక దశాబ్దాల పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుబాట్లు, వేర్పాటువాద ధోరణులు ప్రబలినా రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పంథాను ఇండియా విడనాడలేదు. సయోధ్య ద్వారా సిద్ధించిన ఐక్యతతో దేశం స్థిరంగా ముందుకు సాగుతోంది. వాస్తవానికి, భారత ప్రజాస్వామ్యం బృహత్తరమైంది. ప్రపంచంలో అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగుతోంది. రాజకీయాలలో సైనిక జోక్యం లేకపోవడం భారతదేశ విశిష్ట లక్షణం. దేశంలో తిరుగుబాట్లు సంభవించినా, పొరుగు దేశాలతో యుద్ధాలు జరిగినా పౌర పాలనే స్థిరంగా సాగింది. సరిహద్దు వివాదాలు, యుద్ధాలు, ఉగ్రదాడులు, స్థానికంగా తిరుగుబాట్లను ఎదుర్కొంటున్న దేశాల్లో అనేకం సుదీర్ఘ ఎమర్జెన్సీలోకో, సైనిక పాలనలోకో జారిపోయాయి. భారతదేశం ఆ ఊబిలో పడలేదు. అవసరమైనప్పుడు బలప్రయోగంతో అంతర్గత తిరుగుబాట్లను, ఉగ్రదాడులను అణచివేస్తూ భారత్ ప్రజాస్వామ్య పథంలోనే పయనిస్తోంది. భారత విదేశాంగ విధానం మరీ తటస్థంగా ఉంటుందని విమర్శలు వస్తుంటాయి. ఇండియా వాటిని లెక్కచేయకుండా తన దారిలో తాను నడుస్తోంది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా వైపో, సోవియట్ వైపో పూర్తిగా మొగ్గలేదు. ప్రచ్ఛన్నయుద్ధం ముగిశాక అన్ని పక్షాలతో భాగస్వామ్యం నెరపుతోంది. భిన్న ధ్రువాలుగా చీలిపోతున్న ప్రస్తుత ప్రపంచంలో స్వతంత్ర పంథా అనుసరిస్తోంది.

స్వాతంత్ర్యం వచ్చినప్పుడు భారతదేశ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండేది. 1950-1980ల మధ్య ఆర్థికాభివృద్ధి రేటు సాలీనా సగటున 3-3.5 శాతానికి మించలేదు. అయినా భారత్ ప్రజాతంత్ర రాజకీయ వ్యవస్థను కాపాడుకుంటూనే 1991లో ఆర్థిక సంస్కరణలు చేపట్టి వృద్ధి రేటును ముందుకు ఉరికించగలిగింది. 2005-21 మధ్య 41.5 కోట్లమంది భారతీయులు బహుముఖీన పేదరికం నుంచి బయటపడ్డారని ప్రపంచ బ్యాంకు తెలిపింది. నేడు విద్యావైద్యాలు జనాభాలో అత్యధికులకు అందుతున్నాయి. డిజిటల్ మౌలిక వసతులు విస్తరించి వివిధ రంగాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సేవలను నేరుగా ప్రజలకు అందిస్తున్నాయి. భారత్ ఇప్పుడు ప్రపంచంలో నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. కొనుగోలు శక్తి పరంగా మూడో పెద్ద వ్యవస్థ. ఒకప్పుడు విదేశీ సాయం మీద ఆధారపడిన భారత్ నేడు తానే ఆఫ్రికా, ఆసియాలలోని పేద దేశాలకు ధన, వస్తురూపేణా సాయపడుతోంది. కొవిడ్ సమయంలో 90 దేశాలకు టీకాలు అందించింది. అవసరమైనప్పుడల్లా పేద దేశాలకు ఆహారం సమకూర్చింది. వర్ధమాన దేశాల మధ్య సహకార వృద్ధికి పాటుపడుతోంది. వాతావరణ ఫైనాన్స్, డిజిటల్ మౌలిక వసతుల కల్పనపై చర్చల్లో చురుకైన పాత్ర పోషిస్తోంది.

ముందున్న సవాళ్లెన్నో!

అలాగని ఇండియాలో అంతా సవ్యంగా ఉందని, భవిష్యత్తుకు ఢోకా లేదని చెప్పడం సరికాదు. దేశంలో ఇంకా ఎన్నో సమస్యలు ఉన్నాయి. విచ్ఛిన్నకర ధోరణులు, ప్రాంతీయ తత్వం, గుర్తింపు రాజకీయాలు, మతపరమైన చీలికలు సమసిపోలేదు. డిజిటలీకరణ వల్ల చిన్నచిన్న అవినీతి ఉదంతాలు తగ్గుముఖం పట్టినా, పైస్థాయిలో ఘరానా కుంభకోణాలు వెలుగు చూస్తున్నాయి. వాటిని నివారించాలంటే ఉన్నత స్థాయిలో జవాబుదారీతనం పెరగాలి. పేదరికం తగ్గినా అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, అన్ని ప్రాంతాల్లో సమతుల ప్రగతి ద్వారా ఈ అసమానతలను తొలగించాలి. సమ్మిళిత అభివృద్ధే ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది. అది సాకారం కావాలంటే- నైపుణ్యాలను, ఉపాధి అవకాశాలను బాగా విస్తరించాలి. ప్రాంతీయ సమతుల్య సాధనకు ప్రభుత్వాలు అగ్ర ప్రాధాన్యమివ్వాలి. ఆర్థిక, సాంకేతిక స్వావలంబనతో వ్యూహపరమైన స్వయంప్రతిపత్తిని నిలబెట్టుకోవాలి. గణతంత్ర రాజ్యంగా 77వ పడిలోకి అడుగుపెట్టిన భారతదేశం ఎన్ని సవాళ్లనైనా తట్టుకుని నిలిచే సత్తా తనకుందని నిరూపించడం మాత్రమే కాదు- చట్టబద్ధ పాలన, సమ్మిళిత అభివృద్ధి, వ్యూహపరంగా సాహసిక, సంయమన పంథాతో కొత్త యుగంలోకి దూసుకెళ్లాలి.




రాకేశ్ భాటియా
విశ్రాంత బ్రిగేడియర్

విమర్శకులపై ఎదురుదాడి చేయడం వల్ల సమయం, శక్తి వృథా అవుతాయి. విమర్శలను విజయానికి పునాదిగా మలచుకోవాలి. ప్రణాళికలను అందరికీ చెప్పనక్కరలేదు, ఫలితాలే మాట్లాడాలి. మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ పేరు వినే ఉంటారు. 'స్ట్రోక్‌లెస్ వండర్' అన్నారు ఒకప్పుడు అతణ్ని. విమర్శకుల నోళ్లు ఎలా మూయించవచ్చో చెప్పడానికి ఈ టైటిల్ ఒక ఉదాహరణ.

1983లో అరంగేట్రం చేసిన సిద్ధూ మొదటి మ్యాచ్‌ల్లో చాలా నెమ్మదిగా ఆడాడు. పరుగులు తీయడానికి చాలా ఇబ్బంది పడేవాడు. అప్పట్లో ప్రముఖ క్రికెట్ కాలమిస్ట్ రాజన్ బాలా, సిద్ధూ ఆటతీరును విమర్శిస్తూ ఒక పత్రికలో 'సిద్ధూ: ద స్ట్రోక్‌లెస్ వండర్' అనే శీర్షికతో కథనం రాశారు.

విమర్శలే నిచ్చెనమెట్లు



అతనికి షాట్లు ఆడటం రాదని దాని సారాంశం. ఆ విమర్శ, అది చదివి తండ్రి బాధపడటం సిద్ధూను కదిలించాయి. ఆ వ్యాసాన్ని కత్తిరించి తన అల్మారాకి అంటించుకున్నాడు. విమర్శను పాజిటివ్‌గా తీసుకుని, తండ్రి గర్వించేలా గొప్ప క్రికెటర్ కావాలని నిశ్చయించుకున్నాడు. బ్యాటింగ్ శైలిని మార్చుకోవడానికి తీవ్రంగా శ్రమించాడు. రోజూ తెల్లవారుజామునే లేచి ప్రాక్టీస్ చేసేవాడు. రోజుకు 300 సిక్సులు కొట్టడం టార్గెట్. అలా కొడుతుంటే ఎన్ని బంతులు గ్రౌండ్ చుట్టూ కనపడకుండా పోయేవో. డబ్బులిచ్చి మరీ బౌలింగ్ చేసేందుకు కుర్రాళ్లను పెట్టుకున్నాడు. రాత్రి పదైనా సరే, 300 సిక్సుల లక్ష్యం చేరాల్సిందే. ఒకోసారి చేతి గ్లవుజులు రక్తంతో తడిసేవి. 1987 ప్రపంచకప్‌లో సిద్ధూ అద్భుతమైన ఫామ్‌తో తిరిగి వచ్చాడు. వరసగా నాలుగు అర్ధ సెంచరీలు సాధించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ముఖ్యంగా స్పిన్నర్ల బౌలింగ్‌లో భారీ సిక్సర్లు బాదుతూ విరుచుకుపడ్డాడు. 'సిక్సర్ల సిద్ధూ'గా పేరు తెచ్చుకున్నాడు. ఈసారి రాజన్ బాలా సిద్ధూ గురించి 'పామ్ ట్రీ హిట్టర్(తాటిచెట్లను కొట్టేవాడు)' అని రాశారు. సిద్ధూ 136 వన్డే మ్యాచ్‌లు ఆడి 4,413 రన్స్ సాధించాడు. అందులో ఎన్నో సిక్సులు ఉన్నాయి. టెస్టులు కూడా 51 ఆడి 3,202 పరుగులు తీశాడు. అందులోనూ ఎన్నో సిక్సులు. ఫోర్లు ఉన్నాయని వేరే చెప్పనవసరం లేదు. అదీ సిద్ధూ సక్సెస్ స్టోరీ. విమర్శకు కుంగిపోయి, బాధపడి, నా వల్ల కాదులే అని లక్ష్యాన్ని వదిలేస్తే ఎవరూ ఏమీ సాధించలేరు. ఫెయిల్యూర్‌కి కారణాలు వెతకడం, మన ఓటమికి ఇతరులెవరో కారణమని భావించడం, అన్యాయంగా విమర్శిస్తున్నారని బాధపడటం... విజేతల లక్షణాలు కావు. విజయానికి కావాల్సింది నిర్దిష్టమైన ప్రణాళిక, కఠోర శ్రమ, మన సామర్థ్యంపై మనకి నమ్మకం.

ఇదే సిద్ధూను చిన్నప్పుడు తండ్రి లేపి జాగింగ్‌కి పంపించేవాడు. సిద్ధూ లేచి, తండ్రి అటు వెళ్లగానే, పనివాళ్లకి లంచం ఇచ్చి వేరే రూములో పడుకునేవాడు. ఏడింటికి లేచి, ముఖం మీద నీళ్లు చల్లుకుని, రొప్పుతూ వచ్చి తండ్రికి అలసిపోయినట్లు కనిపించేవాడు. కానీ ఒకసారి ఆటను సీరియస్‌గా తీసుకున్నాక సంకల్పబలంతోనే తానేమిటో నిరూపించుకున్నాడు.

– వైనతేయ



మనసులో ప్రేమ పెంచుకోవడం మరొకరి మీద పెట్టే పెట్టుబడి. ఆరోగ్యం మీద శ్రద్ధ మన మీద మనం పెట్టుకునే పెట్టుబడి. మనం బాగుంటేనే కదా మరొకరిని బాగా చూసుకోగలం.

– అనితానాయర్, రచయిత్రి

చౌక ధరల్లో ఇళ్లేవీ?

ఇండియాలో అభివృద్ధి నగరాల చుట్టూ కేంద్రీకృతం అవుతోంది. దాంతో పెద్ద సంఖ్యలో ప్రజలు పట్టణాలకు వలస వచ్చి ఉద్యోగ, ఉపాధుల్లో కుదురుకుంటున్నారు. వారిలో అల్ప, మధ్యాదాయ వర్గాలు సొంతిల్లు సమకూర్చుకోవడం గగనకుసుమమవుతోంది. ఎందుకంటే, నగరాల్లో అందుబాటు ధరల్లో (రూ.40 లక్షల్లోపు) ఇళ్లు క్రమంగా తగ్గిపోతున్నాయి. మిడ్-ఎండ్ (రూ.40-80 లక్షలు) గృహాల విషయంలోనూ ఇదే ధోరణి నెలకొంది. వాటి స్థానాన్ని హై-ఎండ్ (రూ.80 లక్షలు- రూ.1.5 కోట్లు), లగ్జరీ (రూ.1.5-2.5 కోట్లు), అల్ట్రా-లగ్జరీ (రూ.2.5 కోట్లకు పైన) ఇళ్లు ఆక్రమిస్తున్నాయి. 2019, 2024ల్లో పట్టణ భారతంలో ఆయా విభాగాల వారీగా అందుబాటులోకి వచ్చిన ఇళ్లలో వ్యత్యాసం (శాతాల్లో)...



(ఆధారం: నీతి ఆయోగ్ నివేదిక)

	2019	2024
చౌక ధరల్లో ఇళ్లు	40	16
మిడ్-ఎండ్	33	28
హై-ఎండ్	16	26
లగ్జరీ	7	14
అల్ట్రా లగ్జరీ	4	16

దర్శనకళ

'దర్శనం' అనేది చాలా విలువైన పదం. విరివిగా ఉపయోగిస్తూనే ఉన్నా, అంతరార్థం చాలామందికి బోధపడని పదమది. ఉదాహరణకు 'మీరు దేవుణ్ని చూశారా' అనే ప్రశ్న ఎదురైతే, మనలో చాలామందిమి బిత్తరపోతాం. ఏం చెప్పాలో తెలియక తికమకపడతాం. తిరుమల శ్రీవారినో, శ్రీశైలం శివయ్యనో సేవించుకుని వచ్చినప్పుడు- దర్శనం చేసుకుని వచ్చామని చెబుతామే తప్ప రామకృష్ణ పరమహంసలా 'నేను దైవాన్ని చూశాను' అని నిశ్చయంగా చెప్పలేకపోతున్నాం. కారణం ఏమిటంటే- గురువును వ్యక్తిగాను, మంత్రాన్ని అక్షరాలుగాను, దైవాన్ని ప్రతిమగాను పొరబడటం మానవ సహజం కనుక! కనక దుర్గమ్మ బొమ్మలో అమ్మవారిని సజీవంగా గుర్తించే చూపు మనకు అలవడితేనే- కళ్లకు దర్శనకళ చేకూరినట్లు!

రామలక్ష్మణులను వెంటపెట్టుకుని విశ్వామిత్రుడు మిథిలకు విచ్చేశాడు. జనకుడు వారికి ఎదురేగి, ఆహ్వానం పలికాడు. ఆ క్షణమే ఆయన చూపు రాముడిపై పడింది. 'లక్ష్మీదేవిని వక్షస్థలాన ధరించగల తేజస్సుతో కళకళలాడిపోతున్న ఈ చిరంజీవి ఎవరు?' అని అడిగాడు విశ్వామిత్రుణ్ని. తొలిచూపులోనే రామచంద్రుడిలో విష్ణువు అంశను పసికట్టగలిగిన ఆ నేర్పునే 'దర్శన కళ' అంటారు.



శుక్రాచార్యుడు వద్దు వద్దంటున్నా వామనుడికి దానం ఇచ్చితీరాలని సంసిద్ధుడయ్యాడు బలిచక్రవర్తి. భార్య వింధ్యావళి బంగారు పాత్రతో తెచ్చిన నీళ్లు పోస్తుండగా వామనుడి కాళ్లు కడగబోయాడు. ఆ ఘట్టంలో వామనుడి పాదాల గురించి పోతన చేసిన వర్ణన వింటే- దర్శనకళ అంటే ఏంటో తెలుస్తుంది. అవి రాస్తే వచ్చిన పద్యాలు కావు- చూస్తే వచ్చిన పద్యాలు. తాను బలిచక్రవర్తిగా మారిపోయి స్వయంగా వామనుడి దివ్యపాద పద్మాలను కన్నీటితో అభిషేకిస్తున్నప్పుడు పుట్టుకొచ్చిన పద్యాలవి. ఆ పాదద్వయాన్ని వేదరాశిగా దర్శించిన ధన్యుడు పోతన మహాశయుడు. కాబట్టే 'ఈరోజు ఏమైనా సరే, భీష్ముణ్ని సంహరిస్తాను' అంటూ కోపంగా రథంపైనుంచి కుప్పించి దూకిన కృష్ణుడి కర్ణకుండలాల కాంతి పరివేషం గగనమంతటా వ్యాప్తిచెందిన పరమాద్భుత దృశ్యం పోతనకు దర్శనం ఇచ్చింది.

అంతర్యామి

'ఎడమచేత్తో శ్రీకృష్ణుడు పూరిస్తున్న ఆ శంఖాన్ని చూశారా! బాలకృష్ణుడు కుడిచేత్తో పట్టుకుని కొద్దిగా రుచిచూసిన పెద్ద వెన్నముద్దలా లేదూ?' అని అడిగాడు- పాండురంగ మహాత్మ్యంలో తెనాలి రామకృష్ణుడు. శంఖం ఆకారాన్ని మనం గుర్తు చేసుకుంటే- ఆ వెన్నముద్ద మన కంటిలోనూ కదలాడుతుంది. దర్శనం అనే మాటకు అర్థం తెలుస్తుంది. కావ్య ప్రబంధాల్లోనైనా, దైవ దర్శనాల్లోనైనా- భావన చేసేవారికే భగవంతుడు! ఆ రెండింటా అంతరార్థాలను ఆకళించుకోకుండా- మనలో ఆ కళను ఇంకించుకోకుండా ఉత్తినే పుస్తకాలను తిరగేస్తే ప్రయోజనం లేదు. గుళ్లు తిరిగొస్తే ఫలితం ఉండదు. ఆలయాలకు వెళ్లేది చరవాణిలో స్వీయ చిత్రాలు తీసుకునేందుకు కాదు, గర్భగుడిలోని స్వయంభువును వివేకమనే మన మూడోకంటితో దర్శనం చేసుకునేందుకు!

– ఎర్రాప్రగడ రామకృష్ణ

తాళికట్టు శుభవేళ..

'మా వాడని చెప్పడం కాదు కానీ.. చాలా నెమ్మదస్తుడు. రేటు పెరగని ఫ్లాటులా బాగా సిగ్గు. మీ అమ్మాయికి పర్‌ఫెక్ట్ జోడీ అనుకోండి!'

'మా అమ్మాయి మాత్రం చాలా స్పీడండీ.. స్టాక్ మార్కెట్‌లా ఎప్పుడెలా ఉంటుందో తెలియదు. మార్కెట్ స్వింగ్స్‌లాగే మూడ్ స్వింగ్స్ కూడా కొంచెం ఎక్కువ. మీ అబ్బాయి కొంచెం తట్టుకోవాలి. అయినా అలా సెట్ అవ్వకుండా ఉండట మేగా పెళ్లంటే'

'మరే.. అయినా అమెరికా వీసా కోసం ఆరేళ్లు వెయిటింగ్‌లో ఉన్న గుండె అండీ మా వాడిది. తట్టుకోవడం విషయంలో మీకేం భయం అక్కర్లేదు'

'ఆరేళ్లంటే చాలా త్వరగా వచ్చేసినట్టేనండీ.. మా పక్కింటి పాపాయమ్మగారి బామ్మర్ది అల్లుడు పాలకొల్లు పరమేష్ పదేళ్లుగా క్యూలోనే ఉన్నాడు. వచ్చే ఏడాది అవుతుందేమో అంటున్నారు. చూడాలి మరి!'

'అవునండీ.. పిల్లల్ని కనగలం కానీ వాళ్ల వీసా స్టాంపింగులు కనగలమా చెప్పండి! అందుకే మావాడు ఆరో క్లాసులో ఉన్నప్పటి నుంచే అమెరికా వీసా ఇంటర్వ్యూ కోసం లాంగ్‌టర్మ్ కోచింగ్ పెట్టించేశాను. కనీసం పెళ్లి టైమ్‌కి అయినా రాకపోతుందా అని'

'మంచిపని చేశారు. వియ్యంకులు గారికి ముందుచూపు ఎక్కువే. మరి మీకూ మాకూ అంతా సెట్ అయ్యింది కాబట్టి.. మిగతా విషయాలు కూడా మాట్లాడుకుంటే..'

'ఇచ్చిపుచ్చుకోవడాలే కదా.. మాకేం పట్టింపులు లేవండీ, అమెరికా విమానమంత విశాలమైన హృదయాలు మావి. మీ అమ్మాయి, అల్లుడూనూ.. మీకు నచ్చింది పెట్టుకోండి'

'ఆ మాటన్నారు చాలు. ఎంత మీకు పట్టింపులు లేకపోయినా ఉన్న ఒక్కగానొక్క కూతురికి మేం పెట్టేది పెడతాం కదా.. అందులోనూ మాదసలే వీధి మొత్తానికి రిచ్ ఫ్యామిలీ. అందుచేత.. అమ్మాయికి పెళ్లి కానుకగా గ్రాములో పదోవంతుతో బంగారు ముక్కుపుడక చేయిస్తాం!'



'అయ్యబాబోయ్.. అంత బంగారంతో ముక్కుపుడకే! మీరు రిచ్ అని తెలుసుగానీ, మరీ జిల్లా మొత్తానికని అనుకోలేదు. కానీ అంత వాల్యూబుల్ థింగ్ తీసుకుంటే మేమేదో మిమ్మల్ని కట్నం కోసం వేధించినట్టు ఉంటుందేమో. కేసులవీ కడితే లేనిపోని తలనొప్పి!'

'అయ్యో ఎంతమాట. కావాలంటే మేమే స్వయంగా చేయించాం అని, మీ బలవంతం ఏమీ లేదని హామీపత్రం కూడా రాసిస్తాం. మీకు మాట రానిస్తామా చెప్పండి! నా యావదాస్తీ ధారపోసి అయినా అనుకున్నది చేయాల్సిందే. అలాగే అబ్బాయికి చిటికెన వేలి గోరు చివర సరిపోయేలా గ్రాములో వందోవంతుతో ఉంగరం చేయిస్తాం. తొడగడానికి సరిపోదు అనుకోండీ.. పండగలప్పుడూ కార్యాలప్పుడూ వచ్చీపోయేవారికి 'ఇదిగో మా అత్తోరు పెట్టింది' అంటూ భూతద్దంలో చూపించుకోవచ్చు. కావాలంటే ఆ అద్దం కూడా మేమే కొనిస్తాం'

'బావగారూ.. మీ పెద్ద మనసు చూసి నాకు కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయండీ. ముక్కు చీదుకుందాం అంటే సమయానికి కర్చీఫ్ కూడా లేదు'

'మీరు మరీ అంత ఎమోషనల్ అయిపోవడం నాకూ ఇబ్బందిగా ఉందండీ.. కళ్లు తుడుచుకోండి. ఆడపడుచు కట్నం కూడా ముందే ప్లాన్ చేశాం. ప్రతినెలా కొంత కొంత చొప్పున బంగారం షాపులో కడుతున్నాం. ఇప్పుడు మీ అమ్మాయికి పద్దెనిమిదేళ్లు కదా. ఎనభై వచ్చేసరికి ప్లాన్ ముగుస్తుంది. సన్నజాజి హారంలో ఓ సన్నజాజి పువ్వు వచ్చేస్తుంది ఆ డబ్బుతో!'

'అబ్బబ్బా.. బావగారూ చాలండీ, మీ ఉదార హృదయాన్ని తట్టుకునే ఉదరం నాకు లేదు. ఇక కట్నాలూకానుకలేవీ వద్దు. సామాన్యులకు అల్లంత దూరంలో కూడా అందుబాటులో లేని బంగారాన్ని పిల్లలకు కొనివ్వడానికి మీరు చేస్తున్న త్యాగాలు చాలు. అర్జెంటుగా ముహూర్తాలు పెట్టించేయండి'

'మరి మీ తరఫున పెట్టేవి కూడా ఓ మాట అనేసుకుంటే..'

'మీకు తెలియందేం ఉందండీ.. అబ్బాయికి వీసా వచ్చేసిందని ఆల్రెడీ చెప్పాం కదా. ఇప్పుడు పెళ్లి చేసుకుని వెళ్లిపోతాడు. మళ్లీ ఎప్పుడు వస్తాడో, అసలు రాగలడో లేదో తెలియదు. అసలే తిక్కనూ మెంటల్‌నూ మిక్సీలో వేసి రుబ్బితే వచ్చిన ట్రంపు పాలన. జీవితాలు కూడా అందులో పచ్చడైపోవాల్సిందే కదా! మా ఎదురింటి వాళ్ల అబ్బాయి వీసా సమస్యలతో అమెరికా వెళ్లిన పద్నాలుగేళ్లకు గానీ మళ్లీ తిరిగి రాలేదు. ఈలోగా వాళ్ల కోడలు చిన్న సైజు అరణ్యవాసం చేసేసింది. ఇప్పుడు మా కోడలు కూడా అంతే. ఎంచక్కా భార్య ఇక్కడ, భర్త అక్కడ.. చిలకా గోరింకల్లా ఆన్‌లైన్ కాపురం చేసుకుంటారు. అమెరికా చదువులూ ఉద్యోగాల ట్రెండు మనం కూడా ఫాలో అవ్వకపోతే వెనకపడిపోతాం కదా మరి. ఇంతకుమించి అమ్మాయికి మేం కొత్తగా ఇచ్చేదీ, పెట్టేదీ ఏం కావాలి చెప్పండి!'


'అబ్బా.. ఇంతటి ఘొప్ప కుటుంబంలోకి నా కూతురు కోడలిగా వెళ్తున్నందుకు నా మనసు ఆనందంతో వెండి రేటులా ఉప్పొంగుతోంది. పంతులుగారు.. నెక్స్ట్ మినిట్‌లో ఏం ముహూర్తం ఉందో లేపీమని చెప్పేయండి'

'శుభస్య శీఘ్రం!'

– చంద్రమౌళిక సాపిరెడ్డి

చిలుక కానుక

బొమ్మలు: శ్రీనివాస్ కథ: జి.నర్సయ్య



వీరమ్మతల్లికి నీరాజనం





ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మెట్టినింటిలో మంత్రి పార్థసారథి పూజలు చేశారు. అనంతరం ఊరేగింపులో వేలాది మంది భక్తజనం గండదీపాలతో తరలివచ్చారు. - ఉయ్యూరు, న్యూస్‌టుడే

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో..

జిల్లాస్థాయి ప్రతిభాపాటవ పోటీలు రేపు

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం జరగనున్నాయి. విజయవాడ లబ్బీపేటలోని శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. నాలుగు నెలలుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం, విస్సన్నపేట, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, పెనమలూరు, విజయవాడలోని 25 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు జరిగాయి. ప్రతి కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు చొప్పున 12 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వారంతా ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు. **- విజయవాడ సిటీ, న్యూస్‌టుడే**

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
గురువారం జనవరి 29, 2026

కలల వీర... కొలువుధీర!

వీరు.. సమున్నత లక్ష్యం నిర్దేశించుకున్నారు.. ఆశయ సాకారానికి సంకల్ప దీక్షతో అడుగేశారు.. చక్కటి ప్రణాళిక, నిరంతర సాధన, కార్యాచరణతో శ్రమించారు.. ప్రతీ క్షణం సద్వినియోగం చేసుకున్నారు.. సకల నైపుణ్యాలు అందిపుచ్చుకొన్నారు.. లక్షల మందితో పోటీపడి.. సరిలేరు మాకెవ్వరు అనేలా.. కలల కొలువును సొంతం చేసుకున్నారు. గ్రూప్-2 పరీక్షల తుది ఎంపిక జాబితాను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా వెలువరించగా.. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి విజయులుగా నిలిచిన వారి కృషిపథమిది.

ఐఏఎస్ కావడమే లక్ష్యం..



కొచ్చర్ల అశోక్‌కుమార్

మాది పెనుగంచిప్రోలు మండలంలోని ముచ్చింతాల గ్రామం. సాధారణ రైతు కుటుంబంలో జన్మించాను. అసోంలోని సల్చార్ యూనివర్సిటీలోని ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. గత ఐదేళ్లుగా సివిల్స్‌కు సిద్ధమవుతున్నా. ఈ క్రమంలో ఏపీపీఎస్సీ గ్రూపు-2 నోటిఫికేషన్ రాగా దరఖాస్తు చేశాను. తుది ఫలితాల్లో డిప్యూటీ తహసీల్దారు ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఐఏఎస్ కావడమే నా లక్ష్యం. ఈ నేపథ్యంలోనే గ్రూపు-2 పరీక్షలు రాసి ఉద్యోగం పొందాను. సివిల్స్‌లో మెయిన్స్ వరకు వెళ్లాను.. చివర్లో ఉద్యోగం సాధించలేకపోయాను. మళ్లీ సివిల్స్ రాస్తా. **- న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు**

ఉద్యోగం చేస్తూనే సన్నద్ధమై



రాహుల్‌రెడ్డి

మాది మచిలీపట్నం. ప్రస్తుతం మచిలీపట్నం ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నా. మా అమ్మ శ్రీశశ్రీరాణి తాళ్లపాలెం జడ్పీ హైస్కూల్లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. బీటెక్ చేసిన నేను 2021 నోటిఫికేషన్‌లో గ్రూప్-4 పరీక్షలో ఉమ్మడి కృష్ణాలో ప్రథమ ర్యాంకు సాధించి జూనియర్ అసిస్టెంట్ అయ్యాను. ఓ వైపు విధులు నిర్వహిస్తూనే కార్యాలయ ఖాళీ సమయాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా సమయం కేటాయించుకొని పరీక్షలకు సన్నద్ధమయ్యా. 2023 నోటిఫికేషన్‌లో గ్రూప్-2 రాశాను. మంగళవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో సాధారణ పరిపాలన శాఖలో సెక్షన్ అధికారి పోస్టు దక్కించుకున్నాను. **- ఈనాడు డిజిటల్, మచిలీపట్నం**

పంచాయతీ కార్యదర్శి నుంచి సబ్ రిజిస్ట్రార్‌గా..



బి.కిరణ్మయి

మాది జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు. నాన్న రామారావు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. తల్లి విజయకుమారి గృహిణి. జగ్గయ్యపేటలో ఎంకాం పూర్తి చేశాను. గెజిటెడ్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఐదు నెలలు శిక్షణ తీసుకున్నాను. 2019లో సచివాలయం ఉద్యోగాల పరీక్షకు హాజరై వార్డు పరిపాలన కార్యదర్శిగా ఎంపికయ్యాను. 2020లో గ్రూప్-3 పరీక్ష రాసి పంచాయతీ కార్యదర్శి పోస్టుకు ఎంపికయ్యాను. 2023లో గ్రూప్-2 నోటిఫికేషన్ రాగా.. ఏడు నెలలు సెలవు తీసుకుని ఇంట్లోనే సన్నద్ధమయ్యాను. ఈ క్రమంలో గ్రూప్-2లో సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. తల్లిదండ్రులు, సోదరుడి ప్రోత్సాహంతోనే విజయం సాధించాను. **- న్యూస్‌టుడే, చందర్లపాడు**

వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి ఎస్సై పోస్టుకు..



చలపాటి వీర వెంకటేశ్వరరావు

మాది పెదపారుపూడి మండలం చినపారుపూడి. ప్రస్తుతం కూచిపూడిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నా. వ్యవసాయ కూలీ కుటుంబం నుంచి వచ్చాను. బాల్యం నుంచి కష్టసుఖాలు తెలుసు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పది వరకు చదివా. కుటుంబ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని డిప్లొమాలో చేరి పాసయ్యాను. తల్లిదండ్రులకు సహకరిస్తూ నాగార్జున ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తిచేశాను. కానిస్టేబుల్‌గా ఎంపికైన అనంతరం తొలుత గుడ్లవల్లేరులో విధుల్లో చేరాను. అక్కడ పనిచేస్తూనే మిగిలిన సమయాన్ని ఏపీపీఎస్సీ గ్రూప్-2కు కేటాయించాను. విజయం సాధించి ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యా. నా చదువుకు అంతరాయం లేకుండా నాపై అధికారులు కూడా సహకరించారు. నేను గ్రూప్-2కు స్వయంగానే సాధన చేశా. ఎలాగైనా ఉన్నతి సాధించాలనే లక్ష్యంతో చదివి అనుకున్నది సాధించా. **- కూచిపూడి, న్యూస్‌టుడే**

31న ఉద్యోగ మేళా

కరెన్సీనగర్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో 31వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు హెల్త్ యూనివర్సిటీ ఎదురు వరుణ్ మోటార్స్‌లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఉపాధి కల్పన అధికారి మధుభూషణ్‌రావు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ చేసిన 18-30 ఏళ్ల యువత అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు నుంచి రూ.28 వేల వరకు వేతనం, ఇతర సౌకర్యాలు ఉంటాయన్నారు. వివరాలకు 99854-44333 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కొత్త టెండరులో.. కీలక మార్పులు

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ మిగులు పనుల పూర్తికి కొత్తగా మళ్లీ టెండర్లు పిలిచారు. జనవరి 28 నుంచి బిడ్ల దాఖలుకు వీలు కల్పించారు. ఫిబ్రవరి 12న బిడ్లను తెరవనున్నారు. గతసారి పిలిచిన టెండర్‌లో పలు నిబంధనలను సవరించారు. ప్రధానంగా టెండర్ విధానం, కాలపరిమితి విషయంలో కీలక మార్పులు చేశారు. డిసెంబరులో టెండర్లకు ఎవరూ బిడ్లను దాఖలు చేయలేదు. దీంతో భారత విమానయాన సంస్థ పునరాలోచించింది... నిబంధనలను సవరించింది. **గత మాదిరి..** ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానంలో కాకుండా తాజాగా.. ఐటెం రేట్ విలువ(ఐటమ్ రేట్) ఆధారంగా టెండర్లను ఆహ్వానించారు. ఏ పని ఎంత జరిగింది? ఇంకా ఎంత చేయాల్సి ఉంది? బడ్జెట్ అంచనాలు ఎంతనేది నిర్ణయించాకే.. పనులను అర్హత సాధించిన గుత్తేదారుకు అప్పగించనున్నారు. రూ.470 కోట్లతో చేపడుతున్న టెర్మినల్



పనులు ఆగిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్

గడువు ఐదు నెలలకు పొడిగింపు..

గత టెండర్లలో మూడు నెలల్లోనే పనులు పూర్తిచేయాలని లక్ష్యం నిర్దేశించారు. గుత్తేదారులు ముందుకు రాకపోవడానికి ఇదీ ఒక కారణమే. అందుకే.. కాలపరిమితి ఐదు నెలలకు పొడిగించారు. ఇంకా ఫ్లోరింగ్, సీలింగ్ పనులున్నాయి. ఈ భవనం స్టీల్ స్ట్రక్చర్ పూర్తయింది. వీటికి గ్లాసులు బిగించే పనులు సగంలో ఆగాయి. విద్యుత్తు, సెంట్రల్ ఏసీ పనులు చేపట్టాలి. ఇవికాక మరికొన్ని తుదిదశ పనులు మిగిలాయి.

పనుల్లో ఇప్పటికే ఎన్‌ఈజీ ఇన్‌ఫ్రా సంస్థ 80 శాతం పూర్తిచేసింది. మిగతా 20 శాతం ప్రస్తుతం కొత్త గుత్తేదారు సంస్థ చేపట్టాలి. ఈ పనులను ఒకటిగా కాకుండా వేర్వేరుగా కేటాయించనున్నారు.

నెలలుగా ఆగిన పనులు.. పాత గుత్తేదారును తప్పించింది. నెలలు కావస్తోంది. కొత్త వారి ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో టెర్మినల్ పనులు ఎక్కడికక్కడే ఆగాయి. వాస్తవంగా గత డిసెంబరులోనే టెండర్ ప్రక్రియ పూర్తిచేసి.. కొత్త గుత్తేదారుతో పనులు ఆరంభించి.. మార్చి ఆఖరుకు పూర్తిచేయించాలనేది లక్ష్యం. కానీ.. గుత్తేదారులు ముందుకు రాక తీవ్ర జాప్యం జరుగుతోంది. **- ఈనాడు, అమరావతి**

ఆమాత్రం... ఆదుకోలేరా?!

★ వేధిస్తున్న కీలక మందుల కొరత ★ 15 రోజులుగా వైద్యకేంద్రాల్లో లేవాయె

ఈనాడు, అమరావతి

కిడ్నీ బాధితులకిచ్చే కీలక ఔషధాల్లో ఒకటైన.. సోడియం బై కార్బొనేట్ మాత్రల కొరత వేధిస్తోంది. ఉమ్మడి కృష్ణాలో ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఎక్కడికి వెళ్లినా ఈ మందులు లేవనే చెబుతున్నారు. ప్రధానంగా ఎ.కొండూరు మండలంలో 270 మందికి పైగా ప్రస్తుతం దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి బాధిత రోగులున్నారు. వీరిలో డయాలసిస్ చేయించుకునే వారూ ఉన్నారు. గత 15 రోజులుగా ఎ.కొండూరు పీహెచ్‌సీలో ఈ మందులు లేవని బాధితులను తిప్పి పంపిస్తున్నారు. నిత్యం ఓపీకి వచ్చే కిడ్నీ వ్యాధి బాధితుల్లో కనీసం పది మంది ఈ మందుల కోసమే వస్తున్నారు. ఇంకా మాత్రలు రాలేదని.. రోగులను తిప్పుతూనే ఉన్నారు.

ఎ.కొండూరు పీహెచ్‌సీ పరిధిలోనే డయాలసిస్ యూనిట్ పెట్టారు. గతంలో విజయవాడకు వచ్చే కిడ్నీ బాధితుల్లో వంద మందికిపైగా ప్రస్తుతం ఎ.కొండూరు పీహెచ్‌సీకి వెళుతున్నారు. కీలకమైన సోడియం బై కార్బొనేట్ మాత్రలు లేక.. బయట మెడికల్ షాపుల్లో కొంటున్నారు. దీనికి అనుబంధంగా కిడ్నీ బాధితులకు ఇచ్చే మిగతా సపోర్టింగ్ డ్రగ్స్ అందుబాటులో ఉన్నా.. కీలకమైనవి లేక ఇబ్బంది పడుతున్నారు.



ఎ.కొండూరు డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ బాధిత రోగులు

రోజూ వేసుకోవాల్సిందే.. రెండు జిల్లాలకు మందులను సరఫరా చేసే మచిలీపట్నం సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచే ఈ మాత్రలు రావడం లేదని, తాము ఇండెంటు పెడుతున్నామని.. పీహెచ్‌సీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఎ.కొండూరులో ఈ మందులేక.. తిరువూరు, విస్సన్నపేట, వత్సవాయిలకు వెళ్లినా.. అక్కడా అందుబాటులో లేవనే చెబుతున్నారు. దీర్ఘకాలికంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ మందులు వాడుతున్న వారిలో వ్యాధి తీవ్రత పెరగకుండా ఈ మందు ఆపుతుంది. బాధితులు రోజూ వేసుకోవాల్సిన మందు కావడంతో.. తప్పనిసరిగా కొనాల్సిందే.

విశ్రాంత ఉపాధ్యాయుడికి రూ.24 లక్షలు టోకరా

తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభమంటూ సైబర్ నేరస్థుల మోసం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: తక్కువ పెట్టుబడులకు ఎక్కువ లాభాలంటూ సైబర్ నేరస్థులు అరచేతిలో వైకుంఠం చూపి రూ.లక్షలు కొట్టేస్తున్నారు. ఒక విశ్రాంత ఉపాధ్యాయుడి నుంచి పెట్టుబడులు పేరుతో రూ.24 లక్షలు దోచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి..నగరానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడిని గత ఏడాది నవంబరు 17న గుర్తుతెలియని వ్యక్తులు చరవాణి ద్వారా ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ప్రతినిధులమంటూ పరిచయం చేసుకున్నారు. తమ కంపెనీ 'ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్'లో పెట్టుబడులు పెడితే లాభాలు ఎక్కువగా వస్తాయని నమ్మించారు. తమ కంపెనీ వెబ్‌సైట్ లింక్‌ను పంపించారు. తమ కంపెనీలో చేరిన వారికి ఎంతెంత లాభాలు వచ్చాయో వాటి వివరాలు కూడా పంపించడంతో విశ్రాంత ఉపాధ్యాయుడు ఆకర్షితులయ్యారు. విడతల వారీగా వారు చెప్పిన మేరకు రూ.24 లక్షలు పెట్టుబడులుగా పెట్టారు. ఆ తరువాత లాభాలను తీసుకునేందుకు ప్రయత్నించినా వీలుకాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియాంక కదలికలపై నిఘా!

ఈనాడు, అమరావతి: పిల్లల విక్రయాల కేసులో కీలక నిందితురాలు ప్రియాంక కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల దిల్లీ వెళ్లిన ప్రత్యేక బృందం నుంచి ఆమె త్రుటిలో తప్పించుకుంది. ఈ నేపథ్యంలో ఈసారి గురితప్పకుండా ఉండేందుకు అక్కడి పోలీసుల సహకారం తీసుకుంటున్నారు. త్వరలో పోలీసుల ఎదుట నిందితురాలు లొంగిపోనున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం ఇచ్చింది. అయినా లొంగిపోకుండా తప్పించుకు తిరుగుతోంది. ఈ కేసులో దిల్లీకి సంబంధించి ఈమె దొరికితేనే మూలాలు వెలుగుచూసే వీలుంది. విజయవాడ పోలీసులు యూపీలోని మేరఠ్‌లోని ఆమె ఇంటికి వెళ్లారు. అప్పటికే ఆమె తప్పించుకుని ఉత్తరాఖండ్ పారిపోయినట్లు గుర్తించారు. దీంతో విజయవాడ తిరిగి వచ్చిన పోలీసులు.. మళ్లీ ఆమె ఆచూకీ కోసం ఫోకస్ పెట్టారు. ఆమె ఫోన్ లొకేషన్లపై నిఘా పెట్టగా.. యూపీలోని పలు ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు తేలింది.



అరెస్టుకు అడుగులు: ప్రియాంక నుంచే తాను పిల్లలను తీసుకుని.. విజయవాడకు విక్రయాలకు పంపిస్తున్నట్లు కిరణ్‌శర్మ వెల్లడించింది. ఇటీవల పోలీసు కస్టడీలో వివరాలను వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రియాంకను అదుపులోకి తీసుకుని విచారిస్తే.. ఆమె వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? అనేది వెలుగు చూసే వీలుంది. ఈనేపథ్యంలో ఆమెను అరెస్టు చేసేందుకు అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకుంటున్నారు. త్వరలో అరెస్టు చేసే వీలుంది. ఇదే కేసులో నూరి అరెస్టు కావాల్సి ఉంది. ఆమె థానే సమీపంలో ఉందనీ.. పిల్లల రవాణాలో కవితకు తోడ్పడినట్లు గుర్తించారు. అంతకు మించి పాత్ర లేదని దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న అనిల్‌ను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. మహారాష్ట్ర ముఠా మూలాలు అనిల్ విచారణతో బయటకు వస్తాయని భావిస్తున్నారు.

మత్తు పదార్థాల నిర్మూలన సామాజిక బాధ్యత



సైకిల్ ర్యాలీలో ఎమ్మెల్యే గద్దె, డీసీపీ కృష్ణకాంత్ తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల నిర్మూలన సామాజిక బాధ్యతగా అందరూ స్వీకరించాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. కృష్ణలంక పోలీసుల ఆధ్వర్యంలో స్క్యూబ్రిడ్జి సమీపంలో బుధవారం నిర్వహించిన డ్రగ్స్‌పై దండయాత్ర సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... గంజాయిని పాఠశాలల వరకు తీసుకొచ్చిన ఘనత గత వైకాపా ప్రభుత్వానిదేనని విమర్శించారు. పోలీసులు జిల్లా వ్యాప్తంగా సైకిళ్లపై పర్యటించి డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. డీసీపీ కృష్ణకాంత్ పాటిల్ మాట్లాడుతూ.. తమ పరిధిలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నా, కొనుగోలు చేస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జనసేన నాయకుడు అమ్మిశెట్టి వాసు మాట్లాడారు. డీసీపీ సీఎస్‌డబ్ల్యూ ఎస్‌వీడీ ప్రసాద్, ఏడీసీపీ మురళీకృష్ణ, సౌత్‌జోన్ ఏసీపీ డి.పావన్‌కుమార్, సీఐ నాగరాజు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, కూటమి నాయకులు ఉమ్మడిశెట్టి బహదూర్, సింగంశెట్టి రమేష్, రాయి రంగమ్మ, కొక్కెర తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటారు.. బహుమతులు గెలిచారు



ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఆర్డీవో బాలకృష్ణ, రవీంద్రనాథ్, సత్యమూర్తి తదితరులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు 'ఈనాడు' ప్రతిభాపాటవ పోటీలు దోహదపడతాయని ఆర్డీవో కె.బాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం నందిగామ కాకతీయ అకాడమీ సీబీఎస్ఈ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. మాతృభాష ప్రాముఖ్యత, దాని పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై నిర్వహించిన పోటీల్లో ఎం.థెరిస్సా (కాకతీయ అపోలో పాఠశాల), ఎల్.లక్ష్మీదీపక్ (ప్రతిభ ఆంగ్లమాధ్యమ పాఠశాల), కె.రుత్విక(చందాపురం శ్రీతపస్య ఆంగ్లమాధ్యమ పాఠశాల) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. చిత్రలేఖనం పోటీల్లో టి.తనూష, కె.శ్రావ్య (శ్రీవిద్య ఆంగ్లమాధ్యమ పాఠశాల), అమీన అనజమ్(ప్రతిభ ఆంగ్లమాధ్యమ పాఠశాల) వరుస స్థానాల్లో నిలిచారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిపై ఉపన్యాసం పోటీల్లో ఎం.స్నేహజ (శ్రీతపస్య ఆంగ్లమాధ్యమ పాఠశాల, చందాపురం), ఎన్.సాత్విక (శ్రీవిద్య ఆంగ్లమాధ్యమ పాఠశాల), వి.బాలశ్రీవెన్నెల (శ్రీతపస్య ఆంగ్లమాధ్యమ పాఠశాల, చందాపురం) వరుస స్థానాల్లో నిలిచారు. క్విజ్ పోటీల్లో బి.మేఘన (కాకతీయ అపోలో ఉన్నత పాఠశాల), బాణాల పవన్‌కల్యాణ్, మామిళ్ల జయరామకృష్ణారెడ్డి (శ్రీవిద్య ఆంగ్లమాధ్యమ పాఠశాల) వరుస స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీలకు అమర్లపూడి సుందరరావు, చిత్రలేఖనానికి ద్విభాష్యం శ్రీవల్లి, ఉపన్యాన పోటీలకు కేవీ సాయిరమకుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఆర్డీవో కె.బాలకృష్ణ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్డీవోను పాఠశాల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ సత్యమూర్తి, డైరెక్టర్లు కార్తికేయ, సుష్మ, ఉపాధ్యాయులు సన్మానించారు.

పీ4 కోసం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ అభినందనీయం



టీషర్ట్‌లు ఆవిష్కరిస్తున్న మంత్రులు సుభాష్, రాంప్రసాద్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : బంగారు కుటుంబాల సంక్షేమం కోసం క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్ అన్నారు. చామల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చిలో విశాఖపట్నంలో నిర్వహించనున్న ఎలైట్ క్రికెట్ లీగ్ సీజన్-2 టోర్నమెంట్ జట్ల టీషర్టులను బుధవారం ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మంత్రులు ఆవిష్కరించారు. రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలైట్ క్రికెట్ లీగ్ రెండో సీజన్ ఏపీలో నిర్వహించాలని నిర్ణయించడం ఆనందంగా ఉందని అన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశం మొత్తం ఎలైట్ క్రికెట్ లీగ్ నిర్వహిస్తే.. ఛారిటీ ద్వారా అందరినీ ఆదుకోవచ్చని సూచించారు. పొలిటికల్ టీమ్ కూడా క్రికెట్ ఆడనుందని, యువ మంత్రుల జట్టు కప్ సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సుభాష్ మాట్లాడుతూ.. ఎలైట్ క్రికెట్ లీగ్ రెండో సీజన్ ఏపీలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. చామల ఫౌండేషన్ ఛైర్మన్ చామల ఉదయ్ చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. టోర్నీలో ఆంధ్రా పొలిటికల్ కింగ్స్, టాలీవుడ్ టండర్స్, బుల్లితెర రేంజర్స్, మీడియా మాస్టర్స్, శిరి ఇన్ఫ్రామిసైల్స్, పోలీస్ లయన్స్ జట్లు పాల్గొంటాయని తెలిపారు. టోర్నీ ద్వారా వచ్చిన నగదును సైనికులు, బంగారు కుటుంబాల సంక్షేమానికి వినియోగిస్తామని చెప్పారు. బుల్లితెర నటుడు ప్రభాకర్, చామల ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు భానుచందర్‌రెడ్డి, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తరుణ్, అమిగోస్ తదితరులు పాల్గొన్నారు.

1న జీఆర్‌సీ సైకిల్ రైడ్ ప్రారంభం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జైంట్ సైకిల్స్, అమరావతి రన్నర్స్ సంయుక్తంగా వచ్చే నెల 1వ తేదీన జీఆర్‌సీ-2026 సైకిల్ రైడ్‌ను.. . లీడ్ రైడర్ నిషికాంత్ నర్రా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అమరావతి రన్నర్స్ అధ్యక్షుడు రమేష్ రావి తెలిపారు. ఈ రైడ్‌లో మొత్తం 200 కి.మీ. సైక్లింగ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వచ్చే నెల 1, 8 తేదీల్లో 50 కి.మీ. చొప్పున, మార్చిలో మరో రెండు రైడ్స్ ఉంటాయని, నాలుగింటిని దిగ్విజయంగా పూర్తి చేసిన వారికి పతకం, ధ్రువపత్రంతో పాటు జీఆర్‌సీ సైక్లింగ్ జెర్సీ 50 శాతం రాయితీతో అందజేస్తామని రమేష్ తెలిపారు. ఒకటో తేదీన ఉదయం 5 గంటలకు తొలి రైడ్ యలమంచిలి కాంప్లెక్స్ సమీపంలోని కాకా హోటల్ వద్ద ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 98495 62793 నంబరులో సంప్రదించాలని సూచించారు.



ఆటోనగర్- సనత్‌నగర్ వెళ్లే దారి ఇలా..



మురుగునీటిలో ప్రయాణం

పారని మురుగు.. పడని అడుగు

ఆటోనగర్ నుంచి సనత్‌నగర్ వెళ్లే రహదారి ఒకవైపు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుమారు 2అడుగుల మేర తవ్వారు. సనత్‌నగర్ మసీదు ఎదురుగా తవ్విన గుంతలోకి పక్కనే ఉన్న మురుగు కాలువ నుంచి నీరు వచ్చి పెద్దఎత్తున చేరింది. వాడుకలో ఉన్న రహదారిని సైతం ముంచెత్తింది. దుర్వాసన వస్తున్నా మురుగు నీటిలోనే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు.

- ఈనాడు, అమరావతి

అథ్లెట్లకు 'ప్రోకాం స్లామ్' పతకాలు



ప్రతిభ చూపిన అథ్లెట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: దేశంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో జరిగిన మారథాన్‌ల్లో నగర అథ్లెట్లు వరుసగా పాల్గొని 'ప్రోకాం స్లామ్' పతకాలు అందుకున్నారని విజయవాడ రన్నర్స్ సొసైటీ వ్యవస్థాపకులు మణి దీపక్, బాబీ తెలిపారు. గత ఏడాది ఏప్రిల్‌లో బెంగళూరులో జరిగిన 10 కి.మీ., అక్టోబరులో దిల్లీలో జరిగిన 21 కి.మీ., డిసెంబరులో కోల్‌కతాలో జరిగిన 25 కి.మీ., ముంబయ్‌లో జరిగిన 42.2 కి.మీ.మారథాన్‌ను డాక్టర్ విజయ్ చంద్రారెడ్డి (ఎయిమ్స్, మంగళగిరి), శివగణేష్‌బాబు (న్యాయవాది, విజయవాడ), రామ కిషోర్ (ఫార్మా, రామవరప్పాడు), శ్రావణ్‌కుమార్ (సర్టిఫైడ్ ఫిట్‌నెస్ కోచ్, తెనాలి), రామకృష్ణ (ఆర్‌టీసీ, విజయవాడ), గోపి సువారి (ఫార్మా, విజయవాడ), శివరామ్ (హైకోర్టు న్యాయవాది, విజయవాడ), జయ కామేశ్వరి (సుందరం ఫైనాన్స్, విజయవాడ), శివలీల (హైకోర్టు న్యాయవాది, విజయవాడ), జక్కంశెట్టి భానుప్రసాద్ (సబ్ ఇన్‌స్పెక్టర్, కృష్ణలంక) పూర్తి చేశారని వివరించారు. ముంబయిలో పతకాలు అందుకున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద అథ్లెట్లను అభినందించి జ్ఞాపికలు బహూకరించామని తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్

మైలవరం, న్యూస్‌టుడే : ఒక కుటుంబంపై దాడి చేయగా, మహిళ మృతి చెందిన కేసులో నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆయా కేసు వివరాలను స్థానిక సీఐ కార్యాలయంలో ఎస్సై సుధాకర్‌తో కలిసి, సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు. మండలంలోని దాసుళ్లపాలేనికి చెందిన వింజమూరి అనిల్, తన భార్యకు ఫోన్ చేస్తున్నాడన్న అనుమానంతో, అదే గ్రామానికి చెందిన వింజమూరి లక్ష్మయ్య, అతని కుమారుడు సనత్ ఈ నెల 21వ తేదీ రాత్రి అనిల్ కుటుంబ సభ్యులను కొట్టి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో అనిల్ తల్లి సారమ్మ తీవ్ర గాయాలతో విజయవాడలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది. ఈ నేపథ్యంలో హత్య కేసుగా నమోదు చేసి నిందితులిద్దరినీ అరెస్టు చేసినట్లు వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

బౌండరీలు బాదేసి.. సిక్సర్లు దంచేసి..

ఉత్సాహంగా ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఓ వైపు సీనియర్స్ బౌండరీలు, సిక్స్‌లు కొడితే.. తామేమీ తక్కువ కాదన్నట్లు జూనియర్స్ సైతం గ్యాలరీల్లోకి బంతులు తరలించి సత్తా చాటారు. జూనియర్స్ విభాగంలో బౌలర్లు నిప్పులు చెరిగారు. గుంటూరుకు సమీపంలోని మోతడక చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానంలో జరుగుతున్న 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు రెండో రోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్, తెలంగాణ టైగర్స్, హైదరాబాద్ హీరోస్, నార్త్ ఆంధ్రా నింజాస్ జట్లు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లోనూ తలపడ్డాయి.

క్రీడాకారులకు అభినందన: క్రీడాకారులను చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు అభినందించి ప్రోత్సాహకంగా బ్యాగ్‌లు అందజేశారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఏపీ క్లస్టర్ బిజినెస్ హెడ్ డాక్టర్ యలవర్తి కార్తిక్ చౌదరి.. హైదరాబాద్ హీరోస్, నార్త్ ఆంధ్రా జట్ల క్రీడాకారులను అభినందించారు.



జూనియర్స్: విజయానందంలో తెలంగాణ టైగర్స్ జట్టు

బౌలింగ్‌తో కట్టడి చేసి.. జయకేతనం ఎగురవేసి..

జూనియర్స్ విభాగంలో తెలంగాణ టైగర్స్ (ఎస్ఆర్ఆర్ జూనియర్ కాలేజీ), సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ (ఎన్ఆర్ఐ కాలేజీ విజయవాడ) జట్ల మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేశారు. తర్వాత సెంట్రల్ ఆంధ్రా బ్యాటర్లు చేతులెత్తేశారు. తెలంగాణ టైగర్స్ బౌలర్లు నిప్పులు చెరగడంతో సెంట్రల్ ఆంధ్రా 15 ఓవర్లలో 111 పరుగులకే ఆలౌటైంది. తెలంగాణ టైగర్స్‌కు చెందిన ఆల్‌రౌండర్ రెహాన్ 15 బంతుల్లో 3 బౌండరీలు, 2 సిక్సర్లతో 29 పరుగులు చేయడంతో పాటు మూడు వికెట్లు తీసుకుని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. బౌలర్ సిద్ధార్థ సైతం నాలుగు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు.



జూనియర్స్: గెలుపొందిన హైదరాబాద్ హీరోస్ జట్టు

8.1 ఓవర్లలోనే ముగించేశారు..

జూనియర్స్ విభాగంలో హైదరాబాద్ హీరోస్ (భవన్స్ శ్రీ అరబిందో జూనియర్ కాలేజీ), నార్త్ ఆంధ్రా జట్ల మధ్య రెండో మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచిన నార్త్ ఆంధ్రా జట్టు మొదట బ్యాటింగ్ చేసి 15.1 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. ప్రవీణ్ 19 బంతుల్లో మూడు బౌండరీలు, ఒక సిక్సర్‌తో 24 పరుగులు చేశాడు. నవీన్ 10 పరుగులు చేశాడు. మిగిలిన బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. స్వల్ప విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ హీరోస్ జట్టు ఓపెనర్లు 8.1 ఓవర్లలో 111 పరుగులు కొట్టి జట్టును గెలిపించారు. ఆదిత్య 27 బంతుల్లో ఐదు బౌండరీలు, ఆరు సిక్సర్లతో 63 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరో ఓపెనర్ ప్రణయ్ ఐదు బౌండరీలు, ఒక సిక్సర్‌తో 39 పరుగులు చేశాడు. ఆదిత్యకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

బ్యాటింగ్‌లో సత్తా చాటి..



సీనియర్స్: విజేత సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ జట్టు

సీనియర్స్ విభాగంలో మొదటి మ్యాచ్ సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ (రావూస్ డిగ్రీ- పీజీ కాలేజీ నెల్లూరు), తెలంగాణ టైగర్స్ (వాగ్దేవి డిగ్రీ- పీజీ కాలేజీ) జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 169 పరుగులు చేశారు. తర్వాత తెలంగాణ టైగర్స్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 126 పరుగులు మాత్రమే చేయగలిగారు. సెంట్రల్‌ఆంధ్రా ఛాలెంజర్స్ బ్యాటర్ లీలా సాయి 29 బంతుల్లో రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 44 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్



రెహాన్ లీలాసాయి ఆదిత్య

29న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ X నార్త్ ఆంధ్రా నింజాస్
మ్యాచ్-2: రాయలసీమ రాకర్స్ X హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ X నార్త్ ఆంధ్రా నింజాస్
మ్యాచ్-2: రాయలసీమ రాకర్స్ X హైదరాబాద్ హీరోస్



హైదరాబాద్ హీరోస్ సీనియర్స్ జట్టు

నార్త్ ఆంధ్రా నింజాస్ గైర్హాజరీతో..

సీనియర్స్ విభాగంలో రెండో మ్యాచ్ హైదరాబాద్ హీరోస్ (టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ మీర్‌పేట), నార్త్ ఆంధ్రా నింజాస్ (గీతం డీమ్డ్ యూనివర్సిటీ విశాఖపట్నం) జట్ల మధ్య జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్రా నింజాస్ జట్టు రాకపోవడంతో హైదరాబాద్ హీరోస్ జట్టును విజేతగా ప్రకటించారు.

సాయంత్రం 6- అర్ధరాత్రి 12 మధ్యే అధిక ప్రమాదాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: సాయంత్రం 6 నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్యే అత్యధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు నివేదికల ద్వారా స్పష్టమవుతోందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. గత ఏడాది రోడ్డు ప్రమాద మృతుల సంఖ్యను గణనీయంగా తగ్గించగలిగామనీ, వీటిని పూర్తిస్థాయిలో అరికట్టేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, మరణాలు ఎక్కువగా ద్విచక్ర వాహనాల వల్లే జరుగుతున్నట్టు తెలిపారు. జాతీయ రహదారి-65పై అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. వేగ పరిమితులను తెలిపే సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని గత సమావేశంలో నిర్ణయం తీసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఆచరణలోకి తీసుకు రాకపోవడం సరికాదన్నారు. అధిక లోడుతో వెళుతున్న వాహనాలను నియంత్రించాలని, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

139 బ్లాక్ స్పాట్ల గుర్తింపు: నగరం వెలుపల పశ్చిమ బైపాస్ రోడ్డు పనులు పూర్తయ్యాయని, త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. వివిధ రహదారులపై మొత్తం 139 బ్లాక్ స్పాట్లను గుర్తించినట్టు చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఒక్క ప్రమాదం కూడా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లపై ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. ట్రాఫిక్ డీసీపీ షేక్ షెరీన్ బేగం, ఏసీపీలు రామచంద్రరావు, వంశీ, డీటీసీ ఎ.మోహన్, ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్, ఆర్టీవో ఆర్.ప్రవీణ్, డీపీవో పి.లావణ్యకుమారి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని పాల్గొన్నారు.

30న బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 30న ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలలో వర్సిటీ మహిళా బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి బుధవారం వెల్లడించారు. వర్సిటీ అనుబంధ వైద్య, దంత, ఆయుర్వేద, హోమియోపతి, యునానీ, బీఎన్‌వైఎస్, ఫిజియోథెరపీ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్‌టీ కళాశాలల విద్యార్థినులు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారిణులు వచ్చే నెల 11 నుంచి 15వ తేదీ వరకు చెన్నైలో జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ పోటీల్లో ఆడతారని వివరించారు. ఆసక్తిగల క్రీడాకారిణులు 30వ తేదీ ఉదయం 10 గంటలకు అర్హత పత్రాలతో ఆశ్రం కళాశాల వ్యాయామ సంచాలకుడికి రిపోర్టు చేయాలని సూచించారు.

మిరప సాగుకు రూ.1.20 లక్షల రుణం అవసరం



సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు, రైతులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఎకరా మిరప సాగు చేయడానికి రూ.1.20 లక్షల పంట రుణం అవసరమని మైలవరం మండలం అనంతవరానికి చెందిన అభ్యుదయ రైతు కె.నరసింహారావు కోరారు. పత్తికి రూ.60,000, వరికి రూ.46,000, మొక్కజొన్నకు రూ.45,000 చొప్పున మంజూరు చేయాలని విన్నవించారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (కేడీసీసీ), ఎన్టీఆర్ జిల్లా సాంకేతిక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. సమావేశంలో అభ్యుదయ రైతులు క్షేత్రస్థాయి వివరాలను నివేదించారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంటల సాగు వ్యయం, పంటల దిగుబడి విలువ, రుణ పరిమితి వివరాలను పరిశీలించి, 2026-27 ఆర్థిక సంవత్సరంలో సాగు ఖర్చు, దిగుబడి విలువ అంచనాల ఆధారంగా నిర్ణయించాల్సిన రుణ పరిమితిపై వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల అధికారులు తమ అభిప్రాయాలను సమావేశం దృష్టికి తెచ్చారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితరాల కొనుగోలు, పంట కోతల వరకు రైతులకయ్యే ఖర్చు వివరాలను తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సాంకేతిక కమిటీ ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి వరి, మిర్చి, మామిడి, ఆయిల్‌పామ్, వేరుశనగ, పత్తి వంటి పంటలతోపాటు పట్టు పురుగులు పెంపకం, చేపలు, రొయ్యల సాగుదారులకు వ్యవసాయానుబంధ కార్యకలాపాలకు రుణ పరిమితి ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. గత ఏడాది కంటే రుణ పరిమితి పెంచినట్టు చెప్పారు. రుణ పరిమితికి అదనంగా 30 శాతం వరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేసే అవకాశం ఉన్నట్టు వివరించారు. కేడీసీసీ బ్యాంకు సీఈవో ఎం.శ్యామ్‌మనోహర్, జీఎం ఎ.రంగబాబు, ఎల్డీఎం ఎం.ప్రియాంక, డీఏవో విజయకుమారి, జిల్లా ఉద్యానాధికారి పి.బాలాజీకుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారిణి చక్రాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎం.హనుమంతరావు, అభ్యుదయరైతులు పి.నాగేశ్వరరావు, ఎ.అజయ్‌కుమార్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లపై నిరసన

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రెండు రోజులుగా లేబర్ కోడ్‌లపై విజయవాడ నోవోటెల్‌లో జరిగిన సమావేశాలను అడ్డుకునేందుకు బుధవారం కార్మిక సంఘాల నాయకులు ప్రయత్నించారు. నాయకులు ప్రదర్శనగా హోటల్ వద్దకు రాగా పోలీసులు అడ్డుకోవడంతో లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా చేపట్టారు. హోటల్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.., కేవలం ఐదుగురికి అనుమతి ఇచ్చారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పోలారి, రామకృష్ణ, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సుధీర్ హోటల్ లోపలికి వెళ్లి లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు వినతి పత్రం అందించారు. వాటిని రద్దు చేసే వరకు పోరాటాలు చేస్తామని, ఫిబ్రవరి 12న చేపట్టిన సమ్మె జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. నిరసనలో కార్మిక సంఘాల నాయకులు మరీదు ప్రసాద్, ఆర్.వి.నరసింహారావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎన్.సి.హెచ్.శ్రీనివాస్, కె.దుర్గారావు, ఎన్.నాగేశ్వరరావు, ఎం.సాంబయ్య, కె.ఆంజనేయులు, శంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



నోవోటెల్ హోటల్ వద్దకు ప్రదర్శనగా వెళ్తున్న కార్మిక సంఘాల నాయకులు

క్షణికావేశంలో బాలుడు బలవన్మరణం

కొండపల్లి, న్యూస్‌టుడే : క్షణికావేశంలో ఓ మైనర్ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన కొండపల్లి కోటయ్య నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. కోటయ్య నగర్‌కు చెందిన ఐటీఐ విద్యార్థి కొంతకాలంగా పదో తరగతి చదివే ఓ బాలికను ప్రేమించాడు. ఇదిలా ఉంటే మంగళవారం అతను మద్యం తాగి బాలికతో మాట్లాడగా ఆమె అతనిపై మండిపడింది. అదే సమయంలో బాలుడి తల్లి సైతం అతడిని మందలించింది. ఈ నేపథ్యంలో ఇరువురు తనను మందలించారని భావించిన మైనర్ ఇంట్లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన బాలిక తీవ్ర మనస్తాపానికి గురై సమీపంలోని చెరువులోకి దూకింది. స్థానికులు గమనించి వెంటనే బాలికను కాపాడి ఆమెను వారించారు. అయితే ఈ విషయాలపై బాధితులు ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదని సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

లాలా లజపతిరాయ్ సేవలు అజరామరం

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో ఎంపీయూపీ పాఠశాలలో సమరయోధుడు పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి చిన్నారులు, గ్రామస్థులు నివాళులర్పించారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా, బ్రిటిష్ పోలీసుల లాఠీ దెబ్బలకు బెదరకుండా దేశం కోసం పోరాడిన యోధుడని వక్తలు అన్నారు.

సుబ్బారెడ్డికి నివాళి.. మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని చిలుకూరువారిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల దాత అప్పిరెడ్డి సుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం పాఠశాలలో ఘనంగా నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి, రామిరెడ్డి, అప్పిరెడ్డి రామిరెడ్డి, సర్పంచి నాగమల్లేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు కుసుమ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : రంగుల ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు కాకతీయ కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం చేశారు. కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు భోజనం వడ్డించారు. కాకతీయ కమ్మ సేవా సమితి అధ్యక్షుడు కొల్లి స్టాలిన్, ఇంటూరి రంగారావు, నెట్టెం శిరాం తదితరులు పాల్గొన్నారు.

తిరువూరులో సబ్‌జైలు ఏర్పాటు చేయండి


జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్‌కు పూలమొక్క అందిస్తున్న తిరువూరు న్యాయవాదులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో సబ్ జైలు, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు, సబ్ కోర్టులను ఏర్పాటు చేయాలని ఉమ్మడి కృష్ణా జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ సి.హెచ్.మానవేంద్రనాథ్ రాయ్‌ను తిరువూరు సీనియర్ న్యాయవాదులు కోరారు. అమరావతిలోని ఆయన కార్యాలయంలో వీరు బుధవారం పూలమొక్క అందించి సత్కరించారు. ఇటీవల తిరువూరు కోర్టు ప్రాంగణంలో పర్యటించిన సమయంలో రెండు కోర్టుల ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. న్యాయవాదులు వెంకట రెడ్డి, రవి, జనార్దన్‌రావు, కుమార్, శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, ఆనంద్ స్వరూప్, రమేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

తిరువూరు పట్టణం 6వ వార్డులోని డ్రెయిన్లలో పిచ్చిమొక్కలు పెరిగి, దోమలతో సమస్యగా ఉందని స్థానికుడు అర్జునరావు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ తమ సిబ్బందిని పంపి దోమల మందు ఫాగింగ్ చేయించారు. ◆ తిరువూరు పట్టణం 10వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు ప్రకాశరావు 'మేమున్నాం..' మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన శానిటరీ అధికారి సంతోష్ తమ సిబ్బందిని పంపి పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

? జి.కొండూరు శివ కాలనీలోని కాలువల్లో పూడిక పేరుకుని మురుగు పారక దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. - జి.కిశోర్, గ్రామస్థుడు ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందితో తక్షణమే కాలువల్లో పూడిక తొలగించి మురుగు పారేందుకు చర్యలు చేపడతాం. - బసవ లింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

పాడి పరిశ్రమ పురోగతికి తోడ్పాటు


ప్రచార పత్రాలు చూపుతున్న పశువైద్యాధికారిణి దివ్య, విజయకుమార్

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో పశువుల అభివృద్ధి, పాడి పరిశ్రమ పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ఏపీ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ డైరెక్టర్ డి.విజయ్ కుమార్ తెలిపారు. మండలంలోని కీర్తిరాయునిగూడెంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను ముద్రించిన ప్రచార పత్రాలను పశువైద్యాధికారిణి దివ్యతో కలిసి ఆవిష్కరించారు.

ఉపాధి పనుల బకాయిలు వచ్చేస్తున్నాయ్!

● వివరాలు అందించేందుకు రెండు రోజులే గడువు

గంపలగూడెం, న్యూస్‌టుడే

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిర్మించిన పనులకు సంబంధించిన బకాయిలు చెల్లించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది. దీంతో ఈ నెల 30లోపు పనులకు సంబంధించిన బకాయిల వివరాల(పెండింగ్ బిల్లులు) ఎంబుక్‌లను మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధి హామీ అధికారులకు అందజేయాల్సి ఉంది. వారు ఎంబుక్ ఆధారంగా ఏళ్ల క్రితం జరిగిన పనులకు నిలిచిన నిధుల బకాయిలు ఉంటే నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. కేంద్రం నుంచి నిధులు మంజూరు కాగానే బకాయిలు పూర్తిగా చెల్లించి ఉపాధి పథకం సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తారు. ఇదే విధానం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు వర్తిస్తుంది. పనులు చేసిన గుత్తేదారులు గడువులోపు బిల్లుల సమస్య పరిష్కరించుకోకపోతే ఆ పైన పనులకు బకాయి చెల్లింపులు ఉండవని అధికారులు చెబుతున్నారు.

మార్గదర్శకాల మేరకు..

2015- 25 మధ్య విస్సన్నపేట క్లస్టర్ పరిధిలోని ఎ.కొండూరు, గంపలగూడెం, రెడ్డిగూడెం, తిరువూరు, విస్సన్నపేట మండలాల్లోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో 1,546 పనులు నిర్మించగా ఇప్పటికే కొన్నింటిని 'క్లోజ్ వర్క్స్'గా నమోదు చేశారు. ఉపాధి హామీ పథకంలో 9,190 పనులు చేయగా ఇప్పటికే 1,757 పనులు 'క్లోజ్ వర్క్స్'గా ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. ఈజీఎస్ నిధులతో పీఆర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సీసీ రోడ్లు, పాఠశాలలకు ప్రహరీలు, గ్రామ సచివాలయాలు, రైతు సేవా, ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాల మేరకు పనులు పూర్తయి బిల్ హోల్డ్‌లో ఉన్న నగదు, మెజర్‌మెంట్ బుక్ రికార్డు అయినప్పటికీ వివిధ సాంకేతిక కారణాలతో ఆగిన నిధులను వెంటనే పరిష్కరిస్తారు. నాణ్యత పరిశీలించిన తర్వాత పనులకు సంబంధించిన నిధులు విడుదల చేసి సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలి. జీఎస్టీ చెల్లింపులో జాప్యాన్ని నివారించి బిల్లులు చెల్లించాలి. అపరిష్కృత బిల్లులకు చెందిన ఎంబుక్‌లను ఈజీఎస్ కార్యాలయంలో అందజేసిన వెంటనే వాటికి చెందిన బకాయిలను నిర్వాహకులకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ ఎ.రాము అధికారులను ఆదేశించారు.


బిల్లుల చెల్లింపుపై సమీక్షిస్తున్న ఈజీఎస్ అధికారులు

పదేళ్లలో చేసిన పనుల వివరాలు..

మండలం పేరు	పంచాయతీరాజ్	ఉపాధి హామీ పథకం
ఎ.కొండూరు	264	1746
గంపలగూడెం	482	2040
రెడ్డిగూడెం	209	1725
తిరువూరు	376	1920
విస్సన్నపేట	215	1759

ప్రధానోపాధ్యాయుడికి అభినందన


లక్ష్మీనారాయణకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యార్థులు

మైలవరం, న్యూస్‌టుడే : గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ అవార్డు అందుకున్న స్థానిక లీలావతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ దంపతులను ఆ పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించి, అభినందించారు.

'ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ప్రభుత్వం'


మహిళ సమస్య తెలుసుకుంటున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

గొల్లపూడి, న్యూస్‌టుడే : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గొల్లపూడిలోని కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎక్కడికక్కడే సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనాలకు జవాబుదారీతనంతో కూడిన పరిపాలనను అందిస్తున్నట్లు చెప్పారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

● నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన వారికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, ఎల్‌ఓసీ పత్రాలను శాసనసభ్యుడు అందజేశారు.

రైతు సమస్యలను తీర్చాలని వినతి

జి.కొండూరు, న్యూస్‌టుడే : రైతు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని భాజపా కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను కోరారు. భాజపా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్న సందర్భంగా బుధవారం ఆయన కిసాన్ మోర్చా సభ్యుల బృందంతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయంలో కృష్ణప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా రైతు కూలీల వ్యవస్థ, రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎఫ్‌పీవో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భాజపా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శులు కూనల యుగంధర్, పోసాని గురునాథం, ఆళ్లూరి రవి, రావూరి రమేష్, ఆరేపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యకు శాశ్వత పరిష్కారం


స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, అధికారులు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : నెమలిలో 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణం త్వరలోనే పూర్తి చేసి ఈ ప్రాంత వినియోగదారులకు విద్యుత్తు సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలో విద్యుత్తు ఉప కేంద్రం నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. స్థానిక తెదేపా నాయకులు, జిల్లా జేఈ కె.వాసు, సిబ్బంది పాల్గొన్నారు. తదుపరి దుందిరాలపాడు, సత్యాలపాడు తదితర గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే అనారోగ్యానికి గురైన, ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించారు.

ఈవీఎం గోదాముకు పటిష్ఠ భద్రత


రికార్డు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గొల్లపూడి, న్యూస్‌టుడే : ఈవీఎం, వీవీ ప్యాట్లను భద్రపరిచిన గోదాముకు పటిష్ఠమైన భద్రత కల్పిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని ఈవీఎం గోదామును కలెక్టర్ బుధవారం పరిశీలించి మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల అనుగుణంగా గోదామును క్షుణ్నంగా తనిఖీ చేసి నివేదికను అందించడం జరుగుతుందని చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలన చేస్తున్నామన్నారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం పలు రికార్డులు పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రామయ్య, పరమేశ్వరరావు, వెంకటరత్నం, జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ


కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, పుల్లారావు తదితరులు

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివే విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో గ్రామంలోని తెదేపా నాయకులు వారికి సామగ్రి వితరణ చేశారు. వై.పుల్లారావు, ఆర్.రామస్వామి నిధులు సమకూర్చగా హెచ్‌ఎం కేఎన్‌జే లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం వీటిని అందజేశారు. కార్యక్రమంలో గొల్లపూడి వెంకట నారాయణ, ప్రత్తిపాటి ఆదాం, షేక్ జిలానీ, లింగాల చింతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిప్ డిజైన్‌లో ఉద్యోగావకాశాలు


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అప్పారావు

మైలవరం, న్యూస్‌టుడే : వీఎల్ఎస్ఐ చిప్ డిజైన్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు పేర్కొన్నారు. కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ, చిప్ డిజైన్‌పై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. బెంగళూరు సంస్థ, లీడ్ ఎస్‌టీసీ టెక్నాలజీస్ డైరెక్టర్ వీణా ఎస్.చక్రవర్తి, విభాగాధిపతి జి.శ్రీనివాసులు, కోఆర్డినేటర్లు జీవీఎన్ మూర్తి, ఎంవీఎల్ భవానీ పాల్గొన్నారు.

అత్యవసర వైద్యానికి విజయవాడ తరలింపు

నందిగామ : నందిగామ ఏరియా వైద్యశాల నుంచి అత్యవసర వైద్యానికి విజయవాడకు రోగులను పంపిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.వి.సత్యనారాయణప్రసాద్ తెలిపారు. 'ఈనాడు'లో బుధవారం 'బెజవాడకు తెచ్చేలోపే ప్రాణాలు పోతున్నాయ్' శీర్షికన వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని మాత్రమే విజయవాడకు రిఫర్ చేస్తున్నామని వెల్లడించారు.

రోడ్లు అధ్వానం.. ప్రమాదాలే నిత్యం

తిరువూరు, న్యూస్‌టుడే

తిరువూరు పట్టణంలోని ప్రధాన రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. పట్టణాభివృద్ధికి కీలకంగా ఉన్న రోడ్లపై గుంతలు పడడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎప్పుడైన ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా తిరువూరు- విజయవాడ, నూజివీడు, మధిర, కోకిలంపాడు మార్గాలతో పాటు పట్టణంలోకి వెళ్లే పలు రోడ్లపై జారిపడి గాయాల పాలవుతున్నామని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రికి వచ్చే అంబులెన్సులు సైతం నెమ్మదిగా సాగాల్సి వస్తుండటంతో అత్యవసర సేవలకు సైతం ఆటంకం కలుగుతోంది. రాత్రి వేళల్లో సరైన వీధి దీపాలు లేకపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది.


తిరువూరు నుంచి మధిర వెళ్లే రహదారి పరిస్థితి ఇలా..

హామీలకే పరిమితం

రోడ్లను అభివృద్ధి చేస్తామని హామీలిచ్చిన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తర్వాత వాటిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యలపై పలుమార్లు వినతి పత్రాలు సమర్పించిన, తాత్కాలికంగా గుంతలు పూడ్చి వదిలేయడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్ల కారణంగా వాహనాలు దెబ్బతినడంతో పాటు అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. వ్యాపార కార్యకలాపాలపై కూడా ప్రభావం చూపుతోందని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైకాపా నాయకుల తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు


మాట్లాడుతున్న రాజేశ్వరరావు, పక్కన నాయకులు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ప్రభుత్వం మండలంలోని రైతులు అవసరాల మేరకు యూరియాను సమృద్ధిగా సరఫరా చేస్తున్నట్లు తెదేపా నాయకులు స్పష్టం చేశారు. వైకాపా నాయకులు కావాలనే సాగుదారులు ఆందోళన చెందేలా యూరియా కొరత ఉందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహించారు. గంపలగూడెం సహకార బ్యాంకు వద్ద బుధవారం మండలంలోని పీఏసీఎస్ అధ్యక్షులు, సీఈవోలతో యూరియా సరఫరాపై నిర్వహించిన సమీక్షలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, తెదేపా మండల అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు డీవీ.కృష్ణారావు మాట్లాడారు. యూరియా సరఫరాపై వైకాపా నాయకులు, కార్యకర్తలు తప్పుడు ప్రచారం చేస్తూ లబ్ధి పొందేందుకు చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికీ మండల పరిధిలోని 10 పీఏసీఎస్‌ల్లో ఎరువులు నిల్వ ఉన్నాయన్నారు. పీఏసీఎస్‌ల అధ్యక్షులు కె.సత్యం బాబు, కాపూరి బాబు, టి.అప్పిరెడ్డి, ఎ.శేషగిరిరావు, కె.అజయ్ బాబు, ఎస్.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

జీట్ వెబ్‌సైట్ విద్యార్థులకు ఉపయుక్తం


కార్యక్రమంలో మణికుమార్, రఘుపిలక, కిశోర్ బాబు తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేటలోని గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలకు గురుకులం కార్యదర్శి సి.ఎ.మణికుమార్, జీట్ వెబ్‌సైట్ డైరెక్టర్ రఘుపిలక, డి.ఎస్.అకాడమీ డైరెక్టర్ కిశోర్ బాబు బుధవారం విచ్చేసి జీట్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. జీట్ వెబ్‌సైట్ విశిష్టత, దాని ప్రాధాన్యం, భవిష్యత్తు అవసరాలకు ఎలా ఉపయోగపడుతుందో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. జీట్ వెబ్‌సైట్‌ను ఎస్.బి.ఐ సహకారంతో గురుకులం విద్యార్థులకు అందించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాలు 50 శాతం తగ్గించేందుకు చర్యలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో రహదారి ప్రమాదాలను 50 శాతం తగ్గించాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.మోహన్ తెలిపారు. బెంజ్ సర్కిల్ సమీపంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో అధ్యక్షుడు నాగుమోతు రాజా ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల నేపథ్యంలో సదస్సు నిర్వహించారు. మోహన్ మాట్లాడుతూ... రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ఎన్నో ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు.

15 నుంచి మల్లయ్య స్వామి గట్టు తిరునాళ్లు


సమావేశమైన కొండపర్వ గ్రామ పెద్దలు, ప్రజలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వలోని శ్రీభ్రమరాంబిక మల్లేశ్వర స్వామి దేవస్థానం(మల్లయ్య స్వామి గట్టు) తిరునాళ్లు ఫిబ్రవరి 15,16,17 తేదీల్లో జరుగుతుందని గ్రామ పెద్దలు, గ్రామస్థులు తెలిపారు. గట్టుపై బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సర్పంచి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు గాజుల శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మట్టా వేణుగోపాల్‌రావు, తెదేపా గ్రామ అధ్యక్షుడు ములుగుమాటి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తే మేలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రైతులు సాగు చేస్తున్న పంటలకు రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తే మేలు జరుగుతుందని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం అన్నేరావుపేట, రెడ్డిగూడెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న, వరిపైర్లను పరిశీలించారు. రైతులు పాటించాల్సిన యాజమన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : కొండపర్వలో నిర్వహించిన కార్యక్రమంలో విస్సన్నపేట మండల వ్యవసాయ అధికారి షేక్ టిప్పుసుల్తాన్, ఏఈవో జి.ఉషారాణి, రైతు సేవా కేంద్ర సిబ్బంది విజయ, రైతులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని మునుకుళ్ల, అక్కపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ అధికారిణి పద్మ, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



అన్నేరావుపేటలో రైతులకు సూచనలిస్తున్న ఏవో శ్రీనివాసరావు



కొండపర్వలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది


మునుకుళ్లలో పొలం పరిశీలిస్తూ..

అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేయండి


కరపత్రాలు చూపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మైలవరం, న్యూస్‌టుడే : దీర్ఘకాలంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ సుప్రజ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.సుధాకర్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పుష్పకుమారి, శారద, సరోజిని, ఉష, బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బుల్లయ్యకు ఘన నివాళి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండల పరిధి తాతకుంట్ల గ్రామంలో గద్దల బుల్లయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి గద్దల రాము సీపీఎం జెండాను ఎగరవేశారు. అనంతరం బుల్లయ్య చిత్రపటానికి ఆయన భార్య మరియమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. సీపీఎం మండల కార్యదర్శి నాగరాజు, విస్సన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, సీఐటీయూ మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు, గద్దల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


తాతకుంట్లలో బుల్లయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని వావిలాలకు చెందిన వైకాపా నాయకుడు గ్రామంలోని సెల్‌ఫోన్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశారు. స్థానికుల వివరాల ప్రకారం.. మడిపల్లి.వీరయ్య(గ్రామ మాజీ సర్పంచి) కుమారుడు పున్నయ్య వావిలాల గ్రామ వైకాపా అధ్యక్ష పదవిని ఆశించాడు. ఈ క్రమంలో ఆ పదవి అదే గ్రామానికి చెందిన పిడపాటి.వేంకటేశ్వరరావుకు కేటాయించడంతో, తిరువూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి నల్లగట్ల.స్వామిదాసు తనకు అన్యాయం చేసినట్లు గ్రహించి, దీనిపై ప్రశ్నించగా జిల్లా ఇన్‌ఛార్జి దేవినేని.అవినాష్‌ను వెళ్లి అడగమని చెప్పినందుకు తీవ్ర మనస్తాపానికి గురై సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు వచ్చి అతడితో మాట్లాడి సురక్షితంగా కిందకు దించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తిరువూరు, న్యూస్‌టుడే : మండలంలోని లక్ష్మీపురం పాల కేంద్రం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. లక్ష్మీపురం రోడ్డు కూడలి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా స్థానికులు స్పందించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఈ సంఘటనలో తిరువూరు మండలం కాకర్ల రామన్నపాలేనికి చెందిన మున్నాకు స్వల్ప గాయాలవ్వగా, మైలవరం మండలం నరసింహపాలేనికి చెందిన వెంకట రెడ్డి తలకు బలమైన గాయమైనట్లు స్థానికులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వెంకట రెడ్డిని మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మృతుడి నేత్రాలు దానం

ఆర్లపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని ఆర్లపాడుకు చెందిన మరీదు నరసింహారావు(48) బుధవారం మృతి చెందగా అతని నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు దానం చేశారు. తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు కిలారు కిశోర్ నేత్రదానంపై అవగాహన కల్పించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. ఐ బ్యాంకుకు చెందిన నిపుణులు వచ్చి మృతుని కళ్లల్లోని కార్నియాలను సేకరించి తీసుకెళ్లారు.


నరసింహారావు (పాతచిత్రం)

దైవం.. మానుష రూపంలో!



గురువారం శిరిడీ సాయి భక్తులకు విశేషమైన రోజు. అర్చన, హారతి, అన్నదానాలతో ప్రతి గురువారం బాబా మందిరాలు కళకళలాడతాయి. మరణం శరీరానికే కానీ ఆత్మకు కాదని సద్గురుసాయి నిరూపించినట్లయ్యింది. భౌతికంగా తాను ఈ లోకాన్ని వీడినా.. నిరంతరం భక్తులపై తన అనుగ్రహాన్ని వర్షిస్తూనే ఉంటానని అభయమిచ్చారు సాయి. ఎందరెందరో భక్తులు తమకు బాబా దర్శనమైందని, ఆ సాయినాథుడు ప్రశాంత చిత్తాన్ని ప్రసాదించాడని చెబుతుంటారు.

కర్మ, భక్తి, జ్ఞాన యోగాల సమన్వయం సద్గురు సాయినాథుడు. నిరాడంబరత, మానవీయత, శ్రద్ధ, సహనాలు పరమ ఆదర్శాలని ఆచరించి చూపిన ఆధ్యాత్మిక పురుషుడు. 'దైవం మానుష రూపేణ..' అని అశేష భక్తజనుల ఆరాధనలు అందుకున్న మహనీయుడు. మతాలకు అతీతమైన వారి బోధనలు ఎప్పటికీ అనుసరణీయమే. శిరిడీలో భౌతికంగా దాదాపు అరవై ఏళ్లు తన మాహాత్మ్యాన్ని ప్రదర్శించిన బాబా 1918లో తనువు చాలించారు. మృత్యువు మహోన్నతం, పర్వదినంతో సమానమని నిరూపించారాయన. వారు ఈ లోకాన్ని విడిచిన రోజును సమాధి మహోత్సవంగా జరపడం ఆనవాయితీ.

అజ్ఞానమే పెద్ద జబ్బు..

శిరిడీ సాయి ప్రబోధాలు పారలౌకిక జీవితానికే కాదు, లౌకిక జీవనానికి కూడా మార్గదర్శకాలు. 'జీవితం దుఃఖమయం కావటానికి అజ్ఞానమే కారణం, జ్ఞానం కొరవడటం పెద్ద జబ్బు'- అనేవారు. 'వ్యాధి శరీరాన్నే బాధపెడుతుంది. అజ్ఞానం జీవితాన్నే నాశనం చేస్తుంది' అని హెచ్చరించేవారు. అందుకే వ్యాధులు తగ్గించమని అడిగే భక్తులను ప్రోత్సహించకపోయేవారు. బాధలను ధైర్యంగా ఓర్చుకోవడం అలవాటు చేసుకోవాలనేవారు. ఒకరోజు విజయానందస్వామి అనే సాధువు తమిళనాడు నుంచి మానససరోవరానికి వెళ్తూ బాబా దర్శనార్థమై శిరిడీ వచ్చారు. అతను కుటుంబం గురించే ఆలోచించటం చూసి 'ఇంటిపై ఇంత మమకారముంటే ఎలా సన్యసించావు? వసతి గృహంలో ద్వారాలు గట్టిగా బిగించు. ఓర్పుతో, జాగ్రత్తగా నిరీక్షించు. దొంగలు సర్వం దోచుకుపోతారు. ధనం, శరీరం అశాశ్వతాలని గుర్తుంచుకో. సుఖాపేక్షను వదిలిపెట్టు. భాగవతం శ్రద్ధగా పారాయణం చేయి. సత్ఫలితాలను పొందుతావు' అని ఉపదేశించారు. ఆ ఉపదేశాలను పాటించి ఆధ్యాత్మిక సాధనలను కొనసాగించిన సాధువు.. మూడురోజుల్లో బాబా చెంతనే ప్రాణాలు విడిచారు. విజయానందతో బాబా చెప్పిన వసతిగృహం మరేదో కాదు, నశించిపోయే ఈ శరీరమే! యమదూతలే దొంగలు. ఆయన మూయమన్న ద్వారాలు ఇంద్రియాలు. భాగవత పారాయణం ద్వారా భగవంతునిపై మనసు నిలిపి, శరీరాన్ని విడవమని నర్మగర్భంగా చెప్పారు సాయిబాబా. ఆయా సందర్భాల్లో భగవద్గీత, రామాయణ, భారత, భాగవతాలను ప్రబోధించేవారు.

వాటిని అర్పిస్తేనే ఆత్మజ్ఞానం..

ఒక శ్రీమంతుడు శిరిడీ వచ్చి ఆత్మజ్ఞానం ప్రబోధించమని అడిగాడు. సాయి అతనితో మాట్లాడుతూనే.. అప్పుగా 5 రూపాయలు తీసుకురమ్మని తన సేవకుడిని ఊళ్లోకి పంపారు. అతడొచ్చి అప్పు లభించలేదని చెప్పాడు. ఆ తతంగమంతా చూసి కూడా శ్రీమంతుడు స్పందించలేదు, తన వద్దనున్న ధనాన్ని బయటకు తీయలేదు. పైగా 'బాబా! నేను వెళ్లాలి. దయచేసి జ్ఞానభిక్షను ప్రసాదించండి' అని తొందర పెట్టసాగాడు. బదులుగా సాయి- 'నేను బోధిస్తూనే ఉన్నాను. కానీ నువ్వు అర్థం చేసుకోవడం లేదు. ఆత్మజ్ఞానం పొందాలంటే పంచప్రాణాలు, జ్ఞానేంద్రియాలు, మనసు, బుద్ధి, అహంకారం- వీటన్నింటినీ భగవంతుడికి అర్పించాలి. అదెంతో కష్టం. నీ వద్ద నేను చెప్పిన దాని కంటే యాభై రెట్ల పైకం ఉంది. కానీ నేను ఫకీరుని కనుక.. నీకు అప్పుగా ఇవ్వబుద్ధి కాలేదు. డబ్బే నీకు సర్వస్వం. దానిపై మోహం నశిస్తే గానీ జ్ఞానం కలగదు' అని వివరించారు. 'అశాశ్వతమైన ధనాన్ని ఇంకొకరికి ఇవ్వటానికే అర్హత ఉందో లేదో చూస్తారే! మరి శాశ్వతమైన ఆత్మజ్ఞానం ప్రసాదించాలంటే ఎదుటివారికి అర్హత ఉందో లేదో ఆలోచించకూడదా?' అని ఎదురుప్రశ్న వేశారు.

కోరికలు తీరాకే..

భక్తుడు ప్రాథమిక దశలో భగవంతుణ్ని ధర్మబద్ధమైన ప్రాపంచిక కోర్కెల్ని కోరటంలో తప్పులేదనేవారు సాయిబాబా. శిరిడీకి వచ్చిన ఓ గృహస్థ భక్తుడు కష్టాలు ఏకరువు పెడుతూ, ఆ బాధల నుంచి తనను బయటపడేయమని ప్రార్థించాడు. అక్కడే ఉన్న సాయి సేవకుడు బాబాని అలాంటి కోర్కెలు కోరవద్దని సూచించాడు. అప్పుడు బాబా 'అలా అనకు. నా వద్దకు మొదట అందరూ కోరికలతోనే వస్తారు. కష్టాలు తీరి జీవితంలో ఓ స్థాయికి వచ్చాక.. నన్ను అనుసరిస్తారు' అన్నారు. ఆ భక్తుడి కష్టాలు త్వరలోనే తీరతాయని అభయమిచ్చారు. ప్రాపంచిక జీవితంలో సంతృప్తి చెందాక, ఆధ్యాత్మిక సాధన వైపు మరలాలని అన్యాపదేశంగా ఉపదేశించారు.

స్వధర్మాచరణ.. సద్గురు సేవ

పుస్తకాలు చదివినంతలో లాభం లేదని, ఆ జ్ఞానాన్ని జీవితానికి అన్వయించుకుని ఆచరించినప్పుడే సార్థకత చేకూరుతుందని సాయి తరచూ చెబుతుండేవారు. అలాగే 'స్వధర్మాన్ని విడిచిపెట్టిన వారి ఆధ్యాత్మిక సాధనలు ఫలించవు' అనేవారు. తన వద్దకు వచ్చిన ఓ గృహస్థ భక్తుడితో 'కేవలం గ్రంథ పాండిత్యం వ్యర్థం. స్వధర్మాన్ని ఆచరిస్తూ, గురువుపై విశ్వాసంతో, ఆయన బోధనల్ని అనుసరించినప్పుడే ఆధ్యాత్మిక పురోగతి' అన్నారు. గురుకటాక్షం, అనుభవజ్ఞానం కలిగినవారే ఆ మార్గంలో సాగగలరని ఉద్ఘాటించారు.

అమిత ఆకర్షణ శక్తి..

శిరిడీసాయి తన హృదయలాలిత్యంతో, అవ్యాజమైన ప్రేమతో, అంతులేని కారుణ్యంతో ఆబాలగోపాలాన్నీ అక్కున చేర్చుకున్నారు. ఓ సందర్భంలో బాధాతప్తుడైన భక్తుడితో 'నా దృష్టి ఎవరి మీద పడుతుందో.. వారు ఎక్కడున్నా సరే.. పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కున్నట్టుగా నా వద్దకు చేర్చుకుంటాను. కాపాడమంటూ చేతులు చాపితే.. రాత్రింబవళ్లు మీ చెంతనే ఉంటాను. మీ హృదయమే నా నివాసస్థలం' అన్నారు. నిర్మలమైన మనసు, ఆడంబరాలు లేకపోవడం ఆధ్యాత్మిక జీవనానికి అత్యంత ఆవశ్యకమని తెలియజెప్పేవారాయన. అలాగే సహనం, వినయం, ప్రేమ కలిగినవారే లౌకికంగానైనా, పారలౌకికంగా నైనా పురోగతిని సాధించగలరని హితవు పలికేవారు సాయిబాబా.

- బి.సైదులు

మకరందం

makarandam@eenadu.in

గద్దకు నమస్కరించిన సాధువు!



ఒక గద్ద ముక్కున చేపను కరచుకుని ఎగిరిపోతోంది. అది చూసిన అనేక కాకులు గద్ద వెంటబడి అరుస్తూ, ముక్కులతో పొడుస్తూ.. చేపను లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అది చెట్టు చుట్టూ తిరుగుతూనే ఉంది. కాకులు దాన్ని తరుముతూనే ఉన్నాయి. ఆ బాధ పడలేక విసిగిపోయిన గద్ద ముక్కున ఉన్న చేపను నేల మీదికి జారవిడిచింది. అది చూసిన మరో గద్ద వెంటనే ఆ చేపను అందుకుని వాయువేగంతో చెట్టుకొమ్మపై చేరింది. అందుకా మొదటి గద్దను వెంబడించిన కాకులు ఇప్పుడు రెండో గద్దను వెంటాడాయి. ఇక మొదటి గద్ద ఏ భయమూ, బాధ, ఆరాటం, ఆందోళన లేకుండా నిశ్చింతగా కొమ్మ మీద వాలి, శాంతంగా చూస్తోంది. ఆ చెట్టు కిందే ఉండి.. ఈ తతంగమంతా చూస్తున్న సాధువు చిరునవ్వు చిందించాడు. 'ఇప్పుడు నీ ముఖంలో ఎంత ప్రశాంతత కనిపిస్తోంది! నువ్వే నా గురువు. విషయవాంఛల పట్ల వ్యామోహం అనే బాధను విడిచిపెట్టినంత వరకూ మనిషికి శాంతి, సౌఖ్యం ఉండవు. సంసార బాధల నుంచి విముక్తి లభించదు. ఆందోళనే తప్ప ఆనందం అనుభూతికి రాదు- అని బోధించావు. ఇంతకంటే తత్వజ్ఞానం ఇంకేముంటుంది!' అంటూ ఖగరాజుకు తలవంచి నమస్కరించాడు.

- సునీత

యుద్ధం ఎవరితో?

క్రీస్తువాణి



అనేక విషయాల గురించి మనం యుద్ధం చేస్తుంటాం. భక్తిమైన పోటు చెప్పినట్టు.. జీవితాన్ని పాడుచేసే వ్యతిరేక శక్తులతోనే పోరాటం. మన శత్రువైన సాతానుతో చేసే యుద్ధంలో ఆయుధాలు కనిపించవు. మనల్ని కాపాడేందుకు ఏసుక్రీస్తు మానవరూపంలో జన్మించారు. కంటికి కనిపించని ఆయుధాలతో పోరాడారు. మనం కూడా ఆ స్ఫూర్తిని పొందాలి. మానవత్వం మరచి రాక్షస కృత్యాలు సాగిస్తున్న వాళ్లపై పోరాటం సాగించాలి. ఏసును విశ్వసించినప్పుడు మన శక్తియుక్తులకు తోడు ఆయన అనుగ్రహం లభిస్తుంది. అలా దేవుడు కరుణించిన కొన్ని ఉదంతాలు..

జెరుబ్బాబెలు అనే భక్తుడికి పర్వతం అడ్డు వచ్చింది. అప్పుడతడు దేవుని సహాయం కోరగా.. ఆ పెద్ద పర్వతం కాస్తా చదునుభూమిగా మారిపోయింది. (జెకర్యా 4:7) జెరుబ్బాబెలును అడ్డగించేందుకు వచ్చిన శత్రువులు పర్వతం లేకపోవడం చూసి ఆశ్చర్యపోయారు. దైవశక్తి తోడైనప్పుడు అనుకున్నవి నెరవేరతాయి. కాబట్టి ఆందోళనకు గురైనప్పుడు ఏసును ప్రార్థించాలి.

గిద్యోను అనే భక్తుడు రాజుగా ఉన్నప్పుడు.. సైన్యాన్ని వెంటబెట్టుకుని యుద్ధభూమికి వెళ్లాడు. ఎదురుగా ఉన్న మహాసైన్యాన్ని చూసేసరికి తమ సేన చిన్న గొర్రెల మందగా కనిపించింది. దేవుడి వాగ్దానాన్ని గుర్తు చేసుకుని, ఆ మహా సైన్యాన్ని ఎదిరించాడు, విజయం పొందాడు. (న్యాయాధిపతులు 7:16)

యెహోషాపాతు యుద్ధభూమికి వెళ్లినప్పుడు 'నువ్వు పోరాడాల్సిన అవసరం లేదు. కేవలం నిలబడు యుద్ధం చేసేది నేనే' అన్నాడు దేవుడు. రాజైన యెహోషాపాతుతో పాటు యూదా యెరూషలేం ప్రజలు కూడా దేవునికి హృదయపూర్వకంగా నమస్కరించారు. ఆ యుద్ధంలో వాళ్లు విజయం సాధించారు.

ఫరో ఇశ్రాయేలీయులను సంహరిద్దామని.. ఐగుప్తీయులతో కలిసి బయల్దేరాడు. ఎర్రసముద్రం వద్దకు వెళ్లాక.. ఇక ముందుకు సాగలేకపోయారు. ఇశ్రాయేలీయులు నిరుత్సాహం చెందినప్పుడు.. దేవుడు 'మీరు నిలబడి చూస్తుండండి. ఈ ఐగుప్తీయులు ఇక మళ్లీ మీకు కనిపించరు' అన్నాడు. దైవాజ్ఞ ప్రకారం సముద్రం రెండు పాయలుగా చీలింది. దైవప్రజలైన ఇశ్రాయేలీయులకు దారి ఇచ్చింది. వారు ఆ సముద్రంలో పొడినేల మీద నడిచి.. ముందుకు సాగారు. వారిని ఐగుప్తీయులు తరుముతూ అనుసరించారు. ఇశ్రాయేలీయులు సముద్రం దాటేశారు. ఐగుప్తీయులు సముద్రం మధ్యలో ఉన్నప్పుడు దారి మూసుకు పోయింది. ఫరోతో సహా అందరూ సముద్రంలో జలసమాధి అయ్యారు. మనం సన్మార్గాన్ని అనుసరిస్తే.. దైవం శక్తి సామర్థ్యాలను అందిస్తాడు. అలా ప్రేమ, భక్తి అనే ఆయుధాలతో జీవన సమరంలో పోరాడి విజయం పొందుదాం.

- మర్రి ఎ.బాబ్జి

అల్లాహ్ క్షమాపణ పొందే అరుదైన రాత్రి

ఫిబ్రవరి 4
షబ్-ఎ-బారాత్

ఇస్లాం సందేశం



మనం ఎంత నియమ నిష్టలతో ఆధ్యాత్మిక క్రమశిక్షణతో జీవితాన్ని గడుపుతున్నా.. తెలిసో తెలియకో చేసిన తప్పులు, పాపాలు మనల్ని వెంటాడుతుంటాయి. వాటిని గుర్తించి పశ్చాత్తాపం చెందినవారు అల్లాహ్ క్షమాపణ పొందుతారు. అలాంటి అవకాశాన్ని 'షబ్-ఎ-బారాత్' ఇస్తుంది. ఇది ఇస్లామిక్ క్యాలెండర్‌లో ఎనిమిదవ ఆయిన షాబాన్ నెలలో 15వ తేదీన వస్తుంది. దీన్ని ప్రాయశ్చిత్తం, ప్రార్థన, క్షమాపణలకు సంబంధించిన రాత్రిగా పరిగణిస్తారు. రాబోయే సంవత్సరానికి మన జీవన గమనాన్ని అల్లాహ్ నిర్ణయించేదీ, పాపాలను క్షమించే అద్భుత రాత్రిగా విశ్వసిస్తారు. రాబోయే పవిత్ర రంజాన్ మాసానికి ఆధ్యాత్మిక సన్నాహకంగా ఇది పనిచేస్తుంది. ఓ రోజు రాత్రి దైవ ప్రవక్త ముహమ్మద్ (స) భార్య ఆయిషా (ర.అ.) నిద్ర నుంచి మేల్కొని చూడగా ఆయన కనిపించలేదు. మృతుల క్షమాపణ కోసం ప్రార్థిస్తూ మదీనా లోని జన్నత్- అల్- బాఖీ శ్మశాన వాటికలో ఉండటాన్ని గుర్తించారు. ఈ కారణంగానే ఆ రాత్రికి పవిత్రత చేకూరింది. అదేరోజు రాత్రి దైవ ప్రవక్త మక్కాలో విజయవంతంగా ప్రవేశించారని మరికొన్ని కథనాలు సూచిస్తున్నాయి. ఈ రోజున అల్లాహ్ అపార కరుణను ప్రసాదిస్తాడు, పాపాలను క్షమిస్తాడు, పశ్చాత్తాపం చెందినవారి బాధలను తొలగిస్తాడు- అని ముస్లింలు విశ్వసిస్తారు. అందుకే దీన్ని క్షమాపణ రాత్రి (లైలత్-అల్-బారాత్) అంటారు. రాబోయే సంవత్సర కాలానికి మన విధిరాత ఈ రాత్రికే నిర్ణయం అవుతుందని, అందులో జనన, మరణ వివరాలు, జీవనోపాధి అంశాలు ఉంటాయని ఇస్లామిక్ గ్రంథాలు పేర్కొన్నాయి. షబ్-ఎ-బారాత్ రోజు రాత్రి మసీదుల్లో లేదా ఇళ్లలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. దివ్య ఖురాన్ పఠిస్తారు. మరణించిన తమ ఆత్మీయుల ఆత్మశాంతి కోసం వారి సమాధులను సందర్శించి ప్రార్థిస్తారు. రాత్రంతా దైవ చింతన, ధార్మిక కార్యకలాపాల్లో గడిపి మరుసటిరోజున ఉపవాసం ఉంటారు. షియా ముస్లింలు దీనిని 12వ ఇమామ్ ముహమ్మద్ అల్ మహ్దీ జన్మదినంగా జరుపుతారు. ఆయనను శాంతి, న్యాయాన్ని పునరుద్ధరించే విమోచకుడిగా భావిస్తారు. ఇది దైవం నోహ్ ఓడను జలప్రళయం నుంచి రక్షించిన రాత్రిగా సున్నీలు భావిస్తారు. షబ్-ఎ-బారాత్ సందర్భాన్ని వ్యక్తిగతంగా ప్రత్యేక ప్రార్థనలు ఆచరించడం కంటే నిర్దిష్ట వ్యవస్థీకృతమైన వేడుకగా జరపాలని కొందరు ఇస్లామిక్ పండితుల సూచన. దానధర్మాలకు సరైన సమయమిది. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేక దీప వెలుగులు చేసి బంధుమిత్రులు, పేదలకు పంచుతారు. పూర్వీకుల సమాధుల సందర్శన, దైవ ప్రార్థనలు, ఉపవాసం, మిఠాయిలు పంచటం వంటివి దీనిలో భాగమైనా.. చేసిన పాపాలకు అల్లాహ్ క్షమాపణను పొందటమే ఈ పవిత్ర రాత్రి అసలైన పరమార్థం.

- ఖాసిం పీరా

గుణదల ఠాణా పరిధిలోకి.. ఆ ఐదు గ్రామాలు?

న్యూస్‌టుడే, రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు

ప్రతిపాదిత గ్రామాలు: రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి, **జనాభా:** సుమారు లక్ష మంది.

రామవరప్పాడు కేంద్రంగా నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనేది పోలీసు ఉన్నతాధికారుల ప్రతిపాదన. దశాబ్దాల నుంచి ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా పటమట పోలీస్‌స్టేషన్ పరిధి ఎక్కువగా ఉండడంతో రామవరప్పాడు వైపు గ్రామాల్లో నిఘా కొరవడుతోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు పోలీసు ఉన్నతాధికారులు రంగంసిద్ధం చేస్తున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాలను గుణదల పోలీస్‌స్టేషన్‌లో కలిపేందుకు హోంశాఖకు పోలీసు ఉన్నతాధికారులు నివేదిక కూడా పంపారని సమాచారం. హోంశాఖ నుంచి ఆదేశాలు వస్తే రామవరప్పాడుతో పాటు మిగిలిన గ్రామాలను గుణదల పోలీస్‌స్టేషన్‌లో కలపడం లాంఛనమే.

పరిధి ఎక్కువై.. నిఘా కొరవడి..

నగరంలోనే కీలకమైంది పటమట పోలీస్‌స్టేషన్. దీని పరిధి కూడా అన్ని వైపులా విస్తరించి ఉంది. స్క్యూబ్రిడ్జి నుంచి గూడవల్లి వరకు, బెంజిసర్కిల్ నుంచి అశోక్‌నగర్ వరకు ఉంది. దీంతో పరిధి ఎక్కువై పర్యవేక్షణ ఇబ్బందిగా మారుతోంది. ఎనికేపాడు, నిడమానూరు ప్రాంతాల్లో ఏవైనా నేరాలు జరిగినా ఇక్కడి నుంచి పోలీసులు వెళ్లడానికి అరగంటకు పైగా సమయం పడుతుంది. దీనికితోడు సీఎం, గవర్నర్ రూట్ బందోబస్తుకు స్క్యూబ్రిడ్జి నుంచి గూడవల్లి వరకు జాతీయ రహదారిపై స్టేషన్‌లో ఉన్న 80 శాతం సిబ్బందిని కేటాయించాల్సి వస్తోంది.

ఎమ్మెల్యే అంగీకరిస్తే..

విజయవాడ రూరల్ మండలంలోని 9 గ్రామాలు గన్నవరం నియోజకవర్గంలో ఉన్నాయి. రామవరప్పాడు వైపు గ్రామాలు పటమట స్టేషన్ పరిధిలో.. అంబాపురం, పాతపాడు, పి.నైనవరం గ్రామాలు కొత్తపేటస్టేషన్ పరిధిలో. . నున్న గ్రామం నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నాయి. ఈ మూడు పోలీస్‌స్టేషన్‌లు ఎన్టీఆర్ కమిషనరేట్‌లో ఉన్నాయి. దీంతో ఈ గ్రామాలన్నిటిని కలిపి కొత్తగా ఒక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనేది గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆలోచన. ప్రస్తుతం ఐదు గ్రామాలను మళ్లీ గుణదల పోలీస్‌స్టేషన్‌లో కలిపేందుకు ఆయన ఒప్పుకుంటారా లేదా అనేది చూడాలి.

సెంట్రల్ జోన్‌లోనే ఈ ఐదు గ్రామాలు..

సెంట్రల్ జోన్‌లో మొత్తం పటమట, మాచవరం, గుణదల పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. మాచవరం స్టేషన్ నుంచి కొంత పరిధి, సత్యనారాయపురం స్టేషన్ నుంచి కొంత పరిధి తగ్గించి 2022 మేలో ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, 25 మంది సిబ్బందితో గుణదల పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించారు. రామవరప్పాడు కేంద్రంగా నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడం.. పటమట పోలీస్‌స్టేషన్ పరిధి ఎక్కువవ్వడం.. గుణదల పోలీస్‌స్టేషన్ పరిధి తక్కువగా ఉండడంతో రామవరప్పాడుతో పాటు మిగిలిన గ్రామాలను గుణదలలోకి కలిపేందుకు పోలీసు ఉన్నతాధికారులు అడుగులు వేస్తున్నారు.

తిరుమల తరహాలో.. దుర్గమ్మ ప్రసాదం!

ఈనాడు, అమరావతి: ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు అందించే అమ్మవారి ప్రసాదం, అన్నదానంలో మరింత నాణ్యత పెంచడంపై అధికారులు దృష్టిసారించారు. ప్రస్తుతం దుర్గగుడిలో నూతనంగా అన్నదానం, ప్రసాదాల తయారీ భవనాలను కడుతున్నారు. వచ్చే దసరా నాటికి వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలనేది లక్ష్యం. భవన నిర్మాణాలు తుది దశకు చేరుతున్న నేపథ్యంలో.. దుర్గగుడి ఈవో శీనానాయక్ ఆధ్వర్యంలో ఓ అధికారుల బృందం.. తిరుమలలో అమలవుతున్న విధానాలను పరిశీలించేందుకు వెళ్లింది.



తిరుమల కొండపై అన్నదానం, ప్రసాదాల తయారీని పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్ ఆధ్వర్యంలోని దుర్గగుడి అధికారుల బృందం

నిశిత పరిశీలన...: తిరుమల కొండపై లడ్డూ ప్రసాదం తయారీని ఈ బృందం బుధవారం క్షుణ్నంగా పరిశీలించింది. వినియోగిస్తున్న అత్యాధునిక యంత్రాలు, ముడి పదార్థాల నాణ్యత, తయారీ విధానాన్ని పరిశీలించి.. అక్కడి సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. అన్నప్రసాదం తయారీ, భోజనశాల విస్తీర్ణం, భక్తులకు సౌకర్యాలు, ఒక్కో బంతికి ఎంతమంది కూర్చుకుంటున్నారు, వడ్డించే ఉత్తమ విధానాలు.. అన్నీ తెలుసుకున్నారు. తిరుమల ఇంజినీరింగ్ అధికారులు. . అక్కడి అన్నప్రసాద భవన నిర్మాణం, యంత్రాల పనితీరుపై సమగ్ర సమాచారాన్ని విజయవాడ బృందానికి అందజేశారు.

అన్నదాన భవనంలోనూ ఆధునిక మార్పులు

ఇప్పటికే భవనాలు కట్టేడయంతో..: దుర్గగుడి ప్రాంగణంలోని కనకదుర్గానగర్‌లో ఇప్పటికే ప్రసాదాల తయారీ, అన్నదాన భవనాలను 80 శాతంపైగా కట్టేశారు. తిరుపతి తరహాలో ఇక్కడ అధునాతన సాంకేతిక విధానంలో యంత్ర పరికరాలను పెట్టాలంటే.. భవన నిర్మాణం ఆరంభించడానికి ముందే పక్కాగా ప్రణాళిక ఉండాలి. ప్రస్తుతం అక్కడి విధానాలను ఎలా ఇక్కడ అమలు చేస్తారనేది.. వేచి చూడాలి. ● అన్నదానం, ప్రసాదాల తయారీ కోసం ఉత్తమ విధానాలపై అధ్యయనం చేయాలని దేవాదాయశాఖ మంత్రి, కమిషనర్‌లు తాజాగా సూచించడంతో.. తాము తిరుమలకు వెళ్లామని ఈవో శీనానాయక్ తెలిపారు. భక్తులకు నాణ్యమైన, రుచికరమైన ప్రసాదాలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. పర్యటనకు వెళ్లిన బృందంలో.. ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, ఏఈవోలు చంద్రశేఖర్, రమేష్‌బాబు ఉన్నారు.

ఘనంగా ప్రారంభమైన వీరమ్మ తల్లి తిరునాళ్లు

ఉయ్యూరు: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఉయ్యూరు వీరమ్మ తల్లి తిరునాళ్లు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ.రాజేంద్రప్రసాద్ అమ్మవారి విగ్రహాన్ని మెట్టినింటి నుంచి వెలుపలికి తీసుకొచ్చి అమ్మవారి పల్లకీలో కూర్చోపెట్టారు. అక్కడి నుంచి అమ్మవారు పట్టణంలో గ్రామోత్సవానికి బయలుదేరింది. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం ఉయ్యూరు పట్టణ పోలీసులు అమ్మవారికి ప్రథమ పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించారు. అనంతరం మెట్టినింటిలో మంత్రి పార్థసారథి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు మెట్టినింటి నుంచి బయలుదేరే సమయంలో జరిగిన ఊరేగింపులో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు గండదీపాలతో మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని నూతన వస్త్రాలు సమర్పించిన వారిలో ఉయ్యూరు పురపాలక సంఘం ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తనయుడు బోడే వెంకట్రామ్ ఉన్నారు.



సారె ఊరేగింపులో గన్నవరం డీఎస్పీ శ్రీనివాస్, కంకిపాడు సీఐ



అమ్మవారిని మెట్టినింటి నుంచి వెలుపలికి తీసుకొస్తున్న మంత్రి పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్



ఎదురుగండ దీపాలతో భక్తులు

ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ రాక

గన్నవరం గ్రామీణం: ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ బుధవారం రాత్రి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకున్నారు. దిల్లీ నుంచి వచ్చిన ఆయనకు ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో ఉండవల్లి బయలుదేరి వెళ్లారు.

రంగుల ఉత్సవం.. భక్తజన సంబరం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీగోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ పరివార దేవతామూర్తులు రంగుల ఉత్సవాన్ని పూర్తిచేసుకుని బుధవారం పెనుగంచిప్రోలుకు తిరిగి బయలుదేరారు. జనవరి 5న రంగుల ఉత్సవానికి పెనుగంచిప్రోలు నుంచి జగ్గయ్యపేటకు బయలుదేరిన దేవతామూర్తులు 6వ తేదీ సాయంత్రానికి మండపం చేరుకున్నారు. 25 రోజులపాటు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించిన మహోత్సవాన్ని పూర్తిచేసుకుని పెనుగంచిప్రోలుకు బయలుదేరారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా దేవతామూర్తుల పల్లకిలు వెళ్తుండగా.. భక్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళా కళాకారుల నృత్యాలు, కోలాట ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ తిలక్ పర్యవేక్షణలో సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.



పెనుగంచిప్రోలు వెళ్తున్న అమ్మవారి పల్లకీలు



నృత్యాలు చేస్తున్న కళాకారులు

నకిలీ మద్యం కేసులో.. ఐదుగురు నిందితులకు బెయిల్

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో ఐదుగురు నిందితులకు బెయిల్ మంజూరైంది. గత ఏడాది ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం వ్యవహారంలో నిందితులు సయ్యద్ హాజి (ఏ5), కట్టా రాజు (ఏ6), మిథున్‌దాస్ (ఏ9), అంతదాస్ (ఏ10), షేక్ అల్లాబక్ష్ (ఏ16)లకు విజయవాడలోని ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు బెయిల్ ఇస్తూ బుధవారం సాయంత్రం ఉత్తర్వులిచ్చారు. బెయిల్ కోసం వీరు దాఖలు చేసిన పిటిషన్లపై ఇటీవల ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. ఒక్కొక్కటి రూ.20 వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఉత్తర్వుల్లో న్యాయాధికారి పేర్కొన్నారు.

అనిల్ చోఖ్రా, రోనక్ బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తి

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో ఇద్దరు నిందితుల బెయిల్ పిటిషన్లపై వాదనలు పూర్తయ్యాయి. బెయిల్ మంజూరు చేయాలని అనిల్ చోఖ్రా, రోనక్ కుమార్ దాఖలు చేసుకున్న పిటిషన్లు విజయవాడ ఏసీబీ కోర్టులో బుధవారం విచారణకు వచ్చాయి. వీటిపై న్యాయస్థానంలో ఇరుపక్షాల వాదనలు జరిగాయి. వీటిపై తీర్పు నిమిత్తం వచ్చే నెల 4కు న్యాయాధికారి వాయిదా వేశారు.

కార్గోను విస్తరిస్తే మరింత ఆదాయం

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: కొరియర్ అండ్ కార్గోను మరింత విస్తరిస్తే ఆర్టీసీకి అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం పండిట్ నెహ్రూ బస్టేషన్ అరైవల్ బ్లాక్‌లో నూతనంగా అభివృద్ధి చేసిన ఏసీ కార్గో బుకింగ్, డెలివరీ కౌంటర్లను ప్రారంభించారు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు కార్గో కౌంటర్లను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్గో ప్రారంభించిన తొలి ఏడాది రూ.58 కోట్ల ఆదాయం రాగా, గత ఏడాది 209 కోట్లకు చేరిందని ప్రస్తుతం ఈ ఏడాది చివరకు 230 కోట్లు ఆదాయం రావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్ -2 జి విజయరత్నం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంజినీరింగ్ జి.రవివర్మ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు

భారత్‌పై అమెరికా దురంహకార వైఖరి తగదు

రాఘవయ్యపార్కు కూడలి (కృష్ణలంక): తాము చెప్పినట్లుగా భారత్ నడుచుకోవాలంటూ అమెరికా ప్రదర్శిస్తున్న దురహంకార వైఖరిని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌వో)ఖండించింది. సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలను ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు విజయవాడలో నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా అమెరికా యుద్ధోన్మాదం-ప్రపంచ శాంతి-సవాళ్లు అంశంపై ఫిబ్రవరి 1న ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు సంబంధించిన వివరాలను సంఘం ప్రతినిధులు వై.వెంకటేశ్వరరావు, జి.ఈశ్వరయ్యలు ఎంబీ విజ్ఞాన కేంద్రంలో బుధవారం వెల్లడించి పోస్టర్‌ను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ వెనెజువెలాపై అమెరికా దాడికి పాల్పడి అధ్యక్షుడు మదురో, ఆయన భార్యని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. గ్రీన్‌లాండ్ ఇవ్వాలని పట్టుబట్టడం, ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లాంటి ఘటనలు అమెరికా దురుద్దేశపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేసిన దాడిలో వేలాది మంది చిన్నారులు, మహిళలు, అమాయకులైన ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా వైఖరిపై ప్రధాని మోదీ వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదన్నారు. అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా అందరూ కలిసి రావాల్సిందిగా కోరారు. శాంతి సంఘం రాష్ట్ర కన్వీనర్లు మహంకాళి సుబ్బారావు, నరమాల సతీష్‌కుమార్, చంద్రనాయక్, వై.కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న వెంకటేశ్వరరావు, ఈశ్వరయ్య, సుబ్బారావు, సతీష్‌కుమార్ తదితరులు

వసుంధర

vasundhara@eenadu.in



బాధపడకు 'బంగారం'

ఈ లోహాలనీ ఆ లాభాలనీ ఎక్కడ మిస్సవుతామో అన్న భయంతో చేతిలో ఎంతుంటే అంత డబ్బుల్తో భౌతికంగా కొనేవాళ్లు కొందరు, ఫ్యూచర్స్‌లో పెట్టేవాళ్లు ఇంకొందరు. కొనలేక ఒత్తిడి, ఆందోళనలకు లోనయ్యేవాళ్లు మరెందరో. మధ్య తరగతి మహిళల్లో ఈ తరహా నిరాశ, నిస్పృహలు మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయి. నిజమే, బంగారం మనకి పెట్టుబడి మాత్రమే కాదు, సంప్రదాయ వారసత్వ సంపద. ఓ భావోద్వేగం. అమ్మాయి పెళ్లికోసమనో మనవరాలి బారసాలకనో అంతోఇంతో బంగారం కొని దాచడం తరతరాల నుంచీ వస్తోంది. దాంతో పెరుగుతోన్న ధరలతో ఎటూతోచక కొందరు ఆందోళన చెందడమూ సహజమే.

రాజకీయ, భౌగోళిక అనిశ్చితులు, ట్రంప్ విధానాలు, అమెరికా ఆర్థిక వ్యవస్థ... కారణాలేమయితేనేం, లోహాలకు మహర్దశ నడుస్తోంది... అని సాధారణ గృహిణులూ చర్చిస్తున్నారంటే వెండి, బంగారాల ధరల పెరుగుదల ఎంతటి కలకలం సృష్టిస్తోందో అర్థమవుతోంది. ధర పెరిగేకొద్దీ బియ్యం, బంగాళాదుంప వంటి గిఫెన్ గుడ్స్‌లానే విలువైన లోహాలకీ డిమాండ్ ఏర్పడటం ఆశ్చర్యంగా ఉందని ఆర్థిక విశ్లేషకులూ నివ్వెరపోతున్నారు. దీని వెనకున్న కారణాలేంటో ఎప్పుడే మవుతుందో అన్నదానికి ఎవరి దగ్గరా సరైన సమాధానం లేదు. ఎవరి విశ్లేషణలు వాళ్లవి. అవన్నీ ఎలాగున్నా...

అవి అవసరమా?!

ఒకళ్లని చూసి మరొకరు అవసరం ఉన్నా లేకున్నా కొనాలనుకుంటున్నారు. ఇదో మాస్ మానియా. సోషల్‌మీడియా కూడా ఇందుకు కారణమే. ఉదాహరణకు కొత్త సినిమా విడుదలైతే అందరూ చూస్తున్నారని వెళ్లేవాళ్లు కొత్త ఫ్యాషన్‌ని అంతా వేస్తున్నారనీ కొనేవాళ్లే ఎక్కువ. అది నిజంగా మనకంత ముఖ్యమా అనుకున్నవాళ్లు దాని గురించే ఆలోచించరు.

'ఆర్థిక స్థిరత్వంకోసం పెట్టుబడులు పెట్టడం తప్పు కాదు. కానీ అవసరాలూ ప్రాధాన్యాల్ని మించి కాదు కదా. డబ్బులుండి పెట్టుబడిగా పెట్టాలనుకునేవాళ్లూ ఏ పెళ్లో పేరంటమో ఉండి నగల అవసరం ఉన్నవాళ్లూ ఎటూ కొంటారు. కాకపోతే, పది తులాలు కొనాలనుకుంటే అందులో సగమే కొంటారు. కోరుకున్న నగ రాకపోవచ్చు. అయితే ఏంటీ... వెండి, వన్‌గ్రామ్, 9 క్యారెట్ నగలు... వంటి పత్యామ్నాయాలెన్నో. పెరిగే ధర గురించి అతిగా ఆలోచించకండి' అంటున్నారు నిపుణులు.

నైపుణ్యాలే కీలకం!

'పాతికేళ్ల కిందట పదో తరగతిలో మెరిట్ రావడంతో నాకు గోల్డ్ మెడల్ వచ్చింది. ఎనిమిది గ్రా. బంగారం ఉన్న దాని విలువ అప్పట్లో రూ.4 వేలు. కోచింగ్ అవసరాలకు దాన్ని అమ్మాల్సి వచ్చింది. ఆ పతకం ధర ఇప్పుడు రూ.లక్ష పైచిలుకే. కానీ దానికన్నా నేను పొందిన జ్ఞానం, కెరియర్ ఎన్నో రెట్ల విలువైనవి. జీవితంలో ఎదగడానికి తోడ్పడ్డాయి. కాబట్టి నైపుణ్యాలమీద పెట్టుబడి పెట్టండి' అంటూ బెంగళూరుకి చెందిన ప్రముఖ ఆప్షన్స్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ 'సెన్సిబుల్' వ్యవస్థాపకుడు అబిద్ హసన్ ఎక్స్‌లో యువతను ఉద్దేశించి చేసిన పోస్టు ఈమధ్య వైరలైంది. అవునుమరి, సంపద వస్తువుల రూపంలోనే కాదు, నైపుణ్యాల రూపంలోనూ ఉంటుంది.

అలాగని విలువైన లోహాల కొనుగోళ్లు వద్దనడం లేదు. అవి ఆర్థిక భద్రతను ఇస్తే, నైపుణ్యాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. మెరుగైన అవకాశాల్ని కల్పిస్తాయి. స్వల్పకాలిక ఆస్తి పెరుగుదలతో పోలిస్తే నైపుణ్యాలే విలువైనవి. కాబట్టి మార్కెట్ల పెరుగుదల గురించి అతిగా ఆలోచించకండి. అదే జీవితం కాదు కదా. మనసును ప్రశాంతంగా, ఆనందంగా ఉంచుకునే హాబీలను ఏర్పరచుకోండి. ఫోమో బారిన పడకండి. జీవితంలో ఎదగడం అంటే సంపద పోగేసుకోవడం ఒక్కటే కాదు. విజ్ఞాన సముపార్జనే అసలైన సంపద. అయినా అమ్మాయిలకు నిండైన ఆత్మవిశ్వాసం, చిరునవ్వుల్ని మించిన నగలుంటాయా?! అసలు ఏ ఇంట్లోనైనా అమ్మాయే బంగారం కదా!

'వెండీ బంగారాలేంటీ ఇలా పెరుగుతున్నాయి... ఇక, వీటి సంగతి మర్చిపోవాల్సిందే. డబ్బులుండీ కొనలేకపోయా. పాతవి మార్చకుండా అప్పుడే డబ్బులు పెట్టి కొన్నా బాగుండేది...' ఎక్కడ చూసినా ఈ మాటలే వింటున్నాం. పాత విషయాలు గుర్తుచేసుకుని మరీ బాధపడుతున్నారు, ఒత్తిడి, ఆందోళనలకి గురవుతున్నారు. 'ధర కాస్త తగ్గినా బాగుణ్ను ఈసారి ఎలాగోలా కొంటా' అని ఆ దేవుడికి మొక్కేవాళ్లూ లేకపోలేదు. గృహిణులూ ఉద్యోగినులే కాదు, చదువుకునే అమ్మాయిల్లోనూ ఈ లోహాల పెరుగుదల తీవ్ర అలజడి రేపుతోంది. దీన్నే ఫోమో(ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్)గా చెబుతున్నారు నిపుణులు.

మీకు తెలుసా



గర్భస్థ శిశువుకి మూడో నెల నుంచే వేలిముద్రలు ఏర్పడటం మొదలవుతుంది. ఆరో నెలకి పూర్తిగా ఏర్పడతాయి. నవజాత శిశువుల్లో వేళ్లు మృదువుగా ఉండి చర్మం పొరలుగా ఊడిపోవడం వల్ల ఇవి స్పష్టంగా కనిపించవట.

షార్ట్‌కట్ లేని గెలుపు నాది!

చదివింది పేరున్న సంస్థలో కాదు. మా కాలేజీకి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లేవు. ఇంటర్వ్యూలో ఫెయిలయ్యా... ఒక మంచి ఉద్యోగం దొరకలేదంటే ఒక్కొక్కరూ ఎన్ని కారణాలు చెబుతారో! కానీ ఈ అమ్మాయి అలా కాదు. ప్రతి అవకాశాన్నీ అందుకుంది. తనని తాను తీర్చిదిద్దుకుంది. కాబట్టే, గూగుల్‌లో కొలువు సాధించింది. ఈ క్రమంలో దాటిన తిరస్కరణలూ చాలానే! పేరు... ఆర్కీ గుప్తా.



ఆర్కీ

భోపాల్‌లోని చిన్న పట్టణం ఆర్కీ గుప్తాది. 'మా కాలేజీకి సర్వీస్ బేస్డ్ కంపెనీలే ప్లేస్‌మెంట్ కోసం వచ్చేవి. ఫలానా అవకాశమే కావాలని నేను కూర్చోలేదు. కాలేజీలో, బయటా ఎక్కడ అవకాశం ఉందన్నా ప్రయత్నించేదాన్ని. దీని కోసం కొత్త ప్రాంతాలకు వెళ్లడానికీ వెనకాడలేదు. చివరకు విఫలమైనా నేను మాత్రం ప్రయత్నం ఆపలేదు. తుది సంవత్సరం నాకు సర్వీస్ బేస్డ్ సంస్థలోనే ఉద్యోగం వచ్చింది. నా గమ్యం ఇది కాదు. అయితేనేం, దాన్ని తిరస్కరించలేదు. కానీ ప్రాబ్లమ్ సాల్వింగ్, డేటాబేస్, కంప్యూటర్ ఫండమెంటల్స్ వంటివన్నీ లోతుగా తెలుసుకోవడం మొదలుపెట్టా. మార్కుల కోసం కాదు... నైపుణ్యం సాధించడానికి! దీంతో నాకు ఓపెన్ టెక్స్ట్ అనే ప్రొడక్ట్ బేస్డ్ సంస్థలో ఇంటర్న్‌షిప్ అవకాశం వచ్చింది. దాని కోసం హైదరాబాద్ చేరుకున్నా. ఇక్కడ చేరిన తొలిరోజే నేను ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికైన ఉద్యోగంలో చేరే తేదీ ఖరారైంది. అయితే ఓపెన్ టెక్స్ట్‌లో అసెస్‌మెంట్‌లో విజయం సాధిస్తే పూర్తిస్థాయి ఉద్యోగిగా మారొచ్చు. నెలలు గడుస్తున్నాయి. కానీ ఎన్నిసార్లు ప్రయత్నించినా తిరస్కరణలే ఎదురయ్యాయి. మరోపక్క 15 రోజుల్లో ఉద్యోగంలో చేరాలి. ఇక హైదరాబాద్ వీడాల్సిందే అనుకున్నప్పుడు మ్యాజిక్ జరిగింది. ఇంటర్వ్యూ నెగ్గి, ఉద్యోగం సాధించా. ఇకప్పుడు ధైర్యంగా నచ్చని ఉద్యోగాన్ని వదులుకున్నా. అలాగని సాధించేశానని ఊరుకోలేదు. డేటా సైన్స్, మెషీన్ లర్నింగ్ వంటివాటిల్లో నానో డిగ్రీలు చేశా. ఈ క్రమంలో 2019లో గూగుల్ ఇంటర్వ్యూ వచ్చింది. ఎప్పట్లాగే వైఫల్యమే పలకరించింది. అయినా నేను ఆగలేదు. ప్రయత్నిస్తూనే ఉన్నా. వైఫల్యాలన్నింటినీ పాఠాలుగా తీసుకున్నా. 2020లో సర్వీస్‌నౌలో చేరి రోజుకో సాఫ్ట్‌వేర్ ప్రశ్నకి పరిష్కారం కనుక్కునేదాన్ని. అలా రెండేళ్లు గడిపా. చివరకు 2022లో మళ్లీ గూగుల్ ఇంటర్వ్యూలో పాల్గొన్నా. ఈసారి పూర్తి సన్నద్ధతతో! ఏకంగా నాలుగు నెలలపాలు సాగిందది. ఏదైతేనేం చివరకు 'మీరు ఎంపికయ్యార'న్న మెసేజ్ గూగుల్‌నుంచి అందుకున్నా. ఇక్కడ నా విజయానికి ఏ షార్ట్‌కట్‌లు లేవు. అదృష్టం అంతకన్నా కాదు. ఏళ్ల ప్రయత్నం, నా మీద నాకున్న నమ్మకం, కష్టమే నన్ను ఇక్కడిదాకా తీసుకొచ్చింది' అంటూ సోషల్‌మీడియాలో పంచుకుంది ఆర్కీ. చిన్న చిన్న వైఫల్యాలకు భయపడి నిరాశలో కూరుకుపోయే ఎంతోమందికి ఈ అమ్మాయి ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ! కాబట్టే, ఈమె కథ వైరలవుతోంది.

ఈ విజయం అమ్మదే..!



కోటేశ్వరి

'ఆడపిల్లకు చదువెందుకు పెళ్లి చేసి పంపించండి...' అన్న మాటలు పట్టించుకోకుండా కుమార్తెను చదివించిందా తల్లి. ఆమె కోరుకున్నట్లే గ్రూప్-2లో ఉద్యోగం తెచ్చుకుందా అమ్మాయి. తనే పసుమర్తి కోటేశ్వరి. తాజాగా ఏపీపీఎస్సీ విడుదల చేసిన నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో కమిషనర్ ఆఫ్ సివిల్ సప్లైస్ జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. ఆమెను పలకరిస్తే...

మాది పల్నాడులోని వినుకొండ. అమ్మ మహాలక్ష్మి, ఇళ్లల్లో పనిచేస్తుంది. నాన్న వెంకటేశ్వర్లు. వాచ్‌మన్‌గా పనిచేస్తారు. మేం ఇద్దరం పిల్లలం. చిన్నప్పట్నుంచి చదువంటే ఇష్టం. దాంతో అమ్మానాన్నలు నన్ను చదివించడానికి చాలా కష్టపడ్డారు. ఒకదశలో తిండికీ ఇబ్బందిపడ్డాం. దీనికితోడు ఇరుగు-పొరుగువాళ్ల మాటలు చాలానే. కానీ, అమ్మ అవేమీ పట్టించుకోలేదు. తెనాలి జేఎంజేలో బీఎస్సీ పూర్తి చేశా. గ్రూపు-2 కోసం విజయవాడలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నా. గ్రూప్-4 పరీక్ష రాస్తే ఒక్క మార్కులో పోయింది. అయినా నా ప్రయత్నం ఆపలేదు. ఎస్ఐ ఉద్యోగానికి పరీక్ష రాస్తే మెయిన్స్‌లో క్వాలిఫై కాలేదు. దాంతో పీఈటీ పోస్టు కోసం బీపీటీ కోర్సు పూర్తిచేశా. ఆ తర్వాత సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికై, ప్రస్తుతం విజయనగరంలో శిక్షణలో ఉన్నా. 2023లో రాసిన గ్రూప్-2 ఫలితాలు నాకెంతో ఆనందాన్ని కలిగించాయి. ఈ విజయం ముమ్మాటికీ అమ్మదే. డిగ్రీ పూర్తయిన తర్వాత విజయవాడ హాస్టల్లో ఉండి రోజుకి ఆరేడు గంటలు చదివేదాన్ని. పదో తరగతి చదువుతున్నప్పుడు బాల్-బ్యాడ్మింటన్ జూనియర్స్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. గూప్-2 తుది ఎంపికలో ఇదే నాకు ఉపయోగపడింది. క్రీడా కోటాలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరిన తరవాత సివిల్స్‌కు సన్నద్ధమవుతా.

– లగడపాటి వెంకట్రావు, వినుకొండ

ఎండోమెట్రియాసిస్... ఏం తినాలి?

నా వయసు 26. నాకు నెలసరిలో నొప్పి వస్తుంటుంది. పెళ్లైన తరవాత పిల్లలకోసమని డాక్టర్‌ని సంప్రదిస్తే ఎండోమెట్రియాసిస్ ఉందని చెప్పారు. దానివల్ల గర్భధారణలో ఇబ్బంది అవుతుందని చెప్పారు. ఆహారపరంగా జీవనశైలిలో ఎలాంటి మార్పులు చేసుకుంటే ఈ నొప్పి నుంచి ఉపశమనం పొందొచ్చు? – లక్ష్మి

ఈ ఎండోమెట్రియాసిస్‌తో వచ్చే నొప్పి ఒకేసారి తగ్గదు. కానీ, సరైన పోషకాహారం తీసుకుంటూ జీవనశైలిలో మార్పులు చేసుకుంటే తీవ్రతను కాస్త తగ్గించుకోవచ్చు. సాధారణంగా ఈ లక్షణాలున్న మహిళల్లో అలసట, వికారం, ఐబీఎస్(ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్) వంటి జీర్ణ సమస్యలూ ఉంటాయి. మీరు ఫోడ్‌మ్యాప్ ఫ్రీ డైట్‌ను పాటిస్తే కొంతవరకు ఉపశమనం లభిస్తుంది. అంటే గ్లూటెన్ ఎక్కువగా ఉండే గోధుమ, పాల ఉత్పత్తులకి దూరంగా ఉండాలి. రక్తంలో చక్కెర స్థాయుల్ని పెంచే పిండి పదార్థాలను తినకూడదు. బదులుగా దంపుడు బియ్యం, మొక్కజొన్న, మిల్లెట్స్, ఓట్స్, తృణధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి నొప్పి, వాపును తగ్గిస్తాయి. అంతేకాదు, పొట్టుతో ఉండే పప్పు దినుసుల్ని నానబెట్టి వండుకోవడం మంచిది. ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలుండే సాల్మన్ చేపలు, మొక్క ఆధారిత ఆహార పదార్థాలను డైట్‌లో భాగం చేసుకోవాలి. వీటితోపాటు కొన్ని రోజులు కాఫీ, టీ, రెడ్ మీట్, ఉల్లి, వెల్లుల్లిలాంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. రోజూ క్రమంతప్పక వ్యాయామాలు చేయాలి. 6-8 వారాలపాటు ఈ నియమాలు పాటించి నొప్పి తీవ్రతను గమనించండి. అప్పటికీ మార్పు కనిపించకపోతే వైద్యుల్ని సంప్రదించడం మంచిది.

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

ఎన్ని ప్రాజెక్టులు వచ్చినా... వాళ్ల కష్టం తీరలేదని!

ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో అమ్మాయిలు నెలలో 3-5 రోజులు స్కూల్‌కి వెళ్లడం లేదు. కారణం రుతుక్రమం. దాన్నో అపచారంగా భావించి, అమ్మాయిల్ని దూరంపెట్టే వాళ్లూ ఉన్నారు. ఈ పరిస్థితుల్ని మార్చేందుకే కాదు, పర్యావరణ హితం కోసమూ శానిటరీ ప్యాడ్స్ తయారుచేసి పంపిణీ చేస్తోందీ మిత్రద్వయం సౌమ్యా దబ్రివాల్, ఆరాధనా రాయ్ గుప్తా.





దిల్లీలో పుట్టిపెరిగారు సౌమ్య. ఆస్ట్రేలియాలోని వార్విక్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారీమె. 'నాకు పంతొమ్మిదేళ్లు ఉన్నప్పుడు ప్రాజెక్టులో భాగంగా ఆఫ్రికాలో రెండు వారాలు క్యాంపెయిన్ చేసే అవకాశం వచ్చింది. అక్కడి పిల్లలకు ఇంగ్లిష్, సామాజిక అంశాలు బోధించాలనగానే... నా ఆనందానికి అవధుల్లేవు. ఇంటర్నెట్, విద్యుత్, ఆహారం మౌలిక సదుపాయాలేవీ లేని ప్రాంతం అది. 'నువ్వు అక్కడ ఉండలేవు. వద్దు కాక వద్దు' అన్నారు అమ్మానాన్న. కానీ నేను వెళ్లాల్సిందే అని పట్టుబట్టేసరికి కాదనలేక పంపారు. అక్కడి పరిస్థితులు నేను విన్న దానికంటే దారుణంగా ఉన్నాయి. కనీస అవసరాలకూ నోచుకోని పిల్లల్ని చూశాను. వాళ్లని చూస్తున్నప్పుడు నాకు భారత్ పరిస్థితులు గుర్తొచ్చాయి. ఎందుకంటే జనాభాలో రెండోస్థానంలో ఉన్న దేశం మనది. పైగా, గ్రామాల్లో ఇంకా సంస్కృతీ-సంప్రదాయాల పేరుతో వెనకబడిన నేపథ్యాలే ఎక్కువ. ఇవన్నీ గుర్తొచ్చే ఓ సోషల్ స్టార్టప్ స్థాపించాలనుకున్నా. భారత్‌కి తిరిగొచ్చాక ఆ ప్రయత్నాల్లో పడ్డాను. ఆరాధన కూడా సామాజిక కార్యక్రమాలంటే చాలా ఉత్సాహంగా ఉండేది. క్షేత్రస్థాయి పర్యటనల్లోనే తనని కలిశా. ఇద్దరి అభిమతం ఒక్కటే. రుతుక్రమ సమయంలో పరిశుభ్రమైన పద్ధతులపై అవగాహన కల్పించడం.

ప్రాజెక్ట్ బాలా ఉద్దేశం...

కొన్ని గ్రామాలు, మురికివాడల్లో పరిస్థితులు మేము అనుకున్న దానికన్నా దారుణంగా ఉన్నాయి. అందుకే వెంటనే మా స్టార్టప్ మొదలుపెట్టాలని నిర్ణయించుకున్నాం. 2017లో అవగాహన కార్యక్రమాలతో మొదలైంది ప్రాజెక్ట్ బాలా. పాంప్లెట్లు పంచాం. ఓ పెద్ద సమావేశం ఏర్పాటుచేసి... మహిళలతో మాట్లాడాలన్నది మా ఆలోచన. పాంప్లెట్లు పంచినప్పుడు బాగానే స్పందించారు... తీరా సమావేశం సమయం వచ్చేసరికి ఐదుగురే వచ్చారు. మేమున్న చోటుకి వాళ్లని పిలిస్తే ఫలితాలు ఇలానే ఉంటాయని అర్థమైంది. ఆరోజు నుంచి వాళ్లున్న దగ్గరికి మేము వెళ్లడం మొదలుపెట్టాం. పంచాయతీ పెద్దల అంగీకారంతో అక్కడే సమావేశం ఏర్పాటుచేసుకునేవాళ్లం. శానిటరీ న్యాప్‌కిన్స్ మీద అవగాహన కల్పించేవాళ్లం.

ప్లాస్టిక్‌కి విరుద్ధంగా...

ప్లాస్టిక్ లేని ప్యాడ్స్‌ను తయారుచేసి పంపిణీ చేయడం మొదలుపెట్టాం. అన్నీ రీయూజబుల్. పర్యావరణ పరిరక్షణనీ మా అంకురంలో భాగం చేశాం. నిధుల కోసం బీ2బీ విక్రయాలూ ప్రారంభించాం. అలా ఇప్పటివరకూ ఐదు దేశాల్లో ఈ ప్రాజెక్టును రన్ చేస్తున్నాం. ఆదాయంలో దాదాపు 40శాతం స్వచ్ఛంద సేవకే కేటాయిస్తున్నాం. భారత్‌లో 27 రాష్ట్రాలకు ప్రాజెక్ట్ బాలాను చేరువ చేశాం. అలా ఇప్పటివరకూ 230 మిలియన్ల ప్లాస్టిక్ ప్యాడ్ల దుర్వినియోగాన్ని నియంత్రించగలిగాం. 150 మంది గ్రాస్‌రూట్ భాగస్వాముల్నీ పొందగలిగాం. 62 మంది వాలంటీర్ల టీమ్ ఈ ప్రాజెక్ట్ కోసం నిస్వార్థంగా పనిచేస్తోంది.

కొత్త ఆలోచనతో...

పునర్వినియోగ శానిటరీ న్యాప్‌కిన్లు కూడా రెండు సంవత్సరాల తర్వాత డంప్‌గా మారిపోతాయి. సమయాన్ని పెంచితే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. అందుకే రెండేళ్లుగా స్వీడన్ శాస్త్రవేత్తలతో కలిసి హైడ్రోఫోబిక్ ప్యాడ్స్‌పై ప్రయోగాలు చేయడం ప్రారంభించాం. ఇవి లీకేజ్ తక్కువగా ఉండి ఎక్కువ కాలం మన్నుతాయి. దాదాపు ఐదేళ్ల వరకూ వాడుకునే సౌలభ్యం ఉంటుంది. ఇది ఇంకా అప్రూవల్ దశలో ఉంది. తొందర్లోనే దీన్ని తీసుకువస్తాం. ప్రాజెక్ట్ బాలా ద్వారా మేము అందిస్తున్న సేవల్ని విదేశాల్లో విస్తృతం చేసే మరో అవకాశాన్నీ ఇటీవల అందుకున్నా. ఒబామా స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యా. అంకురాల్ని దేశవిదేశాల్లో మరింత ప్రాచుర్యం ఎలా కల్పించొచ్చు అనే అంశంపై శిక్షణ ఇచ్చే ప్రోగ్రామ్ ఇది.

మరకల్ని తుడిచేస్తుంది!



పిల్లల సృజనాత్మకత అంతా గోడలమీదే! పేపర్లు, పుస్తకాలు ఎన్నైనా ఇవ్వండి... తిరిగి గోడలమీదే వాళ్ల నైపుణ్యమంతా ప్రదర్శించేస్తుంటారు. మళ్లీ మళ్లీ ఏం రంగులేయిస్తాం చెప్పండి? అందుకే ఈ 'మ్యాజిక్ ఎరేజర్ క్లీనింగ్ స్పాంజ్'ని తెచ్చుకోండి. కాసేపు నీటిలో నానబెట్టి, నీటిని పిండేసి రుద్దేయడమే. రంగులన్నీ పోతాయి. ఇవేకాదు, షూ, గ్లాస్, గ్రీజు మరకలు... ఇలా వేటికైనా ఇది చక్కగా పనిచేస్తుంది. పూర్తిగా పాడయ్యేవరకూ ఎన్నిసార్లైనా వాడుకోవచ్చు. రసాయనాలు ఉండవు, దీంతో హానీ తప్పుతుంది. ఒకలాంటి ఫోమ్‌తో దీన్ని తయారు చేశారు. కాబట్టి, మైక్రో స్క్రబర్‌గా పనిచేస్తుంది. అలాగే గీతలు పడతాయి, వస్తువు పాడవుతుందన్న భయమూ ఉండదు. కావాలనిపిస్తే ప్రయత్నించి చూడండి మరి.

బంగారం - వెండి



28న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,67,510	1,53,550	4,00,000
విజయవాడ	1,63,540	1,51,400	3,72,000
ప్రొద్దుటూరు	1,71,800	1,57,320	3,73,000
రాజమహేంద్రవరం	1,67,080	1,53,150	4,00,000
విశాఖపట్నం	1,67,080	1,53,150	3,73,000
తమిళనాడు	-----	1,56,100	4,00,000

ఇలాగైతే ముసలోళ్లైపోతారు!

అద్దంలో చూసుకుని ఎప్పుడైనా 'ఏంటీ చర్మం ఇంత నిర్జీవంగా కనిపిస్తోంది?', 'అప్పుడే గీతలు, ముడతలు వచ్చేస్తున్నాయేంటి?' అనుకున్నారా? వయసు పెరిగేకొద్దీ చర్మంలో మార్పులు సహజమే. కానీ అవి త్వరగా పలకరిస్తున్నాయంటేనే... పొరపాట్లు చేస్తున్నామని అర్థం.



- 7-8 గంటలు నిద్ర పోతున్నారా? లేదు అంటే మాత్రం చర్మానికి హాని చేస్తున్నట్టే. నిద్ర తగ్గితే కొల్లాజెన్ ఉత్పత్తి సరిగా జరగదు. ఫలితమే పొడిబారడం, వృద్ధాప్య ఛాయలు వగైరా.
- ఒత్తిడి ఉందా... అదీ చర్మానికి శత్రువే. దీని కారణంగా శరీరంలో కార్టిసాల్ స్థాయులు పెరుగుతాయి. ఫలితంగానే అనేక చర్మ సమస్యలు.
- వేళకి తినకపోవడం, ఏదో ఒకటిలే అనుకుని పొట్టలో వేసుకోవడం వీటితోనూ చర్మానికి తిప్పలే. ప్రాసెస్డ్ ఆహారాలు, చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వులు ఇవన్నీ ఇన్‌ఫ్లమేషన్ కారకాలే. కాబట్టి, స్కిన్ ఆరోగ్యంగా కనిపించాలంటే పోషకాలు అందించడం తప్పనిసరి.
- ఏం తోచకపోయినా, బోర్ కొట్టినా మనకు కనిపించేది ఫోనే! రీల్స్, సిరీస్ అని మొదలుపెడితే గంటలపాటు కళ్లముందే. కానీ దీన్నుంచి వచ్చే నీలికాంతీ మన చర్మానికి చేటు చేసేదే. ఇవన్నీ చాలనట్టు... అడుగు బయటపెట్టామంటే చాలు విపరీతమైన కాలుష్యం.

చూశారా ఎన్ని చేటు చేసే అంశాలో! కాబట్టి, కేవలం క్రీములు రాసి ఫలితం కోసం చూడకండి. వీటిపైనా దృష్టిపెట్టండి. మంచి నిద్రకి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు పోషకాలతో కూడిన ఆహారాన్ని రోజువారీలో భాగం చేసుకోండి. పరిధి విధించుకుని మరీ ఫోన్‌ని దూరంగా పెట్టండి. ముఖ్యంగా యోగా, శ్వాస వ్యాయామాలు వంటివి చేస్తూ ఒత్తిడిని దూరం చేసుకోండి. ఎంచుకునే క్రీములపైనా దృష్టిపెట్టండి. యాంటీ ఆక్సిడెంట్లతో కూడిన క్రీములు, సన్‌స్క్రీన్ స్కిన్ కేర్ రొటీన్‌లో తప్పనిసరి చేసుకోండి. అప్పుడే త్వరగా వృద్ధాప్యం చేరదు. గమనించుకుంటారుగా మరి?



ప్రకృతి వరం... కనకాంబరం



సుతిమెత్తని రేకులతో తేలిక పాటి బరువుతో ఆకర్షణీయమైన రంగులతో విచ్చుకునే కనకాంబరాల్ని చూసి ముచ్చటపడేవాళ్లెందరో. కొందరికైతే వాటిని చూస్తేనే పాతరోజులెన్నో గుర్తుకొస్తాయి. అందుకే భావోద్వేగాలతో ముడిపడిన ఈ మొక్కను ఎంతోమంది కుండీల్లోనూ ఇష్టంగా పెంచుతున్నారు.

ఒకప్పుడు కనకాంబరాల మాల జడలో తురుముకుంటేనే కానీ అమ్మాయిల అలంకరణ పూర్తయ్యేది కాదు. మల్లెలు, విరజాజుల మధ్యా చేరి మురిపించేవి. ముఖ్యంగా ఎరుపు కలిసిన నారింజ రంగు పూలకు ఉండే ప్రత్యేకతే వేరు. అందుకే వాణిజ్యపరంగానూ వీటిని విస్తృతంగా సాగుచేస్తున్నారు. అకాంతేసి కుటుంబానికి చెందిన కనకాంబరాన్ని ప్రియదర్శ, అబోలి, ఫైర్ క్రాకర్... ఇలా చాలా పేర్లతో పిలుస్తారు. ఇవి ఏడాదంతా నిండుగా విరబూస్తాయి. చెట్టుకే ఉంచితే కనీసం ఎన్ని రోజులైనా వాడిపోకుండా ఉంటాయి.

సంరక్షణ ఇలా...

కనకాంబరం మొక్కలను నేలలో నాటాలనుకున్నా... కుండీల్లో పెంచుకోవాలన్నా ఆ మట్టి సారవంతంగా ఉండాలి. లేదంటే మట్టిలో వర్మీకంపోస్ట్, కోకోపీట్ కలుపుకోవాలి. కుండీల్లో పెంచితే... రెండుమూడేళ్లకోసారి రీ-పాటింగ్ చేయడం తప్పనిసరి. ఇక, కనకాంబరం మొక్కకు పరోక్ష సూర్యకాంతి అవసరం. ఉదయం లేదా సాయంత్రం 3-4 గంటల ఎండ తగిలేలా చూసుకోవాలి. ఎండ ఎక్కువైతే ఆకులు మాడిపోతాయి. పూలు త్వరగా వడలిపోతాయి. ఆ పరిస్థితి ఎదురైతే ఈ మొక్కను ఇండోర్‌లో గానీ, బాల్కనీలోగానీ షేడ్ నెట్ లేదా ఇతర మొక్కల కింద పెట్టాలి. వారానికి 2-3 సార్లు నీటిని అందిస్తే చాలు. మొక్క చుట్టూ ఉండే మట్టి పై పొర పొడిబారితేనే నీళ్లు పోయండి. వేసవిలో మాత్రం గాల్లోని తేమను పెంచడానికి... మొక్క చుట్టూ నీళ్లను స్ప్రే చేస్తూ ఉండటం అవసరం.

ప్రూనింగ్ చేస్తేనే...

పూల మొక్కలకు బ్యాలెన్స్‌డ్ లిక్విడ్ ఫెర్టిలైజర్ ఎన్‌పీకే 10:10:10 నిష్పత్తిలో ఇవ్వాలి. లేదంటే పొటాషియం అధిక మోతాదులో ఉండే ఎరువుని నెలకోసారి ఇస్తే పూలు ఎక్కువగా పూస్తాయి. ఎప్పటికప్పుడు ఎండిన కొమ్మలు, పూలను తొలగించాలి. అప్పుడే కొత్త ఆకులూ, పూలూ వస్తాయి. సాధారణంగా కనకాంబరం మొక్కకు వేరు కుళ్లు తెగులు బాగా ఇబ్బంది పెడుతుంది. ఈ సమస్య వస్తే బేకింగ్ సోడా చల్లండి. నీళ్లు పెట్టడం తగ్గించండి. దీంతోపాటు స్పైడర్ మైట్స్ కూడా ఇబ్బంది పెడతాయి. ఇలాంటప్పుడు వేప నూనె స్ప్రే చేయండి. కనకాంబరాలను విత్తనాల ద్వారానే కాదు, కొమ్మ కత్తిరింపులతోనూ పెంచుకోవచ్చు.


సారలమ్మ ఆగమనం

ఈనాడు, మేడారం: తెలంగాణ కుంభమేళా బుధవారం జనసంద్రమైంది. మేడారం వనజాతరలో తొలిరోజు సారలమ్మను గద్దెల ప్రాంగణానికి కోలాహలంగా ఆహ్వానించారు. ఈ మహాక్రతువును కనులారా తిలకించేందుకు లక్షల మంది భక్తులు పిల్లాపాపలతో కలిసి ఎడ్లబండ్లు, బస్సులు, వాహనాల్లో తరలివచ్చారు. మొదట... మేడారానికి మూడున్నర కిలోమీటర్ల దూరంలో కన్నెపల్లిలో ఉన్న ఆలయంలో ఉదయం ప్రధాన పూజారి కాక సారయ్య ఆధ్వర్యంలో సారలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ఆడపడుచులు ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు వేశారు. తెలంగాణ మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అధికార యంత్రాంగంతో కన్నెపల్లి చేరుకొన్నారు. రాత్రి 7:40 గంటలకు కన్నెపల్లి ఆలయం నుంచి సారలమ్మను బయటకు తీసుకొచ్చే సమయంలో శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. ఆదివాసీలు నృత్యాలు చేస్తూ, కొమ్ముబూర ఊదుతుండగా మంత్రులు, అధికారులు సైతం తన్మయత్వంతో పరవశిస్తూ అమ్మవారికి ఆహ్వానం పలికారు. ఆలయం బయట భక్తులు వరం పడుతూ, పొర్లుదండాలు పెడుతుండగా... పూజారులు వెదురుబుట్టలో సారలమ్మను తీసుకొని వారి పైనుంచి నడుచుకుంటూ వచ్చారు. అత్యంత భావోద్వేగంతో సాగిన ఈ ఘట్టాన్ని చూసి పులకరించిన భక్తులు వనదేవతకు జేజేలు పలికారు. అక్కడి నుంచి మూడంచెల పోలీసుల భద్రత మధ్య పూజారులు మేడారానికి బయలుదేరారు. మార్గంమధ్యలో జంపన్నవాగును దాటుకుంటూ... మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పగిడిద్దరాజు, గోవిందరాజులతో వారి పూజారులు సిద్ధంగా ఉన్నారు. సారలమ్మ రాగానే ముగ్గురు దేవతల పూజారులు ప్రత్యేక పూజలు చేశాక గద్దెల వద్దకు తరలారు. ప్రాంగణం వద్ద ఎదుర్కోలు నిర్వహించి, ముగ్గురినీ అర్ధరాత్రి దాటాక గద్దెలపై కొలువు దీర్చారు. వనదేవతల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని కనులారా తిలకించేందుకు భక్తులు పోటీపడ్డారు.

వేల వాహనాలు... లక్షల్లో భక్తులు

జాతర మొదటి రోజునే భక్తులు భారీగా తరలివచ్చారు. 50 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణానికి వందలాది బస్సులు వచ్చాయి. ప్రైవేటు వాహనాల కోసం ఏర్పాటుచేసిన 1,462 ఎకరాల పార్కింగ్ స్థలాలు పూర్తిగా నిండిపోయాయి. జంపన్న వాగు వద్ద భక్తులు భారీ సంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయం వద్ద క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి.


■ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో 13 వేల మంది పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతను కల్పించింది. మరోవైపు 42 సెక్టార్లలో 21 శాఖలకు చెందిన 40 వేల మంది సిబ్బంది జాతర విధుల్లో భాగస్వాములయ్యారు.



పొరుగు రాష్ట్రాలతో పోర్టుల అనుసంధానం

- ఉద్యాన ఉత్పత్తుల రవాణాకు కనెక్టివిటీ కల్పించాలి
- ఇచ్ఛాపురం-తడ మధ్య 4 రైల్వే లైన్లు అవసరం
- పుష్కరాలకు రాజమహేంద్రవరం, విజయవాడ స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి

రైల్వే ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం చంద్రబాబు



ఈనాడు-అమరావతి: తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి ఏపీలోని పోర్టులకు రైల్ రవాణా సదుపాయం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతి 50 కి.మీ.కు ఓ పోర్టు, ఫిషింగ్ హార్బర్లు వస్తున్నాయని.. వాటిని ప్రధాన రైల్వే లైన్లతో అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపై సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలోని లాజిస్టిక్స్ వ్యవస్థను ప్రపంచస్థాయికి చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రైల్వే ప్రాజెక్టుల విషయంలో ఏపీని బెంచ్‌మార్క్‌గా నిలిపేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న 225 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యానవన ఉత్పత్తులను దేశంలోని వివిధ మార్కెట్లకు రవాణా చేసేలా రైల్వే కనెక్టివిటీ పెరగాలని పేర్కొన్నారు. తిరుపతి-రేణిగుంట ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా తయారవుతోందని, ఈ మార్గాన్ని ప్రధాన రైల్వే మార్గాలతో అనుసంధానిస్తే, పారిశ్రామిక ఉత్పత్తులు తక్కువ ఖర్చుతో వేగంగా రవాణా చేసేందుకు అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు.

ఇచ్ఛాపురం-తడ మధ్య..

కోల్‌కతా-చెన్నై ప్రధాన రైల్వే లైన్ మార్గంలో ఏపీ పరిధిలోని ఇచ్ఛాపురం నుంచి తడ వరకు 4 రైల్వే లైన్లు ఉండేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మూడేళ్లలో ఇది కార్యరూపం దాల్చేలా డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అవసరమైన భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, పర్యవేక్షణల కోసం పార్లమెంటరీ నియోజకవర్గాలవారీగా డిప్యూటీ కలెక్టర్లను నియమించాలని సీఎం ఆదేశించారు.

ప్రధాన నగరాల నుంచి అమరావతిని కలిపేలా..

విజయవాడ, విశాఖపట్నం, గుంతకల్లు, గుంటూరు, రేణిగుంట వంటి రైల్వే జంక్షన్లలో రద్దీ తగ్గించే మార్గాలను చూడాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాయలసీమ నుంచి కోస్తాంధ్రకు కనెక్టివిటీ పెంచాలని ఆదేశించారు. ఎర్రుపాలెం నుంచి రాజధాని అమరావతి మీదుగా నంబూరు వరకు నిర్మిస్తున్న కొత్త రైల్వేలైన్ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై సహా అన్ని ప్రధాన నగరాలను అమరావతి కోర్ క్యాపిటల్‌తో కలిపేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. విజయవాడ, గుంటూరులో ఇప్పుడున్న టెర్మినళ్లను విస్తరించాలని, అమరావతి, గన్నవరంలలో కొత్త టెర్మినళ్ల నిర్మాణ ప్రతిపాదనలను త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

పుష్కరాల కోసం సన్నద్ధం

గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా రైల్వేశాఖ ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని సీఎం ఆదేశించారు. పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ను పూర్తిగా ఆధునికీకరించాలని సూచించారు. పుష్కరాల కోసం 1,012 ప్రత్యేక రైల్ సర్వీసులు నడపనున్నామని, 2,370 కోచ్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే అధికారులు సీఎంకు వివరించారు. విజయవాడ రైల్వే స్టేషన్‌ను పీపీపీ విధానంలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ఈ పనులు పూర్తిచేయాలని సూచించారు. అమృత్ పథకం కింద రాష్ట్రంలో చేపట్టిన 73 స్టేషన్ల అభివృద్ధి పనులు 2027 నాటికి పూర్తికావాలని సీఎం ఆదేశించారు. నడికుడి-శ్రీకాళహస్తి లైన్ 2029 మార్చి నాటికి పూర్తిచేయాలన్నారు. 808 రైల్వే క్రాసింగ్స్ వద్ద ఆర్వోబీలు, ఆర్‌యూబీలు నిర్మించాలని సీఎం ఆదేశించారు.

బెంగళూరు-అమరావతి హైస్పీడ్ రైల్ ప్రాజెక్ట్

హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. బెంగళూరు నుంచి చిత్తూరు, తిరుపతి మీదుగా అమరావతికి హైస్పీడ్ రైల్ కారిడార్ వచ్చేలా చూడాలని తెలిపారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల నుంచి వివిధ ప్రాంతాలకు రైలు కనెక్టివిటీ పెంచడంపై దృష్టిపెట్టాలని సీఎం సూచించారు. రైల్వే రూట్ డెన్సిటీ పరంగా రాష్ట్రంలో ప్రతి వెయ్యి చదరపు కి.మీ.కు 24.82 కి.మీ. రైల్వే లైన్లు మాత్రమే ఉన్నాయని, తమిళనాడుతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

రాష్ట్రంలో రూ.34,310 కోట్ల ప్రాజెక్టుల పనులు

రాష్ట్రంలో రూ.34,310 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులను చేపట్టామని అధికారులు వివరించారు. 2,318 కి.మీ. మేర పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. హైస్పీడ్ కారిడార్ల కోసం సర్వే చేపట్టామని.. 864 కి.మీ. పొడవున చేపట్టే కారిడార్ కోసం రూ.1.90 లక్షల కోట్ల మేర వ్యయమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే, దక్షిణ కోస్తా రైల్వే డివిజన్ల జీఎంలు, రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సచివాలయంలో వినతులు స్వీకరించిన లోకేశ్


సచివాలయంలో తనను కలిసిన ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రజల్ని కలుసుకున్నారు. వివిధ సమస్యలతో తరలి వచ్చిన వారి నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఇబ్బందులు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అందరితో ఫొటోలు దిగారు.

అమరావతికి సంతోషంగా భూములు ఇస్తున్నాం

సీఆర్డీఏకి 21.71 ఎకరాలు ఇచ్చిన రైతు


రైతును సత్కరిస్తున్న ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి

అమరావతి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి మహానగర విస్తరణకు సంతోషంగా భూములు ఇస్తున్నామని పల్నాడు జిల్లా అమరావతి మండలం పెదమద్దూరుకు చెందిన రైతు వెంకట్రావు అన్నారు. రాజధాని రెండో దశ భూ సమీకరణలో భాగంగా బుధవారం ఆయన 21.71 ఎకరాలను సీఆర్డీఏకి అప్పగించారు. ఈ సందర్భంగా రైతును ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలోనే రాజధాని నిర్మాణం సాధ్యమనే నమ్మకంతో భూములు ఇచ్చానని వెంకట్రావు చెప్పారు. అదే గ్రామానికి చెందిన మరో రైతు ఉదయలక్ష్మి 9.5 ఎకరాలు సీఆర్డీఏకి అప్పగించారు.

పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా అభివృద్ధి చేయండి

రైల్వేమంత్రికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వినతి


రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చిస్తున్న పవన్ కల్యాణ్

ఈనాడు, దిల్లీ: పిఠాపురం రైల్వేస్టేషన్‌ను మోడల్ స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజ్ఞప్తిచేశారు. బుధవారం ఇక్కడి రైల్‌భవన్‌లో ఆయన కేంద్రమంత్రిని కలిసి పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన ఆర్‌ఓబీతో పాటు పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 'పిఠాపురం ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణం అయినందున అక్కడి రైల్వేస్టేషన్‌ను అమృత్ పథకం కింద చేర్చి మోడల్ రైల్వేస్టేషన్‌గా అభివృద్ధి చేయండి. అష్టాదశ శక్తిపీఠం, శ్రీపాద శ్రీవల్లభస్వామి కొలువైన క్షేత్రం పిఠాపురంలో ఉన్నందున సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించండి. సేతు బంధన్ పథకం కింద ఇప్పటికే మంజూరు చేసిన రోడ్డు ఓవర్ బ్రిడ్జిని పీఎం గతిశక్తి పథకం పరిధిలోకి తీసుకురావాలి. ఇది 2030 జాతీయ రైలు ప్రణాళికకు అనుగుణంగా లెవెల్ క్రాసింగ్‌లు తొలగించేందుకు, ట్రాఫిక్ నియంత్రణకు సహకరిస్తుంది' అని పవన్ కల్యాణ్ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటితోపాటు రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు రైల్వే ప్రాజెక్టుల గురించి రైల్వేమంత్రితో చర్చించారు.

రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారు: పవన్

తాను చేసిన విజ్ఞప్తులన్నింటికీ రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ సానుకూలంగా స్పందించినట్లు పవన్ కల్యాణ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమ మధ్య అన్ని అంశాలపై సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని చెప్పారు. తన ప్రతిపాదనలన్నింటిపైనా ఆయన సానుకూలంగా స్పందించి, అన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కాకినాడ జిల్లాతోపాటు ఏపీ వ్యాప్తంగా రైల్వే అభివృద్ధికి ప్రోత్సాహకరమైన మద్దతు పలికినందుకు అశ్వినీవైష్ణవ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

అరవ శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణల విచారణకు జనసేన కమిటీ

ఈనాడు, అమరావతి: రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై మీడియాలో వచ్చిన వార్తలు, ఓ మహిళ చేసిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు జనసేన పార్టీ ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించింది. ఆ కమిటీ ఇచ్చే నివేదికను పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే వరకూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని శ్రీధర్‌కు స్పష్టం చేసినట్టు జనసేన పేర్కొంది. కమిటీలో జనసేన నేతలు టి.శివశంకర్, తంబళ్లపల్లి రమాదేవి, టీసీ వరుణ్ ఉన్నారు. శ్రీధర్ వారం రోజుల్లోపు కమిటీ ఎదుట హాజరై వివరణ ఇవ్వాల్సి ఉంది.

లాభాపేక్ష లేకుండా ఆసుపత్రులు నిర్మిస్తే రాయితీలు

- నియోజకవర్గానికో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి
- ఏప్రిల్ 1 నుంచి యూనివర్సల్ హెల్త్ పాలసీ: సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఆసుపత్రుల ఏర్పాటుకు ముందుకొచ్చే ప్రముఖ ఆసుపత్రుల యాజమాన్యాలకు.. లాభాపేక్ష లేకుండా వైద్యశాలల నిర్వహణ చేపట్టే వారికి రాయితీలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం వైద్యారోగ్య శాఖపై సీఎం సమీక్షించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ అమల్లోకి రానున్న క్రమంలో వైద్యారోగ్య శాఖ చేపట్టే చర్యలపై సీఎం ఆరాతీశారు.

ప్రజారోగ్యమే ప్రధాన ఎజెండాగా సంజీవని: ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేలా క్షేత్రస్థాయిలో వివిధ ప్రణాళికలు చేపట్టాలని వైద్యాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. 'ప్రజారోగ్యం వివరాలు నమోదుచేసి, పర్యవేక్షించేలా చిత్తూరు జిల్లాలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టును త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి. ప్రజల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేసేలా ఈ ప్రాజెక్టు రూపొందిస్తున్నాం. ప్రజలకు వైద్యసేవలు అందించడంతో పాటు.. ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ఈ ప్రాజెక్టు తీర్చిదిద్దుతున్నాం. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి? పోషకాహారాల వల్ల ఉపయోగాలేంటనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. న్యూట్రిషన్ యాప్ కూడా అందుబాటులోకి తేవాలి. ప్రజారోగ్యమే ప్రధాన ఎజెండాగా సంజీవని ప్రాజెక్టు చేపట్టాం' అని సీఎం పేర్కొన్నారు.

ఎంపీహెచ్‌ఏలకు ఊరట..: మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల (మేల్) నియామకాల అంశాన్ని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు సీఎం వద్ద ప్రస్తావించారు. 730 మంది ఎంపీహెచ్‌ఏలు ఉన్నారని, సుప్రీంకోర్టు తీర్పు విషయాన్ని దృష్టికి తెచ్చారు. స్పందించిన సీఎం.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఎంపీహెచ్‌ఏలను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు.

నియోజకవర్గాల్లో టాస్క్‌ఫోర్స్: సిటిజన్ హెల్త్ స్క్రీనింగ్‌ను ప్రాధాన్యంగా తీసుకోవాలని, ఇందులోభాగంగా 72.73 లక్షల మందికి వైద్యపరీక్షలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. 'ప్రజల ఆరోగ్య సమాచారం ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉండాలి. ఎనీమియా, గుండెవ్యాధులు, మధుమేహం, కిడ్నీ సమస్యలు, కాలేయ వ్యాధులపై అధ్యయనం చేయాలి. హైరిస్క్‌లో ఉన్నవారిని ఎలర్ట్ చేసి మెరుగైన వైద్యం అందేలా చూడాలి. ప్రజారోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నియోజకవర్గాల్లో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి. ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య తగ్గించేలా ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించడమే లక్ష్యంగా సంజీవని ప్రాజెక్టు అమలుచేయాలి' అని స్పష్టంచేశారు.

అవేర్ 2.0 ద్వారా అప్రమత్తం: క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యం, వ్యాధుల తీవ్రత లాంటి అంశాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి సీఎం సూచించారు. 'మలేరియా, టైఫాయిడ్, డెంగీ, స్క్రబ్ టైఫస్ లాంటి వ్యాధులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ఈ సమాచారం ఎప్పటికప్పుడు అవేర్ 2.0 వ్యవస్థలో అప్‌డేట్ చేయాలి. ఆ సమాచారం ఆధారంగా క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేయాలి. కాన్పు అవ్వగానే జనన రిజిస్ట్రేషన్ జరిగేలా చూడాలి' అని ఆదేశించారు.

150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తా


మాజీ సీఎం జగన్



ఈనాడు, అమరావతి: చంద్రబాబు పాలనలో అరాచకాలపై ప్రజల పక్షాన వైకాపా పోరాడుతోందని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ చెప్పారు. ఏడాదిన్నర తర్వాత తన పాదయాత్ర మొదలవుతుందన్నారు. భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. 'పాదయాత్రలో 150 నియోజకవర్గాల్లో పర్యటిస్తా. యాత్రలో మూడురోజులకోసారి బహిరంగ సభ నిర్వహిస్తాం. ప్రజా సమస్యలు లేవనెత్తుతూ, చంద్రబాబు అసమర్థ పాలనను ప్రజలకు వివరిస్తాం. కార్యకర్తలు కూడా చంద్రబాబు పాలన, మన పాలన మధ్య తేడాను ప్రజలకు వివరించాలి. జగన్ 2.0లో కార్యకర్తలకే అత్యధిక ప్రాధాన్యం. వారి ద్వారానే పాలన ఉంటుంది' అని జగన్ చెప్పారు. 'చంద్రబాబు పాలనలో రాష్ట్రం ఆటవిక రాజ్యంలా మారింది. కూటమి నేతలు, వారి పార్టీల ప్రజాప్రతినిధులు మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినా చర్యలు తీసుకోవట్లేదు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అసలు మనిషేనా? ఒక ప్రభుత్వ ఉద్యోగినిని బెదిరించి, భయపెట్టి లైంగికంగా వేధిస్తే.. ఆ మహిళ సాక్ష్యాధారాలతో బయటపెట్టినా ఆయనపై ఏ చర్యా లేదు' అని జగన్ ఆరోపించారు.

బాలల పొట్టకొడుతున్న బాలముకుందం

- వార్డెన్ల నుంచి రూ.1.84 లక్షల మామూళ్ల వసూలు
- ఏసీబీ దాడుల్లో పట్టుబడిన ఏబీసీడబ్ల్యూవో


నగదుతో పట్టుబడిన ఏబీసీడబ్ల్యూవో బాలముకుందరావు

సోంపేట, కంచిలి, న్యూస్‌టుడే: ఆర్థికంగా వెనుకబడిన చిన్నారులు ఆసరా కోసం వసతి గృహాల పంచన చేరి చదువుకుంటున్నారు. వారికి మెస్ ఛార్జీల కింద ప్రభుత్వం నెలనెలా కొంతమొత్తం చెల్లిస్తుంటుంది. ప్రభుత్వం ఇచ్చేదే అరకొర అయితే, అందులోనూ 'గడ్డి' కరవడానికి అలవాటు పడిపోయారు కొంత మంది అధికారులు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా సోంపేట డివిజన్ సహాయక బీసీ సంక్షేమాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న 'గడ్డి బాలముకుందరావు' వసతి గృహాల వార్డెన్ల నుంచి మామూళ్ల కోసం బుధవారం కంచిలిలో ఏకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల నాలుగు నెలల మెస్ ఛార్జీలు వార్డెన్ల ఖాతాల్లో జమ కావడంతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.50 చొప్పున చెల్లించాలని ఆయన వార్డెన్లకు నిర్దేశించారు. ఈ సమావేశానికి హాజరైన కొందరు వార్డెన్లు తాము తీసుకొచ్చిన మొత్తాలను బాలముకుందరావు సూచన మేరకు అటెండర్ గుడ్ల రామకృష్ణకు అప్పగించారు. ఈ విషయం తెలిసిన ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడిచేసి.. రూ.1,84,070 స్వాధీనం చేసుకున్నారు. ఈ వసూళ్లపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నామని చెప్పారు.

రామాయపట్నం పోర్టు వద్ద ఇండస్ట్రియల్ హబ్



- సోలార్ ప్రాజెక్టుల కోసం పలు సంస్థలకు భూ కేటాయింపులు
- ఎమ్మిగనూరులో మెగా టెక్స్‌టైల్స్ పార్కుకు 77.37 ఎకరాలు
- మంత్రివర్గ సమావేశ వివరాల్ని వెల్లడించిన మంత్రి పార్థసారథి

ఈనాడు, అమరావతి: రామాయపట్నం పోర్టు సమీపంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకుగాను భూముల కేటాయింపునకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. విశాఖలో ప్రపంచస్థాయి ఆరోగ్య సంరక్షణ, విద్య, పరిశోధన కేంద్రం ఏర్పాటుకు, అల్లూరి జిల్లాలో ఎమ్యూజ్‌మెంట్ థీమ్ పార్కు అభివృద్ధికి, ప్రకాశం జిల్లాలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లు నిర్మాణానికి భూములు కేటాయించేందుకు నిర్ణయం తీసుకుంది. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలో మెగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటుకు 77.37 ఎకరాల్ని ఏపీఐఐసీ ఉచితంగా కేటాయింపునకు ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ప్లగ్ అండ్ ప్లే విధానంలో దీన్ని చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశం వివరాలను సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరించారు. అందులోని అంశాలు..

■ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు రామాయపట్నం పోర్టు చుట్టుపక్కల ఉన్న రావూరు, చేవూరు గ్రామాల్లో 1,831 ఎకరాల్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని పంచాయతీలు నిరాకరించడంతో ప్రభుత్వం వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంది. ఆ మేరకు ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకుగానూ గుడ్లూరు మండలం రావూరు గ్రామంలోని 659-9, 660-4 సర్వే నంబర్లలోని 8.06 ఎకరాల్ని, ఇదే గ్రామంలోని 39, 48-1 సర్వే నంబర్లలోని 70.61 ఎకరాలు కేటాయించనున్నారు. చేవూరు గ్రామంలోని 185, 198 సర్వే నంబర్లలోని 16.46 ఎకరాలు కేటాయించనున్నారు.

■ కృష్ణపట్నం పోర్ట్ కంటెయినర్ కాంప్లెక్స్, రైలు-రోడ్డు కనెక్టివిటీకి అటవీ భూములు వినియోగించుకున్నందుకు ప్రత్యామ్నాయంగా జిల్లాల్లోని పలు గ్రామాల్లో కొండ పోరంబోకు భూముల్ని అటవీశాఖకు కేటాయించేందుకు మంత్రిమండలి ఆమోదం. నెల్లూరు జిల్లా రాపూరు మండలం పంగిలిలో 216 ఎకరాలు, వరికుంటపాడులోని 230 ఎకరాలు, కొండాపురం మండలం ఎర్రబల్లి గ్రామంలోని 468.06 ఎకరాలు, సీతారామపురం మండలం దేవరాజు-సూరాయపల్లి గ్రామానికి చెందిన 27.91 ఎకరాలు, ఉదయగిరి మండలం గుడినరవ గ్రామంలోని 87.97 ఎకరాలను అటవీశాఖకు బదిలీకి అనుమతిచ్చింది.

సోలార్ పవర్ ప్రాజెక్టులు

ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 కింద వివిధ ప్రాంతాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన భూముల్ని లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. 36 నెలల నిర్మాణం కాలం, 25 ఏళ్ల నిర్వహణ కాలం కింద ఈ భూముల్ని కేటాయిస్తారు.

1. తాడిపత్రి మండలం తలారి చెరువు, ఆలూరులోని 2,648.08 ఎకరాల ప్రభుత్వ భూమిని సోలార్ పవర్ కార్పొరేషన్‌కు ఇచ్చేందుకు ఆమోదం. ఈ భూమిని మార్కెట్ విలువపై 10% చెల్లింపుపై కేటాయించనున్నారు.
2. గాలివీడు మండలం తూముకుంటలో 52.99 ఎకరాల కేటాయింపునకు ఆమోదం. 100 మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. రెండేళ్లకొకసారి 5% ఎస్కలేషన్‌తో 30 ఏళ్లకు లీజుకు ఇవ్వనున్నారు. ఇదే మండలం వెలిగల్లు గ్రామంలో 1187.58 ఎకరాల్ని కేటాయించనున్నారు. 500 మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ పార్క్ ఏర్పాటుకానుంది. లీజు మొత్తంపై 10% చెల్లింపుపై ఈ భూమిని కేటాయించనున్నారు.
3. నంద్యాల జిల్లా గడివేముల మండలం గని గ్రామంలో 542.27 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు. ఇక్కడ 1,000 మెగావాట్ల అల్ట్రా మెగా సోలార్ పార్క్ ఏర్పాటుకానుంది. లీజు మొత్తంపై 10% చెల్లింపుపై ఈ భూమిని కేటాయించనున్నారు.

విశాఖలో ప్రపంచస్థాయి ఆరోగ్య సంరక్షణ, విద్య, పరిశోధన కేంద్రం

ప్రపంచస్థాయి ఆరోగ్య సంరక్షణ, విద్య, పరిశోధన కేంద్రం ఏర్పాటుకుగానే విశాఖలోని ఎండాడకు చెందిన 9.04 ఎకరాల్ని హైదరాబాద్‌లోని ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హాస్పిటల్స్ (ఏఐజీ) సంస్థకు కేటాయించేందుకు మంత్రిమండలి ఆమోదం. ఈ కేటాయింపు ప్రభుత్వం నిర్ణయించిన షరతులకు లోబడి ఉండనుంది. ఏఐజీ 15 ఎకరాల్ని కోరగా.. ప్రస్తుతం వివాదాలు లేని 9.04 ఎకరాల్ని ఇచ్చేందుకు అనుమతిచ్చింది. ఆ సంస్థ స్థలాన్ని తక్కువ ధరకు ఇవ్వాలని కోరినా.. మార్కెట్ రేటు ప్రకారమే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రకాశం జిల్లాలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్లు

రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం పెద ఇర్లపాడు గ్రామంలోని 475.57 ఎకరాలు, ఇదే జిల్లా కొనకనమిట్ల మండలం వాగుమడుగు గ్రామంలోని 1,069.15 ఎకరాల్ని కేటాయించేందుకు ఆమోదం. ఈ భూమిని ఎకరాకు ఏడాదికి రూ.15,000 చొప్పున లీజు ప్రాతిపదికన కేటాయించనున్నారు. రెండేళ్లకొకసారి 5% ఎస్కలేషన్‌తో గరిష్ఠంగా 30 ఏళ్లపాటు లీజు కాలం ఉండనుంది.

■ ఎమ్యూజ్‌మెంట్ థీమ్ పార్కుతో కూడిన ఫైవ్ స్టార్ రిసార్ట్ కమ్ కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధికి అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం నందకోట గ్రామంలోని 12.59 ఎకరాల్ని రాష్ట్ర టూరిజం అథారిటీకి కేటాయింపునకు ఆమోదం.

రాజకీయ పార్టీలకు ప్రతి నియోజకవర్గంలో భూమి

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో జాతీయ పార్టీలు లేదా గుర్తింపు పొందిన రాష్ట్ర రాజకీయ పార్టీలకు సొంత భూమి లేదా భవనం లేని పక్షంలో ప్రభుత్వ భూమిని గరిష్ఠంగా 0.50 ఎకరాల్ని లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు అనుమతి. ఇప్పటివరకు 0.30 ఎకరాలకు మాత్రమే అనుమతి ఉంది. ఈ మేరకు జీవో 575 సవరణకు మంత్రిమండలి ఆమోదం. ఈ కేటాయింపు షరతులకు లోబడి ఉంటుంది. లీజు 0.50 ఎకరాలకు ఏడాదికి రూ.1000గా నిర్ణయించారు.

నిద్రలేమితో ఎన్నో అనర్థాలు



కొన్ని రోజుల పాటు 1-2 గంటలు తక్కువగా నిద్రపోతే తలెత్తే సమస్యలు:

- శరీరం ఇన్సులిన్‌కు స్పందించే గుణం తగ్గిపోతుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయులు పెరుగుతాయి.
- ఆకలి హార్మోన్ల పనితీరు అస్తవ్యస్తంగా మారడంతో కడుపు నిండినా తినాలనిపిస్తుంటుంది.
- కార్టిసాల్ అధిక మోతాదులో ఉత్పత్తి కావడంతో బరువు పెరిగే ప్రమాదముంది.

– శాయాజీరావ్ గైక్వాడ్, హెల్త్ ప్రొఫెషనల్

దర్యాప్తు పారదర్శకంగా నిర్వహిస్తాం



ప్రమాదంపై దర్యాప్తు చేయడానికి పౌర విమానయాన డైరెక్టరేట్ (డీజీసీఏ), ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) బృందాలు రంగంలోకి దిగాయి. విమానం ల్యాండ్ కావడానికి ప్రయత్నిస్తున్న సమయంలో దృశ్య గోచరత (విజిబులిటీ) తక్కువగా ఉందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. రన్‌వే కనిపించిందా అని పైలట్‌ను ఏటీసీ అడిగినప్పుడు, మొదట సరిగ్గా కనిపించడం లేదని చెప్పారు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించినప్పుడు, రన్‌వే కనిపించిందా అని ఏటీసీ మళ్లీ అడిగింది. అప్పుడు పైలట్ సానుకూలంగా స్పందించారు. దర్యాప్తు పారదర్శకంగా నిర్వహిస్తాం.

– రామ్మోహన్ నాయుడు, పౌర విమానయాన శాఖ మంత్రి

ఎందుకు కూలిందో.. విచారణ జరపాలి



అత్యవసర పనులపై చాలా మంది నేతలు తిరుగుతూ ఉంటారు. అహ్మదాబాద్‌లో ఎంత పెద్ద విమానం కూలిందో చూశాం. ఇది చాలా చిన్న విమానం. ఇది ఎందుకు కూలిందో తెలియాలి. ఈ ప్రమాదం అసహజంగా కనిపిస్తోంది. దీనిపై దర్యాప్తు జరగాలి.


–మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

సుప్రీంకోర్టు నేతృత్వంలో దర్యాప్తు జరగాలి



భాజపాను అజిత్ పవార్ వీడనున్నారని వేరే పార్టీ వ్యక్తి నాకు చెప్పారు. ఇప్పుడేం జరిగిందో చూడండి. ఎవరూ ఇక్కడ సురక్షితం కాదు. దీనిపై సుప్రీంకోర్టు నేతృత్వంలో సమగ్ర దర్యాప్తు జరగాలి. మిగతా దర్యాప్తు సంస్థలపై మాకు విశ్వాసం లేదు.

–మమతా బెనర్జీ, పశ్చిమబెంగాల్ సీఎం



గతంలోనూ చాలా మంది ప్రముఖులు ఇలానే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలి.

–అఖిలేశ్ యాదవ్, ఎస్పీ అధినేత

అజిత్ పవార్ మరణంపై సుప్రీంకోర్టు నేతృత్వంలోని కమిటీతో దర్యాప్తు జరిపించాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ చేసిన డిమాండ్‌పై భాజపా మండిపడింది. ఆమెలో మానవత్వం నశించిందని పేర్కొంది. "ఇది రాజకీయాలు చేయాల్సిన సమయం కాదు. పవార్ కుటుంబానికి అండగా నిలవాల్సిన సమయం" అని భాజపా నేత విష్ణువర్ధన్ పేర్కొన్నారు.



బారామతిలో బుధవారం అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్‌ను పరామర్శిస్తున్న మహారాష్ట్ర గవర్నర్ ఆచార్య దేవ్ వ్రత్, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే

మరాఠ్వాడా గడ్డపై

రాజకీయ మాంత్రికుడు

- ఎత్తుకు పైఎత్తుల్లో వ్యూహ చతురుడు అజిత్ పవార్



సంక్లిష్టమైన మరాఠ్వాడా రాజకీయాల్లో విలక్షణమైన రాజకీయ నేత అజిత్ పవార్. బాబాయి శరద్‌పవార్ వద్ద రాజకీయ ఓనమాలు నేర్చి... అధికార నిచ్చెన మెట్లను వడివడిగా అధిరోహించే క్రమంలో ఆయననే ధిక్కరించి తిరుగుబాటు జెండా ఎగురవేశారు. లక్ష్యసాధనలో రాజకీయ విధేయతలను మార్చడానికి ఏమాత్రం తటపటాయించని వ్యక్తి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని అధిరోహించడమే తన లక్ష్యమని నిర్మొహమాటంగా వెల్లడించిన ఆయన...ఆరుసార్లు ఉపముఖ్యమంత్రి పదవిని చేపట్టి రికార్డు సృష్టించారు. అయితే, చిరకాల స్వప్నం సాకారం కాకముందే విమాన ప్రమాదం ఆయన జీవితాశయాన్ని సమాధి చేసింది.

1959, జులై 22న ఆశా, అనంత్‌రావ్ పవార్ దంపతులకు అజిత్ పవార్ జన్మించారు. మరాఠ్వాడా రాజకీయ దిగ్గజం శరద్‌పవార్ ఆయనకు స్వయానా చిన్నాన్న. బాబాయి అడుగుజాడల్లో నడుస్తూ అజిత్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1982లో ఒక చక్కెర కర్మాగారం పరిపాలనా బోర్డు సభ్యునిగా ఎన్నికయ్యారు. 1991లో బారామతి నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికైనప్పటికీ తదనంతరం ఆ స్థానాన్ని తన బాబాయి కోసం త్యజించారు. నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) వ్యవస్థాపకుడైన శరద్ పవార్‌కు సరైన రాజకీయ వారసుడు అజితే అని భావించేంతగా పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలతో గట్టి అనుబంధాన్ని ఏర్పరచుకున్నారు. కాలక్రమంలో సొంత బలం కలిగిన నేతగా, వ్యూహకర్తగా ఎదిగారు. నిర్విరామంగా శ్రమించే వ్యక్తిగా గుర్తింపుపొందారు. ఎన్ని వివాదాలు చుట్టుముట్టినా ప్రతి సంక్షోభం నుంచి విజేతగా బయటికి వచ్చారు. రూ.70 వేల కోట్ల నీటిపారుదల కుంభకోణం కానీ, తన కుమారుడు పార్థ్‌తో సంబంధం ఉన్న పుణె భూ వివాదం కానీ అజిత్‌ను ఏమీ చేయలేకపోయాయి. కాంగ్రెస్, శివసేన, భాజపా ప్రభుత్వాల్లో ఆయన ఉపముఖ్యమంత్రిగా పనిచేయడం విశేషం.

బారామతిపై కినుక వహించి..

పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతిలో కొన్నేళ్లుగా అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్న విషయం తెలిసిందే. గత లోక్‌సభ ఎన్నికల్లో అజిత్ పవార్ తన సతీమణి సునేత్రను అభ్యర్థిగా నిలబెట్టగా.. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే పోటీకి దిగి విజయం సాధించారు. దీంతో బారామతి ప్రజలపై అలక వహించిన అజిత్.. ఇంకోసారి అక్కడి నుంచి పోటీ చేయనని ప్రకటించారు. ఆ తర్వాత మనసు మార్చుకుని 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు.

బాబాయిపై తిరుగుబాటు

అజిత్ పవార్ 2023 జులైలో తన చిన్నాన్న, ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్‌పై తిరుగుబాటు చేశారు. ఎన్సీపీ ఎమ్మెల్యేలను చీల్చుకొని పోయి భాజపా కూటమితో చేతులు కలిపారు. తదనంతర పరిణామాల్లో పార్టీ పేరు, ఎన్నికల చిహ్నం కూడా అజిత్ వశమయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన పార్టీకి ఒక్క సీటు మాత్రమే లభించింది. ఐదు నెలల తర్వాత జరిగిన శాసనసభ ఎన్నికల్లో తిరిగి పుంజుకొని 41 స్థానాలను కైవసం చేసుకున్నారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి 10 స్థానాలు మాత్రమే దక్కాయి. బాబాయిపై రాజకీయంగా పైచేయి సాధించారు. అంతకుముందు...2019 నవంబరులో జరిగిన రాజకీయ పరిణామాల్లో దేవేంద్ర ఫడణవీస్ మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా అజిత్ పవార్ బాధ్యతలు చేపట్టిన ఘట్టం ఓ రాజకీయ సంచలనం. నాటి ఫడణవీస్ సర్కారు రెండు రోజులు మాత్రమే మనుగడ సాగించగలిగింది. ఆనాడు బాబాయి శరద్ పవార్ వ్యూహం ఫలించడంతో అజిత్ వెనక్కి తగ్గారు.

పవార్‌కు పర్యాయ పదం.. బారామతి

మహారాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకమైన పవార్ కుటుంబానికీ బారామతికి విడదీయరాని అనుబంధం ఉంది. 1967 నుంచి శరద్ పవార్‌కు కంచుకోటగా ఉన్న ఈ అసెంబ్లీ నియోజకవర్గం 1991 నుంచి అజిత్ పవార్‌కు ఆశ్రయమిస్తోంది. అహల్యానగర్ జిల్లాలోని దేవ్‌లాలీ ప్రవర పట్టణంలో అజిత్ పవార్ జన్మించినప్పటికీ.. ఆయనకు రాజకీయ జన్మనిచ్చింది మాత్రం బారామతినే. అజిత్ పవార్ 8 పర్యాయాలు ఇక్కడి నుంచే శాసనసభకు ఎన్నికయ్యారు. రాజకీయాలకు అతీతంగా పాల సంఘాలు, చక్కెర ఫ్యాక్టరీలు, సహకార బ్యాంకులు తదితర సహకార సంస్థల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. సన్నిహితులు ఆప్యాయంగా "దాదా"(అన్నా) అని పిలుచుకునే అజిత్ పవార్ మనసులోని మాటను సూటిగా బయటికి చెప్పేవారు.

- నేషనల్ డెస్క్


చురుకైన యువ పైలట్.. శాంభవి పాఠక్

ప్రాణాలు హరించిన బారామతి విమాన ప్రమాదం

ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్రలోని బారామతిలో బుధవారం జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు అనుభవజ్ఞులైన పైలట్లలో ఇరవై ఆరేళ్ల కెప్టెన్ శాంభవి పాఠక్ ఒకరు. వయసు తక్కువైనప్పటికీ 1,500 గంటలకు పైగా విమానాలను నడిపిన అనుభవం ఆమె సొంతం. ఆర్మీ అధికారి కుమార్తె అయిన కెప్టెన్ శాంభవి పాఠక్.. దిల్లీలోని ఎయిర్‌ఫోర్స్ బాలభారతి స్కూల్‌లో చదువుకున్నారు. 2016-18 మధ్య సెకండరీ విద్యను పూర్తిచేసుకున్న ఆమె.. ముంబయి యూనివర్సిటీ నుంచి ఏరోనాటిక్స్, ఏవియేషన్, ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్ అకాడమీలో కమర్షియల్ పైలట్ శిక్షణ తీసుకుని లైసెన్స్ పొందారు. ఆ తర్వాత భారత్‌కు వచ్చి డీజీసీఏ నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తో పాటు ఫ్రోజెన్ ఎయిర్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్స్ కూడా పొందారు.



శాంభవి పాఠక్



సుమిత్

కొత్త పైలట్లకు శిక్షణ ఇచ్చేలా అసిస్టెంట్ ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గానూ పనిచేశారు. 2022 ఆగస్టు నుంచి వీఎస్‌ఆర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫుల్ టైమ్ ఫస్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీఐపీలు, బిజినెస్ ప్రముఖులు ప్రయాణించే విమానాలను నడుపుతున్నారు. బుధవారం అజిత్ పవార్ ప్రయాణించిన లియర్‌జెట్-45 విమానంలో పైలట్ ఇన్ కమాండ్‌గా కెప్టెన్ సుమిత్ కపూర్ వ్యవహరించగా.. శాంభవి ఫస్ట్ ఆఫీసర్‌గా పనిచేశారు. ఈ ప్రమాదంలో సుమిత్ కూడా ప్రాణాలు కోల్పోయారు. కెప్టెన్ సుమిత్‌కు 16,000 గంటలకు పైగా విమానం నడిపిన అనుభవం ఉంది.

'మళ్లీ ఫోన్ చేస్తా నాన్నా..'

- కుమార్తె పింకీ మాలీ చివరి మాటలు ఇవే..
- గుర్తు చేసుకుని విలపిస్తున్న విమాన అటెండెంట్ తండ్రి

ఇంటర్నెట్ డెస్క్: బారామతి విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో పాటు మృతి చెందిన నలుగురిలో విమాన అటెండెంట్ పింకీ మాలీ కూడా ఉన్నారు. ప్రమాదానికి కొన్ని గంటల ముందు ఆమె తన తండ్రి శివకుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కుమార్తె మరణవార్త వినగానే పింకీ చివరి మాటలు గుర్తుచేసుకుంటూ ఆ తండ్రి కన్నీరుమున్నీరుగా విలపించారు. 'మళ్లీ ఫోన్ చేస్తా నాన్నా..' అని తన కుమార్తె చెప్పిందని, ఇక ఆ క్షణం ఎప్పటికీ రాదంటూ భావోద్వేగానికి గురయ్యారు. "నాన్నా.. బుధవారం డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌తో కలిసి బారామతి వెళ్తున్నా. ఆయనను డ్రాప్ చేసిన తర్వాత నాందేడ్ వెళ్లాలి. హోటల్‌కు చేరుకోగానే నీకు ఫోన్ చేస్తా" అని పింకీ తనతో ఫోన్‌లో అన్నట్లు ఆమె తండ్రి శివకుమార్ మాలీ గుర్తుచేసుకున్నారు. 'రేపు డ్యూటీ అవగానే మాట్లాడుకుందామ'ని కుమార్తెతో అన్నట్లు తెలిపారు.



శివకుమార్

"గత ఐదేళ్లుగా పింకీ విమాన అటెండెంట్‌గా పనిచేస్తోంది. తొలుత ఎయిరిండియాలో పనిచేసిన ఆమె..ఆ తర్వాత ప్రైవేట్ విమానయాన సంస్థలో చేరింది. ఇప్పుడు అనుకోని విధంగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన ఎలా జరిగిందో నాకు తెలియదు. నాకు అంత సాంకేతిక పరిజ్ఞానం లేదు. నేను కోరుకునేది ఒక్కటే. నా కుమార్తె మృతదేహాన్ని అప్పగిస్తే.. ఆమెకు గౌరవంగా అంతిమ సంస్కారాలు నిర్వహిస్తా" అంటూ శివకుమార్ విలపించారు. వీరి కుటుంబం సెంట్రల్ ముంబయిలోని ప్రభాదేవి ప్రాంతంలో నివసిస్తోంది.

పెనువిషాదాలుగా.. ప్రముఖుల ప్రయాణాలు



ప్రయాణాలుగా మొదలై పెనువిషాదాలుగా మారిన విమాన ప్రమాదాలు ఎన్నో. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ నుంచి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ వరకు.. ఎందరో ప్రముఖుల్ని ఈ విమానాలు బలి తీసుకున్నాయి. వాటిలో కొన్ని..

సంజయ్‌గాంధీ (1980)




మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్ గాంధీ. 1980 జూన్ 23న విమాన ప్రమాదంలో మరణించారు. సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం సమీపంలో దిల్లీ ఫ్లయింగ్ క్లబ్‌కు చెందిన విమానంలో సంజయ్ గాంధీ వైమానిక విన్యాసాలు చేస్తున్న సమయంలో విమానం నియంత్రణ కోల్పోయి కుప్పకూలింది.

మాధవ్‌రావ్ సింధియా (2001)



కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ విమానయానశాఖ మంత్రి మాధవ్‌రావ్ సింధియా 2001 సెప్టెంబరు 30న విమాన ప్రమాదంలో మరణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌కు ఎన్నికల ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్న సమయంలో ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేటు విమానం ప్రతికూల వాతావరణం కారణంగా కుప్పకూలింది.

జీఎంసీ బాలయోగి (2002)



అప్పటి లోక్‌సభ స్పీకర్, తెదేపా నేత జీఎంసీ బాలయోగి 2002 మార్చి 3న హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి తిరుగు ప్రయాణమైన సమయంలో కృష్ణా జిల్లా కైకలూరు సమీపంలోని ఓ చెరువు వద్ద ఆయన ప్రయాణిస్తున్న ప్రైవేటు హెలికాప్టర్ కూలిపోయింది.

సౌందర్య (2004)



సినీ నటి సౌందర్య 2004 ఏప్రిల్ 17న గగనతల ప్రమాదంలో చనిపోయారు. బెంగళూరులోని జక్కూర్ ఎయిర్‌ఫీల్డ్ నుంచి తెలంగాణలోని కరీంనగర్‌కు బయలుదేరిన సింగిల్ ఇంజిన్ సెస్నా-180 విమానం... టేకాఫ్ అయిన కొన్ని నిమిషాల్లోనే కూలిపోయింది. దీంతో సౌందర్య సహా నలుగురు ప్రయాణికులు చనిపోయారు.

వైఎస్సార్ (2009)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు. 2009 సెప్టెంబరు 2న ఆయన ప్రయాణిస్తున్న బెల్ 430 హెలికాప్టర్ నల్లమల అడవుల్లో ప్రతికూల వాతావరణం కారణంగా అదుపుతప్పి అడవుల్లోనే కుప్పకూలింది.

దోర్జీ ఖండూ(2011)



2011 ఏప్రిల్ 30న అప్పటి అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి దోర్జీ ఖండూ, మరో నలుగురు హెలికాప్టర్‌లో తవాంగ్ నుంచి ఇటానగర్‌కు బయలుదేరారు. రాష్ట్రంలోని వెస్ట్ కామెంగ్ జిల్లాలోకి ప్రవేశించగానే హెలికాప్టర్ అదుపుతప్పి కూలిపోయింది.

సీడీఎస్ బిపిన్ రావత్ (2021)



దేశ తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ బిపిన్ రావత్, ఆయన భార్య, మరో 11 మంది 2021 డిసెంబరు 8న జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. తమిళనాడులోని సూలూర్ నుంచి వెల్లింగ్టన్‌కు వెళ్తున్న సమయంలో కూనూర్ సమీపంలో వారి హెలికాప్టర్ కూలింది.

విజయ్ రూపాణీ (2025)



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గతేడాది జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాణీ మరణించారు. 2016 నుంచి 2021 మధ్య రెండుసార్లు గుజరాత్ సీఎంగా ఆయన పనిచేశారు. ఆ ఘటన సమయంలో విమానంలో 242 మంది ఉండగా.. ఒక్కరే ప్రాణాలతో బయటపడ్డారు.

మా విమానాలన్నీ ఫిట్: వీఎస్‌ఆర్ ఏవియేషన్

ముంబయి: అజిత్ పవార్ ప్రయాణించిన వీఎస్‌ఆర్ సంస్థకు చెందిన లియర్ జెట్-45 మోడల్ విమానం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ లియర్ జెట్ మోడల్ విమానం 2023లో ఇదే విధంగా ముంబయి విమానాశ్రయంలో క్రాష్‌ల్యాండ్ అయినట్లు జాతీయ మీడియా వర్గాలు తెలిపాయి. దీంతో ఈ మోడల్ విమానాలను నిర్వహించే సంస్థ పనితీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వీటిపై వీఎస్‌ఆర్ యజమాని వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రమాదానికి గురైన విమానంలో ఎలాంటి సాంకేతిక సమస్య లేదని వెల్లడించారు. ఈ ప్రమాదం నేపథ్యంలో ఇతర విమానాలను నిలిపివేస్తారా అన్న ప్రశ్నకు .. తమ విమానాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు పరీక్షిస్తామని పేర్కొన్నారు. అవన్నీ ప్రయాణాలకు అనువుగానే ఉన్నాయన్నారు. విమానం ఫిట్‌గా ఉన్నప్పుడు.. గ్రౌండ్ చేయాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు.

అందుబాటులోకి కొత్త ఆధార్ యాప్


ఇంటర్నెట్‌డెస్క్: కేంద్ర ప్రభుత్వం సరికొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దేశ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చింది. ఈ కొత్త యాప్‌తో ఆధార్ సర్వీసులు మరింత సరళంగా, సురక్షితంగా మారనున్నాయి. బుధవారం దిల్లీలో డాక్టర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ యాప్‌ను జాతికి అంకితం చేశారు. 2009లో ఇదే రోజున (జనవరి 28న) ఆధార్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

ప్రత్యేకతలివీ



■ ఈ యాప్ ద్వారా వెంటనే ఆధార్ వెరిఫికేషన్ చేసుకోవచ్చు. ■ చిరునామా, మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేసుకునే సౌలభ్యం ఉంది. ■ ఆధార్ కాంటాక్ట్ కార్డ్ ద్వారా అత్యంత గోప్యంగా వివరాలను పంచుకోవచ్చు. ■ ఎవరికైనా షేర్ చేసినప్పుడు మొత్తం వివరాలు కాకుండా అవసరమైనవి మాత్రమే కనిపించేలా ఏర్పాటు. ■ ఎలాంటి సంక్లిష్టత లేకుండా యూజర్లకు అందుబాటులోకి సేవలు. ■ ఈ యాప్ ద్వారా ఐదుగురి వరకు ప్రొఫైల్ వివరాలు క్రియేట్ చేసుకోవచ్చు.

మేధస్సుకు కొలమానం అదే..



మేధస్సుకు కొలమానం మీకు ఎన్ని ఎక్కువ విషయాలు తెలుసన్నది కాదు. మీకున్న జ్ఞానంతో ఎన్ని సమస్యలను పరిష్కరించగలరన్నదే ముఖ్యం. మీకైనా, సమాజానికైనా ఉపయోగపడేది అది మాత్రమే. అందుకే మీ తెలివితేటలను ఆచరణాత్మకంగా ప్రదర్శించడానికి ప్రయత్నించండి.

– టైలిన్ జాన్ సైమండ్స్, కంటెంట్ క్రియేటర్

దేశమే అన్నిటికన్నా మిన్న

- ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ముర్ము



దిల్లీ: భిన్నాభిప్రాయాలు, వేర్వేరు దృక్కోణాలు ఉన్నా దేశం కంటే ఏదీ ఎక్కువ కాదనే విషయంలో మాత్రం అందరిదీ ఒకే అభిప్రాయమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. వికసిత భారత్ సంకల్పం, ఆత్మనిర్భరత, దేశ ఐక్యత వంటివాటిలో విభేదాలకు అతీతంగా పార్లమెంటు సభ్యులంతా ఏకతాటిపై నిలవాలని పిలుపునిస్తూ.. అదే రాజ్యాంగ స్ఫూర్తి అని చెప్పారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయం సహజమని, కొన్నింటిపై విభేదాలకు ఆస్కారమే ఉండకూడదనేది మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, బాబాసాహెబ్ అంబేడ్కర్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, జయప్రకాశ్ నారాయణ్, రామ్‌మనోహర్ లోహియా, పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, వాజ్‌పేయీ వంటి నేతలు విశ్వసించారని గుర్తుచేసుకున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు. దేశ ప్రయోజనాల దగ్గరకు వచ్చేసరికి ఏకతాటిపైకి వచ్చి అభివృద్ధి క్రతువులో మమేకం కావాలని, వృద్ధి ప్రస్థానానికి కొత్త ఊపిరిలూదాలని సభ్యులకు ఆమె హితవు పలికారు. ప్రభుత్వ విజయాలు, లక్ష్యాలను ఆవిష్కరించేలా ప్రసంగం కొనసాగింది. ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే..

సామాజిక న్యాయం.. సంక్షేమం..

"పదేళ్లలో 25 కోట్లమందికి పేదరికం నుంచి విముక్తి కల్పించాం. 4 కోట్ల ఇళ్లు నిర్మించాం. 100 కోట్లకుపైగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. సామాజిక న్యాయసాధనకు, అన్ని వర్గాల సంక్షేమానికి సర్కారు కట్టుబడి ఉంది. 'మహిళా నేతృత్వంలో అభివృద్ధి' అనే మంత్రంతో దేశం ముందడుగు వేస్తోంది. వరి ఉత్పత్తిలో ప్రపంచంలోనే మనది అగ్రస్థానం. తయారీ రంగంలోనూ మంచి ప్రగతి నమోదవుతోంది. మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. అవినీతి, కుంభకోణాలను విజయవంతంగా అడ్డుకుని, ప్రజాధనం సద్వినియోగమయ్యేలా చూస్తోంది.

అంకురాల్లో మూడోస్థానం

మన సంస్కరణల ఎక్స్‌ప్రెస్ పరుగులు తీస్తోంది. ప్రజాకాంక్షలకు అనుగుణంగా పన్ను సంస్కరణలు రూపొందుతున్నాయి. జీఎస్టీ-2.0 ద్వారా ప్రజలకు రూ.లక్ష కోట్లు ఆదా అయ్యాయి. ప్రస్తుత కల్లోల పరిస్థితుల్లో ప్రపంచ దేశాలకు భారత్ ఒక వారధిగా ఉంది. అంతర్జాతీయ సంక్షోభాల నివారణలో కీలకపాత్ర పోషిస్తోంది. అంతర్జాతీయ వేదికలపై ఉనికిని బలోపేతం చేసుకుంది. అంకురాల్లో మనది ప్రపంచంలోనే మూడోస్థానం.

వికసిత భారత్ నిరంతర ప్రయాణం

వికసిత భారత్ ప్రస్థానం కేవలం ఒక ప్రభుత్వానికో, ఒక తరానికో పరిమితం కాదు. ఇదో నిరంతర ప్రయాణం. దీనిలో రైతుకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చాం. వారి ఖాతాల్లోకి ఇంతవరకు రూ.నాలుగు లక్షల కోట్లు బదిలీ చేశాం. గ్రామీణ ఉపాధి కల్పన కోసం జీ రామ్ జీ చట్టం తీసుకొచ్చాం. భారత్‌పై దాడిచేస్తే ఏం జరుగుతుందో 'ఆపరేషన్ సిందూర్' ద్వారా యావత్ ప్రపంచం చూసింది. ఆయుధ రంగంలో స్వయం సమృద్ధిని, ఉగ్రచర్యలకు మనం బదులిచ్చే తీరును కూడా ఆ ఘటన చాటింది. సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకూ అనేక చర్యలు తీసుకున్నాం" అని ముర్ము పేర్కొన్నారు.

జీ రామ్ జీపై విపక్షాల నిరసన


వీబీ జీ రామ్ జీ గురించి రాష్ట్రపతి ప్రస్తావించినప్పుడు విపక్ష సభ్యులు బిగ్గరగా నిరసనలు తెలిపారు. ఆ పథకాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాంతో ఆమె ఒక్క క్షణం ప్రసంగాన్ని ఆపాల్సి వచ్చింది. విపక్షాల తీరును ప్రభుత్వం ఖండించింది. ఆ ప్రవర్తనకు గానూ అవి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్‌ను, దాని మిత్రపక్షాల రాజకీయాల తీరును దేశం ఎన్నటికీ క్షమించబోదని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకరులకు చెప్పారు.

56 పేరాలు...7వేల పదాలు

ఈనాడు, దిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీముర్ము 58 నిమిషాల ప్రసంగం 56 పేరాలు, 7వేల పదాలుగా సాగింది. సామాజిక భద్రత విస్తరణ, ఆరోగ్యం, బీమా పథకాల గురించి చెప్పడానికి అత్యధికంగా 350 పదాలు కేటాయించారు.

చర్చలకు వస్తారా.. నాశనం అవుతారా

- ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక



వాషింగ్టన్: అణు ఒప్పందంపై చర్చలకు రాని పక్షంలో ఇరాన్‌పై భీకర స్థాయిలో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం హెచ్చరించారు. "అణు ఒప్పందం కోసం ఇరాన్ త్వరగా చర్చలకు వస్తుందని భావిస్తున్నాను. అణ్వాయుధాలను నిషేధించే ఒప్పందం అందరికీ మేలు చేస్తుంది. భారీగా యుద్ధ నౌకలు ఇరాన్‌వైపు గొప్ప శక్తితో, ఉత్సాహంతో, వేగంతో, ఓ లక్ష్యంతో వెళుతున్నాయి. సమయం లేదు. ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్‌కు మరోసారి చెబుతున్నా" అని 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ చర్చలకు రాకపోతే గతంలో కంటే భీకరస్థాయిలో దాడులు చేస్తాం.. నాశనం తప్పదని హెచ్చరించారు. మరోవైపు అమెరికా దాడికి సిద్ధమవుతున్న సూచనలు కనిపిస్తుండటంతో పశ్చిమాసియా దేశాల మద్దతు కూడగట్టే పనిలో ఇరాన్ నిమగ్నమైంది. ఇరాన్‌పై దాడికి అమెరికా తమ ఆకాశ మార్గాన్ని వినియోగించడానికి అనుమతించబోమని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లు భరోసా ఇచ్చాయని తెలిసింది. ట్రంప్ హెచ్చరికపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. తమను యుద్ధం దిశగా నెడితే.. గతంలో ఎన్నడూ చేయని స్థాయిలో దాడి చేస్తామంది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.

హెచ్-1బీ వీసాల కొత్త దరఖాస్తులు

2027 మే వరకు నిలిపివేత

- టెక్సాస్ గవర్నర్ కీలక నిర్ణయం
- ఇదే బాటలో ఫ్లోరిడా పయనం?

హ్యూస్టన్: కొత్త హెచ్-1బీ వీసా దరఖాస్తులను తక్షణం నిలిపివేయాలని టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 2027 మే 31 వరకు ఈ నిర్ణయం అమలులో ఉంటుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాలకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. భారతీయ నిపుణులను ఇది ప్రభావితం చేయనుంది. హెచ్-1బీ వీసాల జారీ దుర్వినియోగం అవుతోందని, స్థానిక ఉద్యోగాలు అమెరికన్ కార్మికులకే చెందాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రెగ్ అబాట్ ప్రకటించారు. టెక్సాస్ వర్క్‌ఫోర్స్ కమిషను అనుమతిస్తే ఇందులో మినహాయింపులు ఉండొచ్చని తెలిపారు. గతేడాది కొత్తగా పునరుద్ధరించిన హెచ్-1బీ వీసాల పిటిషన్లు, ప్రస్తుతం స్పాన్సర్ చేస్తున్న వీసా హోల్డర్ల సంఖ్య, ఉద్యోగ హోదాలు, వీసా గడువు తేదీల సమాచారాన్ని ఆయా సంస్థలు నివేదించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థికవ్యవస్థ టెక్సాస్ కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనం కోసమే పనిచేయాలన్నారు. ముఖ్యంగా పన్ను చెల్లింపుదారులతో ముడిపడిన ఉద్యోగాలు మొదట టెక్సాస్ ప్రజలకే దక్కేలా రాష్ట్రం ఆదర్శంగా నిలవాలని, కొంత మంది అమెరికన్ కార్మికులను తొలగించి మరీ తక్కువ వేతనాలు తీసుకునే హెచ్-1బీ వీసాదారులను నియమించుకొంటున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రత్యేక నైపుణ్యం లేని ఉద్యోగాలకు హెచ్-1బీ వీసాలు వాడుతున్నారని ఇప్పటికే నిరసన తెలిపిన ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిసాంటిస్ సైతం టెక్సాస్ బాటలో పయనించే అవకాశముంది. హెచ్-1బీ వీసా హోల్డర్లు కాలిఫోర్నియా తర్వాత టెక్సాస్ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నారు. టెక్సాస్ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో దాదాపు 1,200 మంది పనిచేస్తున్నారు. అమెరికాలో హెచ్-1బీ వీసా కార్యక్రమం 1990లో మొదలైంది. ఉన్నత విద్యావంతులు, నిపుణులకు స్థానికంగా కొరత ఉన్న రంగాల్లో ఆ అర్హతలున్న విదేశీయులను నియమించుకోడానికి దీనిని తీసుకువచ్చారు.

వీధి కుక్కలపై కథలు చెబుతున్నారు

- రాష్ట్రాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

దిల్లీ: వీధికుక్కలకు సంతానోత్పత్తి నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసే సదుపాయాలను పెంచుకోవాల్సిందిగా తాను జారీ చేసిన ఆదేశాలకు రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడకపోవడంపై సుప్రీంకోర్టు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలన్నీ గాలిలో మేడలు కడుతున్నాయని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడుకున్న ధర్మాసనం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వాలు కథలు చెబుతున్నాయంటూ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ వ్యాజ్యంలో కోర్టు సహాయకారిగా నియమితుడైన సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలను, ఆ చర్యల్లోని లోపాలను వివరించారు. సంతానోత్పత్తి నియంత్రణ సదుపాయాలను పెంపొందించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు వీధి కుక్కల కోసం షెల్టర్ల ఏర్పాటు. అధికారిక సంస్థల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు, రహదారులు జాతీయ రహదారుల నుంచి వీధి జంతువుల తొలగింపు వంటి చర్యలు చేపట్టాల్సి ఉందని న్యాయవాది అన్నారు.

విద్యార్థులకు పోస్టల్ బ్యాలెట్ కావాలి

ఓ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు మరో నియోజకవర్గంలో చదువుకుంటున్న సందర్భాల్లో వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించేలా కేంద్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని(ఈసీ) ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు బుధవారం స్పష్టం చేసింది. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం కేంద్రానికి, ఈసీకి నోటీసులు జారీ చేసింది. విద్యార్థుల తరఫు న్యాయవాది కె. పరమేశ్వర్ చేసిన వాదనకు స్పందిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

ఛాంపియన్

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు
యూపీ × బెంగళూరు
వేదిక: వడోదర, రా॥ 7.30


సీఫర్ట్ 62

సిరీస్ గెలిచేశామన్న ఉదాసీనతతో.. టాస్ నెగ్గితే చాలు మ్యాచ్ చిక్కినట్లేనన్న భ్రమో.. పొట్టి క్రికెట్లో తమకు ఎదురేలేదన్న అతి విశ్వాసమో గానీ ఛాంపియన్ జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. టీ20 సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల అనంతరం ఆకాశమంత ఎత్తులో కనిపించిన భారత్.. విశాఖలో నేలకు దిగింది. ప్రత్యర్థి దూకుడును అడ్డుకోలేక.. లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడింది. అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ ఎట్టకేలకు బోణీ కొట్టింది.

విశాఖలో పంచ్

భారత్ జోరుకు బ్రేక్

నాలుగో టీ20లో కివీస్ విజయం

విశాఖ నుంచి ఈనాడు క్రీడా ప్రతినిధి

న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో భారత జైత్రయాత్రకు బ్రేక్ పడింది. తొలి మూడు మ్యాచ్‌ల్లో నెగ్గి సిరీస్ చేజిక్కించుకున్న టీమ్‌ఇండియా.. నాలుగో మ్యాచ్‌ను ప్రత్యర్థికి ఇచ్చేసింది. బుధవారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో జరిగిన టీ20లో కివీస్ 50 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. డెవాన్ కాన్వే (44; 23 బంతుల్లో 4×4, 3×6), టిమ్ సీఫర్ట్ (62; 36 బంతుల్లో 7×4, 3×6), డరిల్ మిచెల్ (39 నాటౌట్; 18 బంతుల్లో 2×4, 3×6) చెలరేగడంతో మొదట కివీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 215 పరుగులు సాధించింది. ఛేదనలో మిచెల్ శాంట్నర్ (3/26), ఇష్ సోధి (2/33)ల ధాటికి భారత్ 18.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది. శివమ్ దూబె (65; 23 బంతుల్లో 3×4, 7×6) ఒంటరి పోరాటంతో భారత్ ఆ మాత్రం స్కోరైనా చేయగలిగింది. చివరి టీ20 శనివారం తిరువనంతపురంలో జరుగుతుంది.

పేలవంగా మొదలై..: గత మ్యాచ్‌లో 10 ఓవర్లలో 154 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి అంచనాలు పెంచిన భారత్.. అచ్చొచ్చిన విశాఖలో బుధవారం తీవ్రంగా నిరాశపరిచింది. మూడు రోజుల కిందటి భారత్‌కు.. ఈ జట్టుకు ఒకే ఒక్క మార్పు ఇషాన్ కిషన్ లేకపోవడమే. మంచు అధికంగా కురుస్తుండటం.. బ్యాటింగ్‌కు పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో 216 పరుగుల లక్ష్యాన్ని టీమ్‌ఇండియా ఛేదిస్తుందనే అభిమానులు ఆశించారు. కానీ తొలి బంతికే స్టార్ ఓపెనర్ అభిషేక్‌శర్మ (0) ఔటవడంతో భారత విజయావకాశాలు సగానికి సగం తగ్గింది. హెన్రీ (1/24) బౌలింగ్‌లో వికెట్ల ముందుకొచ్చి భారీ షాట్‌కు ప్రయత్నించాడు. బ్యాట్ అంచును తాకుతూ థర్డ్‌మ్యాన్ దిశగా వెళ్లిన బంతిని కాన్వే ముందుకు డైవ్ చేస్తూ చక్కగా ఒడిసి పట్టుకున్నాడు. డఫీ (2/33) తర్వాతి ఓవర్లోనే అతనికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (8). ఫామ్‌తో తంటాలు పడుతున్న సంజు శాంసన్ (24; 15 బంతుల్లో 3×4, 1×6) ఆడాలా లేదా అనే ఊగిసలాటలో శాంట్నర్ బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. బౌలింగ్, ఫీల్డింగ్‌లో తనకేమీ సంబంధం లేదన్నట్లుగా కనిపించిన హార్దిక్ పాండ్య (2).. శాంట్నర్ బౌలింగ్‌లోనే పేలవ షాట్ ఆడి వెనుదిరిగాడు. అప్పటికి జట్టు స్కోరు 8.4 ఓవర్లలో 63/4. అంతకుముందు ఇదే సమయానికి కివీస్ 100 పరుగులు దాటేసింది.

దంచేసిన దూబె: క్రీజులో ఉన్నంతసేపు ధాటిగా ఆడిన రింకు సింగ్ (39; 30 బంతుల్లో 3×4, 2×6)ను ఫౌక్స్ (1/29) బోల్తా కొట్టించాడు. దీంతో భారత్ పని పోయినట్లేనని అనిపించింది. ప్రేక్షకులు స్టేడియాన్ని వీడడం మొదలైంది. కానీ క్రీజులోకి వచ్చీ రాగానే దూబె పూనకం వచ్చినట్లుగా ఊగిపోయాడు. మొదటి బంతికే సిక్సర్‌గా మలిచి ఒక్కసారిగా అభిమానుల్లో జోష్ నింపాడు. ఇష్ సోధి వేసిన 12వ ఓవర్లో అతను చుక్కలు చూపించాడు. మూడు సిక్సర్లు, రెండు బౌండరీలతో ఏకంగా 29 పరుగులు రాబట్టడం విశేషం. డఫీ బౌలింగ్‌లో మరో రెండు సిక్సర్లతో భారత్‌లో ఆశలు పెంచాడు. కేవలం 15 బంతుల్లోనే అతను అర్ధసెంచరీ సాధించాడు. టీ20 క్రికెట్లో భారత్ తరఫున మూడో వేగవంతమైన అర్ధశతకం ఇది. అదే జోరులో దూబె మరో సిక్సర్, బౌండరీ అందుకున్న దూబె.. అనూహ్యంగా రనౌటైపోయాడు. హర్షిత్ రాణా (9) బలంగా బంతిని బాదగా.. బౌలర్ హెన్రీ చేతిని తాకుతూ దూసుకెళ్లిన బంతి నాన్ స్ట్రైకర్ ఎండ్‌లో స్టంప్స్‌ను తాకింది. అప్పటికే క్రీజు వదిలిన దూబె.. నిరాశగా మైదానాన్ని వీడాడు. అప్పటికి స్కోరు 15 ఓవర్లలో 145/6. తర్వాత మరో 3.4 ఓవర్లాడిన భారత్.. ఇంకో 20 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లు కోల్పోయింది.

కివీస్ దూకుడు: మూడో టీ20లో 154 పరుగుల లక్ష్యాన్ని భారత్ 10 ఓవర్లలోనే ఛేదించడం.. విశాఖలో 200 పైచిలుకు స్కోరు కూడా సురక్షితం కాకపోవడం.. మంచు ప్రభావం అధికంగా ఉండటంతో కివీస్ భారీ స్కోరు కోసం ప్రయత్నించింది. ఓపెనర్ సీఫర్ట్ ఆరంభం నుంచే బాదుడు మొదలుపెట్టాడు. చిన్న గాయం వల్ల ఈ మ్యాచ్‌కు దూరమైన ఇషాన్ కిషన్ స్థానంలో పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను భారత్ తుది జట్టులోకి తీసుకోగా.. అతను వేసిన తొలి ఓవర్లో సీఫర్ట్ హ్యాట్రిక్ ఫోర్లు కొట్టాడు. తర్వాత హర్షిత్ రాణా మొదటి 2 ఓవర్లలో రెండు సిక్సర్లు, ఒక బౌండరీతో చెలరేగాడు. బుమ్రా (1/38) బౌలింగ్‌లోనూ సీఫర్ట్ బంతిని స్టాండ్స్‌కు తరలించడంతో 4.3 ఓవర్లలోనే కివీస్ 50 పరుగులు దాటింది. మరోవైపు స్పిన్నర్ రవి బిష్ణోయ్ (1/49) ఓవర్లో కాన్వే రెండు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 16 పరుగులు పిండుకున్నాడు. దీంతో కివీస్ 6 ఓవర్లలో 71/0తో తిరుగులేని స్థితిలో నిలిచింది. టీ20లో కివీస్ పవర్ ప్లేలో భారత్‌పై సాధించిన అత్యుత్తమ స్కోరిది. 25 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన సీఫర్ట్.. టీ20ల్లో భారత్‌పై అత్యంత వేగంగా ఈ ఘనత అందుకున్న రెండో కివీస్ బ్యాటర్ (సంయుక్తంగా)గా నిలిచాడు. అనంతరం కుల్‌దీప్ (2/39) బౌలింగ్‌లో డీప్ మిడ్ వికెట్ మీదుగా అతను సిక్సర్ సాధించడంతో కివీస్ 8.1 ఓవర్లలోనే 100 పరుగుల మైలురాయిని దాటింది. అయితే ఆ తర్వాతి బంతికే కాన్వేను ఔట్ చేసిన కుల్‌దీప్.. కివీస్ జోరుకు బ్రేకులు వేశాడు. ఆ తర్వాతి ఓవర్ మొదటి బంతికే రచిన్ రవీంద్ర (2).. నేరుగా బౌలర్ బుమ్రా చేతికే క్యాచ్ అందివ్వడం.. కొద్దిసేపటికే సీఫర్ట్‌కు అర్ష్‌దీప్ (2/33) కళ్లెం వేయడంతో కివీస్‌పై ఒత్తిడిలో పడ్డట్లు అనిపించింది. అయితే బ్యాటర్లు వచ్చిన వాళ్లు వచ్చినట్లే పరుగులు రాబట్టడంతో కివీస్ భారీ స్కోరు సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ (24; 16 బంతుల్లో 3×4, 1×6), కెప్టెన్ సాంట్నర్ (11; 6 బంతుల్లో 1×4, 1×6), ఫౌక్స్ (13; 6 బంతుల్లో 1×4, 1×6) వెంటవెంటనే పెవిలియన్‌కు చేరుకున్నా.. భారత్ చేయాల్సిన నష్టం చేసేశారు. చివర్లో మిచెల్ బ్యాటు ఝుళిపించడంతో 19 ఓవర్లలో కివీస్ స్కోరు 200 దాటింది. ఈ మ్యాచ్‌లో రింకు నాలుగు క్యాచ్‌లు అందుకున్నాడు.


దూబె 65

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (సి) రింకు (బి) కుల్‌దీప్ 44; సీఫర్ట్ (సి) రింకు (బి) అర్ష్‌దీప్ 62; రచిన్ (సి) అండ్ (బి) బుమ్రా 2; ఫిలిప్స్ (సి) రింకు (బి) కుల్దీప్ 24; చాప్‌మన్ (సి) హర్షిత్ (బి) బిష్ణోయ్ 9; మిచెల్ 39 నాటౌట్; శాంట్నర్ రనౌట్ 11; ఫౌక్స్ (సి) రింకు (బి) అర్ష్‌దీప్ 13; హెన్రీ 6 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **215; వికెట్ల పతనం:** 1-100, 2-103, 3-126, 4-137, 5-152, 6-163, 7-182; **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4-0-33-2; హర్షిత్ రాణా 4-0-54-0; బుమ్రా 4-0-38-1; రవి బిష్ణోయ్ 4-0-49-1; కుల్‌దీప్ 4-0-39-2

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) కాన్వే (బి) హెన్రీ 0; సంజు శాంసన్ (బి) శాంట్నర్ 24; సూర్యకుమార్ (సి) అండ్ (బి) డఫీ 8; రింకు ఎల్బీ (బి) ఫౌక్స్ 39; హార్దిక్ (సి) ఫౌక్స్ (బి) శాంట్నర్ 2; దూబె రనౌట్ 65; హర్షిత్ రాణా (సి) రచిన్ (బి) సోధి 9; రవి బిష్ణోయ్ నాటౌట్ 10; అర్ష్‌దీప్ (సి) శాంట్నర్ (బి) సోధి 0; బుమ్రా (సి) సోధి (బి) శాంట్నర్ 4; కుల్‌దీప్ (సి) సీఫర్ట్ (బి) డఫీ 1; ఎక్స్‌ట్రాలు 3 **మొత్తం:** (18.4 ఓవర్లలో ఆలౌట్) **165; వికెట్ల పతనం:** 1-0, 2-9, 3-55, 4-63, 5-82, 6-145, 7-157, 8-157, 9-162; **బౌలింగ్:** హెన్రీ 3-0-24-1; డఫీ 3.4-0-33-2; ఫౌక్స్ 3-0-29-1; ఇష్ సోధి 4-0-46-2; శాంట్నర్ 4-0-26-3; ఫిలిప్స్ 1-0-7-0

గుకేశ్ విజయం.. అర్జున్ ఓటమి


గుకేశ్

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీ టైటిల్ రేసులో భారత గ్రాండ్‌మాస్టర్లు తడబడుతున్నారు. అర్జున్ ఇరిగేశి మరో పరాజయం చవిచూశాడు. అతడు పదో రౌండ్లో విన్సెంట్ కెయ్‌మర్ (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు. గత రౌండ్లో ఓడిన ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ పదో రౌండ్లో యాగిజ్ ఖాన్ (తుర్కియే)పై విజయం సాధించాడు. గుకేశ్ అయిదు, అర్జున్ నాలుగు పాయింట్లతో కొనసాగుతున్నారు. ప్రజ్ఞానంద.. నీమన్ (అమెరికా)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. అతడి ఖాతాలో 4.5 పాయింట్లు ఉన్నాయి. అబ్దుసత్తారోవ్ (ఉజ్బెకిస్థాన్) 6.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

పాపం లొరెంజో ముసెటి! గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్ నుంచి గాయంతో అర్ధాంతరంగా నిష్క్రమించిన ఈ ఇటలీ ఆటగాడికి.. ఇప్పుడు ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనూ అదే అనుభవం ఎదురైంది. అగ్రశ్రేణి ఆటగాడు నొవాక్ జకోవిచ్‌పై విజయం దిశగా సాగుతున్న సమయంలో గాయం అతడికి అడ్డుకట్ట వేసింది. అదృష్టం వల్లే తాను ముందంజ వేయగలిగానని మ్యాచ్ అనంతరం జకోవిచ్ వ్యాఖ్యానించడం విశేషం. మరోవైపు కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేయాలని ఆశించిన ఇగా స్వైటెక్‌కు షాక్ తగిలింది. ఆమె క్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టింది.

జకోవిచ్ బతికిపోయాడు

ముసెటి ఆధిక్యంలో ఉండగా గాయంతో ఔట్

- స్వైటెక్ ఇంటిముఖం
- సెమీస్‌లో రిబకినా, పెగులా
- జకోవిచ్, సినర్ ముందుకు


ముసెటి జకోవిచ్

మెల్‌బోర్న్

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో నాలుగో సీడ్ జకోవిచ్ (సెర్బియా)కు అదృష్టం కలిసొచ్చింది. ప్రత్యర్థి గాయంతో వైదొలగడంతో అతడు సెమీఫైనల్లోకి ప్రవేశించగలిగాడు. క్వార్టర్స్‌లో అయిదో సీడ్ లొరెంజో ముసెటి (ఇటలీ).. జకోవిచ్‌పై ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. కానీ 6-4, 6-4, 1-3తో ఆధిక్యంలో ఉన్న దశలో కుడి కాలి గాయం కారణంగా అతడు రిటైరయ్యాడు. జకోవిచ్ కూడా అదృష్టం వల్లే తాను ముందంజ వేయగలిగానని అంగీకరించాడు. "నాకు కూడా కొన్నిసార్లు ఇలా జరిగింది. కానీ ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్లో తొలి రెండు సెట్లు గెలిచి, పూర్తి నియంత్రణలో ఉన్న సమయంలో ఓ ఆటగాడు ఇలా గాయంతో వైదొలగడం దురదృష్టకరం. ఈ రోజు ముసెటినే గెలవాల్సింది. ముసెటికి ఇలా జరగడం బాధాకరం. అతడు నాకన్నా చాలా బాగా ఆడాడు. నేను ఇంటికి వెళ్లిపోవడం గురించి ఆలోచించడం మొదలుపెట్టా" అని మ్యాచ్ అనంతరం జకోవిచ్ వ్యాఖ్యానించాడు. జకోవిచ్‌కు నాలుగో రౌండ్లో కూడా కలిసొచ్చింది. ప్రత్యర్థి మెన్సిక్ (చెక్) గాయంతో వైదొలగడంతో జకోవిచ్ బరిలోకి దిగకుండానే క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ముసెటిని దురదృష్టం వెంటాడుతోంది. నిరుడు అతడు గాయం కారణంగా ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్ నుంచి కూడా మధ్యలోనే నిష్క్రమించాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై కన్నేసిన జకోవిచ్.. సెమీఫైనల్లో రెండుసార్లు డిఫెండింగ్ ఛాంపియన్ యానిక్ సినర్ (ఇటలీ)ను ఢీకొంటాడు. రెండో సీడ్ సినర్ క్వార్టర్‌ఫైనల్లో 6-3, 6-4, 6-4తో ఎనిమిదో సీడ్ షెల్టన్ (అమెరికా)ను మట్టికరిపించాడు. మ్యాచ్‌లో సినర్ 5 ఏస్‌లు, 33 విన్నర్లు కొట్టాడు. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేశాడు. 34 అనవసర తప్పిదాలతో షెల్టన్ దెబ్బతిన్నాడు.

స్వైటెక్‌కు చెక్: మహిళల సింగిల్స్ రెండో సీడ్ ఇగా స్వైటెక్ (పోలెండ్) ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి నిష్క్రమించింది. క్వార్టర్‌ఫైనల్లో రెండో సీడ్ స్వైటెక్ 5-7, 1-6తో అయిదో సీడ్ రిబకినా (కజకిస్థాన్) చేతిలో ఓడిపోయింది. మ్యాచ్‌లో రిబకినా 11 ఏస్‌లు, 26 విన్నర్లు కొట్టింది. స్వైటెక్ 25 అనవసర తప్పిదాలు చేసింది. 2023లో ఇక్కడ ఫైనలిస్టయిన రిబకినా గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ చేరడం ఇది నాలుగోసారి. స్వైటెక్‌కు ఇప్పటివరకు దక్కని గ్రాండ్‌స్లామ్ టైటిల్ ఆస్ట్రేలియన్ ఓపెనే. ఆమె నాలుగు ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు నెగ్గింది. యుఎస్ ఓపెన్, వింబుల్డన్‌లో ఒక్కోసారి విజేతగా నిలిచింది. ఫైనల్లో చోటు కోసం రిబకినా.. ఆరో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా)తో తలపడుతుంది. క్వార్టర్‌ఫైనల్లో పెగులా 6-2, 7-6 (7-1)తో నాలుగో సీడ్ అనిసిమోవా (అమెరికా)ను ఓడించింది. మ్యాచ్‌లో పెగులా ఆరు ఏస్‌లు, 20 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. అనిసిమోవా ఏడు డబుల్ ఫాల్ట్‌లు, 44 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకుంది. మహిళల సింగిల్స్ సెమీస్ గురువారమే జరుగుతాయి. తొలి సెమీస్‌లో సబలెంకా, స్వితోలినా తలపడతారు.


రిబకినా

నేటి మహిళల సింగిల్స్ సెమీస్
(మధ్యాహ్నం 2 నుంచి)
సబలెంక × స్వితోలినా
రిబకినా × పెగులా

పురుషుల సింగిల్స్ సెమీస్‌లో ఇలా..
అల్కరాస్ × జ్వెరెవ్
జకోవిచ్ × సినర్


స్వైటెక్

మేం జూలో జంతువులమా?

ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రసారదారుపై ప్రపంచ నంబర్ 2 ఇగా స్వైటెక్ మండిపడింది. "మేం టెన్నిస్ క్రీడాకారులమా లేదా జూలో జంతువులమా" అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. టోర్నీ సందర్భంగా కొకో గాఫ్‌తో పాటు తనకు సంబంధించిన కోర్టు వెలుపలి వీడియోలు వైరలైన నేపథ్యంలో స్వైటెక్ స్పందించింది. "విసర్జన చేస్తున్నప్పుడు కూడా ప్లేయర్లను గమనించేలా ఉన్నారు. ఇది అతిశయోక్తే అనుకోండి. కానీ మాకు కాస్త ఏకాంతం కల్పిస్తే బాగుంటుంది. ఎల్లప్పుడూ మమ్మల్ని ప్రపంచమంతా చూడాల్సిన అవసరం లేదు" అని వ్యాఖ్యానించింది. క్వార్టర్‌ఫైనల్లో ఓటమి అనంతరం కొకో గాఫ్ కోర్టు బయట కోపంతో తన రాకెట్‌ను పదే పదే నేలకు కొట్టింది. మరోవైపు సోమవారం అక్రిడేషన్ లేకుండా రావడంతో స్వైటెక్‌ను భద్రత సిబ్బంది మొదట స్టేడియంలోకి అనుమతించలేదు. ఆమెను గుర్తించలేకపోవడమే అందుకు కారణం. రెండు నిమిషాల తర్వాత స్వైటెక్‌కు అనుమతి లభించింది. గాఫ్, స్వైటెక్‌లకు సంబంధించిన ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

రెండో రౌండ్లో తరుణ్, మంజునాథ్

థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్


తరుణ్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు తరుణ్ మన్నెపల్లి, మిథున్ మంజునాథ్ శుభారంభం చేశారు. బుధవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో తరుణ్ 22-20, 21-17తో థాయ్‌లాండ్‌కు చెందిన వాంగ్‌చెరియాన్‌ను ఓడించాడు. మరో మ్యాచ్‌లో మంజునాథ్ 21-12, 9-21, 21-17తో ఎనిమిదో సీడ్ మాగ్నస్ జొహానెసెన్ (డెన్మార్క్)కు షాకిచ్చాడు. మంజునాథ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం 60వ స్థానంలో ఉన్నాడు. ఏడో సీడ్ కిరణ్ జార్జ్ కూడా రెండో రౌండ్లోకి ప్రవేశించాడు. మొదటి రౌండ్లో అతడు 21-15, 21-9తో ప్రపంచ 45వ ర్యాంకు ఆటగాడు షొలేహ్ అయిది (మలేసియా)పై విజయం సాధించాడు. ప్రియాంశు రజావత్ పరాజయంపాలయ్యాడు. అతడు 21-15, 13-21, 20-22తో నాలుగో సీడ్ బ్రయాన్ యాంగ్ (కెనడా) చేతిలో కంగుతిన్నాడు. మన్‌రాజ్ సింగ్, శంకర్ ముత్తుసామి కూడా తొలి రౌండ్ దాటలేకపోయారు. మహిళల సింగిల్స్‌లో శ్రియాంశి వలిశెట్టి రెండో రౌండ్లో అడుగుపెట్టింది. ఆమె మొదటి రౌండ్లో 14-21, 21-13, 21-19తో వెన్ జు జాంగ్ (కెనడా)ను ఓడించింది. అన్మోల్ ఖర్బ్ 21-12, 21-12తో లో సిన్ యాన్ హ్యాపీ (హాంకాంగ్)పై, ఇషారాణి 21-12, 21-8తో మాళవిక బాన్సోద్‌పై గెలిచారు. ఇతర భారత షట్లర్లు అనుపమ ఉపాధ్యాయ, తస్నిమ్ మిర్, తన్య హేమంత్ ఓడిపోయారు.

సూర్య 7.. అభిషేక్ 1


సూర్యకుమార్

దుబాయ్: భారత్ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మెరుగయ్యాడు. న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో వరుసగా 32, 82*, 57* స్కోర్లతో తిరిగి ఫామ్ అందుకున్న అతడు.. ఐసీసీ టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అయిదు స్థానాలు ఎగబాకి, ఏడో ర్యాంకులో నిలిచాడు. భీకర ఫామ్‌లో ఉన్న ఓపెనర్ అభిషేక్ శర్మ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. అభిషేక్ (929)కు.. రెండో స్థానంలోని ఫిల్ సాల్ట్‌కు మధ్య 80 పాయింట్ల వ్యత్యాసం ఉండడం విశేషం. తిలక్ వర్మ (3) స్థానంలో మార్పు లేదు. రెండేళ్ల అనంతరం జట్టులోకి పునరాగమనం చేసిన ఇషాన్ కిషన్.. తిరిగి టీ20 ర్యాంకింగ్స్‌లోకి అడుగుపెట్టాడు. అతడు 64వ స్థానం సాధించగా.. శివమ్ దూబె 58, రింకు సింగ్ 68వ ర్యాంకుల్లో ఉన్నారు. టీ20ల్లో నంబర్‌వన్ బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి కొనసాగుతుండగా.. బుమ్రా 13, రవి బిష్ణోయ్ 19వ స్థానాల్లో ఉన్నారు. హార్దిక్ పాండ్య ఏకంగా 18 స్థానాలు మెరుగై 59వ ర్యాంకుకు చేరుకున్నాడు. వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో డరిల్ మిచెల్ అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లి వరుసగా 2, రోహిత్ శర్మ 4, శుభ్‌మన్ గిల్ 5, కేఎల్ రాహుల్ 10 స్థానాల్లో కొనసాగుతున్నారు. వన్డే బౌలర్లలో భారత్ నుంచి కుల్‌దీప్ యాదవ్ (8) ఒక్కడే టాప్-10లో ఉన్నాడు. రషీద్ ఖాన్ (అఫ్గానిస్థాన్) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

భారత్‌కు బంగ్లా షూటర్లు

దిల్లీ: బంగ్లాదేశ్ షూటర్లు భారత్‌కు రానున్నారు. సోమవారం మొదలయ్యే ఆసియా రైఫిల్, పిస్టల్ ఛాంపియన్‌షిప్‌లో బంగ్లా నుంచి ఇద్దరు రైఫిల్ షూటర్లు పాల్గొననున్నారు. భద్రతా కారణాల రీత్యా తమ క్రికెట్ జట్టును టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు పంపించమని తేల్చి చెప్పిన కొద్ది రోజుల్లోనే బంగ్లా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. "ఇప్పటివరకైతే ఈ పోటీలకు తమ క్రీడాకారులను పంపించం అంటూ బంగ్లా నుంచి ఎలాంటి సందేశం రాలేదు. వారితో తరచూ మాట్లాడుతున్నాం. వీసాల అనుమతికి విదేశీ వ్యవహారాల శాఖ ఆమోదం తెలిపింది" అని భారత జాతీయ రైఫిల్ సంఘం కార్యదర్శి రాజీవ్ భాటియా చెప్పాడు. షూటింగ్ ఛాంపియన్‌షిప్ ఇండోర్ స్టేడియంలో జరుగుతుండడంతో క్రీడాకారులకు ఎలాంటి ముప్పు ఉండదని బంగ్లా ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ రేంజ్‌లో జరిగే టోర్నీలో 17 దేశాల నుంచి 300 మందికి పైగా షూటర్లు పాల్గొంటారు.

లిచ్‌ఫీల్డ్ స్థానంలో అమీ జోన్స్


అమీ జోన్స్


వడోదర: డబ్ల్యూపీఎల్‌లో మిగతా మ్యాచ్‌ల కోసం యూపీ వారియర్స్ బుధవారం ఇంగ్లాండ్ వికెట్‌కీపర్ బ్యాటర్ అమీ జోన్స్‌ను జట్టులోకి తీసుకుంది. గాయపడ్డ లిచ్‌ఫీల్డ్ స్థానంలో జోన్స్‌కు అవకాశం లభించింది. ఫామ్‌లో ఉన్న లిచ్‌ఫీల్డ్ దూరం కావడం వారియర్స్‌కు గట్టి దెబ్బే. ఈ సీజన్ డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో లిచ్‌ఫీల్డ్ టాప్-3లో ఉంది. ఆరు మ్యాచ్‌ల్లో ఆమె 243 పరుగులు చేసింది. వారియర్స్ రూ.50 లక్షలకు జోన్స్‌ను తీసుకుంది. ఈ వికెట్ కీపర్ బ్యాటర్ ఇంగ్లాండ్ తరఫున 125 టీ20 మ్యాచ్‌ల్లో 1666 పరుగులు చేసింది.

తొలి టీ20 సఫారీలదే

పార్ల్ (దక్షిణాఫ్రికా): వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో ఆ జట్టు 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కెప్టెన్ మార్‌క్రమ్ (86; 47 బంతుల్లో 9×4, 3×6) మెరుపులతో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో ఒక వికెట్టే కోల్పోయి ఛేదించింది. లువాన్ ప్రిటోరియస్ (44), రికెల్టన్ (40) కూడా రాణించారు. మొదట కరీబియన్ జట్టు 7 వికెట్లకు 173 పరుగులు చేసింది. హెట్‌మయర్ (48) టాప్‌స్కోరర్. బ్రెండన్ కింగ్ (27), రోమన్ పావెల్ (29 నాటౌట్) పర్వాలేదనిపించారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' జార్జ్ లిండే (3/25) విజృంభించాడు. కేశవ్ మహరాజ్, కార్బిన్ బోష్ రెండేసి వికెట్లు తీశారు. రెండో టీ20 గురువారం జరుగుతుంది.


బడ్జెట్ భారతంలో ఎన్ని విశేషాలో..!

ఫిబ్రవరి 1.. ఉదయం 11 గంటలు.. ఏటా దేశవ్యాప్తంగా కోట్లమంది టీవీలకు/ఫోన్లకు అతుక్కుపోయే సమయమది! ఎందుకంటే- వృద్ధి పథంలో దేశ గమనానికి దిశానిర్దేశం చేసే కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టేది అప్పుడే. సుదీర్ఘంగా సాగే ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగానికి చాలామంది తీవ్ర ఉత్కంఠ నడుమ ఆలకిస్తుంటారు. ఆ ముహూర్తం మళ్లీ వచ్చేందుకు మిగిలి ఉన్నది ఇంకో మూడు రోజులే. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర పద్దుకు సంబంధించి కొన్ని ఆసక్తికర అంశాలివీ..



జేమ్స్ విల్సన్ తెలుసా..?

భారత తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది భారతీయుడు కాదు! ఈస్టిండియా కంపెనీకి చెందిన స్కాట్లాండ్ ఆర్థికవేత్త, రాజకీయ నాయకుడు జేమ్స్ విల్సన్ 1860 ఏప్రిల్ 7న అప్పటి బ్రిటన్ రాణికి భారత మొట్టమొదటి బడ్జెట్‌ను సమర్పించారు. స్వతంత్ర భారతదేశంలో తొలి బడ్జెట్‌ను (1947 నవంబరు 26న) ప్రవేశపెట్టిన ఘనత ఆర్.కె. షణ్ముఖం చెట్టికి దక్కింది.


జేమ్స్ విల్సన్



ప్రధానుల పద్దులు

1958, 1970, 1987 బడ్జెట్లకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ మూడు సంవత్సరాల్లోనూ ప్రధానమంత్రులే స్వయంగా పార్లమెంటులో పద్దును ప్రవేశపెట్టారు. ఆ సమయంలో వారే ఆర్థిక మంత్రులుగానూ ఉండటం అందుకు కారణం. టి.టి.కృష్ణమాచారి రాజీనామాతో 1958లో జవహర్‌లాల్ నెహ్రూ.. మొరార్జీ దేశాయ్ రాజీనామాతో 1970లో ఇందిరా గాంధీ.. వి.పి.సింగ్ రాజీనామాతో 1987లో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రులుగా ఉంటూనే ఆర్థిక మంత్రి అవతారమెత్తి బడ్జెట్ ప్రవేశపెట్టారు.

నిర్మలమ్మ.. వరుసగా తొమ్మిదోసారి

నిర్మలా సీతారామన్ పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టనుండటం ఇది వరుసగా తొమ్మిదోసారి. ఇప్పటివరకూ దేశ చరిత్రలో అత్యధిక బడ్జెట్లు (10) ప్రవేశపెట్టిన ఘనత మొరార్జీ దేశాయ్ సొంతం. ఆయన తర్వాతి స్థానంలో ఉన్న పి.చిదంబరం (9) రికార్డును ఆదివారంతో నిర్మల సమం చేయనున్నారు. అయితే వరుసగా ఎక్కువ బడ్జెట్లు ప్రవేశపెట్టిన ఘనత మాత్రం ఇప్పటికే ఈమె సొంతం.




హిరూభాయి ముల్జీభాయి

ఆ బడ్జెట్.. 800 పదాల్లోనే

బడ్జెట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘ ప్రసంగం చేసిన రికార్డు నిర్మలమ్మదే. 2020 ఫిబ్రవరి 1న పద్దును ప్రవేశపెడుతూ ఆమె ఏకంగా 2 గంటల 42 నిమిషాల పాటు మాట్లాడారు. చివరకు ఒంట్లో నలతగా ఉండటంతో మరో రెండు పేజీలు మిగిలి ఉండగానే ప్రసంగాన్ని ముగించారు. ఇక అత్యంత తక్కువ సమయంలో బడ్జెట్ ప్రసంగం పూర్తిచేసిన ఆర్థిక మంత్రిగా హిరూభాయి ముల్జీభాయి పటేల్ నిలిచారు. 1977లో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెడుతూ ఆయన తన ప్రసంగాన్ని కేవలం 800 పదాల్లో ముగించారు.

భారతీయత ఉట్టిపడేలా 'బహీ ఖాతా'

బడ్జెట్ ప్రతులని 2018 వరకు లెదర్ సూట్‌కేసులో పార్లమెంటుకు తీసుకొచ్చేవారు. బ్రిటిష్ పాలన కాలం నాటి నుంచి కొనసాగుతున్న ఆ సంప్రదాయానికి 2019లో నిర్మల తెర దించారు. ఆ ఏడాది తన తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆమె.. వాటి ప్రతుల్ని 'బహీ ఖాతా'గా పిలిచే ఎరుపు రంగు క్లాత్ బ్యాగ్‌లో తీసుకొచ్చారు. దానిపై జాతీయ చిహ్నాన్ని కూడా అమర్చారు. తద్వారా భారతీయత ఉట్టిపడేలా చేశారు. 2021లో కొత్తగా డిజిటల్ బడ్జెట్‌కు నిర్మల శ్రీకారం చుట్టారు.





ఫిబ్రవరి 1నే ఎందుకంటే..

కేంద్ర బడ్జెట్‌ను 2016 వరకు ఏటా ఫిబ్రవరి చివరి పనిదినాన పార్లమెంటులో ప్రవేశపెట్టేవారు. అయితే దానివల్ల కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే ఏప్రిల్ 1వ తేదీ నాటికి బడ్జెట్‌లోని అంశాలను అన్ని మంత్రిత్వశాఖలు అమలు చేయడం కష్టమయ్యేది. దీంతో ఫిబ్రవరి 1నే పద్దును ప్రవేశపెట్టే చరిత్రాత్మక మార్పునకు 2017లో అప్పటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ శ్రీకారం చుట్టారు. దీని వల్ల నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి బడ్జెట్‌కు సంబంధించిన అన్ని ప్రక్రియలను ప్రభుత్వం పూర్తిచేయడానికి తగినంత సమయం అందుబాటులో ఉంటోంది.

- బ్రిటిష్ టైమ్‌జోన్‌కు అనుగుణంగా.. వలస పాలన సమయంలో మన దేశ బడ్జెట్‌ను సాయంత్రం 5 గంటలకు పార్లమెంటులో ప్రవేశపెట్టేవారు. స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా చాలా ఏళ్లు అదే ఆనవాయితీ కొనసాగింది. 1999లో అప్పటి ఆర్థికమంత్రి యశ్వంత్ సిన్హా తొలిసారిగా ఉదయం 11 గంటలకు పద్దును ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి అదే ఆనవాయితీగా కొనసాగుతోంది.
- 2016 వరకు రైల్వే బడ్జెట్‌ను విడిగా ప్రవేశపెట్టేవారు. 2017 నుంచి కేంద్ర బడ్జెట్‌లోనే దాన్ని భాగంగా మార్చారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

రెండేళ్ల నిరీక్షణకు తెర

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించింది. క్రీడా కోటాకు రెండు పోస్టులను రిజర్వు చేయాలని గతంలో హైకోర్టు ఆదేశాలు ఇచ్చినందున ఎక్సైజ్ ఎస్సై, లా ఏఎస్ఓ పోస్టులను ఏపీపీఎస్సీ పక్కన పెట్టింది. హైకోర్టు తీర్పును అనుసరించి ప్రకటించిన 891 పోస్టుల్లో హారిజంటల్ రిజర్వేషన్ కారణంగా 25 పోస్టుల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది. మిగతా 866 పోస్టుల్లో ఎలాంటి మార్పూ ఉండదు. ఏడు దివ్యాంగ, మరో 5 ఇతర రిజర్వేషన్లకు అభ్యర్థులు లేనందున 12 పోస్టులకు ఎంపిక జాబితాను ప్రకటించలేదు.

✦ 2023 డిసెంబరు 7న నోటిఫికేషన్ వెలువడగా.. 2024 ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. 2025 ఫిబ్రవరి 23న మెయిన్ పరీక్షలు జరిగాయి. 2025 ఏప్రిల్ 4న ఫలితాలు వెల్లడించారు. ఇప్పుడు తుది ఎంపిక జాబితా విడులైంది.

అర్ధరాత్రి విడుదల

గ్రూపు-2 ఎంపిక జాబితాను ఏపీపీఎస్సీ అర్ధరాత్రి విడుదల చేసింది. గతంలోనూ కొన్ని నియామకాల ఎంపిక జాబితాలను అర్ధరాత్రే వెలువరించింది. ఫలితాల విడుదలకు సభ్యుల అనుమతి తీసుకొని, ప్రాసెసింగ్ చేసేందుకు ఎక్కువ సమయం పడుతున్నందునే రాత్రి సమయాల్లో ఫలితాలు విడుదల చేయాల్సి వస్తోందని ఏపీపీఎస్సీ చెబుతోంది.


కంపెనీ ప్రతినిధులకు ఒప్పందపత్రాలు అందిస్తున్న సీఆర్డీఏ అధికారులు

అమరావతిలో ది న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ రూ.100 కోట్ల పెట్టుబడి

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి గ్రామాల పరిధిలో దేశంలో అతిపెద్ద జనరల్ ఇన్సూరెన్స్ సంస్థ అయిన ది న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏసీఎల్) తమ ప్రాంతీయ కార్యాలయాన్ని నిర్మించనుంది. ఈ కార్యాలయ స్థాపన ద్వారా అమరావతిలో ఆ సంస్థ సుమారు రూ.100 కోట్ల పెట్టుబడి పెట్టడమే కాకుండా అమరావతిలో టెక్నికల్, ఫైనాన్స్, మార్కెటింగ్, అడ్మినిస్ట్రేషన్ లాంటి విభాగాల్లో 200-225 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. అదే విధంగా ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త ఇన్సూరెన్స్ ఉత్పత్తుల అభివృద్ధికి ఏఐ స్పెషలిస్ట్ అధికారులనూ కార్యాలయంలో నియమించనున్నట్లు ఎన్ఐఏసీఎల్ వర్గాలు పేర్కొన్నాయి.

ఫిబ్రవరిలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

త్వరలోనే భూములు అప్పగిస్తామన్న కలెక్టర్


ఎం.ఎన్. హరేంధిరప్రసాద్

విశాఖపట్నం (వన్‌టౌన్), న్యూస్‌టుడే): విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు ఫిబ్రవరిలోనే శంకుస్థాపన చేసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో విలేకర్లతో మాట్లాడారు. సంస్థకు అవసరమైన 308 ఎకరాల భూముల్ని ఆనందపురం మండలం తర్లువాడ పరిసరాల్లో సిద్ధం చేశాం. ఆయా భూముల్ని అతి త్వరలోనే ఏపీఐఐసీ ద్వారా గూగుల్‌కు అప్పగిస్తాం. 51 మంది రైతుల నుంచి భూములు సేకరించి, వారిలో 49 మంది ఖాతాలకు నిధులు జమచేశాం. మిగిలిన ఇద్దరికీ త్వరలోనే జమ చేస్తాం. డేటా సెంటర్‌కు అవసరమైన నీటిని జీవీఎంసీ ద్వారా అందించే పనులపై దృష్టిపెట్టాం. సింహాచలం భూముల కేటాయింపు దస్త్రం రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాం' అని తెలిపారు.

ఆడిటింగ్ ముసుగులో మస్కా

- రూ.7 కోట్ల విలువైన బంగారంతో ఉడాయింపు
- నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఫైనాన్స్ కంపెనీలో ఆడిటర్‌గా పని చేస్తున్న ఉద్యోగి అదే సంస్థలో ఆడిటింగ్‌కు వెళ్లి రూ.7 కోట్ల విలువైన బంగారు నగలు కాజేశాడు. నిందితుడితో సహా సొత్తునూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ వివరాల మేరకు.. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన వడ్లమూడి ఉమామహేశ్ కనకదుర్గ ఫైనాన్స్‌లో ఆడిట్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా ఆడిట్ నిమిత్తం గతేడాది సెప్టెంబరు 9న ఏలూరు జిల్లా చింతలపూడిలోని కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ బ్రాంచికి వెళ్లాడు. ఇతర ఉద్యోగులతో కలిసి ఆడిటింగ్‌లో పాల్గొన్నాడు. అక్కడ ఎవరూ లేని సమయంలో 4.49 కిలోల బంగారు ఆభరణాలను బ్యాగులో వేసుకొని ఉడాయించాడు. లెక్కల్లో తేడా రావడంతో బ్రాంచి మేనేజర్ చింతలపూడి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం ఉమామహేశ్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు.

దీక్షగా చదివి... కొలువులు గెలిచి

ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం... సంకల్పం మాత్రం ఒక్కటే. అడ్డంకులు ఎదురైనా వెనుకడుగు వేయక లక్ష్యం దిశగా సాగారు. గ్రూప్-2లో ఉన్నత కొలువులకు ఎంపికయ్యారు. ఒక్కొక్కరిదీ ఒక్కో స్ఫూర్తిదాయక పయనం... ప్రేరణగా నిలిచేవారి వివరాలు ఇవీ...

అన్నదమ్ములు... అదరహో!


రిషికాంత్, శల్వంత్

ప్రజా సేవే లక్ష్యంగా ప్రభుత్వ కొలువులు సాధించామని చెబుతున్నారు కర్నూలుకు చెందిన సోదరులు శల్వంత్, రిషికాంత్‌లు. వీరి తల్లిదండ్రులు ఎల్లప్ప, పార్వతమ్మ. శల్వంత్ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఉప కారాగారాధికారిగా విధులు నిర్వర్తిస్తూనే రోజుకు 5 గంటలు చదివారు. గ్రూప్-2లో ఉప తహసీల్దారుగా ఎంపికయ్యారు. శల్వంత్ తమ్ముడు రిషికాంత్ కరోనా సమయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి అన్నయ్య ప్రోత్సాహంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. రోజుకు 11 గంటలు చదివారు. గ్రూప్-2లో సెక్రటేరియట్‌లో సహాయ గణాంక అధికారి పోస్టుకు ఎంపికయ్యారు.

- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

అపజయం ఎరుగని సోదరులు


వేణుగోపాల్ ఓంప్రకాశ్

శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లికి చెందిన బట్టా నాగభూషణ, నిర్మల దంపతులది వ్యవసాయ కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వేణుగోపాల్ గతంలో జరిగిన గ్రూప్-2లో సీనియర్ సహాయకుడి ఉద్యోగం సాధించి, విజయవాడ వ్యవసాయశాఖ కమిషనరు కార్యాలయంలో పనిచేస్తున్నారు. ప్రస్తుత గ్రూప్-2లో డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. రెండో కుమారుడు ఓంప్రకాశ్‌ను అంతకుముందు నిర్వహించిన గ్రూప్-2లో రెవెన్యూ శాఖలో జూనియర్ సహాయకుడు, జిల్లా కోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్, ఎగ్జామినర్, జూనియర్ సహాయకుడి ఉద్యోగాలు వరించాయి. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో చేరారు. ప్రస్తుత గ్రూప్-2లో రాష్ట్ర సచివాలయంలో ఏఎస్ఓ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సివిల్స్ సాధించడమే లక్ష్యమని అన్నదమ్ములిద్దరూ తెలిపారు.

- న్యూస్‌టుడే, కనగానపల్లి

వైకల్యాన్ని అధిగమించి..


కవిరాజు

సంకల్పం ముందు పేదరికం.. వైకల్యం నిలవలేకపోయాయి. ఆయనను మూడు ప్రభుత్వ ఉద్యోగాలు వరించాయి. అనంతపురం జిల్లా బెళుగుప్పకు చెందిన కవిరాజు పుట్టుకతోనే మరుగుజ్జు. చిన్నప్పుడు వైకల్యంతో కదల్లేని పరిస్థితుల్లో ఉండేవారు. ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ రూ.12 లక్షలతో బెంగళూరులో చికిత్స చేయించింది. అయినా కవిరాజు వయసుకు తగిన ఎత్తు పెరగలేదు. బీఈడీ పూర్తిచేసిన ఆయన 2012 డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే గ్రూప్-1కు సిద్ధమై రెండో ప్రయత్నంలో విజయం సాధించారు. ఎంపీడీవోగా ఎంపికైనా ఉపాధ్యాయ వృత్తిలోనే కొనసాగారు. ఇప్పుడు గ్రూప్-2లో సబ్ రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు.

- న్యూస్‌టుడే, బెళుగుప్ప

అంధకారాన్ని జయించి...


నాగూర్‌బాబు

చదువుతో అంధకారాన్ని జయించారు.. నాగూర్‌బాబు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఆయన కమిషనరేట్ ఆఫ్ స్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. 'అమ్మానాన్నలు వ్యవసాయ కూలీలు. పుట్టినప్పటి నుంచే నాకు చూపులేదు. మిత్రుల సహాయంతో విద్యాలయాలకు వెళ్తూ చదువుకున్నా. 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించా. నాకు భార్య శ్రావణి, ఒక పాప ఉన్నారు. రోజూ విధులు నిర్వహిస్తూనే ఏడెనిమిది గంటలు పరీక్షలకు సిద్ధమయ్యా. నా భార్య చదువుతూ ఉంటే నేను వినేవాడిని. అలా పరీక్షలు రాసి గ్రూపు-2లో విజయం సాధించా' అని నాగూర్‌బాబు చెప్పారు.

- న్యూస్‌టుడే, మంగళగిరి గ్రామీణం

దంపతులు.. జట్టుగా.. కలిసికట్టుగా!


హేమచంద్ర, వినత దంపతులు

అనంతపురం జిల్లా గన్నేవారిపల్లికి చెందిన హేమచంద్ర, వినత దంపతులు.. గ్రూప్-2లో కొలువులు సాధించేశారు. ఇద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ గ్రూప్స్ శిక్షణ తీసుకున్నారు. గతంలో వినతకు కోర్టులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు. తర్వాత బ్యాంకులో క్లర్క్ కొలువు రావడంతో కొన్నాళ్లు చేశారు. దంపతులిద్దరూ కష్టపడి చదివారు. ప్రస్తుత గ్రూప్-2లో వినత సబ్ రిజిస్ట్రార్‌గా, హేమచంద్ర ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు.

- న్యూస్‌టుడే, తాడిపత్రి

ఆత్మస్థైర్యం నడిపించింది


మోతుకూరి రవీంద్రబాబు

అడ్డంకులు ఎదురైనా ఆత్మస్థైర్యంతో లక్ష్యాన్ని సాధించారు మోతుకూరి రవీంద్రబాబు. గ్రూప్-2లో మున్సిపల్ కమిషనర్ పోస్టు దక్కించుకున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని దిబ్బలరోడ్డుకు చెందిన రవీంద్రబాబు తల్లిదండ్రులు నిరక్షరాస్యులు. రవీంద్రబాబుకు బాల్యంలో పోలియో సోకి, వైకల్యం బారిన పడ్డారు. తండ్రి రిక్షా తొక్కుతూ.. తల్లి టిఫిన్ బండి నడుపుతూ రవీంద్రను చదివించారు. 2001 డీఎస్సీలో ఆయన ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రస్తుతం నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ప్రైవేట్ పాఠశాల బస్సులో మంటలు

- డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా విద్యార్థులు




పుట్లూరు (బుక్కరాయసముద్రం), న్యూస్‌టుడే: పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులతో బయలుదేరిన బస్సు అగ్నికి ఆహుతైన ఘటన అనంతపురం జిల్లాలో జరిగింది. డ్రైవర్ అప్రమత్తతతో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం పుట్లూరులోని శ్రీరామ్ గ్లోబల్ పాఠశాల బస్సు డ్రైవర్ 30 మంది విద్యార్థులను ఎక్కించుకుని వారిని దించడానికి కడవకల్లు గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో చింతకుంట గ్రామ శివారులో గేర్ బాక్సులో సమస్యలు తలెత్తడంతో డ్రైవర్ బస్సును ఆపేశాడు. విద్యార్థులను కిందకు దించి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో బస్సు అంతా వ్యాపించడంతో పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి ముందే బస్సులోని విద్యార్థులను డ్రైవర్ కిందకు దింపేయడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సరిగా లేకున్నా అనుమతులు ఇవ్వడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెన్నైలో బిహారీ కార్మికురాలిపై హత్యాచారం

- అడ్డుకోబోయిన భర్త, పసిపిల్లాడిని కొట్టి చంపిన దుండగులు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: బతుకుదెరువు కోసం బిహార్ నుంచి వచ్చిన ఓ కుటుంబాన్ని కొందరు కామాంధులు పొట్టన పెట్టుకున్నారు. హత్యల విషయం బయటపడకుండా ఉండాలని మృతదేహాలను నగరంలో వివిధ ప్రాంతాల్లో పడేశారు. ఈనెల 26న చెన్నై అడయారు ఇందిరానగర్‌లో గోనె సంచిలో ఓ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. బిహార్‌కు చెందిన గౌరవ్‌కుమార్(24) కుటుంబంతో ఉపాధి కోసం చెన్నై వచ్చారు. గౌరవ్ కుమార్ తరమణిలోని కేంద్ర పాలిటెక్నిక్ కళాశాలలో సెక్యూరిటీగా పనిచేస్తూ.. భార్య, రెండేళ్ల కుమారుడితో అక్కడే ఉంటున్నారు. గత ఆదివారం రాత్రి గౌరవ్‌కుమార్ విధుల్లో ఉండగా.. ఆయన భార్యపై స్థానికంగా ఉంటున్న సికిందర్, నరేంద్ర కుమార్, రవీంద్రనాథ్ ఠాకుర్, వికాశ్ అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ క్రమంలో భార్య కేకలు విని గౌరవ్‌కుమార్ అక్కడికి వెళ్లగా నిందితులు అతన్ని కొట్టి చంపారు. ఆ తర్వాత అతని భార్యను, వారి కుమారుడినీ హతమార్చారు. బాలుడి మృతదేహాన్ని కైలాష్ ప్రాంతంలోని అడయారు నది తీరంలో, గౌరవ్‌ది ఇందిరానగర్‌లో పడేశారు. పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టి బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. మహిళ మృతదేహం కోసం గాలిస్తున్నారు. బుధవారం నలుగురిని అరెస్టు చేశామని, కేసుతో సంబంధం ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్సు కిటికీలోంచి ఉమ్మబోతే.. టోల్‌ప్లాజా గడ్డర్ తగిలి విద్యార్థి మృతి


రవీంద్ర

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ఇనుప స్తంభం (గడ్డర్)తగిలి ఓ విద్యార్థి తల పగిలి మృతి చెందాడు. ముమ్మిడివరం మండలం లక్ష్మీదేవిలంకకు చెందిన సోంపల్లి వెంకట రవీంద్ర(16) అమలాపురంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. బుధవారం ఆర్టీసీ బస్సులో కళాశాలకు బయలుదేరాడు. ఉమ్మి వేసేందుకు కిటికీలోంచి తలను బయటకు పెట్టగా టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ఇనుప స్తంభం బలంగా తగిలి.. అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థి తండ్రి వ్యవసాయ కూలీ కాగా, తల్లి గృహిణి.

ఫిబ్రవరి నుంచి 'ఏఐ' విశ్వవిద్యాలయం కార్యకలాపాలు



కాటమనేని భాస్కర్

విశాఖపట్నం(సాగర్‌నగర్), న్యూస్‌టుడే: దేశంలో తొలిసారిగా అమరావతిలో కృత్రిమమేధ (ఏఐ) విశ్వవిద్యాలయం ఫిబ్రవరి 19 నుంచి కార్యకలాపాలు ప్రారంభించనుందని రాష్ట్ర ప్రభుత్వ ఐటీఈ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తెలిపారు. భారత్-ఏఐ ఇంపాక్ట్ సమిట్-2026కు ప్రీ సమిట్ కార్యక్రమంగా 'ఏఐ ఫర్ పబ్లిక్ గుడ్ డెమో డే'ను బుధవారం గీతం డీమ్డ్ వర్సిటీలో నిర్వహించారు. టెక్ భారత్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రధాన నిర్వాహక సంస్థగా వ్యవహరించగా గీతం డీమ్డ్ వర్సిటీ, ప్యారడైమ్ ఐటీ సంస్థ సహ నిర్వాహకులుగా వ్యవహరించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన కాటమనేని భాస్కర్ మాట్లాడుతూ ఎన్విడియా సంస్థ భాగస్వామ్యంతో ఏఐ వర్సిటీ ఏర్పాటవుతోందన్నారు. కృత్రిమ మేధస్సు ఇప్పుడు ప్రయోగాత్మక దశను దాటి వ్యూహాత్మక నిర్ణయాలు, రోజువారీ పనితీరులో కీలక భాగస్వామిగా మారుతోందని చెప్పారు. ఈ డెమో డే కార్యక్రమంలో ప్రభుత్వపాలన, పౌరసేవల కోసం ఇప్పటికే అభివృద్ధి చేసి అమలుకు సిద్ధంగా ఉన్న 10 ఏఐ నమూనా వ్యవస్థలను యువత ప్రదర్శించారు. గీతం ప్రో-వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జీఎస్ఐబీ డీన్ ప్రొఫెసర్ రాజాఫణి పప్పు తదితరులు పాల్గొన్నారు.

అలాంటివారితో ఎక్కువ సమయం గడపండి




- మీ జీవితంపై అత్యంత సానుకూల ప్రభావం చూపుతున్న సన్నిహితులను గుర్తించండి. వారితో వీలైనంత ఎక్కువ సమయం గడపండి.
- ప్రతిరోజూ మీకు అత్యధిక ఫలితాలను తీసుకొచ్చే పనులేంటో తెలుసుకోండి. వాటికి ప్రాధాన్యమిస్తూ ముందుగా వాటిని పూర్తిచేయండి.
- మీకు ఎక్కువ ఒత్తిడి కలిగిస్తున్న అంశాలేంటో తెలుసుకోండి. వాటిని పూర్తిగా పక్కనపెట్టండి.

- జేమ్స్ క్లియర్, రచయిత

పనులు పూర్తిచేయకుండానే.. 'వెలిగొండ'ను జాతికి అంకితమిచ్చిన జగన్

- మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం


సచివాలయంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రాజెక్టు వివరాలు వెల్లడిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

ఈనాడు, అమరావతి: 'అత్యంత వెనుకబడిన, ఫ్లోరైడ్ బాధితులున్న ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు నెల్లూరు, కడప జిల్లాల ప్రజలకు మేలు చేసే కీలకమైన వెలిగొండ ప్రాజెక్టును వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. పనులు పూర్తిచేయకుండానే ఎన్నికలకు ముందు 2024 మార్చి 6న పోలీసు పహారా మధ్య జాతికి అంకితం చేశామని ప్రకటించింది. టన్నెల్, హెడ్ రెగ్యులేటర్, ఫీడర్ కెనాల్, డైవర్షన్ రోడ్డు పనులు, ఆర్‌అండ్‌ఆర్ పనులన్నీ పూర్తయితేనే ప్రాజెక్టు పూర్తయినట్లుగా భావించాలి.. ఈ పనులేవీ పూర్తిచేయకుండా వెలిగొండ ప్రాజెక్టును జగన్ జాతికి ఎలా అంకితం ఇచ్చారు' అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో 2024 మార్చి 6 వరకు జరిగిన అసంపూర్తి పనులు.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 18 నెలల్లో చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రి వివరించారు. వెనుకబడిన ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేసిన జగన్.. ప్రజలకు ముఖం చూపించలేక అబద్ధాలతో తన అవినీతి కరపత్రికలో టన్నుల కొద్దీ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీకి వస్తే వాస్తవాలు ఏమిటో చర్చిద్దామని సవాలు విసిరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వెలిగొండ ప్రాజెక్టుకు అవాంతరాలు తొలగించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు, నల్లమల సాగర్ ఫీడర్ కాలువ పనులను పరిశీలిస్తారని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు పరిహారం చెల్లించడానికే రూ.886 కోట్లు అవసరమని గుర్తుచేశారు. టన్నెల్-2లో బోరింగ్ మిషన్ నిలిచిపోయిన నేపథ్యంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం చొరవ చూపలేదని విమర్శించారు. ఈ అడ్డంకులను తొలగించి ప్రాజెక్టు ప్రారంభిస్తామని తెలిపారు.

'స్త్రీశక్తి' కింద 40 కోట్ల ప్రయాణాలు

- ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా రూ.200 కోట్ల ఆదాయం
- రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా స్త్రీశక్తి పథకం కింద ఇప్పటివరకు మహిళలు సుమారు 40 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసినట్లు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ పథకాన్ని ప్రభుత్వం భారంగా చూడకుండా, బాధ్యతగా అమలు చేస్తోందన్నారు. పథకం విజయవంతం వెనుక 48 వేల మంది ఆర్టీసీ సిబ్బంది శ్రమ ఉందని పేర్కొన్నారు. టికెట్ల ఆదాయంపైనే ఆధారపడకుండా కార్గో సర్వీసు ద్వారా రూ.200 కోట్లు ఆర్టీసీ ఆర్జించిందని తెలిపారు. విజయవాడలోని ఆర్టీసీ కార్యాలయంలో స్త్రీశక్తి పథకంపై ఎండీ ద్వారకా తిరుమలరావుతో కలిసి ఆయన బుధవారం సమీక్షించారు. కార్గో ఆదాయంలో మొదటి వరుసలో నిలిచిన జిల్లా అధికారులకు వారు ప్రశంసాపత్రం, నగదు పురస్కారాలను అందించారు. అనంతరం విజయవాడ బస్టాండ్‌లోని కార్గో సర్వీసు నూతన భవనాన్ని మంత్రి ప్రారంభించారు. 'త్వరలో రాష్ట్రానికి 750 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. రెట్రోఫిట్మెంట్ బస్సులపై పరిశీలన కొనసాగుతోంది. అధునాతన సౌకర్యాలతో విద్యుత్ బస్సుల్ని తీసుకురాబోతున్నాం. పల్లెవెలుగు సర్వీసుల్లోనూ ఏసీ ఉండేలా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు నిర్దేశించారు. ఆ మేరకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. మహిళలు ఉచితంగా ప్రయాణించేలా అన్ని ప్రాంతాల్లోనూ ఏసీ బస్సుల్ని అందుబాటులోకి తీసుకొస్తాం. వైకాపా ప్రభుత్వ హయాంలో పరిష్కారం కానీ ఎన్నో సమస్యల్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తోంది' అని మంత్రి వివరించారు.

గ్రంథాలయాలకు రూ.1.40 కోట్ల విలువైన పుస్తకాలు

- ముందుకొచ్చిన ఎమెస్కో విజయకుమార్
- అభినందించిన సీఎం చంద్రబాబు


సీఎం చంద్రబాబుతో ఎమెస్కో విజయకుమార్ తదితరులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ గ్రంథాలయాలకు రూ.1.40 కోట్ల విలువైన పుస్తకాలను అందించేందుకు ఎమెస్కో సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు ఎమెస్కో విజయకుమార్ సచివాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును కలిసి ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌ను సీఎం అభినందించారు. గ్రంథాలయాలు సమాజంలో జ్ఞానవిస్తరణకు కీలకపాత్ర పోషిస్తున్నాయని, పుస్తకాలు పంచడం అంటే జ్ఞానాన్ని పంచినట్లేనని పేర్కొన్నారు. ప్రచురణల వితరణ ద్వారా విద్యార్థులు, ప్రజలకు మేలు జరుగుతుందని వెల్లడించారు.

గ్రూప్-2 ఫలితాల్లో 'శ్యామ్' విజయభేరి

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో కాకినాడలోని 'శ్యామ్' ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందిన మొదటి ప్రయత్నంలోనే పలువురు ఉద్యోగాలు సాధించారని ఛైర్మన్ జి.శ్యామ్ తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన వారిలో 89 మంది డిప్యూటీ తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా ఎంపికయ్యారని ఓ ప్రకటనలో వివరించారు. పోలీసు విభాగ పరీక్షల్లో పైచేయిగా నిలిచిన తమ సంస్థ.. గ్రూప్స్‌లోనూ ప్రత్యేక స్థానాన్ని నిలుపుకొందన్నారు. నిపుణులతో బోధన, రోజువారీ పరీక్షలతో పాటు అభ్యర్థుల కార్యదక్షత విజయానికి కారణమన్నారు.

ముగిసిన జేఈఈ మెయిన్ పేపర్-I పరీక్షలు

- చివరి రోజు కొంత సులభంగా ప్రశ్నపత్రం
- నేడు పేపర్-2

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ పేపర్-1 ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం ముగిశాయి. ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీల్లో బీటెక్‌లో చేరేందుకు.. ఐఐటీల్లో ప్రవేశానికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించేందుకు ఈనెల 21, 22, 23, 24, 28 తేదీల్లో పేపర్-1 పరీక్షలు నిర్వహించారు. చివరి రోజు ప్రశ్నపత్రాలు మిగిలిన రోజులతో పోల్చుకుంటే కొంత సులభంగా ఉన్నాయని నిపుణులు తెలిపారు. దేశవ్యాప్తంగా పేపర్-1కు దాదాపు 13.50 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 95 శాతం మంది హాజరై ఉంటారని అంచనా. గురువారం పేపర్-2 పరీక్ష జరగనుంది. ఫిబ్రవరి 12లోపు పరీక్షల స్కోర్‌ను వెల్లడిస్తామని ఇప్పటికే జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ప్రకటించింది. అంటే మరో 3-4 రోజుల్లో ప్రాథమిక కీ, విద్యార్థుల రెస్పాన్స్ షీట్ విడుదల చేయనున్నారు. బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పేపర్-2 రాయాల్సి ఉంటుంది.

పొగమంచుతో విమాన సర్వీసులు ఆలస్యం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: గన్నవరం పరిసరాలను వేకువజామున పొగమంచు దుప్పటిలా కమ్మేస్తోంది. దీంతో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మీదుగా రాకపోకలు సాగించే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, దిల్లీ విమాన సర్వీసులు బుధవారం గంటకు పైగా ఆలస్యంగా నడిచాయి. ఉదయం 10 గంటల వరకు మంచు వీడకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

లాహిరి లాహిరి.. పర్యాటకం



విజయవాడ బెర్మ్ పార్కులో సిద్ధం చేసిన హౌస్ బోటు

- ఎనిమిది చోట్ల హౌస్ బోట్లు
- ప్రైవేట్ ఆపరేటర్లకు అనుమతి
- త్వరలో అందుబాటులోకి

ఈనాడు, అమరావతి: పర్యాటక రంగంలో మరో కీలక ముందడుగు పడనుంది. రాష్ట్రంలో ఎనిమిది చోట్ల పర్యాటకుల కోసం హౌస్ బోట్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ప్రధాన నదులు, జలాశయాల్లో వీటిని నిర్వహించేందుకు పలు ప్రైవేట్ ఆపరేటర్లు ముందుకొచ్చారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గతంలో పలుచోట్ల హౌస్ బోట్లు ప్రారంభించినా నిర్వహణపరంగా ఇబ్బందులు తలెత్తాయి. వీటిలో పలు బోట్లు మూలకు చేరాయి. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రైవేట్ ఆపరేటర్ల ఆధ్వర్యంలో వీటి నిర్వహణకు ప్రభుత్వం అనుమతులిస్తోంది.



విజయవాడ బెర్మ్ పార్కు వద్ద రొమాంటిక్ ఫ్లోట్, డైన్ బోటు

◆ రాష్ట్రంలో ఎనిమిది చోట్ల సింగిల్, డబుల్ బెడ్‌రూం హౌస్ బోట్ల నిర్వహణకు ప్రభుత్వం అనుమతించింది. సూర్యలంక, భవానీ ద్వీపం, రాజమహేంద్రవరంలోని సరస్వతీ ఘాట్, పుష్కర ఘాట్, వైఎస్సార్ కడప జిల్లా గండికోట, అనకాపల్లి జిల్లా కొండకార్ల సరస్సు, విశాఖపట్నం జిల్లా గంభీరం, అల్లూరి జిల్లా తాజంగి జలాశయాలు వీటిలో ఉన్నాయి. బోట్ల నిర్వహణకు వివిధ ప్రైవేట్ సంస్థలు ఎనిమిది చోట్లా కలిపి రూ.10 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి.

◆ విజయవాడలో కృష్ణా నది మధ్యలోని భవానీ ద్వీపంలో హౌస్ బోట్లను సీఎం చంద్రబాబు ఇటీవల ప్రారంభించారు. టికెట్ బుకింగ్ ఇంకా ప్రారంభించాల్సి ఉంది. ద్వీపంలో రెండు హౌస్ బోట్లు, మరో రొమాంటిక్ ఫ్లోట్, డైన్ బోటు సిద్ధం చేశారు. ◆ తాజంగి, కొండకార్ల సరస్సు, గంభీరం జలాశయంలో బోట్ల నిర్వహణకు సంబంధించిన ప్రతిపాదనలు కలెక్టర్ల ద్వారా పర్యావరణ, జలవనరుల పరిశీలనకు వెళ్లాయి. త్వరలో అనుమతులు రానున్నాయి.

◆ స్వర్ణాల చెరువు (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), గార్గేయపురం (కర్నూలు) ఎదుర్లంక (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ)లోనూ బోట్ల నిర్వహణకు తాత్కాలిక అనుమతులివ్వనున్నారు.

రాత్రి బస.. రొమాంటిక్ ఫ్లోట్ బోట్

◆ ఒక్కో బోటులో ఆరుగురికి సరిపడా సదుపాయాలు కల్పిస్తున్నారు. వీటిలో రాత్రులు బస చేయవచ్చు. నది ఒడ్డున జెట్టీ వద్ద వీటిని నిలిపి ఉంచుతారు.

◆ రొమాంటిక్ ఫ్లోట్, డైన్ బోటులో జన్మదినోత్సవాలు, వార్షికోత్సవాలు, సభలు, సమావేశాలు నిర్వహించుకోవచ్చు. అదే బోటుపై లంచ్, డిన్నర్‌లకు ఏర్పాట్లు చేయనున్నారు.

ప్రభుత్వ సహకారం ఇలా..

బోట్ల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జెట్టీల ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయిస్తున్నారు. విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు.

భద్రతకు కంట్రోల్ రూంలు

◆ బోట్లలో ప్రయాణించే పర్యాటకుల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. బోట్లు నడిపే ప్రతిచోటా కంట్రోల్ రూం విధిగా ఉండాలని ప్రభుత్వం పర్యాటకశాఖను ఆదేశించింది. రెవెన్యూ, పోలీస్, జలవనరులశాఖ ఉద్యోగులు కంట్రోల్ రూంలో ఉంటారు.

◆ బోట్లలో భద్రత ప్రమాణాలు పాటిస్తున్నారా, లేదా? బోట్లు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారో లేదో పరిశీలిస్తారు. నదులు, జలాశయాల్లో వరద ఉద్ధృతి ఉంటే బోట్ల నిర్వహణను నిలిపివేస్తారు.

హెచ్.పైలోరీ ఇన్‌ఫెక్షన్‌కు శ్వాస పరీక్ష

- ఏఐజీలో తొలిసారి అందుబాటులోకి
- తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యకు చెక్



కిట్ తయారీ సంస్థ ట్రైమెడ్ కంట్రీ హెడ్ భాను రాహూనితో కరచాలనం చేస్తున్న ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తీవ్రమైన జీర్ణకోశ సమస్యలకు కారణమయ్యే హెలికోబాక్టర్ పైలోరీ(హెచ్.పైలోరీ) ఇన్‌ఫెక్షన్‌ను గుర్తించే శ్వాస పరీక్ష హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ(ఏఐజీ)లో తొలిసారి అందుబాటులోకి వచ్చింది. పీవై టెస్టుగా వ్యవహరించే ఈ పరీక్ష కేంద్రాన్ని బుధవారం ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. నోబెల్ బహుమతి గ్రహీత, హెచ్.పైలోరీ బ్యాక్టీరియాను కనుగొన్న ప్రొఫెసర్ బారీ మార్షల్ ఈ పీవై టెస్టును అభివృద్ధి చేశారు. ట్రైమెడ్ సంస్థ ఈ కిట్‌ను తయారు చేసింది. దేశంలోనే తొలిసారి ఈ టెస్టును ఏఐజీలో అందుబాటులోకి తెచ్చినట్లు డాక్టర్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. "ఈ టెస్టు నాన్-ఇన్వేసివ్‌తో పాటు త్వరితగతిన, అత్యంత కచ్చితత్వంతో వ్యాధి నిర్ధారణ చేస్తుంది. ఈ పరీక్ష దేశంలో జీర్ణశయాంతర ఆరోగ్య సంరక్షణకు ఒక మైలురాయిగా నిలుస్తుంది. మత్తు, ఎలాంటి కోతలు, ఎండోస్కోపీ వినియోగించకుండానే హెచ్.పైలోరీ వ్యాధిని గుర్తించవచ్చు. తీవ్రమైన గ్యాస్ట్రిక్ వ్యాధులను ముందుగా గుర్తించి అడ్డుకునేందుకు ఈ టెస్టు ఎంతో ఉపయోగపడుతుంది" అని వివరించారు.

అప్పన్నస్వామి సేవలో భారత క్రికెటర్లు



కప్పస్తంభం వద్ద కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, అక్షర్ పటేల్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితరులు

సింహాచలం, న్యూస్‌టుడే: విశాఖలో న్యూజిలాండ్‌తో టీ20 క్రికెట్ మ్యాచ్ ఆడటానికి వచ్చిన భారత జట్టు ఆటగాళ్లు బుధవారం సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, ఫీల్డింగ్ కోచ్ దిలీప్, మాజీ మేనేజర్ పులపర్తి వెంకటరామ్ తదితరులు ఆలయానికి విచ్చేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఆలయ ప్రధానార్చకులు కరి సీతారామాచార్యులు వారికి స్వాగతం పలికారు. క్రికెటర్లు కప్పు స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఏఈవో తిరుమలేశ్వరరావు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, చిత్రపటాలు అందజేశారు.

సామాజిక పరివర్తనకు జైళ్లశాఖలో సంస్కరణలు

- కారాగారాల ఆధునికీకరణకు రూ.960 కోట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- విశాఖలో జైళ్ల శాఖ 9వ జాతీయ సదస్సు ప్రారంభం

ఈనాడు-విశాఖపట్నం, మధురవాడ-న్యూస్‌టుడే: 'జైళ్లలో సంస్కరణలు తెస్తున్నాం. సామాజిక పరివర్తనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాం. జైళ్ల ఆధునికీకరణకు కేంద్రం రూ.960 కోట్లు కేటాయించింది. ఖైదీల భద్రత, సంక్షేమానికి రూ.161 కోట్లు ఇస్తోంది. ప్రతి రాష్ట్రానికీ ఏటా 'నిర్ధన్ ఖైదీ సహాయ యోజన' కింద రూ.20 కోట్లు ప్రత్యేకంగా కేటాయిస్తున్నాం. జరిమానా కట్టలేని పరిస్థితుల్లో జైల్లో మగ్గుతున్న ఖైదీల కోసం ఈ పథకం తెచ్చాం. జైలంటే భయానక వాతావరణం కాకుండా, ఖైదీలు పరివర్తనతో బయటకు వెళ్లాలన్న ఆలోచనతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. విశాఖలో జైళ్లశాఖ కరెక్షనల్ అడ్మినిస్ట్రేటర్స్ 9వ జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి మాట్లాడుతూ.. కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్) కోడ్, జైళ్ల శాఖలో అమలవుతున్న వివిధ పరివర్తన కార్యక్రమాలు మంచి ఫలితాలిస్తున్నాయన్నారు. 'జైళ్ల ఆధునికీకరణ ప్రారంభించాం. జైళ్ల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి వచ్చినా కేంద్రం సహకరిస్తోంది. సదస్సులో అధికారులిచ్చే సూచనలు, సలహాలను స్వీకరిస్తాం' అని బండి సంజయ్ తెలిపారు. అనంతరం ఖైదీలు తయారుచేసిన వస్తువులతో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.



స్టాళ్లు పరిశీలిస్తున్న బండి సంజయ్, జైళ్లశాఖ ఉన్నతాధికారులు



సదస్సులో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్. చిత్రంలో ఏడీజీ రవి జోసెఫ్ లొక్కు, డీజీలు అలోక్‌రంజన్, అంజనీకుమార్, పి.సి.మీనా, ఐ.శ్రీనివాసరావు

అధికారులు ఏమన్నారంటే..

◆ 'నక్సలిజంలో చివరి ఘట్టం నడుస్తోంది. భారత్ ఆర్థిక సూపర్ పవర్‌గా ఎదుగుతోంది. మానవత్వం, పరివర్తన అనేవే ఈ సదస్సు ముఖ్యాంశాలు' అని ఏపీ జైళ్లశాఖ డీజీ అంజనీకుమార్ పేర్కొన్నారు.

◆ 'రెండేళ్లకోసారి ఈ తరహా సదస్సు జరుగుతోంది. జాతీయస్థాయిలో అనుభవాలను పంచుకునేందుకు దీనివల్ల వీలవుతుంది. ప్రధాని కోరినట్లు పోలీసింగ్ వికసిత్ భారత్ సాధ్యం చేయాలి' అని ఎన్‌సీఆర్‌బీ డీజీ అలోక్ రంజన్ తెలిపారు.

◆ కార్యక్రమంలో ఏపీ జైళ్లశాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు, ఉత్తర్‌ప్రదేశ్ డీజీ పీసీ మీనా, వివిధ రాష్ట్రాల నుంచి జైళ్లశాఖ డీజీలు, ఉన్నతాధికారులు, బ్యూరో ఆఫ్ పోలీస్ అండ్ డెవలప్‌మెంట్ అధికారులు హాజరయ్యారు. అనంతరం అతిథులకు డీజీ అంజనీకుమార్ జ్ఞాపికలు అందజేశారు. గుజరాత్‌లో ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక బ్యారెక్‌లు, అస్సాంలో ఖైదీలతో ఓపెన్ వర్సిటీల్లో డిగ్రీ, పీజీ కోర్సులు చేయించడం, పిల్లలను క్రీడాకారులుగా మార్చేలా శిక్షణ ఇవ్వడం వంటి అంశాలపై చర్చించారు.

అసంతృప్తిని కొనితెచ్చుకోవడం ఎందుకు?



మన పూర్వీకులు శతాబ్దాలుగా వరదలు, కరవుకాటకాలు, యుద్ధాలు, ప్లేగు వ్యాధి లాంటి ఆపదలను జయించి ప్రాణాలు నిలుపుకొన్నారు. వారి దృష్టిలో ప్రాణంతో ఉండటం కన్నా విలువైనది మరేదీ లేదు. వారి వారసులమైన మనం మాత్రం ఎన్నో సౌకర్యాలతో జీవిస్తున్నా, మన జీవితాన్ని ఇతరులతో పోల్చుకుంటూ అసంతృప్తికి గురవుతున్నాం. ఆన్‌లైన్‌లో మనమెప్పుడూ కలవని వ్యక్తుల ఆడంబరాలను చూస్తూ, మనమేదో కోల్పోయినట్లు చింతించడం సరికాదు.

– మార్క్ మాన్సన్, రచయిత

EENADU Vol: 52, Issue: 169 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు బిజినెస్

ఎల్ అండ్ టీ లాభంలో 4% క్షీణత

దిల్లీ: మౌలిక రంగ దిగ్గజం ఎల్ అండ్ టీ, డిసెంబరు త్రైమాసికంలో రూ.3,215 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని పొందింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,359 కోట్లతో పోలిస్తే ఇది 4.2% తక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.64,668 కోట్ల నుంచి రూ.71,450 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.60,302.62 కోట్ల నుంచి రూ.65,729.76 కోట్లకు పెరిగాయి. డిసెంబరు త్రైమాసికంలో గ్రూప్ ఏకీకృత ఆర్డరు పుస్తకం విలువ ఏడాది క్రితం కంటే 30% పెరిగి రూ.7,33,161 కోట్లకు చేరింది. ఇందులో అంతర్జాతీయ ఆర్డర్లు 49% ఉన్నాయి. మూలధన వ్యయాలను కొనసాగించడం ద్వారా స్థిర వృద్ధి కొనసాగింపగలమని కంపెనీ సీఎండీ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ ఆశాభావం వ్యక్తం చేశారు. దేశీయ తయారీని మరింత బలోపేతం చేసేందుకు విధాన మద్దతు లభిస్తుందని అంచనా వేశారు. తమ వాటాదార్లకు సాంకేతికత ఆధారిత వృద్ధిని అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.

మారుతీ సుజుకీ లాభం రూ.3,879 కోట్లు



మారుతీ సుజుకీ ఇండియా, డిసెంబరు త్రైమాసికంలో రూ.3,879 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,727 కోట్లతో పోలిస్తే ఇది 4% అధికం. కొత్త లేబర్ కోడ్ అమలు కోసం రూ.594 కోట్ల ఏక కాల కేటాయింపు జరపడం వల్ల, నికర లాభంపై ప్రభావం చూపినట్లు సంస్థ తెలిపింది. కార్యకలాపాల మొత్తం ఆదాయం రూ.38,764 కోట్ల నుంచి రూ.49,904 కోట్లకు చేరింది. కంపెనీ గతంలో ఎన్నడూ లేనంత అధికంగా, సమీక్షా త్రైమాసికంలో 5,64,669 కార్లను దేశీయ విపణిలో విక్రయించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో విక్రయించిన 4,66,993 కార్ల కంటే ఇవి 97,676 అధికం. పెరిగిన విక్రయాల్లో చిన్న కార్లే 68,328 ఉన్నాయి. వీటిపై జీఎస్టీ 28% నుంచి 18 శాతానికి తగ్గడం ఇందుకు కారణం.

● సమీక్షా త్రైమాసికంలో మొత్తం విక్రయాలు 6,67,769 (ఎగుమతులు 1,03,100)కు చేరాయి. 2024-25 ఇదే కాలంలో మొత్తం విక్రయాలు 5,66,213 (ఎగుమతులు 99,220)మాత్రమే. స్టాండలోన్ ప్రాతిపదికన కంపెనీ త్రైమాసిక నికర విక్రయాలు రూ.36,802 కోట్ల నుంచి రూ.47,534 కోట్లకు చేరాయి. నికర లాభం రూ.3,659 కోట్ల నుంచి రూ.3,794 కోట్లకు పెరిగింది.

తగ్గిన హెరిటేజ్ ఫుడ్స్ లాభం

దిల్లీ: హెరిటేజ్ ఫుడ్స్, డిసెంబరు త్రైమాసికంలో రూ.34.5 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదుచేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.43 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 20% తక్కువ. పాల సరఫరా తగ్గడంతో వ్యయాలు పెరిగాయని, అధిక ఖర్చుల వల్ల లాభం తగ్గిందని కంపెనీ తెలిపింది. మొత్తం ఆదాయం రూ.1042.26 కోట్ల నుంచి రూ.1,126.9 కోట్లకు వృద్ధి చెందింది. మొత్తం వ్యయాలు రూ.981.62 కోట్ల నుంచి రూ.1,080 కోట్లకు పెరిగాయి. 'పాల కొరత వల్ల సేకరణ వ్యయాలు పెరగడం, పోటీ తీవ్రం కావడం కారణంగా మూడో త్రైమాసికంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నాం. సవాళ్లు ఎదురైనప్పటికీ, ఆదాయంలో 8 శాతం వృద్ధి సాధించాం. విలువ జత చేర్చిన ఉత్పత్తులు సహా వినియోగదారు వ్యాపార వృద్ధి కొనసాగింది' అని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రాహ్మణి నారా వెల్లడించారు.

కోడి గుడ్డు

29న ఫారం వద్ద గుడ్డు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లు రూపాయల్లో)

హైదరాబాద్	515
వరంగల్	517
విజయవాడ	550
తూ.గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	573

3,300 కొత్త విమానాలు అవసరం



- 2044 నాటికి దక్షిణాసియాపై బోయింగ్ అంచనా
- 4 రెట్లు పెరగనున్న సర్వీసులు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న విమానయాన విపణిగా భారత్ రికార్డు సృష్టిస్తోంది. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ, ఆర్థిక వృద్ధి నేపథ్యంలో 2044 నాటికి భారత్, దక్షిణాసియా దేశాలకు కలిపి సుమారు 3,300 కొత్త విమానాలు అవసరం అవుతాయని అమెరికా విమాన తయారీ సంస్థ బోయింగ్ అంచనా వేసింది. ఇందులో 90% భారత్‌కేనని పేర్కొంది. ఇందువల్ల రాకపోకలు 4 రెట్లు పెరుగుతాయంది. భారత్‌కు కొత్తగా 2,875 నారో బాడీ, 39 వైడ్ బాడీ విమానాలు అవసరమంది. హైదరాబాద్ వేదికగా జరుగుతున్న వింగ్స్ ఇండియా 2026లో బుధవారం బోయింగ్ 'కమర్షియల్ మార్కెట్ ఔట్‌లుక్' నివేదికను విడుదల చేసింది. వచ్చే 20 ఏళ్లలో భారత విమాన ప్రయాణికుల రద్దీ ఏటా 7 శాతానికి పైగా పెరుగుతుంది. ఇందుకోసం దాదాపు 1,41,000 మంది కొత్త నిపుణులు అవసరం అవుతారు. కొత్తగా 45,000 మంది పైలట్లు, 45,000 మంది టెక్నీషియన్లు, 51,000 మంది క్యాబిన్ క్రూ సిబ్బందికి అవకాశాలుంటాయని బోయింగ్ పేర్కొంది.



అశ్విన్ నాయుడు

అభివృద్ధి చెందిన దేశాల్లో పాత విమానాల స్థానంలో కొత్తవి వస్తుంటే, భారత్‌లో మాత్రం.. కొత్తగా సమకూర్చుకుంటున్న విమానాల సంఖ్య పెరుగుతోందని బోయింగ్ కమర్షియల్ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ నాయుడు తెలిపారు. బాలికలకు విమానయాన రంగంపై ఆసక్తిని పెంచేందుకు 'బోయింగ్ సుకన్య' కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

సేవలకూ ప్రాధాన్యం

విమానయాన సేవలకు సంబంధించి, నిర్వహణ, మరమ్మతు, డిజిటల్ సేవలు, శిక్షణ కోసం రాబోయే కాలంలో రూ.16 లక్షల కోట్ల (195 బి.డాలర్లు) పెట్టుబడులు అవసరమని బోయింగ్ పేర్కొంది. సరకు రవాణా విమానాల సంఖ్య వచ్చే 20 ఏళ్లలో 5 రెట్లు పెరుగుతుందని అంచనా వేసింది.

ఎస్‌జే 100 విమానాల తయారీ: హెచ్‌ఏఎల్

దేశీయంగా 100 సీట్ల పౌర విమానాల తయారీ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) కీలక ముందడుగు వేసింది. రష్యాకు చెందిన ఎస్‌జే 100 విమాన తయారీ కోసం, యునైటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ (యూఏసీ) భాగస్వామ్యంతో మనదేశంలోని నాసిక్‌లో అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయనున్నట్లు హెచ్‌ఏఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ తెలిపారు. ఇది కార్యరూపంలోకి వచ్చేందుకు మూడేళ్లు పడుతుందన్నారు. దీనికి ముందుగా, రష్యా సంస్థ నుంచి 20 విమానాలు లీజుకు తీసుకుని, నిర్వహణ కోసం 2 విమానయాన సంస్థలకు అందిస్తామన్నారు. వాటి పనితీరు, మరమ్మతుల వంటి అంశాలు తెలుసుకుంటామని చెప్పారు.

భారత్‌లో మరో 5-7 నగరాలకు విస్తరణ: ఎతిహాద్

తమకు అనుమతులు లభిస్తే, భారత్‌లో కార్యకలాపాలను భారీగా విస్తరిస్తామని ఎతిహాద్ ఎయిర్‌వేస్ ప్రకటించింది. గోవా సహా మరో 5-7 కొత్త నగరాలకు సేవలు అందించడంతో పాటు, హైదరాబాద్, అహ్మదాబాద్ వంటి నగరాలకు విమాన సర్వీసులను రెట్టింపు చేయాలని యోచిస్తున్నట్లు సంస్థ సీఈఓ ఆంటోనోల్డో నెవ్స్ వెల్లడించారు. ఎతిహాద్ ఎయిర్‌వేస్ ప్రపంచవ్యాప్తంగా 20% వృద్ధిని నమోదు చేసినా, భారత్‌లో ఆశించిన స్థాయిలో విస్తరించలేదని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న ట్రాఫిక్ హక్కుల కోటా పూర్తిగా వినియోగం కావడమే ఇందుకు కారణమని నెవ్స్ తెలిపారు. భవిష్యత్తు వృద్ధిలో 15-20% ఇక్కడి నుంచే ఆశిస్తున్నట్లు వివరించారు. పర్యాటక రంగాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలను సడలించడం భారత్‌కు ప్రయోజనకరమని పేర్కొన్నారు.

2030 నాటికి అంతర్జాతీయ సేవలు 40%

అంతర్జాతీయ విస్తరణ ప్రణాళికల్లో భాగంగా, 2030 నాటికి తమ మొత్తం సామర్థ్యంలో 40% విదేశీ సర్వీసులకే కేటాయించాలని యోచిస్తున్నట్లు ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ వెల్లడించారు. దేశీయంగా, అంతర్జాతీయ సర్వీసులతో కలిపి రోజుకు మొత్తం 4,000కు పైగా విమాన సర్వీసులను నడపాలని లక్ష్యంగా విధించుకున్నట్లు తెలిపారు. ఇండిగో వద్ద ప్రస్తుతం 440 విమానాలు ఉన్నాయని, రోజుకు 2,200 సర్వీసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2030 నాటికి 20 కోట్ల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నది తమ లక్ష్యమన్నారు.

భారత్‌లో తయారీ సీ295 సెప్టెంబరుకు సిద్ధం: ఎయిర్‌బస్

పూర్తిగా భారత్‌లో అసెంబ్లింగ్ చేస్తున్న తొలి సైనిక రవాణా విమానం సీ295, ఈ ఏడాది సెప్టెంబరుకు సిద్ధమవుతుందని ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్ భారత్, దక్షిణాసియా హెడ్ వెంకట్ కట్కూరి తెలిపారు. గుజరాత్‌లోని వడోదరలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) కేంద్రంలో తుది అసెంబ్లింగ్ పూర్తవుతోందని పేర్కొన్నారు. ఎయిర్‌బస్, టీఏఎస్ఎల్ ఉమ్మడి భాగస్వామ్య ప్రాజెక్టు ఇది. ఈ విమానానికి సంబంధించిన విడి భాగాలన్నీ హైదరాబాద్ ఆదిభట్లలో ఉన్న ఎయిర్‌బస్-టీఏఎస్ఎల్‌లో తయారవుతున్నాయని పేర్కొన్నారు.

అమెజాన్‌లో 16,000 ఉద్యోగాల కోత



న్యూయార్క్: అమెరికా ఇకామర్స్ దిగ్గజ సంస్థ అమెజాన్, ప్రపంచవ్యాప్తంగా 16,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. గత అక్టోబరులో 14,000 మందిని తొలగించిన ఈ సంస్థ, రాబోయే మూడు నెలల్లో 16,000 మందిని తొలగించేందుకు సిద్ధమవుతోంది. కార్పొరేట్ ఉద్యోగులకు బదులు జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించడం వల్లే, ఈ తొలగింపులు చేపడుతున్నట్లు అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గాలెట్టీ తెలిపారు. కొవిడ్-19 పరిణామాల్లో నియమించుకున్న ఉద్యోగులనూ తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వెబ్ సర్వీసెస్, రిటెయిల్, ప్రైమ్ వీడియో, మానవ వనరుల వంటి వివిధ కార్పొరేట్ రోల్స్‌లో ఉన్న 30,000 మంది ఉద్యోగులను తీసివేయాలన్నది సంస్థ లక్ష్యం. 2023లో సంస్థ 27,000 మంది ఉద్యోగులను తొలగించాక, మళ్లీ అధికంగా కోత విధిస్తోంది ఇప్పుడే.

● సంస్థలోనే 90 రోజుల్లోపు కొత్త రోల్ కనుగొనడానికి అమెరికాలోని ఉద్యోగులకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. గడువులోపు కొత్త ఉద్యోగాన్ని ఎంచుకోలేకపోతే, పరిహారం చెల్లిస్తారు. కొత్త ఉద్యోగం పొందేందుకు సాయం చేయడంతో పాటు ఆరోగ్య బీమా ప్రయోజనాలను ఆఫర్ చేస్తామన్నారు.

నియామకాలు చేపడతాం

ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నా, అవసరమైన పోస్టుల్లోకి కొత్త వారిని తీసుకుంటామని, అవసరమైన కీలక విభాగాల్లో పెట్టుబడులు పెడతామనీ వివరించారు. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జెనరేటివ్ కృత్రిమమేధ సాంకేతికత (ఏఐ) వినియోగిస్తామని సంస్థ సీఈఓ యాండీ జస్సీ గతంలోనే ప్రకటించడం గమనార్హం.

యూపీఎస్‌లో 30,000 మందిపై వేటు

అమెరికాలోని అతిపెద్ద షిప్పింగ్, లాజిస్టిక్స్ సంస్థ యూపీఎస్ కూడా 30,000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. అమెజాన్ నుంచి సరఫరా ఆర్డర్లు తగ్గడమే ఇందుకు కారణం. గత అక్టోబరులోనూ ఈ సంస్థ 34,000 మందిని తొలగించింది.

పసిడి రూ.10,000.. వెండి 23,700 పెరిగాయ్



ఈనాడు వాణిజ్య విభాగం: ఒక రోజులోనే బంగారం, వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర రికార్డు స్థాయిలో 212 డాలర్లు (4.2%) పెరిగి 5296 డాలర్లకు చేరడం, ఔన్సు వెండి ధర కూడా 6.27 డాలర్లు (5.67%) వృద్ధితో 112 డాలర్లను అధిగమించడం ఇందుకు కారణం. ఫలితంగా బుధవారం రాత్రి 11.55 గంటలకు హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర రూ.1,73,300కు చేరింది. కిలో వెండి ధర రూ.3,79,700 వద్ద స్థిరపడింది. మంగళవారం బంగారం ముగింపు ధర రూ.1,63,300 కాగా, కిలో వెండి ధర రూ.3,56,000. వీటితో పోలిస్తే 10 గ్రాముల బంగారం (999 స్వచ్ఛత) ధర రూ.10,000, కిలో వెండి ధర రూ.23,700 పెరిగింది.

కొనుగోలుదార్లు అప్రమత్తంగా ఉండాల్సిందే

బంగారం, వెండి ధరలు అంతర్జాతీయంగా నిమిష నిమిషానికీ మారిపోతుండటం.. విలువ భారీగా పెరిగిన నేపథ్యంలో, ఆభరణాల విక్రయదారులు కూడా అప్పటికప్పుడు ధరలను మార్చివేస్తున్నారు. ఆన్‌లైన్‌లో ధరలను చూసుకుంటే, పెరిగిన ధర ప్రకారమే వసూలు చేస్తున్నారు. ధర తగ్గినప్పుడు మాత్రం కొందరు వ్యాపారులు ఆ మేరకు తగ్గింపును చూపడం లేదని, ఉదయం నిర్ణయించిన ధర ప్రకారమే విక్రయిస్తున్నామని చెబుతున్నారని కొనుగోలుదారులు చెబుతున్నారు. 999 స్వచ్ఛత కలిగిన బంగారం ధరను 92% హెచ్చిస్తే వచ్చేదే 22 క్యారెట్ల బంగారం ధర. విక్రయదారు చూపే 24 క్యారెట్ల ధరలో జీఎస్టీ కలిపి ఉంటే కనుక, ఆభరణాన్ని విక్రయించేప్పుడు మళ్లీ బంగారంపై జీఎస్టీని చూపకూడదు. ఆన్‌లైన్ ధర కంటే తక్కువ ధరకు బంగారం ఇస్తున్నామంటే, జీఎస్టీ కలపకుండా ధర చూపుతూ.. బిల్లు వేసేప్పుడు 3% కలుపుతారు.

పన్ను ఇలా విధించాలి

పసిడి విలువపై 3% జీఎస్టీ, విడిగా తయారీ ఛార్జీలపై 5% పన్ను మాత్రమే విధించాలి. బంగారం విలువ, తయారీ ఛార్జీలకు కలిపి 3% జీఎస్టీ విధిస్తే కనుక.. కొనుగోలుదార్లకు అదనపు భారం పడుతుంది.

ఓఎన్‌జీసీ, రిలయన్స్ జట్టు

చమురు రిగ్గులు, నౌకల సంయుక్త వినియోగం



బేతుల్(గోవా): ఇంధన రంగంలోని ప్రభుత్వ, ప్రైవేటు దిగ్గజ సంస్థలు ఓఎన్‌జీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ జట్టు కట్టాయి. చమురు-గ్యాస్ అన్వేషణ, వెలికితీత కోసం ఉపయోగించే రిగ్‌లు, సరఫరా నౌకలు, లాజిస్టిక్స్, ప్రత్యేక సముద్రగర్భ సామగ్రి వంటి వనరులను సంయుక్తంగా పంచుకునే ఒప్పందంపై ఇరు కంపెనీలు సంతకాలు చేశాయి. దేశ తూర్పు తీరంలోని క్షేత్రాల్లో ముఖ్యంగా కృష్ణా గోదావరి (కేజీ) క్షేత్రం, అండమాన్ క్షేత్రాల్లో డీప్‌వాటర్ ఆఫ్‌షోర్ తవ్వక, ఉత్పత్తి కార్యకలాపాల్లోని వనరులను ఈ ఒప్పందం కింద ఇరు సంస్థలు ఉపయోగించుకుంటాయని ఇండియా ఎనర్జీ వీక్(ఐఈడబ్ల్యూ) అనంతరం ఓఎన్‌జీసీ డైరెక్టర్(ఉత్పత్తి) పంకజ్ కుమార్ పేర్కొన్నారు.

ఏమిటీ ప్రయోజనం: వనరులను పంచుకోవడం వల్ల వ్యయాలు తగ్గుతాయని, సంక్లిష్ట డీప్ వాటర్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయొచ్చని పంకజ్ తెలిపారు. పక్కపక్కనే క్షేత్రాలున్న ఈ రెండు దిగ్గజ కంపెనీలు కలవడం వ్యూహాత్మక ప్రయోజనాలను అందిస్తుందని తెలిపారు.

అనిల్ అంబానీ కంపెనీల రూ.1,800 కోట్ల ఆస్తులు జప్తు



అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూపు కంపెనీలకు చెందిన మరో రూ.1,800 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. దీంతో ఇప్పటివరకు అనిల్ అంబానీ సంస్థలకు సంబంధించి మొత్తంగా రూ.12,000 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసినట్లయ్యింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, యెస్ బ్యాంక్ మోసం కేసుల వ్యవహారాల్లో మనీల్యాండరింగ్ నియంత్రణ చట్టం కింద తాజాగా ఆస్తుల అటాచ్‌మెంట్ చర్యను చేపట్టినట్లు ఈడీ తెలిపింది. అటాచ్ చేసిన ఆస్తుల్లో బీఎస్ఈఎస్ యమునా పవర్, బీఎస్ఈఎస్ రాజధాని పవర్, ముంబయి మెట్రో వన్ ప్రైవేట్‌లో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు చెందిన వాటా ఉందని పేర్కొంది. రూ.148 కోట్ల బ్యాంకు డిపాజిట్లు, వ్యాల్యూ కార్ప్ ఫైనాన్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ దగ్గర నుంచి రావాల్సిన రూ.143 కోట్లతో పాటు కంపెనీ ఉన్నతాధికారి అంగరాయ్ సేథురామన్ పేరు మీద ఉన్న ఒక ఇల్లు, మరో ఉన్నతోద్యోగి పునీత్ గార్గ్ పేరు మీద ఉన్న షేర్లు, మ్యూచువల్ ఫండ్‌లను కూడా అటాచ్ చేసినట్లు ఈడీ తెలిపింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
హెచ్‌టీ మీడియా	(23.60)	(3.24)	496.61	489.80
సన్‌టెక్ రియాల్టీ	56.83	42.52	356.04	174.76
వి-గార్డ్	20.26	18.52	1403.51	1268.65
అరవింద్ ఫ్యాషన్స్	36.11	46.52	1376.58	1202.76
ఆదిత్యబిర్లా రియల్‌ఎస్టేట్	(75.31)	(42.37)	90.33	208.64
సోలార్‌విండ్ ఎనర్జీ	49.21	42.68	587.84	205.11
ఎన్ఐఐటీ ఎంటీఎస్	74.3	61.73	499.69	418.87
ది ఫీనిక్స్ మిల్స్	276	264	1168	1006
జీఈ వెర్నోవా	291	143	1719	1099
సీఎస్‌బీ బ్యాంక్	153.00	152.00	1431.00	1139.00
ఎస్‌బీఐ కార్డ్	455.00	383.00	5353.00	4767.00
స్టార్ హెల్త్	128.00	215.00	4624.00	3796.00
లోధా డెవలపర్స్	956.90	944.40	4775.40	4146.60
మహీంద్రా ఫైనాన్స్	826.00	918.00	----	----
ఎస్‌బీఐ లైఫ్	577.00	551.00	45,803.00	18,542.00

దీర్ఘకాల దృక్పథంతో బడ్జెట్ రూపొందించాలి

● ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



దిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతంగా, స్వతంత్రంగా ఉంచేలా చూసేందుకు, దీర్ఘకాల దృక్పథాన్ని రాబోయే బడ్జెట్ కలిగి ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పూర్వ గవర్నర్ రఘురామ్ రాజన్ ఆకాంక్షించారు. ప్రపంచం ఇపుడు 'అత్యంత ప్రమాదకర సమయం'లో ఉందని ఆయన వివరించారు. 'భారత్‌కు పంచవర్ష ప్రణాళికలు ఉండేవి. అయినా, వాటితో బడ్జెట్ సమన్వయం అంతగా జరిగేది కాద'ని అభిప్రాయపడ్డారు. 'భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ కాబట్టి, స్నేహంగా ఉండాలని అందరూ అనుకుంటారు. అందుకు కావలసిన కసరత్తును బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసి ఉంటారనే భావిస్తున్న'ట్లు రాజన్ తెలిపారు.

'అంతర్జాతీయంగా, దేశీయంగా అత్యంత ప్రమాదకర పరిస్థితులున్నాయి. అయితే కృత్రిమ మేధ (ఏఐ)లో అసాధారణ పెట్టుబడుల నుంచి గొప్ప సానుకూల అవకాశాలు కనిపిస్తున్నాయి. మనల్ని బలహీనపరచే అంశాలపై బాగా ఆధారపడి ఉండడం మాత్రం ప్రమాదాన్ని కొని తెస్తుంద'ని రాజన్ పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్‌లో టారిఫ్ రేట్లు తగ్గొచ్చని రాజన్ అంచనా వేశారు. 'రాష్ట్రాలు సైతం పెట్టుబడులను రాబట్టుకోవడానికి స్నేహపూర్వక విధానాలు తెస్తున్నాయి. మరిన్ని విధానాలు మనకు కావాల'ని అన్నారు. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకతో పాటు అన్ని దేశాలతోనూ సంబంధాలను పెంచుకోవాలని తెలిపారు. అపుడే అమెరికాతో అనిశ్చితి మరింత పెరిగినా, తట్టుకునే పరిస్థితి ఉంటుందన్నారు. అంతర్జాతీయ అనిశ్చితి నేపథ్యంలో అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో ఇమడడానికి ఉన్న అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు.

చైనా, తూర్పు ఆసియా దేశాల మాదిరిగా 30 ఏళ్ల పాటు అధిక వృద్ధిరేట్లు కొనసాగించేలా భారత్ లక్ష్యం పెట్టుకోవాలా అన్న ప్రశ్నకు సమాధానంగా 'చైనా వేగంతో మనం వెళ్లాల్సిన అవసరం లేదు. చైనాలో స్థిరాస్తి మార్కెట్లో ఎదురవుతున్న సమస్యలను మనం చూస్తూనే ఉన్నాం. ఆ సమస్య పరిష్కారానికి ఏళ్ల కొద్దీ సమయం పడుతుంది. అధిక వృద్ధి విషయంలో భారత్ జాగ్రత్తగానే ఉండాల'న్నారు.

దివాలా స్మృతి ఒక గేమ్ ఛేంజర్!

ఆర్థిక సేవల కార్యదర్శి నాగరాజు



దిల్లీ: కార్పొరేట్ వివాద పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం, సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా.. బలమైన ఆర్థిక వ్యవస్థకు పునాది వేయడంలో దివాలా స్మృతి (ఐబీసీ) గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు బుధవారం వెల్లడించారు. అయితే ఇప్పటికీ అనేక సవాళ్లు మిగిలి ఉన్నాయని తెలిపారు. 'పరిష్కారాలు, లిక్విడేషన్లకు కల్పించిన నిర్ణీత గడువు వల్ల, ఆయా సంస్థల విలువ క్షీణించి, రుణదాతలకు తక్కువ మొత్తం లభిస్తోంద'ని వెల్లడించారు. జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కు సామర్థ్య పరిమితులు ఉన్నాయని ఐబీబీఐ, ఇన్సోల్ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో నాగరాజు పేర్కొన్నారు.

● ఐబీసీకి ఏడో సవరణ

సెలెక్ట్ కమిటీ సిఫార్సు చేసిన ఐబీసీ సవరణ బిల్లు 2025 ఏడో సవరణ.. పరిష్కారం, లిక్విడేషన్‌లో జాప్యాన్ని నివారించేందుకు, తక్కువ రికవరీ రేట్లకు సంబంధించిన కీలక సవాళ్లను కొన్నింటిని పరిష్కరించడానికి ప్రయత్నిస్తుందని తెలిపారు. ఐబీసీ తర్వాత కంపెనీలు, ప్రమోటర్లు దివాలా తీయడానికి భయపడుతున్నారని ఐబీబీఐ (ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా) ఛైర్‌పర్సన్ రవి మిట్టల్ వెల్లడించారు. సుమారు 32,000 దరఖాస్తులను ఉపసంహరించుకున్నారని, రూ.14.5 లక్షల కోట్లకు పైగా రుణ వివాదాలను పరిష్కరించుకున్నారని వివరించారు. ఐబీసీ భయం, ప్రభావం ఇదేనని అన్నారు.

రూ.6 లక్షల కోట్లు పెరిగిన సంపద

- రెండో రోజూ సూచీలకు లాభాలే
- కొనసాగిన భారత్- ఈయూ ఎఫ్‌టీఏ సానుకూలతలు



సెన్సెక్స్ ▲ 487 82345

నిఫ్టీ ▲ 167 25343

భారత్- ఐరోపా సమాఖ్య (ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) చర్చలు ముగిసిన ప్రభావం వరుసగా రెండో రోజూ స్టాక్ మార్కెట్‌పై కనిపించింది. ఈ ఒప్పందంతో ప్రయోజనం కలిగే రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు లాభాల్లో ముగిశాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (8.9%), రిలయన్స్ ఇండస్ట్రీస్ (1.16%), ఎటర్నల్ (5.09%) షేర్ల రాణింపూ కలిసొచ్చింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 31 పైసలు తగ్గి 91.99 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.8% లాభంతో 68.10 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లోనే ముగియగా.. ఐరోపా మార్కెట్లు ప్రతికూల ధోరణిలో ఆరంభమయ్యాయి.

● బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.86 లక్షల కోట్లు పెరిగి రూ.459.53 లక్షల కోట్లకు పెరిగింది.

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.480.26 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు.. రూ.3360.59 కోట్లు

హెచ్చుతగ్గుల మధ్య..

బీఎస్ఈ సెన్సెక్స్ 81,892.36 పాయింట్ల వద్ద లాభాల్లోనే (క్రితం ముగింపు 81,857.48) ఆరంభమైంది. ఆ వెంటనే అమాంతం పెరిగి 82,503.97 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. అక్కడ నుంచి క్రమక్రమంగా లాభాలు తగ్గించుకుంటూ, ఒక దశలో నష్టాల్లోకి జారి 81,814.75 పాయింట్లకు చేరింది. అనంతరం మళ్లీ పుంజుకుని 487.20 పాయింట్ల లాభంతో 82,344.68 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 167.35 పాయింట్లు లాభపడి 25,342.75 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,187.65 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని, 25,372.10 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ తాకింది.


8 మినహా మిగతావి లాభాల్లోనే..

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 8 మినహా మిగతావి లాభాల్లో ముగిశాయి. డిసెంబరు త్రైమాసిక ఫలితాలు మెప్పించడంతో, భారత్ ఎలక్ట్రానిక్స్ షేరు 8.9% పెరిగి రూ.453.40 వద్ద ముగిసింది. బజాజ్ ఫైనాన్స్ 2.10%, పవర్‌గ్రిడ్ 2.1%, ట్రెంట్ 1.91%, మహీంద్రా అండ్ మహీంద్రా 1.6%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.41%, బజాజ్ ఫిన్‌సర్వ్ 1.33% పెరిగాయి. డిసెంబరు త్రైమాసికానికి నికర లాభం తగ్గిన ఏషియన్ పెయింట్స్ షేరు 4.34% నష్టపోయి, రూ.2,510.85 వద్ద ముగిసింది. మారుతీ సుజుకీ 2.39%, సన్‌ఫార్మా 1.78%, ఇన్ఫోసిస్ 1.01%, హిందుస్థాన్ యునిలీవర్ (0.83%), భారతీ ఎయిర్‌టెల్ 0.74% నష్టపోయాయి.

షాడోఫాక్స్ పేలవ ఆరంభం..

లాజిస్టిక్స్ సేవల సంస్థ షాడోఫాక్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ షేరు స్టాక్ మార్కెట్లో నమోదైన రోజే నిరాశాజనక ప్రదర్శన కనబర్చింది. ఇష్యూ ధర రూ.124తో పోలిస్తే, బీఎస్ఈలో 9% తక్కువగా రూ.113 వద్ద నమోదైంది. ఆ తర్వాత మరింత తగ్గి రూ.109కి దిగివచ్చింది. చివరకు 11.37% నష్టంతో 109.90 వద్ద ముగిసింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేనాటికి కంపెనీ మార్కెట్ విలువ రూ.6,353.68 కోట్లుగా నమోదైంది.

రెండేళ్ల గరిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి వృద్ధి



దేశ పారిశ్రామికోత్పత్తి వృద్ధి 2025 డిసెంబరులో 7.8 శాతంగా నమోదైంది. ఇది రెండేళ్ల గరిష్ఠ స్థాయి. గనులు, తయారీ, విద్యుత్ రంగాలు బలమైన పనితీరు కనబర్చడం ఇందుకు కారణం. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) ఆధారంగా పారిశ్రామికోత్పత్తి వృద్ధిని లెక్కిస్తారు. 2024 డిసెంబరులో ఇది 3.7%. ఎన్ఎస్ఓ విడుదల చేసిన గణాంకాల ప్రకారం..

● 2025 డిసెంబరులో తయారీ రంగ ఉత్పత్తిలో వృద్ధి 8.1 శాతానికి పెరిగింది. 2024 డిసెంబరులో ఇది 3.7 శాతమే. గనుల రంగ ఉత్పత్తిలో వృద్ధి 2.7% నుంచి 6.8 శాతానికి పెరిగింది. విద్యుదుత్పత్తి వృద్ధి 6.2% నుంచి 6.3 శాతానికి పెరిగింది.

● ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- డిసెంబరులో పారిశ్రామికోత్పత్తి వృద్ధి 3.9 శాతానికి తగ్గింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఇది 4.1%.

63% తగ్గిన ఏసీసీ లాభం

సిమెంట్ తయారీ సంస్థ ఏసీసీ లిమిటెడ్, డిసెంబరు త్రైమాసికానికి రూ.404.25 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1091.79 కోట్లతో పోలిస్తే, ఇది 63% తక్కువ. అయితే కార్యకలాపాల ఆదాయం రూ.5251.70 కోట్ల నుంచి 21.7% అధికమై రూ.6391.17 కోట్లకు చేరింది. ఒక త్రైమాసికంలో ఇప్పటివరకు ఇదే అత్యధిక ఆదాయమని సంస్థ తెలిపింది. అధిక ప్రీమియం సిమెంట్ విక్రయాలు 33% పెరగడమే ఇందుకు కారణమంది.

టీవీఎస్ లాభంలో 46% వృద్ధి

టీవీఎస్ మోటార్ కంపెనీ, డిసెంబరు త్రైమాసికంలో రూ.891.26 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.609.35 కోట్లతో పోలిస్తే ఇది 46.26% ఎక్కువ. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.11,034.88 కోట్ల నుంచి రూ.14,755.52 కోట్లకు వృద్ధి చెందింది. మొత్తం ద్విచక్ర, త్రిచక్ర వాహన విక్రయాలు 12.12 లక్షల నుంచి 27% పెరిగి రికార్డు స్థాయిలో 15.44 లక్షలుగా నమోదయ్యాయి.

సంక్షిప్తంగా..

- దేశ పశ్చిమ ఆఫ్‌షోర్ ప్రాంతంలోని ఆంబే గ్యాస్ క్షేత్రం దిగువన అదనపు సహజవాయువు నిల్వలను కనుగొన్నట్లు వేదాంతాకు చెందిన **కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్** తెలిపింది. గుజరాత్ తీర ప్రాంతం నుంచి సుమారు 35 కి.మీ. దూరంలో, కాంబే బేసిన్‌లో ఈ ఆంబే బ్లాక్ ఉంది.
- **ఆర్సెలర్ మిత్తల్** గ్రూపు నుంచి 248.5 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు ఆర్డరు వచ్చినట్లు సుజ్లాన్ తెలిపింది. గుజరాత్‌లోని భచౌ లో ఆర్సెలర్ మిత్తల్ నిప్పన్ స్టీల్ ప్లాంటు వద్ద ఏర్పాటు చేయనున్న అతిపెద్ద హైబ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా ఈ పవన విద్యుత్ ప్రాజెక్టును చేపట్టాల్సి ఉంటుంది.
- **అదానీ ఎలక్ట్రిసిటీ ముంబయి లిమిటెడ్**కు ఏఏఏ క్రెడిట్ రేటింగ్‌ను ఇండియా రేటింగ్స్ ఇచ్చింది. భారత్‌లో ఈ రేటింగ్ పొందిన మొదటి ప్రైవేట్ రంగ విద్యుత్ పంపిణీ కంపెనీ ఇదే.

ఈనాడు సినిమా

వీరిద్దరినీ ఒకే తెరపై చూడాలని నాకూ ఉంది



రజనీకాంత్



కమల్‌హాసన్

రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటించనున్న సినిమా ప్రాజెక్టు గురించి దర్శకుడు లోకేశ్ కనగరాజ్ మాట్లాడారని రజనీకాంత్ కుమార్తె, నిర్మాత సౌందర్య రజనీకాంత్ తెలిపారు. 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రదర్శకుడు అభిషాన్ జీవింత్ కథానాయకుడిగా పరిచయమవుతున్న 'విత్ లవ్' ఫిబ్రవరి 6న విడుదల కానున్న సందర్భంగా ప్రమోషన్‌లో భాగంగా కోయంబత్తూర్‌లో ఇటీవల విలేకర్ల సమావేశం నిర్వహించారు. చిత్ర నిర్మాతల్లో ఒకరైన సౌందర్య రజనీకాంత్ మాట్లాడుతూ.. తన తండ్రి రజనీకాంత్, కమల్‌హాసన్‌లను ఒకే తెరపై చూడాలనే ఆసక్తి తనకూ ఉందన్నారు. ఈ చిత్రం గురించి దర్శకుడు లోకేశ్ కనగరాజ్ మాట్లాడారని, మిగతా విషయాలను వెల్లడించలేనని తెలిపారు. 'జన నాయగన్' చిత్రం విడుదలలో సెన్సార్ బోర్డు వైఖరి గురించి లేవనెత్తిన ఓ ప్రశ్నకు స్పందించడానికి ఆమె నిరాకరించారు. -న్యూస్‌టుడే, చెన్నై

ఆకాశంలో మరో తార




దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా... పవన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయం అవుతోంది. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో... సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మిస్తున్న ఈ చిత్రంలో మరొక ప్రముఖ తార శ్రుతిహాసన్ ఓ కీలక పాత్రని పోషిస్తున్నట్టు బుధవారం చిత్రబృందం ప్రకటించింది. ఆచితూచి సినిమాలు చేస్తున్న శ్రుతిహాసన్ ఇందులో కథని మలుపు తిప్పే పాత్రని పోషిస్తున్నారని, విలక్షణమైన కథతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని వేసవిలో తెలుగుతోపాటు, తమిళ, హిందీ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నామని సినీ వర్గాలు తెలిపాయి. ఈ చిత్రానికి రచన: గంగరాజు గుణ్ణం, సంగీతం: జి.వి.ప్రకాశ్, ఛాయాగ్రహణం: సుజిత్ సారంగ్, ప్రొడక్షన్ డిజైన్: శ్వేతా సాబుసిరిల్.



శ్రుతి హాసన్

మళ్లీ మూడు చిత్రాలతో



ప్రభాస్

ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజాసాబ్' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నాయి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో, భారీ హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాలైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజెక్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంతకాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట. 'ది రాజాసాబ్' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఆయన కొత్త సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఉద్దేశంలో ఉన్నట్టు తెలుస్తోంది.


ఇంతకీ ఆ వ్యాపారం ఏమిటో?



శివాని, సుహాస్

తన తండ్రి నిర్వహిస్తున్న వ్యాపారాల్ని చూసుకోవడమే తన ఏకైక లక్ష్యం అనుకుంటూ పెరిగాడు ఆ యువకుడు. ఆ క్రమంలో చదువును కూడా నిర్లక్ష్యం చేసేశాడు. మరింతకీ ఆయన తండ్రి నిర్వహిస్తున్న వ్యాపారం ఏమిటి? ఆ బాధ్యతల్ని ఆ యువకుడికి ఎలా అప్పజెప్పాడో తెలియాలంటే 'హే భగవాన్' చూడాల్సిందే. సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందుతున్న చిత్రమిది. సీనియర్ నటుడు నరేశ్, యాంకర్ స్రవంతి చొక్కారపు కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. గోపీ ఆచ్చర దర్శకుడు. బి.నరేంద్రరెడ్డి నిర్మాత. బుధవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేయడంతోపాటు, ఫిబ్రవరి 20న బన్నీ వాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది చిత్ర బృందం. ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ "గతంలో నేను చేసిన సినిమాలకు భిన్నంగా హాస్య ప్రధానమైన పాత్రని పోషించా. ఇందులో బలమైన కథ కూడా ఉంది. ఇక నుంచి నా సినిమాలు అందరినీ అలరించేలా ఉంటాయి. ఈ చిత్రం నా కెరీర్‌లోనే అత్యుత్తమమైన చిత్రంగా నిలుస్తుంది" అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ "ఈ కథలో హీరో తండ్రి చేసే వ్యాపారమేమిటో ఊహిస్తే బహుమతి ఇస్తాం. ఈ సినిమాతో నిర్మాత నరేంద్రరెడ్డి పేరు గట్టిగా వినిపిస్తుంది. సుహాస్ నుంచి ప్రేక్షకులు ఎలాంటి వినోదాన్ని ఆశిస్తారో అది ఈ సినిమాతో ఇచ్చారు. ఇందులో ఓ కొత్త సుహాస్‌ని చూస్తారు. ఓ మంచి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. కచ్చితంగా విజయం అందుకుంటాం" అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల్‌రాజ్, తేజస్వీరావు, దర్శకుడు సాయి మార్తాండ్ పాల్గొన్నారు.

ఖాయమైన 'బార్డర్ 3'



సన్నీ దేఓల్

"సైనికుడికి సరిహద్దు అంటే కేవలం ఒక గీత కాదు. ఇది తన దేశానికి ఇచ్చిన వాగ్దానం'' అంటూ ఇటీవలే థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది 'బార్డర్ 2' చిత్రం. సన్నీ దేఓల్ హీరోగా అనురాగ్ సింగ్ తెరకెక్కించిన చిత్రమిది. భూషణ్ కుమార్ నిర్మించారు. ఇప్పుడీ వార్ డ్రామాకు కొనసాగింపుగా 'బార్డర్ 3' రాబోతున్నట్లు ప్రకటించారు నిర్మాత. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత ఈ మూడో భాగం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు. ''బార్డర్ 2' కన్నా ముందు నుంచే నేను.. దర్శకుడు అనురాగ్ సింగ్ వేరే ప్రాజెక్ట్ కోసం కలిసి పనిచేస్తున్నాం. ఆ చిత్రం విడుదలైన తర్వాత.. తిరిగి 'బార్డర్ 3' సెట్‌లోకి అడుగుపెడతాం. దాదాపు 30 ఏళ్ల తర్వాత కూడా మళ్లీ అదే దేశభక్తిని వెండితెరపై ఆవిష్కరించి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందుతున్నాం. అందుకే ఈ స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని మూడో భాగంతో కొనసాగించాలనుకుంటున్నామ''ని తెలిపారు.

ఆ ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నా



అర్జిత్ సింగ్

బాలీవుడ్ నేపథ్య గాయకుడు అర్జిత్ సింగ్ ఇకపై కొత్త ప్రాజెక్టులు అంగీకరించనని రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనతో అభిమానులతోపాటు సంగీత ప్రియులంతా ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. మరి కొందరు ఆందోళన చెందుతూ అసలీ నిర్ణయం ఎందుకు తీసుకున్నారంటూ.. సామాజిక మాధ్యమాలలో వరుస పోస్టులు పెట్టారు. తాజాగా దీనికి గల కారణాన్ని ఆయన వివరించారు. "రిటైర్మెంట్‌కు ఒక కారణమని చెప్పలేను. చాలా అంశాలున్నాయి. నేను ఎన్నో రోజుల నుంచి ఈ నిర్ణయం తీసుకోవాలని ఆలోచిస్తున్నాను. దానికోసం అవసరమైన ధైర్యాన్నంతా కూడగట్టుకొని ఇప్పుడు మీకు వెల్లడించాను. ఒక విషయమైతే చెప్పగలను.. నాకు కొత్తదనం ఇష్టం. అందుకే నా పాటలను కూడా ఎప్పుడూ ఒకేలా పాడను. వేదికలపై కూడా వాటి ట్యూన్ మార్చి కొత్తగా పాడుతుంటాను. సంగీతంలో కొత్త అంశాలు నేర్చుకోవాలనుకుంటున్నా. మరో నిజమేంటంటే.. కొత్త గాయకుల పాటలను వినాలనుకుంటున్నాను. వాళ్లు కూడా నాకు స్ఫూర్తినిస్తున్నారు. అందుకే కొత్త గాయకుల ప్రతిభను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నా''అని అర్జిత్ పోస్ట్‌లో తెలిపారు. ఇకపై ఆయన సొంతగా స్వరపరుచుకున్న సంగీతంతోనే శ్రోతల ముందుకు రానున్నట్లు సమాచారం.

చిదంబర సందేశం



వంశీ, సంధ్య

ఎప్పుడూ కళ్లజోడు పెట్టుకుని తిరిగే ఆ అబ్బాయి పేరు చిదంబరం కాదు. కానీ అందరూ ఆ పేరుతోనే పిలుస్తుంటారు. దానికి అతను పలుకుతాడు కూడా! కానీ ఓ అమ్మాయి పరిచయమైన తర్వాత కథ మారింది. తన పేరు చిదంబరం కాదంటూనే తన అసలు పేరునీ, కళ్ల జోడు తీసి తన అసలు రూపాన్ని బయటకు చూపించాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియాలంటే 'శ్రీ చిదంబరం గారు' చూడాల్సిందే. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ఠ జంటగా నటించిన చిత్రమిది. వినయ్ రత్నం దర్శకుడు. చింతా వినీషారెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మాతలు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ని ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు సానా విడుదల చేశారు. అందమైన ప్రేమకథకు తోడు, బలమైన సందేశంతో రూపొందిన సినిమా అని తెలుస్తోంది. "కొత్తవాళ్లతో రూపొందించిన స్ఫూర్తిదాయకమైన చిత్రమిది. వాణిజ్యాంశాలతో, ప్రతీ సన్నివేశం ఎంతో సహజంగా కనిపిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంద''న్నారు నిర్మాతలు. గోపీనాథ్, శివకుమార్ మట్టా, కల్పలత గార్లపాటి, అరుణ్‌కుమార్, తులసి తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: చందు - రవి, ఛాయాగ్రహణం: అక్షయ్‌రామ్ పొడిశెట్టి.

రక్తం చూడని యుద్ధం ఉంటుందా?



దీక్షిత్‌శెట్టి

దీక్షిత్‌శెట్టి, క్రితికాసింగ్ ప్రధాన పాత్రధారులుగా... ప్రేమ్‌చంద్ కిలారు దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'శబార'. హర్షిత చదలవాడ, దుర్గా చుంచు, రమాదేవి కిలారు నిర్మాతలు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కథని పరిచయం చేస్తూ 'హార్ట్ బీట్ ఆఫ్ శబార' పేరుతో ప్రచార చిత్రాన్ని విడుదల చేసింది చిత్రబృందం. 'ఒక ప్రపంచమంతా బంగారమే ఉందని తెలిసినప్పుడు దాన్ని వెతుక్కుంటూ ఎంతమంది వచ్చుంటారు? ఎన్ని యుద్ధాలు జరిగి ఉంటాయి? ఎన్ని ప్రాణాలు పోయుంటాయి? ఈ నేల ఎంత రక్తాన్ని చూసి ఉంటుంది? రక్తం చూడని యుద్ధం ఉంటుందా?' అంటూ సాగే సంభాషణలు ప్రచార చిత్రానికి ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా కథానాయకుడు మాట్లాడుతూ "శబార అంటే ప్రపంచం అని అర్థం. ప్రేమ్‌చంద్ సృష్టించిన ప్రపంచమే ఈ సినిమా. కథ మొత్తం అడవి నేపథ్యంలోనే సాగుతుంది'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "మా నాన్న నాకు దేవుడి కంటే ఎక్కువ. ఆయన్నే ఎదురించి ఈ సినిమా తీస్తున్నానంటే ఇది ఎలాంటి సినిమానో, నేనెంతగా నమ్మానో అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రయాణంలో దీక్షిత్ అడుగడుగునా సహకారం అందిస్తున్నారు. ఈ సినిమానే మాట్లాడుతుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో మీషానారంగ్, రాజీవ్ పిళ్లై, భూషణ్‌కల్యాణ్, సుమయా, శివ కామేశ్ మోహన్ భగత్, మిథున్ ముకుందన్ తదితర చిత్రబృందం పాల్గొంది.

సోదరా అంతా గాబరా



సంతోశ్ శోభన్, మానస వారణాసి

సంతోశ్ శోభన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. మానస వారణాసి కథానాయిక. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. యు.వి.క్రియేషన్స్ సమర్పణలో... యు.వి.కాన్సెప్ట్ సంస్థ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం ఇందులోని 'గాబరా గాబరా సోదరా లైఫ్ మొత్తం... కాలమే తన్నేరా లక్‌ని ఆమడ దూరం...' అంటూ సాగే పాటని విడుదల చేశారు. ఆదిత్య రవీంద్రన్ స్వరకల్పనలోని ఈ పాటని రాకేందు మౌళి రచించగా, సంతోశ్ నారాయణన్ ఆలపించారు. ఓ మంచి రొమాంటిక్ ప్రేమకథతో రూపొందిన ఈ చిత్రమిదని తెలిపాయి సినీ వర్గాలు.

బాలీవుడ్‌లో తొలి అడుగు?



ప్రీతి

'కన్నప్ప' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించింది యువకథానాయిక ప్రీతి ముకుందన్. ఇందులో నెమలి పాత్రలో కనిపించి ఆకట్టుకున్న ఈమె.. ఇప్పుడు బాలీవుడ్‌లో తొలి అడుగు వేయడానికి సన్నద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. హిందీ హీరో కార్తిక్ ఆర్యన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఓ సినిమాలో ప్రీతిని కథానాయికగా ఎంపిక చేసిందట చిత్రబృందం. "ప్రస్తుతం కార్తిక్ ఖాతాలో కబీర్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్న సినిమాతోపాటు.. 'నాగ్జిల్లా' అనే మరో చిత్రం కూడా ఉంది. ఈ రెండింటిలో ఒక సినిమాలో కార్తిక్‌కు జోడీగా కనిపించనుంది ప్రీతి. ప్రస్తుతం ఆమెతో చర్చలు జరుగుతున్నాయి. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంద''ని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరి కార్తిక్ సరసన ప్రీతి కనిపిస్తుందో లేదో తెలుసుకోవాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

శింబుకి జోడీగా?



మృణాల్ ఠాకూర్

గతేడాది 'సన్ ఆఫ్ సర్దార్ 2' అనే ఒక్క సినిమాతోనే సరిపెట్టుకున్న అందాల తార మృణాల్ ఠాకూర్.. ఈ సంవత్సరం వరుస సినిమాలతో తెరపై సందడి చేయడానికి ముస్తాబవుతోంది. ఇందులో భాగంగానే ఆమె.. మరో ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. శింబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఎస్‌టీఆర్51' (వర్కింగ్ టైటిల్). 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో కథానాయికగా మృణాల్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ప్రస్తుతం దీని గురించే చర్చలు జరుగుతున్నాయనీ, అన్నీ సవ్యంగా జరిగితే ఈ సినిమాతోనే మృణాల్ తమిళంలోకి అడుగుపెట్టనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమా షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేసి.. 2027లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు చిత్ర వర్గాలు చెప్పాయి. మరి పాత్రలతోనే గుర్తుండిపోయే మృణాల్.. తమిళంలో ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

కొన్ని కథలు ముగియవు ఎందుకంటే..!

విమర్శలు, వివాదాల మధ్య విడుదలై బాక్సాఫీసు వద్ద మంచి వసూళ్లను రాబట్టిన చిత్రం 'ది కేరళ స్టోరీ'. కేరళలో కొన్నేళ్లుగా మహిళలు అదృశ్యమైనట్లు వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వారి ఆచూకీ ఎక్కడనే ఇతివృత్తంతో దీన్ని తెరకెక్కించారు. ఇప్పుడీ చిత్రానికి కొనసాగింపుగా 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రాబోతున్న సంగతి తెలిసిందే. కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. విపుల్ అమృత్‌లాల్ షా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌తోపాటు ఓ వీడియోను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "కొన్ని కథలు ముగియవు.. మోసానికి అతీతంగా. మానవత్వానికి అతీతంగా.. ద్వేషానికి అతీతంగా..'' అంటూ సాగుతున్న ఈ వీడియోలో ముగ్గురు మహిళలు భయం, కన్నీళ్లు, కోపంతో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఉల్కా గుప్తా, ఐశ్వర్య ఓజా, అదితి భాటియా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫిబ్రవరి 27న థియేటర్లలోకి రానుందీ చిత్రం. త్వరలో టీజర్ విడుదల కానున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.



'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'

యథార్థ గాథతో 'హ్రీం'



తనికెళ్ల భరణి

పవన్ తాత, డా.చమిందా వర్మ జంటగా రూపొందుతున్న చిత్రం 'హ్రీం'. రావూరి రాజేశ్ దర్శకత్వం వహిస్తున్నారు. శివమ్ మీడియా పతాకంపై శివ మల్లాల నిర్మిస్తున్నారు. హారర్ థ్రిల్లర్ కథతో రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణని పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని సినీ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. "యథార్థ గాథని ఆధారంగా చేసుకుని రూపొందించిన చిత్రమిది. హిందూధర్మంలోని చతుర్విధ పురుషార్థాలకీ, ఈ కథకీ సంబంధం ఉంది. అందుకే 'హ్రీం' అనే పేరు పెట్టాం. త్వరలోనే ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాల్ని వెల్లడిస్తామ''ని సినీ వర్గాలు తెలిపాయి. తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ, భద్రం తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: అరవింద్, సంగీతం: మార్కస్.యం.

సైంటిఫిక్ ఆఫీసర్లు

బాబా అణు పరిశోధనా కేంద్రం, ముంబయి ..సైంటిఫిక్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● సైంటిఫిక్ ఆఫీసర్-(ఈ/డీ/సీ): 19 ● టెక్నికల్ ఆఫీసర్-డీ: 02

విభాగాలు: కార్డియాలజీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఈఎన్‌టీ, రేడియో డయాగ్నోస్టిక్స్, రేడియాలజీ, ఆప్తల్మాలజీ, జనరల్ డ్యూటీ, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, న్యూక్లియర్ మెడిసిన్, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజీ.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, డీఎన్‌బీ, ఎంఎస్, పీజీ డిప్లొమా, ఎమ్మెస్సీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

మూల వేతనం: నెలకు సైంటిఫిక్ ఆఫీసర్-ఈకు రూ.78,800; సైంటిఫిక్ ఆఫీసర్-డీ, టెక్నికల్ ఆఫీసర్-డీకు రూ.67,700; సైంటిఫిక్ ఆఫీసర్-సీకు రూ.56,100.

వయసు: సైంటిఫిక్ ఆఫీసర్-ఈకు 50 ఏళ్లు; సైంటిఫిక్ ఆఫీసర్-డీ, టెక్నికల్ ఆఫీసర్-డీకు 40 ఏళ్లు; సైంటిఫిక్ ఆఫీసర్-సీకు 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 27-02-2026.

వెబ్‌సైట్: https://barc.gov.in/careers/recruitment.html

ఎన్‌హెచ్‌ఏఐలో డిప్యూటీ మేనేజర్లు



నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)..40 డిప్యూటీ మేనేజర్ (టెక్నికల్) పోస్టులను భర్తీచేయనుంది. సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్-2025 స్కోరుతో నియామకాలు ఉంటాయి

మొత్తం ఖాళీల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 20, ఓబీసీకి 9, ఈడబ్ల్యూఎస్‌కు 4, ఎస్సీకి 5, ఎస్టీకి 2 కేటాయించారు.

ఎంపిక: షార్ట్‌లిస్ట్ చేసిన వారిని.. ఇంటరాక్షన్/ ఇంటర్వ్యూకు పిలుస్తారు. గేట్-2025 స్కోరుతోనే తుది ఎంపిక చేస్తారు. దేశవ్యాప్తంగా ఎక్కడైనా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి.. ఇంటర్వ్యూ తేదీ, ఇతర ఉద్యోగ వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

వివరాలు:

అర్హత: సివిల్ ఇంజినీరింగ్ డిగ్రీ, గేట్-2025 స్కోరు ఉండాలి.

వయసు: 30 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 09.02.2026

వెబ్‌సైట్: http://www.nhai.gov.in/

ఉద్యోగికీ ఉండాలి బ్రాండింగ్

కాలేజీ నుంచి నేరుగా కార్పొరేట్ సంస్థలో కొలువులో చేరింది మానస. ఉత్పత్తులతో పాటు ప్రతి ఉద్యోగీ ఒక బ్రాండింగ్ ఏర్పర్చుకోవాలని సీనియర్స్ అనడం విని ఆశ్చర్యపోయింది. అప్పటి వరకూ ప్రొడక్ట్ బ్రాండింగ్ గురించి వినటమే తప్ప వ్యక్తిగత బ్రాండింగ్‌పై కాలేజీలో ఎప్పుడూ చెప్పలేదని గుర్తించింది. కార్పొరేట్ సంస్థల్లోనూ నేరుగా చెప్పరని గ్రహించింది.

కార్పొరేట్ స్కిల్స్



అతి విశ్వాసం

ఒక ప్రాజెక్టుకు సంబంధించిన విశ్లేషణలో ముఖ్యమైన డేటాను అనుసంధానించడాన్ని అఖిల్ మర్చిపోయాడు. సమీక్షలో ఈ పొరపాటును గుర్తించిన మేనేజర్ అతడిని వివరణ కోరారు. దీంతో జరిగిన తప్పిదాన్ని అతడు తెలుసుకున్నాడు. మేనేజర్ ఇచ్చిన కౌన్సెలింగ్‌తో అతి విశ్వాసం కారణంగానే ఇలా జరిగిందని, వ్యక్తిగత బ్రాండింగ్ అంటే కేవలం మాటలు మాత్రమే కాదని గ్రహించాడు. ఫలితంగా సమావేశాల్లో అవసరమైన మేరకే మాట్లాడేవాడు. జట్టుగా చేసిన పనిని బృంద విజయంగా ప్రస్తావించడం మొదలుపెట్టాడు. చివరగా అఖిల్‌లో గణనీయమైన మార్పు కనిపించింది.

ప్రవర్తన ద్వారా సహజంగా సంక్రమించే వ్యక్తిగత బ్రాండింగ్ దీర్ఘకాలం ఉంటూ, ఉద్యోగి ఎదుగుదలకు సహకరిస్తుంది. కృత్రిమంగా వచ్చే బ్రాండింగ్ కెరియర్‌ను దెబ్బతీస్తుందని తెలుసుకున్నాడు అఖిల్.

కార్పొరేట్ సంస్థల్లో చేరే యువ ఉద్యోగులు పొరపాట్లను స్వీకరించాలి. తమను తాము మెరుగుపరచుకోవడం వ్యక్తిగత బ్రాండింగ్‌కు సహకరిస్తుంది. అలాంటి ఉద్యోగులు సరైన బ్రాండింగ్‌తో గుర్తింపు పొందుతారు.

విశ్వసనీయత

ఒక తయారీ రంగ సంస్థలో ప్రవీణ్ అసిస్టెంట్‌గా చేరాడు. టీమ్ లీడర్ అప్పగించిన పనిని నిర్దేశిత గడువులోగా నాణ్యతా లోపాలు లేకుండా పూర్తిచేసేవాడు. ఇచ్చిన టాస్క్ పూర్తయిన వెంటనే ఆ విషయాన్ని టీమ్ లీడర్‌కు తెలియజేసేవాడు. పనిలో సమస్య ఎదురైతే టీమ్ లీడర్ దృష్టికి తీసుకెళ్లేవాడు. పరిష్కారం గురించీ ఆలోచించేవాడు. అతడి పని తీరుతో ప్రవీణ్ అంటే నాణ్యత, నిబద్ధత అనే నమ్మకం సంస్థలో అందరికీ ఏర్పడింది. ఇది ఒక బ్రాండ్‌గా మారి అతడు తక్కువ సమయంలోనే కార్పొరేట్ కెరియర్‌లో టీమ్ లీడర్‌గా ఎదిగాడు.

అదే టీమ్‌లోని రాహుల్ తనకు అప్పగించిన పనిని టీమ్ లీడర్ అడిగే వరకూ పూర్తి చేసేవాడు కాదు. ఏదైనా అడిగితే సరైన సమాధానమూ చెప్పేవాడు కాదు. బాధ్యత తీసుకోవడానికీ వెనకడుగు వేసేవాడు. దీంతో అతడు ఏది చేసినా, చివరి నిమిషం వరకూ హడావిడి తప్ప పని జరిగేది కాదు. ఈ ప్రవర్తనతో రాహుల్ అంటే 'బాధ్యతా రాహిత్యం' అనే నెగటివ్ బ్రాండ్ ఏర్పడింది. ఫలితంగా అతడు ఉద్యోగంలో అభివృద్ధి సాధించలేకపోయాడు.

కొత్తగా ఉద్యోగంలో చేరినవారు అప్పగించిన పనిని బాధ్యతతో పూర్తి చేయాలి. దీంతో యాజమాన్యం నమ్మకాన్ని పొందవచ్చు. కొద్ది రోజుల్లోనే సొంత గుర్తింపూ ఏర్పర్చుకోవచ్చు.

నిరంతర ప్రక్రియ



▲ వ్యక్తిగత బ్రాండింగ్ ఒకరోజులో సాధ్యమయ్యేది కాదు. ప్రవర్తన, పనితీరు, పాటించే విలువలతో క్రమానుగతంగా రూపొందుతుంది.

▲ కార్పొరేట్ కెరియర్‌లో అతి త్వరగా తమకంటూ ఒక బ్రాండ్ సృష్టించుకుని ఎదగాలనుకునే యువ ఉద్యోగార్థులు చిన్న చిన్న పనులకూ అతిగా ప్రచారం చేసుకోకూడదు. ప్రతి చిన్న పనినీ గొప్పగా చూపించుకోవడం సహోద్యోగుల్లో అసహనాన్ని కలిగిస్తుంది. చేస్తోన్న పనిలో నిబద్ధత, మంచి ప్రవర్తనలతో ఏర్పడే వ్యక్తిగత బ్రాండింగ్ ఎదుగుదలకు సహకరిస్తుందని గుర్తించాలి.

▲ సంస్థల్లో సొంత బ్రాండింగ్ పొందడానికి చాలా సమయం పడుతుంది. ఓర్పు లేకుండా తొందరపడి తీసుకునే నిర్ణయాలు వ్యక్తిగత బ్రాండ్‌కు శాశ్వతంగా నష్టం కలిగించవచ్చు.

▲ మీరు ఏమి చేస్తున్నారన్న అంశంపై కాకుండా ఏమి చేయకూడదో తెలుసుకోవడం పైనా వ్యక్తిగత బ్రాండింగ్ ఆధారపడి ఉంటుంది.

వ్యక్తిగత బ్రాండింగ్ అంటే కేవలం నైపుణ్యాల ప్రదర్శన మాత్రమే కాదు. అది మీ చైతన్యం, నైపుణ్యం, విలువలకు ప్రతిరూపం. మీ ప్రవర్తన బ్రాండ్‌గా మారినప్పుడే మీరు కార్పొరేట్ నిచ్చెనలో అత్యున్నత శిఖరాలకు చేరుకుంటారు.

ప్రచార ఆర్భాటం

ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయం నుంచి ఎంబీఏ పూర్తిచేసిన అఖిల్ ఒక బహుళ జాతి సంస్థలో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీగా చేరాడు. విద్యార్థి దశ నుంచే అందరికంటే ప్రత్యేకంగా ఉండాలని తపించేవాడు. ఉద్యోగంలోనూ ట్రెయినీల్లో ఒకడిగా కాకుండా అందరికంటే భిన్నంగా, ప్రత్యేకంగా కనిపించాలనుకున్నాడు. ఇందుకోసం ఉద్యోగంలో చేరిన తొలి రోజు నుంచే తన ప్రతిభను అతిగా ప్రదర్శించే ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

సమావేశాల్లో అవసరానికి మించి మాట్లాడేవాడు. ఇతర బృంద సభ్యుల పనుల్లో కల్పించుకునేవాడు. వారి విజయాలను తన ఖాతాలో వేసుకునేవాడు. సందర్భం లేకపోయినా అందరితో తన గురించి గొప్పలు చెప్పేవాడు. ఇలా చేయడమే వ్యక్తిగత బ్రాండింగ్ అని భావించేవాడు. ఈ విపరీత ప్రవర్తనతో అతడిపై ప్రతికూల అభిప్రాయం ఏర్పర్చుకున్నాడు. బృందం దృష్టిలో కేవలం ప్రచార ఆర్భాటం ఉన్న ఉద్యోగిగా మిగిలిపోయాడు.



– దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

సెంట్రల్ సిల్క్ బోర్డ్ (సీఎస్‌బీ) 28 సైంటిస్ట్–బీ పోస్టులను భర్తీచేయనుంది. బీఈ/ బీటెక్ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్–2025 స్కోరు, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.

సైంటిస్ట్-బీ కొలువులు



గేట్-2025 స్కోరుతో షార్ట్‌లిస్ట్ చేసి ధ్రువపత్రాలను పరిశీలిస్తారు. ఇందులో విజయవంతమైనవారికి ఇంటర్వ్యూ/ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. వైద్య పరీక్షల అనంతరం కేటగిరీల వారీగా తుది ఎంపిక చేస్తారు. ఎంపికైనవారు ఏడాది ప్రొబేషన్‌లో కొనసాగుతారు.

వివరాలు

అర్హత: టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజినీరింగ్ అండ్ ఫైబర్ సైన్స్ బ్రాంచ్‌తో బీఈ/ బీటెక్. గేట్-2025 స్కోరు ఉండాలి.

వయసు: 18.02.2026 నాటికి 35 సంవత్సరాలు మించకూడదు. ప్రత్యేక వర్గాలకు చెందినవారికి గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, మాజీ సైనికోద్యోగులకు రూ.1000. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలకు ఫీజు లేదు. **వేతన శ్రేణి:** నెలకు రూ.56,100-1,77,500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.02.2026 **వెబ్‌సైట్:** https://csb.gov.in

బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ ప్రయోజనం ఎంత?

ఎంఈసీ గ్రూపుతో ఇంటర్ చదువుతున్నాను. బీబీఏలో బిజినెస్ అనలిటిక్స్ కోర్సుతో ప్రయోజనమేనా? మేటి సంస్థలు, ఉద్యోగ అవకాశాల వివరాలు తెలపండి? -కాత్యాయని

■ ఎంఈసీ గ్రూపుతో ఇంటర్మీడియట్ తర్వాత సీఏ, సీఎంఏ, బీబీఏ, బీకాం, బీఏ ఎకనామిక్స్, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ లాంటి కోర్సులను ఎంచుకోవచ్చు. ప్రస్తుత డిజిటల్ యుగంలో డేటా ఆధారిత నిర్ణయాలకు ప్రాధాన్యం పెరిగింది. ఈ నేపథ్యంలో బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ కోర్సు ఎంఈసీ విద్యార్థులకు ఆధునిక, భవిష్యత్తు అవకాశాలతో కూడిన డిగ్రీగా మారింది. వ్యాపార నిర్ణయాలను డేటా విశ్లేషణ ఆధారంగా తీసుకోవడం ఈ కోర్సు ప్రధాన లక్ష్యం.

◗ బీబీఏ బిజినెస్ అనలిటిక్స్.. మేనేజ్‌మెంట్ విద్యతో పాటు స్టాటిస్టిక్స్, లాజికల్ అనాలిసిస్, డేటా అర్థం చేసుకునే నైపుణ్యాలను కలిపి నేర్పించే కోర్సు. ఎంఈసీ గ్రూపులో చదివిన మ్యాథ్స్, ఎకనామిక్స్, కామర్స్ ఈ ప్రోగ్రాంకు బలమైన పునాదిని ఇస్తాయి. సంఖ్యలతో పని చేయడం, లాజికల్ థింకింగ్, వ్యాపార పరిస్థితులను విశ్లేషించడం లాంటి లక్షణాలు ఉన్న విద్యార్థులకు బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ చాలా అనుకూలంగా ఉంటుంది.



బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ చదివిన వారికి సాధారణ బీబీఏతో పోలిస్తే ఎక్కువ ప్రయోజనాలే ఉంటాయి. కేవలం మేనేజ్‌మెంట్ సిద్ధాంతాలకే పరిమితం కాకుండా, వ్యాపార సమస్యలను డేటా ద్వారా ఎలా పరిష్కరించాలి అనే దానిపై ప్రాక్టికల్ అవగాహన వస్తుంది. మార్కెట్ ట్రెండ్స్ విశ్లేషణ, వినియోగదారుల ప్రవర్తనను అర్థం చేసుకోవడం, ఖర్చులు–లాభాల విశ్లేషణ చేయడం లాంటి నైపుణ్యాలు ఈ కోర్సు ద్వారా అభివృద్ధి చెందుతాయి.

◗ భారతదేశంలో బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ లేదా అనలిటిక్స్ ఫోకస్ ఉన్న అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు అందిస్తున్న మేటి సంస్థలెన్నో ఉన్నాయి. ఈ కోర్సును పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నాయి. ఈ సంస్థల్లో ఇండస్ట్రీ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఉండటం వల్ల విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవం లభిస్తుంది. క్రైస్ట్ యూనివర్సిటీ-బెంగళూరు, సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ-పుణె, ఫ్లేమ్ యూనివర్సిటీ-పుణె, గీతం యూనివర్సిటీ-విశాఖపట్నం, కేఎల్ యూనివర్సిటీ-గుంటూరు, జైన్ యూనివర్సిటీ-బెంగళూరు, ప్రెసిడెన్సీ యూనివర్సిటీ-బెంగళూరు.. ఈ కోర్సు అందించే సంస్థల్లో ముఖ్యమైనవి. అయితే కాలేజీ ఎంపికలో పేరు మాత్రమే కాకుండా కోర్సు కంటెంట్, ప్రాక్టికల్ ట్రెయినింగ్, ప్లేస్‌మెంట్ రికార్డు తప్పనిసరిగా పరిశీలించాలి.

◗ బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ పూర్తిచేసిన తర్వాత ఉద్యోగ అవకాశాలు కూడా విస్తృతంగా ఉన్నాయి. జూనియర్ బిజినెస్ అనలిస్టు, డేటా అనాలిసిస్ ఎగ్జిక్యూటివ్, మార్కెట్ రిసెర్చ్ అనలిస్టు, ఆపరేషన్స్ అనలిస్టు, మేనేజ్‌మెంట్ ట్రెయినీ లాంటి ఉద్యోగాల్లో చేరవచ్చు. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఈ-కామర్స్ రిటైల్, కన్సల్టింగ్ సంస్థలు వీరిని ఎక్కువగా నియమిస్తున్నాయి. ప్రారంభ దశలోనే సాధారణ బీబీఏతో పోలిస్తే మెరుగైన వేతనమూ పొందే అవకాశం ఉంటుంది.

◗ డిగ్రీ తర్వాత ఉన్నత విద్య వైపు వెళ్లాలనుకునే వారికీ ఈ కోర్సు మంచి దారి చూపిస్తుంది. ఎంబీఏ బిజినెస్ అనలిటిక్స్, ఫైనాన్స్, మార్కెటింగ్ లాంటి కోర్సులు చేయవచ్చు. అలాగే డేటా అనలిటిక్స్, ఫైనాన్షియల్ అనలిటిక్స్‌కు సంబంధించిన సర్టిఫికేషన్ కోర్సులు చేస్తే ఉద్యోగ అవకాశాలు మరింత మెరుగవుతాయి. ఉద్యోగం చేస్తూనే పార్ట్‌టైమ్ లేదా ఆన్‌లైన్ పీజీ కోర్సులు చేయడం ద్వారా కెరియర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లవచ్చు.

ఎంఈసీ గ్రూపుతో ఇంటర్ చదువుతున్న విద్యార్థికి బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ ఒక ప్రయోజనకరమైన, భవిష్యత్ దృష్టితో కూడిన కోర్సు. సరైన సంస్థను ఎంచుకుని, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే మంచి ఉద్యోగాలు, స్థిరమైన కెరియర్ సాధించవచ్చు. డేటా ఆధారిత నిర్ణయాలు కీలకమైన ఈ కాలంలో బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ డిగ్రీకి మంచి డిమాండ్ ఉంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

సీసీఎంబీలో టెక్నీషియన్లు

సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ), హైదరాబాద్.. 80 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది.

● టెక్నికల్ అసిస్టెంట్: 25
● టెక్నికల్ ఆఫీసర్: 05
● టెక్నీషియన్(1)/గ్రేడ్-II(1): 50

అర్హత: టెక్నీషియన్ పోస్టులకు 50 శాతం మార్కులతో పదో తరగతి లేదా తత్సమాన విద్యార్హత. సంబంధిత విభాగంలో ఐటీఐ సర్టిఫికెట్ లేదా నేషనల్/ స్టేట్ ట్రేడ్ సర్టిఫికెట్, టెక్నికల్ అసిస్టెంట్, ఆఫీసర్ పోస్టులకు సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/ బీటెక్, బీఎస్సీ, ఎమ్మెస్సీలతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: టెక్నికల్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు; టెక్నికల్ ఆఫీసర్‌కు 30 ఏళ్లు; టెక్నీషియన్‌కు 28 ఏళ్లు మించకూడదు.

వేతనం: టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.72,240; టెక్నికల్ ఆఫీసర్‌కు రూ.90,100; టెక్నీషియన్‌కు రూ.39,545.

ఎంపిక: ట్రేడ్ టెస్టు, రాత పరీక్షలతో.

దరఖాస్తు ఫీజు: రూ.500; ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు ఫీజు లేదు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 23.02.2026.

చిరునామా: ఆన్‌లైన్ దరఖాస్తు హార్డ్‌కాపీలపై సంతకం చేసి, సంబంధిత ధ్రువపత్రాలను జత చేసి సెక్షన్ ఆఫీసర్, సీసీఎంబీ, ఉప్పల్ రోడ్, హబ్సిగూడ, హైదరాబాద్ చిరునామాకు పోస్టు ద్వారా పంపాలి.

హార్డ్‌కాపీ దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 02.03.2026. **వెబ్‌సైట్:** https://www.ccmb.res.in/Careers/RegulamPositions

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

బిజినెస్ ఆపరేషన్స్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
నైపుణ్యాలు: అటెన్షన్ టు డిటెయిల్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, గూగుల్ వర్క్‌స్పేస్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 19
☛ https://tinyurl.com/4p5mfmss

ఫైనాన్స్ అండ్ అకౌంట్స్

సంస్థ: టీ-హబ్ ఫౌండేషన్ **నైపుణ్యాలు:** బిజినెస్ రిసెర్చ్, ఫైనాన్షియల్ అనలిటిక్స్, మార్కెట్ రిసెర్చ్, ఎంఎస్-ఎక్సెల్, ప్రజెంటేషన్ స్కిల్స్ **స్టైపెండ్:** రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/2pefbyz9

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: జయిన్ వెబ్ టెక్
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, ఈమెయిల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సెర్చ్ ఇంజిన్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ **స్టైపెండ్:** రూ.8,000-14,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/6958yxk4

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: డెక్కన్ ఫౌండర్స్ మీడియా ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 19
☛ https://tinyurl.com/ws6j8hm

మార్కెటింగ్

సంస్థ: ఇండ్‌వెల్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్, తెలుగు మాట్లాడటం
స్టైపెండ్: రూ.5,100-10,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 19
☛ https://tinyurl.com/mw7pfbd4

విశాఖపట్నంలో

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: ఎస్‌బీ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.5,000-8,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 8
☛ https://shorturl.at/29231

ట్రావెల్ అండ్ టూరిజం

సంస్థ: ఫ్రాన్సెస్కో ఇమిగ్రేషన్ అండ్ అబ్రాడ్ సర్వీసెస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ రాయడం, మాట్లాడటం, హాలిడే ప్యాకేజ్ డిజైన్, ట్రావెల్ ఇటెనరరీ మేకింగ్, ట్రావెల్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000-11,000
దరఖాస్తు గడువు: మార్చి 7
☛ https://tinyurl.com/mr3kc5ez

గుంటూరు, విజయవాడల్లో

ఫీల్డ్ సేల్స్

సంస్థ: అడామ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, మార్కెట్ రిసెర్చ్, తెలుగు మాట్లాడటం
స్టైపెండ్: రూ.7,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 14
☛ https://shorturl.at/s7rDM

హెచ్‌సీఎల్‌లో ఎలక్ట్రీషియన్లు

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్), రాజస్థాన్ 18 చార్జ్‌మ్యాన్ (ఎలక్ట్రికల్), ఎలక్ట్రీషియన్ పోస్టులను భర్తీచేయనుంది. డిప్లొమా/ ఐటీఐ/ డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, ట్రేడ్ టెస్టు, రైటింగ్ ఎబిలిటీ టెస్టులతో నియామకాలు ఉంటాయి.

విద్యార్హతలు, ఖాళీల వివరాలు...

పోస్టు: చార్జ్‌మ్యాన్ (ఎలక్ట్రికల్) **ఖాళీలు:** 4
అర్హత: ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా, మైనింగ్ సూపర్‌వైజర్‌గా ఏడాది అనుభవం, సూపర్‌వైజరీ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ ఉండాలి/ఐటీఐ (ఎలక్ట్రికల్), మూడేళ్ల అనుభవం. లేదా పదోతరగతి, ఐదేళ్ల అనుభవం, సూపర్‌వైజరీ సర్టిఫికెట్ ఆఫ్ కాంపిటెన్సీ ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.28,740-72,110.

పోస్టు: ఎలక్ట్రీషియన్ 'ఏ' **ఖాళీలు:** 2
అర్హత: ఐటీఐ (ఎలక్ట్రికల్), నాలుగేళ్ల అనుభవం/ పదోతరగతి, ఏడేళ్ల అనుభవం, వైర్‌మెన్ పర్మిట్ ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.28,430-59,700.

పోస్టు: ఎలక్ట్రీషియన్ 'బీ' **ఖాళీలు:** 3
అర్హత: ఐటీఐ (ఎలక్ట్రికల్), మూడేళ్ల అనుభవం/ పదోతరగతి, ఏడేళ్ల అనుభవం, వైర్‌మెన్ పర్మిట్ ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.28,280-57,640.

పోస్టు: డబ్ల్యూఈడీ 'బీ' **ఖాళీలు:** 4
అర్హత: డిప్లొమా, ఏడాది అనుభవం, వైండింగ్ ఇంజిన్ డ్రైవర్స్ సర్టిఫికెట్/ ఏదైనా డిగ్రీ, ఏడాది అనుభవం/ ఐటీఐ, మూడేళ్ల అనుభవం/ పదోతరగతి, ఆరేళ్ల అనుభవం ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.28,280-57,640.

పోస్టు: డబ్ల్యూఈడీ 'సీ' **ఖాళీలు:** 5
అర్హత: డిప్లొమా, వైండింగ్ ఇంజిన్ డ్రైవర్స్ సర్టిఫికెట్/ ఏదైనా డిగ్రీ, ఆరు నెలల అనుభవం/ ఐటీఐ, రెండేళ్ల అనుభవం/ పదోతరగతి, నాలుగేళ్ల అనుభవం.
వేతన శ్రేణి: నెలకు రూ.28,120-55,620.



ఎంపిక: రెండు దశల్లో ఉంటుంది. మొదటి దశలోని రాత పరీక్షకు 100 మార్కులు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. సబ్జెక్ట్ నాలెడ్జ్ ప్రశ్నలకు 80 మార్కులు, జనరల్ నాలెడ్జ్‌కు 20 మార్కులు.

✦ ఇందులో జనరల్ అభ్యర్థులు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ 35 శాతం, ఓబీసీ-ఎన్‌సీఎల్ 38 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.

✦ వీరిని 1:3 నిష్పత్తిలో రెండో దశలోని ట్రేడ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఇది అర్హత పరీక్ష మాత్రమే. రాత పరీక్షలో పొందిన మార్కులతో తుది ఎంపిక చేస్తారు.

వివరాలు

వయసు: 01.01.2026 నాటికి 40 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కి మూడేళ్లు, క్రీడాకారులకు ఐదు నుంచి పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్/ అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ-ఎన్‌సీఎల్, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.500. ప్రత్యేక వర్గాలకు చెందినవారికి ఫీజు లేదు.

వేతనం: పోస్టులను బట్టి మారుతుంది. మూలవేతనానికి అదనంగా డీఏ, పెర్క్స్, అలవెన్స్, ఎక్స్‌గ్రేషియా, సెలవులు, పీఎఫ్, గ్రాట్యుటీ, ఎన్‌పీఎస్, వైద్య సదుపాయాలు ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.02.2026

వెబ్‌సైట్: https://www.hindustancopper.com

యూఓహెచ్‌లో ఎంబీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) 2026-28 విద్యా సంవత్సరానికి ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

కోర్సు: ఎంబీఏ **సీట్లు:** 75

అర్హత: ఏదైనా డిగ్రీతో పాటు క్యాట్ లేదా ఇతర జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ పరీక్షల స్కోరు ఉండాలి. డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులూ అర్హులే. **ఎంపిక:** వచ్చిన దరఖాస్తులు స్కోరు మెరిట్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసి, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు గడువు తేదీ:** జనవరి 31. **వెబ్‌సైట్:** http://acad.uohyd.ac.in/mba26.html

కరెంట్ అఫైర్స్

★ టైమ్ మ్యాగజైన్ '2025 సీఈఓ ఆఫ్ ది ఇయర్'గా ఎవరిని ఎంపిక చేసింది?



జ: నీల్ మోహన్ (ఈ భారత సంతతి వ్యక్తి ప్రపంచంలోనే అతి పెద్ద వీడియో ప్లాట్‌ఫామ్ అయిన యూట్యూబ్‌నకు సీఈఓగా ఉన్నారు.)

★ పురుషుల అంతర్జాతీయ క్రికెట్‌లోని మూడు ఫార్మాట్లు (టెస్టులు, వన్డేలు, టీ20లు)లో సెంచరీలు సాధించిన 6వ భారతీయుడిగా ఇటీవల ఎవరు ఘనత సాధించారు? (దక్షిణాఫ్రికాతో విశాఖపట్నంలో జరిగిన మూడో వన్డేలో సెంచరీ చేసి ఈయన ఈ ఘనత సాధించాడు. గతంలో ఈ ఘనత సాధించిన ఐదుగురు భారత క్రికెటర్లు సురేష్ రైనా, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్) జ: యశస్వి జైస్వాల్

మాదిరి ప్రశ్నలు

★ ఇంటర్నేషనల్ వాలంటీర్ డే (ఐవీడీ)ను ఏటా ఎప్పుడు నిర్వహిస్తారు? ('ఎవ్రీ కంట్రిబ్యూషన్ మ్యాటర్స్' అనే థీమ్‌తో 2025 దినోత్సవాన్ని నిర్వహించారు.) జ: డిసెంబరు 5

★ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్)ను 2025, డిసెంబరు 6 నుంచి 9 వరకు ఎక్కడ నిర్వహించారు? (2015 నుంచి నిర్వహిస్తున్న ఐఐఎస్ఎఫ్‌నకు ఇది 11వ ఎడిషన్. దీన్ని 'విజ్ఞాన్ సే సమృద్ధి: ఫర్ ఆత్మనిర్భర్ భారత్' అనే థీమ్‌తో నిర్వహించారు.) జ: పంచకుల, హరియాణా

మరింత సమాచారం

జూనియర్ ఇంటర్ వృక్ష శాస్త్రం

వృక్షరాజ్యం



ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

4 మార్కులు

1. ఎరుపు, గోధుమ వర్ణ శైవలాల మధ్య తేడాలను తెలపండి.

జ: **ఎరుపువర్ణ శైవలాలు:** 1) ఇవి రోడోఫైసి తరగతికి చెందినవి. 2) ప్రధాన వర్ణద్రవ్యాలు క్లోరోఫిల్ ఎ, డి, ఆర్- ఫైకోఎరిథ్రిన్. 3) నిల్వ ఆహారం ఫ్లోరిడియన్ స్టార్చ్. 4) కణకవచంలో సెల్యులోజ్, పెక్టిన్, పాలీ సల్ఫేట్ ఎస్టర్‌లు ఉంటాయి. 5) కశాభాలు ఉండవు. 6) వీటి దేహం బహుకణయుతంగా ఉంటుంది.

ఉదా: 1) పాలీ సైఫోనియా 2) గ్రాసిల్లేరియా

గోధుమవర్ణ శైవలాలు: 1) ఇవి ఫియోఫైసి తరగతికి చెందినవి. 2) ప్రధాన వర్ణద్రవ్యాలు క్లోరోఫిల్ ఎ, సి, ఫ్యూకోజాంథిన్. 3) నిల్వ ఆహారం లామినారిన్, మానిటాల్. 4) కణకవచంలో సెల్యులోజ్, ఆల్జిన్‌లు ఉంటాయి. 5) కశాభాలు ఉంటాయి. అసమానం, పార్శ్వం. 6) వీటి దేహం తంతురూపం లేదా శాఖాయుతం. **ఉదా:** 1) లామినేరియా, సర్గాసం.

2. లివర్ వర్ట్‌లు, మాస్ మొక్కల మధ్య తేడాలను గుర్తించండి.

జ: **లివర్ వర్ట్‌లు:** 1) మొక్కదేహం పృష్ఠోదర విభేదనాన్ని కలిగి థాలస్‌లా ఉంటుంది. 2) శాఖీయ ప్రత్యుత్పత్తి థాలస్ ముక్కలు కావడం వల్ల, జెమ్మాల ద్వారా జరుగుతుంది.
3) స్త్రీ, పురుష బీజాశయాలు ఒకే థాలస్ లేదా వేర్వేరు థాలస్‌ల మీద ఏర్పడతాయి. 4) సహతంతువులు ఉండవు.
5) సిద్ధబీజాల విడుదలకు ఇలేటర్లు తోడ్పడతాయి.

ఉదా: మార్కాంషియా

మాస్ మొక్కలు: 1) మొక్క దేహం కాండం, పత్రం లాంటి భాగాలను, మూల తంతువులతో ఉంటుంది.
2) శాఖీయ ప్రత్యుత్పత్తి ముక్కలవడం, జెమ్మాలు ద్వితీయ ప్రథమ తంతువులోని మొగ్గల ద్వారా జరుగుతుంది. 3) స్త్రీ, పురుష బీజాశయాలు గామిటోఫోర్ అగ్రభాగంలో ఏర్పడతాయి.
4) లైంగిక అవయవాల మధ్య సహతంతువులు ఉంటాయి.
5) సిద్ధబీజాల విడుదలకు పరిముఖ దంతాలు తోడ్పడతాయి.
ఉదా: ఫ్యునేరియా

3. టెరిడోఫైటాలో, సమసిద్ధబీజాలు లేదా భిన్నసిద్ధబీజాలు అంటే ఏమిటి? రెండు ఉదాహరణలు ఇవ్వండి.

జ: 1) చాలా టెరిడోఫైటా మొక్కలు ఒకే రకమైన సిద్ధబీజాలను ఏర్పరుస్తాయి. అలాంటి మొక్కలను సమసిద్ధబీజ మొక్కలు అంటారు. **ఉదా:** టెరిస్, లైకోపోడియం

2) కొన్ని టెరిడోఫైటా మొక్కలు రెండు రకాల సిద్ధబీజాలను ఉత్పత్తి చేస్తాయి. అవి 1) సూక్ష్మ సిద్ధబీజాలు, 2) స్థూల సిద్ధబీజాలు. వీటిని భిన్న సిద్ధబీజ మొక్కలు అంటారు.

ఉదా: సెలాజినెల్లా, సాల్వీనియా

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: టి. నాగరాజు

దారాలు-ప్లాస్టిక్





దారాలు, ప్లాస్టిక్ అనేవి పాలిమర్‌తో ఏర్పడే పదార్థాలు. పాలిమర్ అనే ఆంగ్ల పదం పాలి, మోర్ అనే గ్రీకు పదాల నుంచి ఉద్భవించింది. గ్రీకు భాషలో 'పాలి' అంటే ఎక్కువ; మోర్ అంటే భాగం/యూనిట్ అని అర్థం. అనేక చిన్న చిన్న యూనిట్లతో కలిసి పొడవైన గొలుసుల మాదిరి ఏర్పడే నిర్మాణాన్ని 'పాలిమర్' అంటారు. సహజ పాలిమర్‌కు ఉదాహరణ సెల్యులోజ్. దీనిలో గ్లూకోజ్ అనే మోనోమర్‌లు ఉంటాయి.

దారాలు-రకాలు

సన్నని, పొడవైన, తంతువు లాంటి పదార్థాలను 'దారాలు' అంటారు. ఇవి ప్రధానంగా రెండు రకాలు అవి- 1) సహజ దారాలు 2) కృత్రిమ దారాలు.

సహజ దారాలు: మొక్కలు, జంతువుల నుంచి లభించే దారాలను సహజ దారాలు అంటారు.

మొక్కల నుంచి లభించే దారాలు: పత్తి, జనుము నార, కొబ్బరి నార, అరటి నార మొదలైనవి.

జంతువుల నుంచి లభించే దారాలు: ఉన్ని, పట్టు.




పత్తి: పత్తి కాయల్లో ఉండే తెల్లటి పదార్థాన్ని పత్తి అంటారు. పత్తి నుంచి గింజలను వేరు చేయడాన్ని 'జిన్నింగ్' అంటారు. జిన్నింగ్‌తో ఏర్పడే పదార్థమే 'దూది'. పత్తిలో సెల్యులోజ్ అనే కార్బోహైడ్రేట్ ఉంటుంది. దూదిలోని పోగులను 'నూలు దారాలు' అంటారు. ఆ పోగులను పురి పెడుతూ దారంగా మార్చడమే వడకడం/స్పిన్నింగ్. నూలు దారాలను ఉపయోగించే పరికరాలు చరఖా, రాట్నం, తకిలీ. పుస్తకాల బైండింగ్‌కు వాడే వస్త్రాలను 'కాలికో' అంటారు. పత్తికి నల్లరేగడి నేలలు అనుకూలం. ఏపీలో ప్రకాశం, గుంటూరు; తెలంగాణలో నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో అధికంగా పండుతుంది.

జనపనార: పూత దశకు వచ్చిన జనుము మొక్కల కాండాల నుంచి జనపనార తీస్తారు. ఇది దృఢంగా, గరుకుగా ఉంటుంది. దుస్తుల తయారీకి ఉపయోగపడదు. దీనినే 'బంగారు దారం' అంటారు. జనపనార పండించే రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్, ఒడిశా, అస్సాం, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, మేఘాలయ, త్రిపుర. ఒక్క బెంగాల్‌లోనే 50% జనపనార ఉత్పత్తి అవుతోంది.



◆ 1823లో ఛార్లెస్ మెకింతోష్ వర్షానికి తడవని దుస్తులు తయారుచేశాడు. ◆ వాల్డో ఎల్‌సీమన్ అనే శాస్త్రవేత్త ఫ్లెక్సీల తయారీలో ఉపయోగించే పాలీ వినైల్ క్లోరైడ్ కనుక్కున్నాడు. ◆ 1970లో మియోషి వోకమెటో అనే శాస్త్రవేత్త మొదటి సూక్ష్మదారాన్ని తయారుచేశాడు.



ఛార్లెస్ మెకింతోష్


నిత్యం అందరూ వాడే దుస్తులు, బ్యాగులు, నీటి సీసాలు, ఆహార డబ్బాలు, వంట సామగ్రి, వైద్య పరికరాలన్నీ చాలా వరకు దారాలు, ప్లాస్టిక్‌లతో తయారైనవే. పత్తి, జనుము లాంటివి సహజ దారాలు. పెట్రో రసాయనాల నుంచి నైలాన్, రేయాన్, అక్రలిక్ తదితర కృత్రిమ దారాలు తయారవుతాయి. పళ్లు తోముకునే బ్రష్ కుంచెల నుంచి వాహనాల టైర్లు, పిల్లల డైపర్లు, తివాచీలు, కంబళ్లు మొదలైనవి ఎన్నో ఈ కృత్రిమ దారాలతోనే రూపొందుతున్నాయి. ఈ విధంగా దారాలు, ప్లాస్టిక్‌లు ఆధునిక జీవితాన్ని సౌకర్యవంతంగా మార్చాయి. దుస్తుల తయారీలో దారాలు ముఖ్యపాత్ర పోషిస్తే, ప్యాకేజింగ్, గృహోపకరణాలు, వైద్యం, పరిశ్రమల్లో ప్లాస్టిక్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. వీటిలో ఉన్న రకాలు, తయారీ విధానం, భిన్న ప్రయోజనాల గురించి పోటీ పరీక్షార్థులకు పరిజ్ఞానం ఉండాలి. పర్యావరణ సమస్యలకు కారణమవుతున్న ప్లాస్టిక్స్ వినియోగం విషయంలో పాటించాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవాలి.



మన్నికగా.. తేలికగా.. సౌకర్యంగా!

ప్లాస్టిక్ - రకాలు

కృత్రిమ దారాల మాదిరిగా ప్లాస్టిక్ కూడా ఒక పాలిమర్. అందులో మోనోమర్లు రెండు రకాలుగా అమరి ఉంటాయి ప్లాస్టిక్‌ను మొదటిసారిగా తయారు చేసినవారు - అలెగ్జాండర్ పార్క్స్. దీనిని అభివృద్ధి చేసి ప్లాస్టిక్ పరిశ్రమ పితామహుడిగా బేక్ ల్యాండ్ గుర్తింపు పొందారు. ప్లాస్టిక్ ప్రధానంగా 2 రకాలుగా ఉంది.



అలెగ్జాండర్ పార్క్స్

థర్మోప్లాస్టిక్: వేడి చేసినప్పుడు ముడుచుకుపోయే, వంచడానికి వీలయ్యే ప్లాస్టిక్‌ను థర్మోప్లాస్టిక్ అంటారు. దీనిని వేడి చేసినప్పుడు ద్రవస్థితిలోకి, చల్లారిస్తే గాజు స్థితిలోకి ఘనీభవిస్తుంది. థర్మోప్లాస్టిక్‌ను 1920లో హెర్మన్ స్టాండింగర్ కనుక్కున్నారు. పాలిమర్లు పొడవాటి గొలుసులు ఉన్న అణువులుగా ఉంటాయని తెలిపిన ఈయనకు 1953లో నోబెల్ బహుమతి వచ్చింది.

ఉపయోగాలు: పాలిథీన్ కవర్లు, ప్లాస్టిక్ సీసాలు, బకెట్లు, మగ్గులు, ప్లేట్లు, బొమ్మలు, దువ్వెనలు, సిరంజీలు, నైలాన్ తాళ్లు, పీవీసీ పైపుల తయారీలో ఉపయోగిస్తారు.

టెఫ్లాన్: అధిక ఉష్ణాన్ని తట్టుకోగలిగిన, ఆహార పదార్థాలకు అంటుకోని ప్లాస్టిక్. దీనిని నాన్‌స్టిక్ పాన్ ఉపరితలంపై పూత మాదిరి ఉపయోగిస్తారు.

థర్మోసెట్టింగ్ ప్లాస్టిక్: ఒకసారి వంచిన తర్వాత వేడి చేయడం ద్వారా మృదువుగా మార్చలేని ప్లాస్టిక్‌లే థర్మోసెట్టింగ్ ప్లాస్టిక్‌లు. దీనిని వేడిచేస్తే నల్ల బొగ్గుగా మారుతుంది లేదా మండుతుంది. **ఉదా:** బెకలైట్, మెలమిన్.

బెకలైట్: కార్బోనిక్ ఆమ్లం, ఫార్మాల్డీహైడ్‌ల సమ్మేళన పదార్థం. బెకలైట్‌ను తక్కువ ఉష్ణ, విద్యుత్తు వాహకత్వం ఉన్న వంటపాత్రల పిడులు, స్విచ్ బోర్డుల తయారీలో, ముత్యాల లాంటి రాళ్లకు ప్రత్యామ్నాయాలుగా ఉపయోగిస్తారు. ఇచ్చిన ప్లాస్టిక్ పదార్థం బెకలైట్ అవునో, కాదో వేడి గుండు సూది



పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చు. సూది లోపలికి చొచ్చుకుపోయినా లేదా పదార్థం కరిగినా ఆ వస్తువు బెకలైట్ కాదు.

మెలమిన్: వంటపాత్రలు, గృహోపకరణాల తయారీకి వాడతారు. దీనికి మంటను నిరోధించే శక్తి ఉంటుంది. అగ్నిమాపక సిబ్బంది ధరించే దుస్తులు, ఫ్లోర్ మెటీరీయల్, కీబోర్డు, కంప్యూటర్, టీవీలపై భాగం (కేబినెట్) తయారీకి ఉపయోగిస్తారు.

జనరల్ స్టడీస్
రసాయన శాస్త్రం

కృత్రిమ దారాలు

పెట్రోలియం ఉత్పత్తుల నుంచి రసాయన ప్రక్రియల ద్వారా తయారుచేసే దారాలను 'కృత్రిమ దారాలు' అంటారు. సహజ దారాల ఉత్పత్తి, లభ్యత తగినంతగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా శాస్త్రవేత్తలు వీటిని రూపొందించారు. **ఉదా:** నైలాన్, రేయాన్, అక్రలిక్, పాలిస్టర్ మొదలైనవి.



నైలాన్: మొదటి సారిగా తయారు చేసిన కృత్రిమ దారం. రెండో ప్రపంచయుద్ధ కాలంలో ప్రాచుర్యంలోకి వచ్చింది. నేలబొగ్గు, నీరు, గాలి మిశ్రమంతో వీటిని తయారు చేస్తారు. నైలాన్ అనే పాలిమర్ పాలి ఎమైడ్ (హెక్సా మిథిలీన్ డైఎమీన్, ఎడిపిక్ ఆమ్లంల కలయిక) అనే రసాయన యూనిట్లతో తయారవుతుంది. నైలాన్ స్టీల్ తీగ కంటే గట్టిగా ఉంటుంది.

ఉపయోగాలు: తాళ్లు, గుడారాలు, చేపల వలలు, టూత్‌బ్రష్ కుంచె, ఈత దుస్తులు, కారు టైర్లు, మేజోళ్లు మొదలైన వాటి తయారీలో వాడతారు.

రేయాన్ దీనినే 'కృత్రిమ పట్టు' అంటారు. మొదటిసారిగా 1911లో అమెరికాలో తయారుచేశారు. 1924లో ఈ దారాలకు రేయాన్ అని పేరు పెట్టారు. 1946లో రేయాన్ పరిశ్రమను కేరళలో స్థాపించారు. రేయాన్‌ను మొక్కల సెల్యులోజ్‌తో తయారుచేస్తారు. అందుకే దీనిని 'సెల్యులోజ్ దారం' అంటారు.

ఉపయోగాలు: రేయాన్‌ను నూలుతో కలిపి దుప్పట్లు, ఉన్నితో కలిపి తివాచీలు; ఫ్యాషన్ గృహాలంకరణలోనూ వాడుతున్నారు. ఆరోగ్య సంబంధ ఉత్పత్తుల తయారీ (డైపర్స్, బ్యాండేజ్ దారాలు)లోనూ ఉపయోగిస్తారు.

అక్రలిక్: దీన్ని కృత్రిమ ఉన్ని లేదా నకిలీ ఉన్ని అంటారు. వాణిజ్య పరంగా 1941 నుంచి అందుబాటులోకి వచ్చింది. నేలబొగ్గు, నీరు, గాలి, నూనె, సున్నపురాయి మిశ్రమంతో తయారుచేస్తారు.

ఉపయోగాలు: మేజోళ్లు, స్వెట్టర్లు, శాలువాలు, క్రీడాదుస్తులు, తివాచీలు, వాహనాల కవర్లకు ఉపయోగిస్తారు.

పాలిస్టర్: ఇది చాలా సాధారణంగా వాడే కృత్రిమ దారం. డై మిథైల్ ఈథర్, టెరిఫ్తాలిక్ ఆమ్లం చర్య జరిపినప్పుడు ఏర్పడే ఉత్పన్నాన్ని డై హైడ్రిక్ ఆల్కహాల్‌తో చర్య జరిపించి పాలిస్టర్‌ను తయారుచేస్తారు. ఇది ఒక రకమైన ప్లాస్టిక్. ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్న పాలిస్టర్ రకం టెర్లిన్. సులభంగా మంటకు అంటుకుంటుంది. దీనిని వస్త్రాలతోపాటు సోడా సీసాల తయారీలోనూ వాడతారు.



రచయిత: ఎస్. రామకృష్ణ

మహిళలకు 'స్టెప్'.. పిల్లలకు 'హరిహర్'!

ఏ సమాజానికైనా మహిళలు, పిల్లలు మూలస్తంభాలు. వారు ఆరోగ్యంగా, సురక్షితంగా, సుశిక్షితులుగా ఉంటే మొత్తం సమాజానికి ప్రయోజనం చేకూరుతుంది. దేశం ప్రగతిపథంలో నడుస్తుంది. అందుకే వీరి సంక్షేమం, విద్య, భద్రత, ఉపాధికి భారత రాజ్యాంగంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం ప్రాధాన్యం ఇస్తున్నాయి. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వారి సాధికారతకు కృషి చేస్తున్నాయి. ఈ మేరకు మహిళలు, పిల్లల కోసం చేసిన చట్టాలు, అమలు చేస్తున్న విధానాలు, పథకాలపై పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి పూర్తి అవగాహన ఉండాలి. దేశం అభివృద్ధి మార్గంలో పయనించే విధంగా మహిళలు, పిల్లలకు వ్యవస్థాగతంగా ఉన్న అవకాశాలు, కల్పిస్తున్న ప్రోత్సాహకాలను తెలుసుకోవాలి.

భారతదేశంలో మహిళలు, బాలల సంక్షేమం - సాధికారిత

1. వ్యవసాయ రంగంలో మహిళా శ్రామిక శక్తిని ఉపయోగించుకునే లక్ష్యంతో ప్రారంభించిన 'నమో డ్రోన్ దీదీ' పథకానికి 2025-26 బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయించారు?
1) రూ.980.65 కోట్లు 2) రూ.950.85 కోట్లు
3) రూ.870.65 కోట్లు 4) రూ.875.40 కోట్లు

2. 2023-24 మహిళా శ్రామిక భాగస్వామ్య రేటు ఎంత?
1) 49.1% 2) 41.7% 3) 43.4% 4) 38.4%

3. 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది రైట్ ఆఫ్ ది చైల్డ్-1989' ప్రకారం బాలలు అంటే ఎన్నేళ్లలోపు వారు?
1) 16 2) 15 3) 18 4) 14

4. 'మహిళా సాధికారిత - భారత సాధికారిత' అనే లక్ష్యంతో 2013లో ఏర్పాటు చేసిన భారతీయ మహిళా బ్యాంకు కింది ఏ బ్యాంకులో విలీనమైంది?
1) బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
2) బ్యాంక్ ఆఫ్ బరోడా
3) ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
4) స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

5. ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమం కింద పాఠశాల, ఉన్నత విద్య కోసం 'పీఎం-ఇ-విద్య'ను ఎప్పుడు ప్రారంభించారు?
1) 2020, మే 2) 2021, జూన్
3) 2022, ఏప్రిల్ 4) 2020, డిసెంబరు

6. ప్రపంచంలోనే అతి పెద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రధాన కేంద్రం ఎక్కడుంది?
1) కోల్‌కతా 2) వారణాసి
3) బెంగళూరు 4) హైదరాబాద్

7. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) 2023 ప్రకారం అవ్యవస్థీకృత రంగంలో ఎంత శాతం మహిళలు పనిచేస్తున్నారని అంచనా?



1) 64.9%
2) 62.9%
3) 71.5%
4) 70.3%

8. 2025, జులై నాటికి ఎన్ని కోట్ల గ్రామీణ కుటుంబాలకు 'జల్ జీవన్ మిషన్' కింద పైపుల ద్వారా నీటి సరఫరా అందించారు?
1) 15.67 కోట్లు 2) 15.10 కోట్లు
3) 15.62 కోట్లు 4) 15.96 కోట్లు

9. 2024లో లోక్‌సభకు ఎంపికైన మహిళా సభ్యుల సంఖ్య?
1) 59 2) 74 3) 64 4) 72

10. ఏ రాజ్యాంగ అధికరణ స్త్రీ, పురుషులకు సమాన వేతనం గురించి వివరిస్తుంది?
1) ఆర్టికల్-42 2) ఆర్టికల్-39(ఇ)
3) ఆర్టికల్-39(డి) 4) ఆర్టికల్ 39(ఎ)

11. బాలకార్మిక నిషేధ, నియంత్రణ చట్టం-1986కు సంబంధించి, కింది వాటిని సరిచూడండి.



ఎ) ఈ చట్టం ప్రకారం 14 సంవత్సరాల్లోపు బాలలను పనుల్లో నియమించరాదు.
బి) సెక్షన్ 13 పిల్లల ఆరోగ్య రక్షణ గురించి చెబుతుంది.
1) ఎ సరైంది 2) బి సరైంది
3) ఎ, బి సరైనవి 4) ఎ, బి సరికావు

12. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఆంగ్ల మాధ్యమంలో అందించడానికి మోడల్ స్కూలు పథకం (ఆదర్శ పాఠశాల) ఎప్పుడు ప్రారంభించారు?
1) 2008 2) 2009 3) 2012 4) 2011

13. మహిళా సంక్షేమానికి సంబంధించి 9 నుంచి 12వ ప్రణాళిక వరకు కింది వాటిలో ఏ అంశానికి ప్రాధాన్యం ఇచ్చారు?
1) మహిళా అభివృద్ధి 2) ఆరోగ్యం, విద్య
3) సాధికారత 4) జండర్ బడ్జెటింగ్

14. భారతదేశంలో ఎప్పుడు ప్రత్యేకంగా మహిళలు - శిశువుల కోసం మంత్రిత్వశాఖ ఏర్పడింది?
1) 2006 2) 2009 3) 2010 4) 2008

15. ఎంఎస్ఎంఈ నివేదిక-2025 ప్రకారం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఎంత శాతం మహిళా శ్రామిక శక్తి ఉంది?



1) 14.21%
2) 13.53%
3) 13.31%
4) 12.62%

16. నాబార్డు ద్వారా స్వయంసహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జీ) బ్యాంకు లింకేజ్ ప్రోగ్రాంను ఎప్పుడు ప్రారంభించారు?
1) 1992 2) 1994 3) 1999 4) 1990

17. కింది వాటిని పరిశీలించి, సరైన సమాధానాన్ని గుర్తించండి.
ఎ) భారతదేశంలో 39.2% మహిళలకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి.
బి) ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకు ఖాతా ఉన్నవారు 42%.
1) ఎ సరైంది 2) బి సరైంది
3) ఎ, బి సరికావు 4) ఎ, బి సరైనవి

18. 6-14 ఏళ్ల బాలబాలికలకు నిర్బంధ ప్రాథమిక విద్య అందాలని ఏ అధికరణ చెబుతుంది?
1) 20(ఎ) 2) 21(ఎ) 3) 23 4) 24

19. కింది వాటిలో సరికానిది?
1) హిందూ దత్తత, నిర్వహణ చట్టం-1956
2) బాల కార్మికుల నిషేధ, నియంత్రణ చట్టం-1988
3) బాలల న్యాయ సవరణ చట్టం-2021
4) వెట్టిచాకిరీ నిర్మూలన చట్టం-1976

20. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఎప్పుడు ఏర్పాటైంది?
1) 2005 2) 2007 3) 2009 4) 2010

21. కుటుంబ న్యాయస్థానాల చట్టం-1984 ప్రకారం వీటిని ఏర్పాటు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
1) రాష్ట్ర ప్రభుత్వం 2) గవర్నర్
3) హైకోర్టు 4) సుప్రీంకోర్టు

22. ప్రస్తుతం జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్?
1) విజయ కిశోర్ రహత్కర్
2) మమతా కుమారి
3) జయంత్ పట్నాయక్
4) రేఖా శర్మ



విజయ కిశోర్ రహత్కర్

23. పిల్లలకు తల్లి పాలు పట్టడాన్ని ప్రోత్సహించేందుకు యునిసెఫ్, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా 'మదర్స్ అబ్సల్యూట్ అఫెక్షన్'ను ఎప్పుడు ప్రారంభించాయి?



జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

1) 2018 2) 2016 3) 2020 4) 2015

24. సతీసహగమన నిరోధక చట్టం ఏ సంవత్సరంలో చేశారు?
1) 1990 2) 1989 3) 1987 4) 1992

25. రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఎవరు ఏర్పాటు చేస్తారు?
1) శాసన సభ 2) గవర్నర్
3) సుప్రీంకోర్టు 4) రాష్ట్ర ప్రభుత్వాలు

26. భారతదేశంలో మహిళా సాధికారిత కోసం ఏర్పాటు చేసిన 'స్టెప్' పథకం ప్రధాన ఉద్దేశం?



1) మహిళా అక్షరాస్యత
2) మహిళా పొదుపు ప్రోత్సాహం
3) మహిళలకు శిక్షణ 4) ఏదీకాదు

27. కింది వాటిలో ఏ రాష్ట్ర ప్రభుత్వం నిరాశ్రయులైన, విడిచిపెట్టిన, లొంగిపోయిన పిల్లల పునరావాసం కోసం హరిహర్ పథకం ప్రారంభించింది?
1) ఉత్తర్‌ప్రదేశ్ 2) హరియాణా
3) తెలంగాణ 4) మధ్యప్రదేశ్

28. ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం 'ఉమెన్ ఎట్ వర్క్' ప్రోగ్రాం ప్రారంభించింది?
1) ఆంధ్రప్రదేశ్ 2) తెలంగాణ
3) బిహార్ 4) కర్ణాటక

29. కిందివారిలో ఎవరికి జాతీయ మహిళా కమిషన్‌ను నియమించే, తొలగించే అధికారం ఉంటుంది?
1) రాష్ట్రపతి 2) పార్లమెంటు
3) కేంద్ర ప్రభుత్వం 4) సుప్రీంకోర్టు

30. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం (పోక్సో)ను పార్లమెంటు ఏ సంవత్సరంలో ఆమోదించింది?
1) 2014 2) 2015 3) 2012 4) 2016

31. జాతీయ మహిళా దినోత్సవాన్ని ఫిబ్రవరి 13న ఎవరి జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తారు?
1) దుర్గాబాయి దేశ్‌ముఖ్ 2) సరోజినీ నాయుడు
3) ఇందిరా గాంధీ 4) సావిత్రిబాయి పులే

32. కింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.
ఎ) బేటీ బచావో-బేటీ పఢావో-2015, జనవరి 22
బి) ఇంద్రధనస్సు-2014, డిసెంబరు 25
సి) సుకన్య సమృద్ధి యోజన-2015, జనవరి 22
డి) డిజిటల్ జెండర్ అట్లాస్-2015, మార్చి 9
1) ఎ, బి 2) సి, డి
3) ఎ, బి, సి, డి 4) బి, డి

33. భారత ప్రభుత్వం 2016లో ప్రారంభించిన మహిళా ఇ-హాట్ పథకం ముఖ్య ఉద్దేశం?
1) మహిళలకు ఆన్‌లైన్‌లో వ్యవస్థాపక అవకాశాలు అందించడం.
2) వివిధ స్థాయుల్లో మహిళలకు భద్రత
3) మహిళలకు ఉపాధి
4) మహిళలకు సురక్షితమైన వసతి కల్పన

34. కింది వాటిలో మహిళా సాధికారితలో ఏ సంస్థ ముఖ్యపాత్ర పోషిస్తుంది?
1) ప్రభుత్వేతర సంస్థలు (ఎన్జీఓ)
2) స్వయంసహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీ)
3) పంచాయతీరాజ్ సంస్థలు
4) పైవన్నీ

35. 10.33 కోట్ల ఎల్‌పీజీ కనెక్షన్లు అందించే ప్రధాన మంత్రి ఉజ్వల యోజన పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
1) 2020 2) 2016 3) 2017 4) 2021

36. ఏ రాష్ట్ర ప్రభుత్వం 'ముఖ్యమంత్రి మాతృత్వ సహాయత యోజన'ను గర్భిణుల కోసం ప్రారంభించింది?
1) మధ్యప్రదేశ్ 2) పంజాబ్
3) హరియాణా 4) కేరళ

37. ముస్లిం మహిళల (వివాహ హక్కుల రక్షణ) చట్టం ఏ సంవత్సరంలో అమల్లోకి వచ్చింది?
1) 2019 2) 2020
3) 2021 4) 2022

సమాధానాలు

1-2; 2-2; 3-3; 4-4; 5-1; 6-3; 7-2; 8-1; 9-2; 10-3; 11-3; 12-1; 13-4; 14-1; 15-3; 16-1; 17-4; 18-2; 19-2; 20-2; 21-3; 22-1; 23-2; 24-3; 25-4; 26-3; 27-2; 28-4; 29-3; 30-3; 31-2; 32-3; 33-1; 34-4; 35-2; 36-3; 37-1.

ప్రతి వ్యక్తికీ మెరుగైన జీవనం, సౌకర్యాలు, అభివృద్ధి అవసరం. ఆయా దేశ ప్రభుత్వాలు వీటిని తమ పౌరులకు అందించడంతోపాటు ఇతర దేశాల కంటే మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నాయి. అయితే వీటిని సాధించే క్రమంలో పరిసరాలతోపాటు పర్యావరణం నాశనమవుతోంది. తద్వారా ప్రాణకోటికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వేగవంతమైన పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, జనాభా పెరుగుదల మొదలైనవి పర్యావరణ క్షీణతకు ప్రధాన కారణాలు. వాతావరణ మార్పులు, జీవవైవిధ్య నష్టం, అడవుల నరికివేత, కాలుష్యం లాంటివి ఇందులో భాగాలు. ప్రస్తుత, భవిష్యత్తు తరాల జీవితాలు ఆనందమయంగా సాగాలంటే స్వచ్ఛమైన పర్యావరణం అవసరం. పర్యావరణ పరిరక్షణ విధానాలతోనే దీన్ని సాధించగలం.



◆ మనం నివసిస్తున్న భౌతిక జీవన పరిసరాలను 'పర్యావరణం' అంటారు. ఇందులో జీవులు, నిర్జీవులు అనే రెండు అంశాలు ఉంటాయి. పర్యావరణాన్ని ఆంగ్లంలో 'ఎన్విరాన్మెంట్' అంటారు. ఇది ఎన్విరానర్ (environner) అనే ఫ్రెంచ్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం 'చుట్టూ ఉన్న'.

◆ "ప్రకృతి మానవుడి అవసరాలను తీరుస్తుంది. దురాశను కాదు" అని మహాత్మా గాంధీ అన్నారు.

◆ నాగరికత ప్రారంభం నుంచే మానవులు ప్రకృతిపై ఆధారపడి జీవిస్తున్నారు. మనకు కావాల్సిన తిండి, దుస్తులు, నివాసం లాంటి ప్రాథమిక అవసరాలను అదే తీరుస్తోంది. అందుకే మన ఆచారాల్లో ప్రకృతిని ఆరాధించే నియమం ఉంది. అయితే కొన్నేళ్లుగా ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. మానవుడు తన అవసరాల కోసం సహజ వనరులను విచ్చలవిడిగా వాడటం మొదలుపెట్టాడు. దీంతో పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటోంది.

అభివృద్ధి, పర్యావరణ సమస్యలు - పర్యావరణ పరిరక్షణ విధానం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

మించిన అవసరాలే.. అనర్థాలకు మూలం!

పర్యావరణ మార్పు

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటోన్న అతిపెద్ద సమస్యల్లో పర్యావరణ మార్పు ఒకటి. ప్రకృతిలోని వనరులను ఉపయోగించుకుని మానవులు తమకు కావాల్సిన వివిధ వస్తువులను ఉత్పత్తి చేసుకుంటున్నారు. దీన్నే 'ఉత్పత్తి - వినియోగ' ప్రక్రియ అంటారు. ప్రస్తుతం వీటిని అవసరాలకు మించి విచక్షణా రహితంగా వినియోగిస్తున్నారు. దీంతో ఎన్నో వ్యర్థాలు, కాలుష్య కారకాలు విడుదలవుతున్నాయి. ఫలితంగా పర్యావరణం మార్పునకు గురవుతోంది. కరవు, వరదలు, తుపానులు లాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. వీటి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలివెళ్లాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

❖ మానవుడు అభివృద్ధి కార్యకలాపాల పేరుతో వనరులను దుర్వినియోగం చేస్తూ, పర్యావరణ సమతౌల్యాన్ని దెబ్బతీస్తున్నాడు. దీని ఫలితమే గ్లోబల్ వార్మింగ్, ఆమ్లవర్షాలు, ఓజోన్ పొర క్షీణత, భూగర్భ జలాల పరిమాణం తగ్గిపోవడం, ఎడారీకరణ, వరదలు, దుర్భిక్షం, భూకంపాలు, సునామీల తీవ్రత పెరగడం, అంటు వ్యాధులు ప్రబలడం మొదలైనవి.

❖ పర్యావరణంపై మానవుడి ప్రభావం మూడు రకాలుగా ఉంటుంది. అవి:

1 ఉపాధి, విద్య, వైద్యం, విలాసవంతమైన జీవితం మొదలైనవాటి కోసం ప్రజలు గ్రామాలు విడిచి నగరాలకు వలస వెళ్తున్నారు. దీంతో పట్టణ ఆవరణ వ్యవస్థలు కలుషితం అవుతున్నాయి. నగరాల్లో మురికివాడల సంఖ్య పెరగడం, తాగునీరు, ఆరోగ్యపరమైన సమస్యలు తీవ్రమవుతున్నాయి.

2 నూతన సాంకేతికతతో చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నంలో సహజ ఆవరణ వ్యవస్థల స్వభావాన్ని మార్చడంతో ప్రకృతి వనరుల నాణ్యత తగ్గిపోతోంది. జీవవైవిధ్యం దెబ్బతింటోంది.

ఉదా: పశ్చిమ రాజస్థాన్‌లోని ఎడారి ప్రాంతాలకు సాగు నీటిని అందించే ఉద్దేశంతో ఇందిరాగాంధీ కాలువ నిర్మించారు. దీని వల్ల జొన్న, సజ్జ లాంటి ఆహార పంటల సాగు తగ్గి చెరకు, పత్తి మొదలైన వాణిజ్య పంటల సాగు విస్తరించింది. సాంద్ర వ్యవసాయ విధానాల వల్ల భూ వనరులు క్షారనేలలుగా మారిపోతున్నాయి.

3 పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి అధికం చేసే ప్రయత్నంలో హరిత విప్లవ సాంకేతిక పద్ధతులైన రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని అధికం చేశారు. దీనివల్ల భూ, జలవనరులు కాడ్మియం, ఫ్లోరిన్, లెడ్ లాంటి భార లోహాలతో కలుషితమయ్యాయి.

ఉదా: ప్రస్తుతం మానవుడు ఎదుర్కొంటున్న ఫ్లోరోసిస్, ఇటాయి - ఇటాయి, మినిమాటా లాంటి వ్యాధులకు కారణం తాగే నీటిలో ఈ కాలుష్యాల పరిమితి ఎక్కువ కావడమే.

వాతావరణ మార్పుల పనితీరు సూచిక - 2026

యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్ ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) 30వ సదస్సు 2025 నవంబరు 10 నుంచి 21 వరకు బ్రెజిల్‌లోని బేలంలో జరిగింది. మొత్తం 198 దేశాలకు చెందిన 50వేల మందికి పైగా ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు.

✦ ఇందులో నవంబరు 18న వాతావరణ మార్పుల పనితీరు సూచిక (Climate Change Performance Index - CCPI) 2026ను విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించి, పునరుత్పాదక వనరుల వినియోగాన్ని అధికం చేసిన దేశాలతో ఈ జాబితాను రూపొందించారు.

✦ 2005 నుంచి ఏటా దీన్ని విడుదల చేస్తున్నారు.

✦ 2025 ఇండెక్స్‌ను జర్మన్‌వాచ్, న్యూ క్లైమెట్ ఇన్‌స్టిట్యూట్, క్లైమెట్ యాక్షన్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా ప్రచురించాయి. ఉద్గారాల కట్టడిలో దేశాల పనితీరును హరితగృహ వాయు ఉద్గారాలు (Greenhouse gases emission), పునరుత్పాదక శక్తి (renewable energy), శక్తి వినియోగం (energy use), వాతావరణ విధానం (climate policy) అనే నాలుగు గ్రూప్‌లుగా విభజించి అంచనా వేస్తారు. ఇందులో 14 సూచికలూ ఉన్నాయి.

✦ జాబితాలో మొత్తం 67 ర్యాంకులు ఉండగా.. మొదటి మూడు ర్యాంకులను ఏ దేశానికీ ప్రకటించలేదు. అన్ని విభాగాల్లోనూ అధిక రేటింగ్ సాధించేంతగా దేశాలు రాణించకపోవడమే ఇందుకు కారణం.

1	24 VIET NAM	47 SLOVAC REPUBLIC
2 -	25 MALTA	48 HUNGARY
3 -	26 SWITZERLAND	49 MALAYSIA
4 DENMARK	27 BRAZIL	50 POLAND
5 UNITED KINGDOM	28 SLOVENIA	51 BULGARIA
6 MOROCCO	29 FINLAND	52 TÜRKIYE
7 CHILE	30 GREECE	53 UZBEKISTAN
8 LUXEMBOURG	31 MEXICO	54 CHINA
9 LITHUANIA	32 THAILAND	55 BELARUS
10 NETHERLANDS	33 IRELAND	56 AUSTRALIA
11 NORWAY	34 LATVIA	57 JAPAN
12 PORTUGAL	35 AUSTRIA	58 ARGENTINA
13 SWEDEN	36 COLOMBIA	59 CHINESE TAIPEI
14 SPAIN	37 BELGIUM	60 KAZAKHSTAN
15 PAKISTAN	38 EGYPT	61 CANADA
16 ROMANIA	39 CYPRUS	62 UAE
17 NIGERIA	40 ALGERIA	63 REPULIC OF KOREA
18 ESTONIA	41 SOUTH AFRICA	64 RUSSIAN FEDERATION
19 PHILIPPINES	42 CZECH REPUBLIC	65 UNITED STATES
20 EUROPEAN UNION	43 INDONESIA	66 IRAN
21 FRANCE	44 NEW ZEALAND	67 SAUDI ARABIA
22 GERMANY	45 CROATIA	
23 INDIA	46 ITALY	

✦ డెన్మార్క్ (80.52 స్కోరు), యునైటెడ్ కింగ్‌డమ్ (70.80), మొరాకో (70.75) వరుసగా నాలుగు, అయిదు, ఆరు స్థానాల్లో ఉన్నాయి.

✦ ఈ సూచీలో భారత్ 60.31 స్కోరుతో 23వ స్థానంలో నిలిచింది. చమురు, గ్యాస్, బొగ్గు ఉత్పత్తిలో ఇండియాను అతిపెద్ద దేశాల్లో ఒకటిగా సీసీపీఐ పేర్కొంది. అంతేకాక ఉద్గారాల కట్టడిలో మన దేశ పనితీరును 'అధికం' నుంచి 'మధ్యస్థ' స్థాయికి మార్చింది. గత ఏడాది (2025) సూచికలో మన దేశం 10వ స్థానంలో ఉంది.

✦ సీసీపీఐ 2026లో సౌదీ అరేబియా (11.90 స్కోరు, 67వ ర్యాంక్), ఇరాన్ (14.33 స్కోరు, 66వ ర్యాంక్), అమెరికా (21.84, 65వ ర్యాంక్) చివరి స్థానాల్లో నిలిచాయి.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

905 **Word of the Day**

Nonviable

Telugu meaning: ఉపయోగం లేని, అనుకూలం కాని

English meaning: The word nonviable (నాన్‌వయబల్) is an adjective that describes something that is not capable of working successfully, surviving, or being effective.

Synonyms: Impractical, Useless; ***Antonyms:*** Feasible, Workable

Usage: **1.** The proposed business model was found to be nonviable due to high operational costs and low market demand.

2. Without sufficient funding and public support, the plan quickly became nonviable and was abandoned.

Current Affairs



India and the European Union on 27 January 2026 announced the conclusion of the long-awaited India-EU Free Trade Agreement (FTA), described as the "Mother of All Deals". This marking a historic milestone in bilateral relations between two of the world's largest economies. The announcement was made at the 16th India-EU Summit by Prime Minister Narendra Modi and European Commission President Ursula von der Leyen during the visit of European leaders to India.



Brazilian aerospace manufacturer Embraer has signed an Memorandum of Understanding (MoU) with Adani Aerospace and Defence on 27 January 2026 to develop an integrated regional transport aircraft ecosystem in India. Under this MoU two companies will explore establishing an assembly line for regional aircraft in India and collaborate on manufacturing, supply chain, aftermarket services, and pilot training for the Regional Transport Aircraft (RTA) programme.

India and Canada signed a Joint Statement on Energy Cooperation on the sidelines of India Energy Week (IEW) 2026 in Goa on 27 January 2027, reaffirming their commitment to strengthen bilateral collaboration in conventional and clean energy sectors. The Joint Statement was signed following a bilateral meeting between Union Minister for Petroleum and Natural Gas Hardeep Singh Puri and Canada's Minister of Energy and Natural Resources Timothy Hodgson, marking the first high-level participation of a Canadian Cabinet Minister at India Energy Week.

Indian Air Force Group Captain Shubhanshu Shukla was conferred the Ashoka Chakra, the country's highest peace-time gallantry award, by President Droupadi Murmu during the 77th Republic Day celebrations at Kartavya Path on 26 January 2026.

For more Current Affairs: Scan QR code

భారతీయ వార్తాపత్రిక దినోత్సవం

జనవరి 29
చరిత్రలో ఈనాడు

ప్రజలకు కచ్చితమైన సమాచారాన్ని అందించడంలో వార్తాపత్రికలు ముందుంటాయి. ఆధునిక యుగంలో ప్రజా చైతన్యాన్ని పెంపొందించడంలోనూ ఇవి ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. పౌర సమస్యలను ఎలుగెత్తి, పాలనా లోపాలను చాటి, అన్యాయాలను ప్రశ్నిస్తున్నాయి. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేయడంలోనూ వార్తాపత్రికలు కీలకంగా వ్యవహరించాయి. బ్రిటిష్ వారి అకృత్యాలు, అన్యాయాలు, అణచివేతలు కళ్లకు కట్టేలా కథనాలు ప్రచురించడంతోపాటు వారిని ఎదిరించాయి. స్వాతంత్ర్యోద్యమంలో జనం భాగస్వాములయ్యేలా ప్రేరేపించాయి. **రోజూ వార్తాపత్రికలు చదవాల్సిందిగా ప్రజలను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా మన దేశంలో జనవరి 29న 'భారతీయ వార్తాపత్రిక దినోత్సవం'గా (Indian Newspaper Day) నిర్వహిస్తారు.** సమాజ హితంలో పత్రికలు పోషిస్తోన్న పాత్రను గుర్తించడంతోపాటు వార్తల సేకరణలో జర్నలిస్టుల తెగువ, ధైర్యసాహసాలను గౌరవించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

స్వాతంత్ర్యోద్యమంలో వార్తాపత్రికల పాత్ర



స్వాతంత్ర్యోద్యమ సమయంలో నాయకుల ఆలోచనలను దేశ ప్రజలకు చాటడంలో.. పోరాటాలను రూపొందించడంలో భారతీయ వార్తాపత్రికలు ముఖ్య పాత్ర పోషించాయి. ఒకవైపు ఆంగ్లేయుల విధానాలను ఎండగడుతూనే మరోపక్క నాటి సమాజంలో పేరుకుపోయిన మూఢ విశ్వాసాలు, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలను చైతన్యపరిచాయి.

▮ 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు దేశంలోని పత్రికల ముఖ చిత్రాన్నే మార్చేసింది. అంతకుముందు ప్రచురితమైన పత్రికలు వినోదం, విజ్ఞానాలతోపాటు సాంఘిక, రాజకీయ సమస్యల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాయి.

▮ 1857 తర్వాత భారతీయ పత్రికలు దేశంలో జాతీయత భావాలను పెంపొందించడం, దేశభక్తిని ప్రబోధించడం, బ్రిటిషర్ల అరాచకాలు - దోపిడీ విధానాలను ఎండగట్టడంపై దృష్టిసారించాయి.


చారిత్రక నేపథ్యం

మనదేశంలో మొదటి వార్తాపత్రికను ఐర్లాండ్‌కి చెందిన జేమ్స్ అగస్టస్ హిక్కీ 1780, జనవరి 29న 'ది బెంగాల్ గెజెట్' పేరుతో ప్రారంభించారు. భారతీయ జర్నలిజానికి పునాది వేసిన పత్రికగా దీన్ని భావిస్తారు. అందుకే మన దేశంలో ఏటా ఆ తేదీన 'భారతీయ వార్తాపత్రిక దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు.

పత్రికా రంగం ఆవిర్భావం, గతంలో ఎస్ఎస్‌సీ సీజీఎల్, స్టెనో, ఆర్ఆర్‌బీ గ్రూప్ డి పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

ఆధునిక భౌతికశాస్త్రం



ఆధునిక భౌతికశాస్త్రం 1900లో ఆవిర్భవించింది. ప్లాంక్ క్వాంటం సిద్ధాంతం ఆధునిక భౌతికశాస్త్రానికి పునాదులు వేసింది. ఇది కృష్ణ వస్తువు వికిరణాన్ని అర్థం చేసుకోవడంలో కొత్త తరహా ఆలోచనలకు నాంది పలికింది. ఆధునిక భౌతికశాస్త్ర పితామహుడిగా ఐన్‌స్టీన్‌ను పేర్కొంటారు. ఈయనతో పాటు ఎందరో శాస్త్రవేత్తల కృషితో ఇది మరింత అభివృద్ధి చెందింది.

సంప్రదాయం, అధునాతనం

భౌతికశాస్త్ర స్థూల ధర్మాలను న్యూటన్ నియమాల ఆధారిత సంప్రదాయ భౌతికశాస్త్రం (Classical Physics) వివరిస్తుంది.

✦ మాక్స్‌వెల్ విద్యుదయస్కాంత తరంగాలను కనుక్కున్నాక ప్లాంక్ క్వాంటం సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. శక్తి అతి చిన్న కణాల రూపంలో ఉంటుందని, వాటిని క్వాంటంలు (quanta) అంటారని ఇది తెలిపింది. సూక్ష్మ భౌతికశాస్త్ర అధ్యయనానికి క్వాంటం సిద్ధాంతం పునాది వేసింది.

ఎలక్ట్రాన్ ఆవిష్కరణ - విద్యుత్ ఉత్సర్గం, ఉపపరమాణు కణాలు - కనుక్కున్న వారు, వివిధ పరమాణు నమూనాలు - ప్రతిపాదనలు - లోపాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs in the Income Tax Department

The Principal Chief Commissioner of Income Tax (Pr.CCIT) in the Mumbai region is inviting applications for Stenographer Grade-II, Tax Assistant, and Multi-Tasking Staff posts under the sports quota. The total number of posts is 97. The application fee is Rs.200. Eligible candidates can apply online before 2026 January 31.

Deputy Manager jobs

The National Highways Authority of India (NHAI) is inviting applications for Deputy Manager (Technical) positions on a direct recruitment basis. The total number of posts is 40. Eligible candidates can apply online before 2026 February 9.

Jobs at IISER Tirupati

The Indian Institute of Science Education and Research (IISER), Tirupati, is inviting applications for Technical Assistant, Junior Translator, Lab Assistant (Biology), and other positions across various departments. The total number of posts is 22. The last date for submission of online applications is 2 February 2026.

Did You Apply..?

Today (January 29) is the last date for the following Jobs

☛ 98 Building Consultant jobs at NIRDPR. ***Eligibility:*** Postgraduate Degree.

☛ RRB Isolated Categories Recruitment 2025 - 312 Posts. ***Qualification:*** Intermediate.

For more information and other notifications - scan QR code

Arithmetical Reasoning

Directions (Qs. 1 - 5): *Choose the correct alternative in the following questions*

1. In a chess tournament each of six players will play every other player exactly once. How many matches will be played during the tournament?
A) 12 B) 15 C) 30 D) 36 E) 14

2. A man has a certain number of small boxes to pack into parcels. If he packs 3, 4, 5 or 6 in a parcel, he is left with one over; if he packs 7 in a parcel, none is left over. What is the number of boxes, he may have to pack?
A) 106 B) 309 C) 301 D) 400 E) 402

3. A, B, C and D play a game of cards. A says to B, "If I give you 8 cards, you will have as many as C has and I shall have 3 less than what C has. Also, if I take 6 cards from C, I shall have twice as many as D has." If B and D together have 50 cards, how many cards has A got?
A) 40 B) 37 C) 27 D) 23 E) 26

4. In a group of cows and hens, the number of legs is 14 more than twice the number of heads. The number of cows is....
A) 5 B) 7 C) 10 D) 12 E) 15

5. A worker may claim Rs.15 for each km which he travels by taxi and Rs.5 for each km which he drives his own car. If in one week he claimed Rs.500 for travelling 80 km how many kms did he travel by taxi?
A) 10 B) 20 C) 30 D) 40 E) 60

Bank Exams
Reasoning

Directions *(Qs. 6 - 8):* The following questions are based on the given following data for an examination.
(A) Candidates appeared 10,500
(B) Passed in all the five subjects 5685
(C) Passed in three subjects only 1498
(D) Passed in two subjects only 1250
(E) Passed in one subject only 835
(F) Failed in English only 78
(G) Failed in Maths only 275
(H) Failed in Physics only 149
(I) Failed in Chemistry only 147
(J) Failed in Biology only 221

6. How many candidates failed in all the subjects?
A) 4815 B) 3317 C) 2867 D) 2357 E) 362

7. How many candidates passed at least in four subjects?
A) 6555 B) 5685 C) 1705 D) 870 E) 1054

8. How many candidates failed because of having failed in four or less subjects?
A) 4815 B) 4453 C) 3618 D) 2368 E) 2456

9. Reena is twice as old as Sunita. Three years ago, she was three times as old as Sunita. How old is Reena now?
A) 6 years B) 7 years C) 8 years D) 12 years E) 15 years

10. The age of a father is twice that of the elder son. Ten years hence the age of the father will be three times that of the younger son. If the difference of ages of the two sons is 15 years, the age of the father is
A) 50 years B) 55 years C) 60 years D) 70 years E) 80 years

11. A group of 1200 persons consisting of captains and soldiers is travelling in a train. For every 15 soldiers there is one captain. The number of captains in the group is....
A) 85 B) 80 C) 75 D) 70 E) 90

12. Aruna cut a cake into two halves and cuts one half into smaller pieces of equal size. Each of the small pieces is twenty grams in weight. If she has seven pieces of the cake in all with her, how heavy was the original cake?
A) 120 grams B) 140 grams C) 240 grams D) 280 grams E) None of these

13. First bunch of bananas has $\frac{1}{4}$ again as many bananas as a second bunch. If the second bunch has 3 bananas less than the first bunch, then the number of bananas in the first bunch is...
A) 9 B) 10 C) 12 D) 15 E) 22

14. At the end of a business conference the ten people present all shake hands with each other once. How many handshakes will there be altogether?
A) 20 B) 45 C) 55 D) 90 E) 100

15. A student got twice as many sums wrong as he got right. If he attempted 48 sums in all, how many did he solve correctly?
A) 12 B) 16 C) 24 D) 18 E) 27

16. The number of boys in a class is three times the number of girls. Which one of the following numbers cannot represent the total number of children in the class?
A) 48 B) 44 C) 42 D) 40 E) 52

Scan the QR code for Key

These model questions were prepared by ***Rajesh Madhu, Asst. Prof. of Mathematics.***

ఎన్సీపీకి కోలుకోలేని దెబ్బ!

- పార్టీ భవితవ్యంపై ఆందోళన
- అజిత్ పవార్ మరణంతో మహాయుతికీ నష్టమే..

ముంబయి: విమాన ప్రమాదంలో ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ మరణించడం మహారాష్ట్ర రాజకీయాలతో పాటు ఆయన పార్టీకీ ఓ కుదుపులాంటిదే. ఇది ఎన్సీపీకి కోలుకోలేని దెబ్బగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అంతేకాకుండా అధికార మహాయుతి కూటమికీ నష్టమే నన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



■ అజిత్ మరణంతో ఎన్సీపీలో నాయకత్వ సంక్షోభం తలెత్తనుంది. ఆయన తర్వాత నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా రెండో స్థానంలో ఎవరూ లేకపోవడమే ఇందుకు కారణం. గడియారం గుర్తు తిరుగులేని అధినేతను కోల్పోయిందని, పార్టీ భవిత ప్రమాదంలో పడటం ఖాయమని, పార్టీ వ్యవస్థాపకుడు, ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్తో రాజకీయ సఖ్యత ఎలా అనే ప్రశ్నలు తలెత్తున్నాయని పరిశీలకులు అంటున్నారు.

■ ఎన్సీపీకి ఉన్న 41 మంది ఎమ్మెల్యేలు శరద్ పవార్‌వైపు వెళ్లకుండా కాపాడటం ముఖ్యమంత్రి, భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్‌కు సవాలే.

■ అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు. అయితే ఆమెకు పార్టీ పాలనా వ్యవహారాలపై పట్టు లేదు. ప్రస్తుతం ఎన్సీపీకి ఒక లోక్‌సభ సభ్యుడు (సునీల్ తత్కారే), ఇద్దరు రాజ్యసభ సభ్యులు (సునేత్రతో పాటు ప్రఫుల్ పటేల్) ఉన్నారు.

కలుస్తాయనుకున్న సమయంలో..

ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ ప్రస్తుతం ప్రజల్లో పెద్దగా కనిపించడం లేదు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎన్సీపీ (ఎస్పీ) తరఫున ఆయన కుమార్తె సుప్రియా సూలే ప్రచారం చేశారు. కానీ అజిత్ పవార్ దాటికి తట్టుకోలేకపోయారు. అదే సమయంలో రెండు ఎన్సీపీలు కలుస్తాయని, అజిత్ పవార్ నాయకత్వం వహిస్తారనే ప్రచారం జరిగింది. ఆశ్చర్యకరంగా విమాన ప్రమాదంలో అజిత్ మరణించడంతో ఆయన పార్టీ భవిష్యత్తే అగమ్యగోచరంగా మారే అవకాశం కనిపిస్తోంది.

■ వచ్చేనెల ఫిబ్రవరి 5వ తేదీన జరగనున్న జిల్లా పరిషత్ ఎన్నికల్లో గడియారం గుర్తుపై ఎన్సీపీలు రెండు కలిసి పోటీ చేస్తున్నాయి. అయితే ఎవరితో ఎవరు కలిశారన్న అంశంలో స్పష్టత లేదు.

■ ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు ఎన్సీపీలు కలిసి పోటీ చేశాయి. మహాయుతి నుంచి అజిత్ పార్టీ బయటకు వచ్చి పోటీలోకి దిగింది. కానీ తమకు గట్టి పట్టున్న పుణె, పింప్రి చించ్వాడ కార్పొరేషన్లలో ఓడిపోయింది.

బలమైన నేత ఏరీ?

ఎన్సీపీలో అజిత్ పవార్ తర్వాత అంత బలమైన నేత లేరు. సునీల్ తత్కారే, ప్రఫుల్ పటేల్‌లను పక్కనబెడితే మరో గట్టి నేత కనిపించడం లేదు. ఆ పార్టీలో ప్రజాబలం ఉన్న నేత ఛగన్ భుజ్‌బల్ ఒక్కరే. ఆయన ఇటీవలే మనీ లాండరింగ్ కేసుల నుంచి విముక్తుడయ్యారు. అయితే ఆయన ఆరోగ్యం సరిగా లేదు.

■ సునీల్, ప్రఫుల్‌లకు రాష్ట్రవ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పట్టులేదు.

సునేత్ర పట్టు సాధిస్తారా..



అజిత్ సతీమణి సునేత్ర పార్టీపై పట్టు సాధిస్తారా అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఎన్సీపీలో ఉన్న ఆమె.. గతంలో మహిళల హక్కుల కోసం పోరాడారు. విద్యా సంస్థల నిర్వహకురాలు.. పర్యావరణ కార్యకర్త. పార్టీలో ఎక్కువ మంది ఆమెకు మద్దతిచ్చే అవకాశముంది. దీంతో పాటు సానుభూతి అనుకూలించవచ్చు. అసలే దేశంలోనే అత్యంత కల్లోల రాజకీయాలు మహారాష్ట్రలో చోటుచేసుకుంటుంటాయి. అలాంటి రాష్ట్రంలో పార్టీని నిర్వహించడం కత్తిమీద సామే.

■ సునేత్ర.. మరాఠ్వాడా ప్రాంతంలోని ధారాశివ్ ప్రాంతం నుంచి వచ్చారు. ఆమె కుటుంబమూ రాజకీయాల్లో రాటుదేలిందే. ఆమె రాష్ట్ర మాజీ మంత్రి, ఎంపీ పదంసింహ్ పాటిల్ సోదరి. 1985లో ఆమె అజిత్ పవార్‌ను వివాహమాడారు. ఆమెకు 'పవార్ కోడలు'గా పేరుంది.

■ గత లోక్‌సభ ఎన్నికల్లో బారామతి నుంచి పోటీ చేసేవరకూ సునేత్ర పెద్దగా రాజకీయాల్లో కనిపించలేదు. ఆ ఎన్నికల్లో ఆమె ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత రాజ్యసభ సభ్యురాలిగా ఎంపికయ్యారు.

■ మహారాష్ట్ర టెక్స్‌టైల్ కంపెనీ యజమానిగా ఉన్న ఆమె.. 2010 నుంచి పర్యావరణ సంస్థను స్థాపించి సామాజిక సేవ చేస్తున్నారు. ఆమె సంస్థ పల్లెల్లో ఆర్గానిక్ వ్యవసాయం, నీటి పొదుపు చర్యలను ప్రోత్సహిస్తున్నారు. మహారాష్ట్ర సుస్థిరాభివృద్ధికి కృషి చేస్తున్నందుకుగాను ఆమెకు గ్రీన్ వారియర్ అవార్డు వచ్చింది.

■ అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్, మేనల్లుడు రోహిత్ పవార్ పార్టీ నాయకత్వ బాధ్యతల కోసం ప్రయత్నించవచ్చు. అయితే సునేత్రనే ఈ వరుసలో ముందుంటారు. అజిత్ పవార్ స్థానంలో ఆమే ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశముంది.

2024లోనూ భయంకర అనుభవం

- మేఘాల్లో హెలికాప్టర్ ప్రయాణం
- దేవుడిని తలచుకున్న అజిత్ పవార్

నాగ్‌పుర్: విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు 2024లోనూ భయంకర అనుభవం ఎదురైంది. అప్పట్లో ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ప్రతికూల వాతావరణం కారణంగా ప్రమాదంలో చిక్కుకుంది. దీంతో ఆయన దేవుడి పేరును తలచుకుంటూ భయం భయంగా గడిపారు. అయితే ఆ ప్రమాదం నుంచి ఆయనతోపాటు ప్రస్తుత సీఎం దేవేంద్ర ఫడణవీస్, మరో నేత త్రుటిలో తప్పించుకున్నారు. వారి హెలికాప్టర్ సురక్షితంగా దిగింది. ఆ తర్వాత జరిగిన సభలో ఆయన ఆ అనుభవాన్ని వివరించారు.

2024 జులై 17వ తేదీన ఫడణవీస్, అజిత్ పవార్, ఉదయ్ సామంత్ కలిసి నాగ్‌పుర్ నుంచి గఢ్‌చిరోలి వెళ్తున్నారు. 'తొలుత మా హెలికాప్టర్ బాగానే టేకాఫ్ అయింది. అది మేఘాల్లోకి ప్రవేశించగానే ఏమీ కనిపించలేదు. దీంతో మనకు ఏమీ కనిపించడం లేదని ఫడణవీస్‌తో చెప్పా. చెట్టు, నేల, ఏమీ కనిపించడం లేదని అన్నా. మనం ఎప్పుడకు వెళ్తున్నామో తెలియట్లేదని వివరించా. అయితే ఫడణవీస్ ఎంతో సావధానంగా సమాధానమిచ్చారు. ఆందోళన చెందవద్దని చెప్పారు. గతంలో తనకు 6 సార్లు ఇటువంటి అనుభవాలు ఉన్నాయని తెలిపారు. హెలికాప్టర్‌గానీ, విమానంగానీ ప్రమాదానికి గురైనా ఏమీ కాదని ఆయన అన్నారు. కానీ అప్పటికే నాలో భయం మొదలైంది. దీంతో పాండురంగా.. పాండురంగా అనుకుంటూ కూర్చున్నా' అని అజిత్ పవార్ వివరించారు.

పెద్ద సాంకేతిక లోపం తలెత్తితేనే విమానం క్రాష్ ల్యాండింగ్: నిపుణులు

ఇంటర్నెట్‌డెస్క్: మహారాష్ట్రలోని బారామతిలో జరిగిన ఘోర విమాన ప్రమాద నేపథ్యంలో విమానయాన రంగ నిపుణులు 'ఈటీవీ'తో మాట్లాడారు. అన్నిరకాల విమానాలకు ఫైట్ సేఫ్టీ నిబంధనలు ఒకేలా ఉంటాయని చెప్పారు. ఇలాంటి ఘటనలకు ఎక్కువగా వాతావరణం, సాంకేతిక అంశాలే కారణమై ఉంటాయని తెలిపారు. బ్లాక్ బాక్స్‌లోని కాక్‌పిట్ వాయిస్ రికార్డును విశ్లేషిస్తేనే, మరికొద్దిరోజుల్లో ప్రమాద కారణాలు వెల్లడయ్యే అవకాశముందని విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజేంద్రప్రసాద్ వెల్లడించారు.

ఆ సమయంలో పైలట్లు విచక్షణకే వదిలేయాలి

'వీవీఐపీ, వీఐపీలు ప్రయాణించే విమానాలు బయల్దేరే ముందు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. విమానం గాల్లో ఉన్నప్పుడు రెడ్ రాడార్ వార్నింగ్ వస్తే వెనక్కి రావాలి. కొంతమంది వీఐపీలు వాళ్ల షెడ్యూల్ కారణంగా ముందుకు వెళ్లిందుకే మొగ్గు చూపడంతో పైలట్లపై ఒత్తిడి పడుతుంది. పొగమంచు, ఇతర వాతావరణ సమస్యలు తలెత్తినప్పుడు పైలట్ల దృష్టి, విజిబిలిటీ అంశాల్లో పోకస్ మారుతూ ఉంటుంది. అలాంటి సమయంలో నిర్ణయాన్ని వాళ్ల విచక్షణకే వదిలేయాలి' అని ఫైట్ అండ్ ఎయిర్‌ఫీల్డ్ సేఫ్టీ విశ్రాంత అధికారి శేషాద్రివాసు తెలిపారు.



ల్యాండింగ్ గేర్ లేకుండానే భూమిని తాకిన నాసా విమానం

న్యూయార్క్: అమెరికా అంతరిక్ష సంస్థ నాసాకు చెందిన ఓ రీసెర్చ్ విమానం ల్యాండింగ్ గేర్ లేకుండానే భూమిని తాకింది. ఈక్రమంలో విమానం నుంచి భారీగా మంటలు వ్యాపించాయి. వివరాల్లోకి వెళితే.. నాసాకు చెందిన డబ్ల్యూ-57 విమానం ల్యాండ్ గేర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఆ విమానాన్ని హ్యూస్టన్‌లోని ఎల్లింగ్టన్ ఎయిర్‌పోర్టులో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈక్రమంలో విమానం అదుపుతప్పి రన్‌వేపై ఒకవైపునకు వంగిపోవడంతో దాని వెనక భాగం నుంచి మంటలు వచ్చాయి. ఎయిర్‌పోర్టులోని రెస్క్యూ సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వారి సహాయంతో పైలట్ కాక్‌పిట్ నుంచి సురక్షితంగా బయటపడ్డారని నాసా ధ్రువీకరించింది. సిబ్బంది అందరూ సురక్షితంగా బయటపడ్డారని తెలిపింది. ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించింది.

బారామతిలో టేబుల్ టాప్ రన్‌వే

(ఈనాడు ప్రత్యేక విభాగం)

మహారాష్ట్రలోని బారామతి విమానాశ్రయంలో టేబుల్ టాప్ రన్‌వే ఉంది. దృశ్య స్పష్టత లేకపోవడంతో రన్‌వే అంచును గుర్తించడంలో పైలట్ చేసిన పొరపాటే ఈ ప్రమాదానికి దారి తీసినట్లు భావిస్తున్నారు. పేరుకు తగ్గట్టుగానే టేబుల్ టాప్ రన్‌వే ఒక టేబుల్ ఉపరితలంలా మొదలై చివర్లో లోతైన అగాధం కలిగి ఉంటుంది. ఎత్తైన కొండలపై నిర్మించిన విమానాశ్రయాల్లో ఇలాంటి రన్‌వేలు ఉంటాయి. రెండు వైపులా లోతైన అగాధాలు ఉన్న కారణంగా ఈ రన్‌వేల్లో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అయితే టేబుల్ టాప్ రన్ వేలు కేవలం కొండ ప్రాంతాల్లో కాకుండా దీవుల్లోనూ నిర్మిస్తుంటారు. మన దేశంలో అయితే, గ్యాంగ్‌టక్, కిమ్లా, కులు, మంగళూరు, బారామతిలో ఇలాంటి రన్‌వేలు ఉన్నాయి. రన్ వే మొదలు, చివర అతి ప్రమాదకరమైన లోతు కలిగి ఉన్న అగాధం కారణంగా పైలట్ అంచులను సరిగా అంచనా వేయలేక ప్రమాదానికి గురవుతుంటారు. విమానం ల్యాండింగ్, టేకాఫ్ సమయాలు రెంటిలోనూ ఈ ప్రమాదం పొంచి ఉంటుంది. దట్టమైన పొగమంచు కమ్ముకున్నప్పుడు, భారీ వర్షం కురిసేటప్పుడు ప్రమాద అవకాశాలు ఇంకా ఎక్కువ. ఎంతో నైపుణ్యం కలిగిన పైలట్లు కూడా ఇబ్బంది పడుతుంటారు.

✦ 2020 ఆగస్టు 7న దుబాయ్ నుంచి కోళికోడ్‌కు చేరుకున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఈ తరహా రన్ వేపై ప్రమాదానికి గురై 18 మంది మరణించారు. నాటి ప్రమాదంలో విమానం రెండుగా చీలిపోయింది. 2010 మే 22న దుబాయ్ నుంచి మంగళూరు చేరుకున్న ఎయిరిండియా విమానం ఇదే రీతిలో ప్రమాదానికి గురై 158 మంది మరణానికి కారణమైంది.

'మీ విశ్వసనీయ ప్రభుత్వం'

- ఎక్స్‌లో అజిత్ పవార్ చివరి పోస్ట్

ఇంటర్నెట్‌డెస్క్: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రాణాలు కోల్పోయిన వేళ ఆయన వివరసారిగా ఆయన చేసిన సోషల్ మీడియా పోస్టు వైరల్‌గా మారింది. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రమాదం జరగడానికి కొన్ని గంటల ముందు రాష్ట్ర ప్రజలకు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో భాగంగా 'మీ విశ్వసనీయ ప్రభుత్వం' తీసుకున్న పలు ముఖ్యమైన నిర్ణయాలు అని పేర్కొంటూ.. రాష్ట్రంలో వృత్తి శిక్షణా సంస్థలను ఏర్పాటుచేయడం, కాంట్రాక్టర్ల చెల్లింపు వ్యవస్థల్లో మార్పులు చేయడం, ప్రైవేటు కంపెనీలకు కేటాయించిన ప్రభుత్వ భూమి లీజు కాలాల పొడిగింపు వంటి విషయాలను వెల్లడించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సీఎం ఫడణవీస్ నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను అజిత్ పవార్ వెల్లడించారు.

ఏం జరుగుతుందో మాకు తెలుసు

- లోపాలను సరిదిద్దుకోండి
- యూజీసీ 'సమానత్వ' నిబంధనలపై సీజేఐ సూచన
- పిల్‌ను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

దిల్లీ: కుల వివక్షను నిరోధించి.. ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన కొత్త నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) సుప్రీంకోర్టు స్వీకరించింది. దీనిపై వాదనలు వినేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం బుధవారం అంగీకరించింది. ఈ సందర్భంగా సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఏం జరుగుతుందో మాకు తెలుసు. లోపాలు సరిదిద్దుకోండి. మేం విచారిస్తాం" అని తెలిపారు. యూజీసీ కొత్త రూల్స్ ప్రకారం, ఉన్నత విద్యాసంస్థల్లో వివక్ష ఫిర్యాదులు పరిష్కరించేందుకు, సమానత్వాన్ని పెంపొందించేందుకు 'సమానత్వ కమిటీలు' ఏర్పాటు చేయాలి. వాటిల్లో తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, దివ్యాంగులకు చోటు కల్పించాలి. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఓ న్యాయవాది ఈ పిల్‌ను దాఖలు చేశారు. కుల ఆధారిత వివక్ష కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకంగా జరుగుతుందనే భావన ఆధారంగా ఈ ఉత్తర్వులను యూజీసీ రూపొందించిందని అందులో పేర్కొన్నారు. కుల ఆధారంగా జనరల్ లేదా నాన్ రిజర్వుడు కేటగిరీ విద్యార్థులు కూడా వివక్షను ఎదుర్కొనే అవకాశం ఉందని అన్నారు. కులానికి అతీతంగా అన్ని రీతిలో వివక్ష అనే పదాన్ని నిర్వచించేలా యూజీసీకి ఆదేశాలు ఇవ్వాలని పిల్‌లో పిటిషనర్ కోరారు.

✦ యూజీసీ ఉత్తర్వుల్లో తీవ్ర లోపాలు ఉన్నాయని సీపీఎం పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ కమిటీల ఎంపిక ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా నిర్వహించాలని, సంస్థల అధిపతులు కాదని పేర్కొంది.

✦ ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆందోళనలు జరుగుతున్నాయి. ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరుతూ కొంతమంది తమ ఓ అందోళనకారుడు తన రక్తంతో ప్రధాని మోదీకి లేఖ రాశారు. రాయ్‌బరేలి నుంచి భాజపా నేత..పార్టీలో తన పదవికి రాజీనామా చేశారు.

యువతకు లెక్కలేనన్ని అవకాశాలు

- భారత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై మోదీ


దిల్లీ: ఐరోపా సమాఖ్య (ఈయూ)తో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) సహా అనేక దేశాలతో ఇటీవల భారత్ కుదుర్చుకున్న ఎఫ్‌టీఏల వల్ల దేశంలోని లక్షల మంది యువతకు లెక్కలేనన్ని అవకాశాలను తీసుకురానున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. బుధవారం ఆయన దిల్లీ కంటోన్మెంట్‌లో జరిగిన ఎన్‌సీసీ పీఎం ర్యాలీ కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. ప్రపంచం మొత్తం భారత యువతవైపు ఎంతో నమ్మకంతో చూస్తోందన్నారు. మన నైపుణ్యాలు, 'సంస్కారం' ఈ విశ్వాసానికి కారణాలని తెలిపారు. "ఇదే సరైన సమయం అంటూ ఎర్రకోట నుంచి నేను ప్రసంగించా. యువతకు ఎన్నో అవకాశాలను తీసుకొచ్చే సమయం ఇది. వారికి మరిన్ని ప్రయోజనాలు చేకూర్చాలనే ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందులో ఒకదాన్ని మీరు బుధవారమే చూశారు. భారత్- ఈయూ మధ్య చారిత్రాత్మక ఎఫ్‌టీఏ ఒప్పందం కుదిరింది. అంతకుముందు ఒమన్, న్యూజిలాండ్, బ్రిటన్, యూఏఈ, ఆస్ట్రేలియాతో పాటు మారిషస్ వంటి దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేశాం. ఇవన్నీ భారత యువతకు మంచి అవకాశాలు తీసుకురానున్నాయి" అని మోదీ వ్యాఖ్యానించారు.

ఆయుష్ వైద్యులు ఈయూలో సేవలు అందించొచ్చు

భారతీయ సంప్రదాయ వైద్యరీతుల్ని అనుసరిస్తున్న వైద్యులు ఇకపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) సభ్య దేశాల్లో తమ సేవల్ని అందించవచ్చని ప్రధాని మోదీ బుధవారం ప్రకటించారు. భారత - ఈయూ వాణిజ్య ఒప్పందం ఇందుకు అవకాశం కల్పించిందని ఆయన తెలిపారు. భారత్‌లో సాధించిన వృత్తి పరమైన అర్హతల ఆధారంగా ఆయుష్ వైద్యులు సేవలు అందించవచ్చని ఆయన కేరళ ఆర్య వైద్యశాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఇచ్చిన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆర్య వైద్యశాల అందిస్తున్న సేవల్ని ఆయన కొనియాడారు. ఈ వైద్యశాల 600కు పైగా ఔషధాలను ఉత్పత్తి చేయడంతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న తన ఆస్పత్రుల ద్వారా రోగులకు ఆయుర్వేద చికిత్స అందిస్తోందని తెలిపారు.



దిల్లీలో బుధవారం కరియప్పా గ్రౌండ్‌లో జరిగిన ఎన్‌సీసీ ర్యాలీలో ఓ క్యాడెట్‌ను సత్కరిస్తున్న ప్రధాని మోదీ



పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు చూపు పోయే ముప్పు!

ఇంటర్నెట్‌డెస్క్: పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళనకర వ్యక్తమవుతోంది. తమ నేతకు వెంటనే చికిత్స అందించకపోతే.. కంటిచూపు పోయే ప్రమాదం ఉందని పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ వర్గాలు పేర్కొన్నాయి. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. ఇమ్రాన్ కుడి కంటిలో సమస్య తలెత్తింది, దానికి వెంటనే చికిత్స అందించకపోతే చూపుపోయే ప్రమాదం ఉందని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తంచేశాయి. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించాలని డిమాండ్ చేశాయి. వైద్యుల సూచనను పట్టించుకోకుండా జైలులోనే ఆయనకు చికిత్స అందించారని అధికారులు పట్టుబడుతున్నారని ఆరోపించాయి. 2024 అక్టోబరులో ఇమ్రాన్ తన వ్యక్తిగత వైద్యుడి వద్ద పరీక్షలు చేయించుకున్నారని, ఆ తర్వాత నుంచి ఆయన్ను కలిసేందుకు అనుమతించడం లేదని వెల్లడించాయి.

ఆస్తుల వివరాలు సమర్పించేలా ఐఏఎస్‌లను అప్రమత్తం చేయండి

సీఎస్‌లకు డీఓపీటీ లేఖ

ఈనాడు, దిల్లీ: ఐఏఎస్ అధికారులంతా 2025 సంవత్సరానికి సంబంధించిన అన్ని స్థిరాస్తుల వివరాలను ఈనెల 31వ తేదీలోపు సమర్పించేలా అప్రమత్తం చేయాలని కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ బుధవారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది. ఈ నెల ఒకటి నాటికి ఉన్న ఆస్తి వివరాలను సిబ్బంది వ్యవహారాలశాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని గత డిసెంబరు 23న, ఈనెల 13న అధికారులకు లేఖలు రాసింది. ఇప్పుడు ఆ గడువు ముగిసే సమయం వస్తున్నందున తమ పరిధిలో పనిచేసే ఐఏఎస్ అధికారులందరికీ ఈ విషయాన్ని గుర్తుచేయాలని కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను కోరింది. ఎవరూ పత్రాలను హార్డ్ కాపీ రూపంలో పంపవద్దని, డీఓపీటీకి కానీ పంపకూడదని, కేవలం సాఫ్ట్ కాపీలను మాత్రమే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించింది.

రిజిస్టర్డ్ ఆస్తులపైనే వక్ఫ్ ట్రైబ్యునళ్లకు విచారణాధికారం: సుప్రీంకోర్టు

దిల్లీ: వక్ఫ్ చట్టం కింద రిజిస్టర్ అయిన ఆస్తులపై మాత్రమే వక్ఫ్ ట్రైబ్యునళ్లు విచారణాధికారం కలిగి ఉంటాయని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. 1995 నాటి వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 85 కింద సివిల్ కోర్టులకు ఈ అంశాలపై విచారణాధికారం ఉండదని చెప్పడం సరికాదని జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ట్రైబ్యునల్ విచారణకు చేపట్టిన విషయాలపై సివిల్ కోర్టుల్లో వ్యాజ్యాలు వేయలేనని విచారణకు వెళ్లేదని, ట్రైబ్యునల్ జారీ చేసిన ఆదేశాలు లేదా అది విచారణ చేపట్టలేనే అంశాలపై సివిల్ కోర్టులకు విచారణాధికారం లేదని చట్టం చెబుతోంది. వక్ఫ్ చట్టంలోని నిబంధనల ప్రకారం.. ఒక ఆస్తి ప్రస్తావన ఔకాఫ్ జాబితాలో ఉన్నప్పుడే అది వక్ఫ్ ఆస్తి అవుతుందా కాదా అనే అంశంపై ట్రైబ్యునల్ విచారణ జరపొచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది.

మతాలకు అతీతం.. నజ్మా కల్యాణం


"గుల్లో గింజలు తిన్న పిచ్చుక మసీదులో నీళ్లు తాగుతుంది.. రాధ దుస్తులు సల్మాన్‌దేగా కుడుతుంది" లాంటి మాటలు కవుల కల్పనల్లో వింటూ ఉంటాం. మధ్యప్రదేశ్‌లోని దమోహ్ జిల్లా నిబోరా గ్రామం ఈ విధమైన మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. యాదవ వర్గీయులతో నిండిన ఈ గ్రామంలో గుడ్డూ ఖాన్ కుటుంబం ఒక్కటే ముస్లిం ఇంటిపేరుకి చెందినది. వలస కార్మికులైన గుడ్డూఖాన్ దంపతులు గ్రామం వీడి వెళ్లిపోవడంతో తమ కుమార్తె నజ్మాను పొరుగున ఉన్న రామరాజ్ యాదవ్ సంరక్షణలో వదిలి వెళ్లేవారు. సొంత బిడ్డలా నజ్మాతో అనుబంధం పెంచుకున్న రామరాజ్.. గుడ్డూ ఆర్థిక పరిస్థితిని చూసి పెళ్లీడు వచ్చిన ఆమెకు తానే వివాహం చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ విషయం విన్న గ్రామస్థులందరూ మద్దతు పలికి తలో చేయి వేస్తామని ముందుకు వచ్చారు. తేజ్‌గఢ్‌కు చెందిన సాహిల్‌ఖాన్‌తో నజ్మా పెళ్లిని గుడ్డూఖాన్ నిశ్చయించారు. బారాత్ నుంచి నిఖా పూర్తయ్యేదాకా భోజనాలు, బస.. ఇలా గ్రామస్థులు చేసిన మర్యాదల పట్ల ఎంతో ఆనంద పడిన పెళ్లివారు అమితంగా ఆశ్చర్యపడ్డారు. అత్తారింటికి వెళ్తున్న నజ్మాను చూసి గ్రామస్థులు కన్నీళ్లు పెట్టుకోగా.. "చిన్నప్పటి నుంచి నా బిడ్డలా పెంచాను" అంటూ రామరాజ్ యాదవ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.



భారత్ ఈటీవీ భారత్ సౌజన్యంతో

రాజస్థాన్ అడవిలో అరుదైన పిల్లి

రాజస్థాన్‌లోని బారాన్ జిల్లా పరిధిలో గల షేర్‌గఢ్ అడవిలో ప్రపంచంలోనే అతి చిన్న పిల్లుల్లో ఒకటైన మచ్చల పిల్లి (రస్టీ - స్పాటెడ్ క్యాట్) కనిపించింది. కోటా అటవీశాఖ డిప్యూటీ కన్జర్వేటర్ అనురాగ్ భట్నాగర్ మాట్లాడుతూ.. ఈ జాతి పిల్లి షేర్‌గఢ్ అభయారణ్యంలో కెమెరా ట్రాప్‌కు చిక్కడం ఇదే మొదటిసారి అన్నారు. "అది ఇదేనా లేదా మగదా అన్నది తెలియదు. ఆ పిల్లికి ఈ అడవిలో ఓ కుటుంబం ఉండే అవకాశముంది. పూర్తి వివరాల కోసం మరిన్ని ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ కూటమి (ఐయూసీఎన్) ఈ పిల్లిని అంతరించిపోతున్న జీవిగా గుర్తించింది. సంతానోత్పత్తి కాలంలో తన జతతో కలిసి ఇది రాత్రిపూట బయటకు వస్తుంది. ఈ పిల్లి మాంసాహారి" అని వివరించారు.



ఫార్మా కంపెనీలకు వెసులుబాటు

- ప్రయోగ పరీక్షలకు లైసెన్సు అక్కర్లేదు

దిల్లీ: సులభతర వ్యాపారాన్ని మరింత ప్రోత్సహించే చర్యల్లో భాగంగా ఫార్మా కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇక నుంచి ఆయా కంపెనీలు ప్రయోగ పరీక్ష లైసెన్సును తీసుకోవాల్సిన అవసరం లేదు. అంతేకాకుండా సీడీఎస్‌సీవోకు ఆన్‌లైన్‌లో సమాచారం ఇచ్చి ఔషధ అభివృద్ధిని కొనసాగించవచ్చు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం ఇది వర్తించదు. ఈ మేరకు కొత్త డ్రగ్స్ అండ్ క్లినికల్ ట్రయల్స్ (ఎన్‌డీసీటీ) నిబంధనలు-2019కి సవరణలు చేస్తూ కేంద్ర ఆరోగ్యశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనివల్ల నియంత్రణ ప్రక్రియ సులభతరం కానుంది. ప్రమాదాలను పొందే సమయం తగ్గనుంది. వేగంగా క్లినికల్ పరిశోధనల కొనసాగించవచ్చు. ఔషధాల అభివృద్ధిలో వేగంగా అడుగులు వేయవచ్చు.

ఈయూతో ట్రేడ్ డీల్ వల్ల భారత్‌కే లాభం

అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్

ఇంటర్నెట్‌డెస్క్: భారత్-ఐరోపా సమాఖ్య మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం భారత్‌కే ఎక్కువ అనుకూలంగా ఉందని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో గ్రీర్ మాట్లాడుతూ.. "ఈ ఒప్పందానికి సంబంధించిన కొన్ని వివరాలు నేను పరిశీలించా. దీనిలో భారత దేశం పైచేయిగా నిలుస్తుందని భావిస్తున్నా. ఐరోపా మార్కెట్‌లో భారత్ ఉత్పత్తులకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు. భారతీయ నిపుణులకు ఐరోపా దేశాల్లో ఎక్కువ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశీయ ఉత్పత్తులకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దేశంలోకి దిగుమతయ్యే వస్తువులపై టారిఫ్‌లు విధిస్తుండటంతో.. ఇతర దేశాలు తమ ఉత్పత్తుల కోసం ఇతర మార్కెట్ల వైపు చూస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఈయూ.. భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుందన్నారు.

దక్షిణ కొరియా మాజీ ప్రథమ మహిళకు 20 నెలల జైలు

- అవినీతి కేసులో శిక్ష

సియోల్: అవినీతి కేసులో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యున్ సుక్ యోల్ సతీమణి, మాజీ ప్రథమ మహిళ కిమ్ కియోన్ హీ.. 20 నెలల జైలు శిక్షకు గురయ్యారు. వ్యాపార ప్రయోజనాలకు యునిఫికేషన్ చర్చ్ నుంచి బహుమతులు తీసుకున్నారనే ఆరోపణలపై సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆమెకు ఈ శిక్ష విధించింది. లంచం, స్టాక్ మార్కెట్ అవకతవకలు, రాజకీయ నిధుల చట్ట ఉల్లంఘనల కేసులో ఆమెను దోషిగా తేల్చుతూ ఆమెకు 15 ఏళ్ల కారాగార శిక్ష విధించాలని స్వతంత్ర న్యాయవాది కోరారు. అయితే సరైన ఆధారాలు సమర్పించడంలో విఫలమవడంతో ఆ కేసుల్లో కిమ్‌ను న్యాయస్థానం నిర్దోషిగా తేల్చింది. తీర్పు విషయంలో కిమ్ తరఫు న్యాయ బృందం కోర్టుకు కృతజ్ఞతలు తెలిపింది. అయితే అవినీతి కేసులో 20 నెలల జైలు శిక్ష చాలా ఎక్కువని, దీనిపై అప్పీలుకు వెళ్లే విషయాన్ని ఆలోచిస్తామన్నారు.

ఇంజినీర్ రషీద్ అప్పీలు తిరస్కరించిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలకు నిధుల సమకూర్చినట్లుగా తనపై అభియోగాలు మోపడాన్ని సవాలు చేస్తూ జమ్మూకశ్మీర్‌కు చెందిన లోక్‌సభ సభ్యుడు ఇంజినీర్ రషీద్ సమర్పించిన అప్పీలును దిల్లీ హైకోర్టు తిరస్కరించింది. కింది కోర్టు ఆదేశాలను వ్యతిరేకిస్తూ రషీద్ దాఖలు చేసిన అప్పీలు జస్టిస్ ప్రతిభా ఎం సింగ్, జస్టిస్ మధు జైన్‌లు పేర్కొన్నారు. 2017 నాటి ఉగ్ర నిధుల కేసుకు సంబంధించి ఎన్ఐఏ ఆయనపై యూఏపీఏ కింద వ్యాజ్యం దాఖలు చేసింది. ఆయన 2019 నుంచి తిహాడ్ జైలులో ఉన్నారు. ఈ కేసులో మరో ముద్దాయి అయిన వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఎన్ఐఏ కేసు నమోదు చేశారు.

జమ్మూకశ్మీర్‌లో విరిగిన మంచుచరియలు

జమ్మూ: గత కొన్ని రోజులుగా జమ్మూకశ్మీర్‌లో మంచు కురుస్తుండటంతో భారీగా మంచు చరియలు విరిగిపడ్డాయి ఈ ఘటనకు సంబంధించిన ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదని అధికారులు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గందేర్బల్ జిల్లా సోనామార్గ్‌లో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఆ ఇళ్లు, దుకాణాలు, వాహనాలను మంచు కప్పేసింది. ఘటన తీవ్రత ఎక్కువగా ఉన్న చోట రెస్క్యూ సిబ్బంది, స్థానిక అధికారులు అప్రమత్తమయ్యారు. సహాయక చర్యలు ప్రారంభించారు. అయితే, ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం లేదని అధికారులు వెల్లడించారు. మంగళవారం కశ్మీర్ లోయలో మంచు తీవ్రంగా కురిసిన క్రమంలో.. అధికారులు జమ్మూ-శ్రీనగర్ జాతీయరహదారిని మూసివేశారు. శ్రీనగర్ విమానాశ్రయంలో అన్ని విమానాలను రద్దు చేశారు. దీంతో జమ్మూలో ఉన్న ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కిష్త్వార్ జిల్లాలో మంచు చరియలు విరిగిపడటంతో పదుల సంఖ్యలో మేకలు, గొర్రెలు మృతిచెందాయి. హన్స్ వంతెన వద్ద గొర్రెల కాపరులు తమ పశువులను ఆ ప్రాంతాన్ని దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

వాణిజ్య ఒప్పందానికి మరింత చేరువైన భారత్, అమెరికా

దిల్లీ: వాణిజ్య ఒప్పందానికి భారత్, అమెరికా మరింత చేరువయ్యాయి. చర్చల్లో భాగంగా కీలక పురోగతి సాధించాయి. అమెరికాతో భారత్ స్థిరమైన విధానాన్ని కొనసాగిస్తున్నదని, త్వరలో సానుకూల ఫలితం వస్తుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఐరోపా కూటమితో ఒప్పందానికి అమెరికాకు ప్రతీకారంగా చూడకూడదని, భారతీయ ఎగుమతిదారులకు ఆ దేశం కూడా కీలక మార్కెట్టేనని స్పష్టం చేశారు. వచ్చే వారం విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ అమెరికా వెళ్తున్నారు. కీలక ఖనిజాలపై జరిగే సమావేశంలో పాల్గొననున్నారు. ఆ సమయంలో.. ట్రంప్ అధికార యంత్రాంగంలోని పలువురితో సమావేశం కానున్నారు.

✦ చైనా ఆధిపత్యంలోని ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యంలో (ఆర్‌సీఈపీ) చేరకూడదనే తన నిర్ణయాన్ని భారత్ సమీక్షించుకుందని వచ్చిన వార్తలను అధికార వర్గాలు ఖండించాయి.

పేరు మార్చి ఏమార్చిన భోలే బాబా..!

- అన్నీ తెలిసీ తనిఖీ బృందాల తప్పుడు నివేదికలు
- అడ్డగోలుగా టెండర్ నిబంధనల మార్పు
- భారీ నెయ్యి మోసానికి అదే కారణం
- సిట్ దర్యాప్తులో వెల్లడి

ఈనాడు, అమరావతి: మొదట్లో హర్ష్ డెయిరీ పేరుతో తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన సంస్థ తర్వాత భోలే బాబా సంస్థగా పేరు మార్చుకుని ఏమార్చినట్లు సిట్ దర్యాప్తులో బయటపడింది. వైకాపా హయాంలో తితిదే నిబంధనల్ని తుంగలో తొక్కుతూ ప్రైవేటు డెయిరీలకు ఎర్ర తివాచీ పరచి, సహకార డెయిరీలు టెండర్లలో పాల్గొనకుండా చేసిన వైనం తేటతెల్లమైంది. ప్రైవేటు డెయిరీల సాంకేతిక అర్హతల్ని నిర్ధారించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏర్పాటైన కమిటీలు భోలే బాబా డెయిరీకి అనుకూలంగా పదే పదే తప్పుడు నివేదికలు ఇచ్చాయి. ఆ సంస్థకు టెండర్లు దక్కుతూనే ఉన్నాయి.

సహకార డెయిరీల్ని తప్పించేందుకు..!

నెయ్యి కొనుగోలుకు సంబంధించిన టెండర్ నిబంధనల్ని మరింత కట్టుదిట్టం చేసేందుకు 2019 ఏప్రిల్‌లో అప్పటి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆమోదం మేరకు తితిదే అధికారులు, డెయిరీ రంగ నిపుణులతో కమిటీ ఏర్పాటైంది. నేషనల్ కేటగిరీ టెండర్లలో పాల్గొనే డెయిరీలకు అర్హత నిబంధనలపై కమిటీ పలు సిఫారసులు చేసింది. అంతవరకు రోజుకు 6 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం ఉండాలన్న నిబంధనను 12 టన్నులకు పెంచింది. వార్షిక టర్నోవర్‌ను రూ.150 కోట్ల నుంచి రూ.250 కోట్లకు పెంచింది. రోజుకు 4 లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం ఉండాలన్న నిబంధన పెట్టింది. 2019 ఆగస్టు నుంచి అవి అమల్లోకి వచ్చాయి. కానీ 4 నెలలు గడవకముందే ఈ సారి టెండర్ నిబంధనల్ని ప్రైవేటు సంస్థలకు అనుగుణంగా మార్చేందుకు 2020 జనవరిలో మరో కమిటీ ఏర్పాటైంది. రోజుకు 4 లక్షల లీటర్ల పాలసేకరణ నిబంధన తీసేశారు. కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న డెయిరీనే టెండర్లలో పాల్గొనాలన్న నిబంధన ఏడాదికి తగ్గించారు. 12 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యాన్ని 8 టన్నులకు తగ్గించారు. వార్షిక టర్నోవర్ సామర్థ్యాన్ని రూ.250 కోట్ల నుంచి 150 కోట్లకు తగ్గించారు. అసలు పాలే సేకరించని ప్రైవేటు డెయిరీలకు రాచబాట పరిచేందుకు ఈ నిబంధనలు 2020 ఫిబ్రవరి నెలాఖరు నుంచి అమల్లోకి తెచ్చారని సిట్ పేర్కొంది.

తనిఖీ బృందాల తప్పుడు నివేదికల ఆధారంగా టెండర్లు

డెయిరీలను తనిఖీ చేసి సాంకేతిక అర్హతల్ని నిర్ధారించేందుకు ఏర్పాటైన అధికారులు, నిపుణుల కమిటీలు ప్రలోభాలకు లొంగి కళ్లు మూసుకుని నివేదికలు ఇచ్చాయి.

◆ హర్ష్ ఫ్రెష్ డెయిరీ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్.. భోలే బాబా డెయిరీకి మొదట్లో ఉన్న పేరు ఇది. హర్ష్ డెయిరీ 2018 నుంచి తితిదే నెయ్యి టెండర్లలో పాల్గొంటోంది. 2018 ఏప్రిల్ 17న అప్పటి ఈవో ఆదేశాల మేరకు.. హర్ష్ డెయిరీని తనిఖీ చేసేందుకు కమిటీని నియమించారు. కొనుగోళ్ల విభాగం జీఎం జి.జగదీశ్వర్‌రెడ్డి, ఎస్వీ గో సంరక్షణశాల డైరెక్టర్ హరనాథ్‌రెడ్డి, డెయిరీ రంగ నిపుణుడు బత్తుల సురేంద్రనాథ్ భగవాన్‌పుర్‌లోని ఆ సంస్థ డెయిరీని సందర్శించారు. ఆ సంస్థ రోజుకు 1,33,500 లీటర్ల ఆవుపాలు సేకరిస్తోందని, నిత్యం 4 టన్నుల నెయ్యి ఉత్పత్తి చేస్తోందని తప్పుడు నివేదిక ఇచ్చారు. కానీ హర్ష్ ఫ్రెష్ డెయిరీ అది ఏర్పాటైనప్పటి నుంచి ఎప్పుడూ ఆవు పాలు సేకరించనేలేదని సిట్ దర్యాప్తులో తేలింది.

◆ హర్ష్ డెయిరీ స్వయంగా సేకరించిన పాలతో పాటు, సుందర్, లియాఖత్ డెయిరీల నుంచి పాలు కొంటోందని తనిఖీ బృందం పేర్కొంది. కానీ ఆ సంస్థల నుంచి హర్ష్ డెయిరీ ఎప్పుడూ పాలు కొనలేదని సిట్ దర్యాప్తులో తేలింది. కమిటీ ఇచ్చిన తప్పుడు నివేదిక వల్ల హర్ష్ డెయిరీ ఫైనాన్షియల్ బిడ్‌కు అర్హత సాధించింది. కానీ ఆ టెండర్ దక్కలేదు.

◆ 2019 ఫిబ్రవరి 18న 82 వేల కిలోల ఆవు నెయ్యి కొనుగోలుకు తితిదే పిలిచిన టెండర్లలో హర్ష్ డెయిరీ మళ్లీ పాల్గొంది. ఒక్కసారి ఇన్‌స్పెక్షన్ కమిటీ నివేదిక ఇస్తే సంవత్సరం పాటు చెల్లుబాటవుతుంది. అంతకు ముందు తనిఖీ బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ సారి ఫైనాన్షియల్ బిడ్‌కి అర్హత సాధించి టెండర్ దక్కించుకుంది.

◆ 2019 ఆగస్టులో మరోసారి ఇన్‌స్పెక్షన్ కమిటీ ఏర్పాటైంది. కమిటీ సభ్యులు పి.జగదీశ్వర్‌రెడ్డి, మద్ది విజయభాస్కర్‌రెడ్డి 2019 ఆగస్టు 6న హర్ష్ డెయిరీని సందర్శించారు. ఆ సంస్థ ఆవుపాలు, ఆవు నెయ్యి వ్యాపారం చేస్తోందే తప్ప, పాలసేకరణ, ఉత్పత్తి చేయడం లేదని ఈసారి నివేదిక ఇచ్చారు. ఆ సంస్థకు సాంకేతిక అర్హత లేదని తేల్చారు. తితిదే 2019 సెప్టెంబరులో 70 వేల కిలోల ఆవు నెయ్యి సరఫరా పిలిచిన టెండర్లలో హర్ష్ డెయిరీ పాల్గొన్నా అర్హత లేదని తోసిపుచ్చారు.

పేరు మార్పులో మతలబు

హర్ష్ డెయిరీ పేరుతో టెండర్‌లో పాల్గొని నెయ్యి సరఫరా టెండర్ దక్కించుకోలేమని అర్థమవడంతో దాని డైరెక్టర్లు డెయిరీ పేరుని 2021 జులైలో భోలే బాబా ఒరిగానిక్ డెయిరీ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చేశారు.

◆ 2021 అక్టోబరులో 25 లక్షల కిలోల నెయ్యిని ట్యాంకర్లలో సరఫరా చేసేందుకు తితిదే పిలిచిన టెండర్లలో భోలేబాబా పేరుతో పాల్గొన్నారు. ఈసారి తనిఖీకి వెళ్లిన కమిటీ దానికి సాంకేతిక అర్హత ఉందని తేల్చేసింది. ఆ సంస్థ ఆవుపాలు, వెన్న కొనుగోలు చేసి నెయ్యి ఉత్పత్తి చేస్తున్నట్టు సర్టిఫికెట్ ఇచ్చేసింది. అక్కడ సదుపాయాలు బాగున్నాయని పేర్కొంది. కానీ తనిఖీ బృందం తప్పుడు నివేదిక ఇచ్చిందని, భోలేబాబా సంస్థ ఎప్పటిలానే ఒక్క లీటరు ఆవుపాలు కూడా కొనలేదని దర్యాప్తులో తేలింది. ఆ టెండర్లలో ఎల్-2గా నిలిచిన భోలే బాబా సంస్థ 7,17,500 కిలలో నెయ్యి సరఫరా ఆర్డర్ దక్కించుకుని కల్తీ నెయ్యి సరఫరా చేసింది.

◆ అదే కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా మరో 72,450 కిలోల నెయ్యి సరఫరా ఆర్డర్ దక్కించుకుంది.

◆ ఆ తర్వాత కూడా ఆ కమిటీ పదే పదే టెండర్లు దక్కించుకుంటూనే ఉంది.

మత్తు ఇంజక్షన్ ఇచ్చి తల్లిదండ్రుల హత్య

- కులాంతర వివాహానికి అడ్డొస్తున్నారని కుమార్తె ఘాతుకం
- తెలంగాణలోని వికారాబాద్ జిల్లాలో దారుణం




మృతులు దశరథం, లక్ష్మి



నిందితురాలు సురేఖ

వికారాబాద్, బంట్వారం, న్యూస్‌టుడే: కులాంతర వివాహానికి అడ్డొస్తున్నారని తల్లిదండ్రులను కడతేర్చిందో కుమార్తె. ఒళ్లునొప్పులకు మందు ఇస్తున్నానంటూ ఒకరి తర్వాత ఒకరికి అధిక మోతాదులో మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఘాతుకానికి పాల్పడింది. ఆపై ఏడుపు నటిస్తూ సహజ మరణాలుగా చిత్రీకరించబోయింది. ఘటనా స్థలిలో లభించిన సిరంజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేయగా కుమార్తె దురాగతం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన తెలంగాణలోని వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం యాచారం గ్రామంలో జరిగింది. కేసు వివరాలను వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూర్ సీఐ రఘురాములు బుధవారం వెల్లడించారు. యాచారానికి చెందిన నక్కలి దశరథం(58), లక్ష్మి(54) దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు. మూడో కుమార్తె సురేఖ(25) మినహా అందరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు అశోక్ భార్యాపిల్లలతో బంట్వారంలో దుస్తుల దుకాణం నడుపుతూ జీవిస్తున్నాడు. సురేఖ సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆమెకు ఏడాది కిందట సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలానికి చెందిన యువకుడు(డ్రైవరు) ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. అది కాస్త ప్రేమగా మారింది. సురేఖ ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పగా.. కులాలు వేరు కావడంతో తీవ్రంగా వ్యతిరేకించారు. పెళ్లి సంబంధాలు చూడటం ప్రారంభించారు. దీంతో ప్రేమకు అడ్డుగా ఉన్న తల్లిదండ్రులను హతమార్చాలని పథకం రచించింది.

కలిసి భోజనం చేసి..

వృత్తి నైపుణ్యాన్ని ఉపయోగించి పనిచేస్తున్న ప్రైవేటు ఆస్పత్రి నుంచి అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే మత్తు మందును సేకరించింది. ఔషధ దుకాణంలో మూడు సిరంజీలను కొనుగోలు చేసింది. ఈ నెల 24న రాత్రి సెలవుపై సురేఖ ఇంటికొచ్చింది. తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసింది. అనంతరం మరోమారు పెళ్లి ప్రస్తావన తీసుకురాగా వారు కసురుకున్నారు. వారిని చంపాలని.. తల్లి లక్ష్మికి ఒళ్లు నొప్పులుండడంతో ఉపశమనానికి రాత్రి 10 గంటల వేళ వెంట తెచ్చుకున్న మత్తు మందు మోతాదుకు మించి ఇచ్చింది. కొద్దిసేపటికే ఆమె శాశ్వత నిద్రలోకి జారుకోగా.. నిద్రపోతున్నట్లు పడుకోబెట్టింది. అనంతరం ఇంటి బయట చలిమంట కాచుకుంటున్న తండ్రి దశరథం దగ్గరికెళ్లింది. ఆయనకూ ఒళ్లు నొప్పులుండటంతో సూది మందు ఇవ్వగా.. ఆయన కుప్పకూలి చనిపోయాడు. సహజ మరణాలుగా చిత్రీకరించేందుకు యత్నించింది. అన్న అశోక్‌కు ఫోన్ చేసి.. 'అమ్మా నాన్న చనిపోయారు.. భయంగా ఉంది.. తొందరగా రండి' అని చెప్పింది. ఆయన రాగానే.. 'అన్న అన్నీ చూసుకుంటాడు.. ఆయన చెప్పినట్లు విను'.. అని చివరి మాటలు చెప్పి నాన్న కుప్పకూలాడని, పరీక్షించగా చనిపోయాడని నమ్మబలికింది. విషయం అమ్మకు చెప్పగా షాక్‌కు గురై గుండెపోటుతో స్పృహ తప్పిందని.. సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయిందని రోదిస్తూ చెప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలంలో రెండు సిరంజీలను గుర్తించి సురేఖను ప్రశ్నించారు. మూడు నెలల కిందటివని బుకాయించే ప్రయత్నం చేసింది. సంచిలో ఉపయోగించని మూడో సిరంజీని స్వాధీనం చేసుకొని, దానిపై ఉన్న లేబుల్ ఆధారంగా వివరాలు సేకరించారు. ఆమె దగ్గరున్న ఖాళీ ఇంజక్షన్ సీసాలు, వాడిన సిరంజీలను స్వాధీనం చేసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా ప్రేమ పెళ్లికి నిరాకరించడంతోనే తల్లిదండ్రులను హత్య చేసినట్లు అంగీకరించగా.. రిమాండ్‌కు తరలించారు.

విమానయాన రంగంలో పెట్టుబడులకు ఏపీ అనుకూలం


మంత్రి జనార్దన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: విమానయాన రంగంలో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా మారనుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ రంగంలో పెట్టుబడులకు అవకాశాలున్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో నిర్వహించిన 'వింగ్స్ ఇండియా-2026' కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) ఏర్పాటుచేసిన స్టాల్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్, వివిధ రాష్ట్రాలు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించారు.

కోకో ధరల నిర్ణయానికి కమిటీ

ఈనాడు, అమరావతి: కోకో ధరల నిర్ణయానికి ఉద్యానశాఖ డైరెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వం కమిటీ ఏర్పాటుచేసింది. ఉద్యానశాఖ ఏడీ కన్వీనర్‌గా వ్యవహరించే కమిటీలో వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్స్‌లర్, సీపీసీఆర్ఐ మాజీ డైరెక్టర్ చౌడప్ప, మార్కెటింగ్ కమిషనర్, క్యాంప్‌కో ప్రతినిధి తదితరులతో పాటు నలుగురు నుంచి ఐదుగురు రైతులు, ఆయిల్ పామ్ ప్రాసెసర్ల నుంచి ముగ్గురు, కోకో ప్రాసెసర్ల నుంచి ముగ్గురు సభ్యులుగా ఉంటారు.

తెలంగాణ సీఎంతో హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ల భేటీ



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో హార్వర్డ్ ప్రొఫెసర్లు

ఈనాడు, హైదరాబాద్: హార్వర్డ్ విశ్వవిద్యాలయంలోని కెన్నెడీ స్కూల్‌లో కొనసాగుతున్న తరగతుల విరామ సమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బుధవారం హార్వర్డ్-ఎఫ్‌ఏఎస్ అధిపతి, వైస్ ప్రొవోస్ట్ ప్రొఫెసర్ డస్టిన్ టిన్స్‌లే, హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ డీన్ ప్రొఫెసర్ జెరెమీ వైన్‌స్టీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి దిశను ప్రతిబింబించే 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్'ను సీఎం వారికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం, కెన్నెడీ స్కూల్ మధ్య పరస్పర సహకారానికి సీఎం ఆసక్తి వ్యక్తం చేయగా.. ఇందుకు ప్రొఫెసర్లు సానుకూలంగా స్పందించారు. విద్యా నాణ్యతను మెరుగుపరిచే వివిధ రూపకల్పనలు, ఆధునిక నైపుణ్యాల అభివృద్ధి విధానాలు, మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై చూపే ప్రభావం తదితర అంశాలపై ముఖ్యమంత్రి విస్తృతస్థాయిలో చర్చించారు.



సరికొత్త బోయింగ్ 787-9 డ్రీమ్ లైనర్ విమానాన్ని ఎయిర్ ఇండియా బేగంపేటలో ప్రారంభమైన 'వింగ్స్ ఇండియా 2026' ప్రదర్శనలో ఆవిష్కరించింది. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు విమానాన్ని సందర్శించి.. భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపకల్పన చేసినట్లు అభినందించారు.

మంగళగిరిలో వక్ఫ్ భూమి డీనోటిఫైని రద్దు చేయాలి

మాజీ సీఎం జగన్‌తో ముస్లిం సమాఖ్య వేదిక ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: 'మంగళగిరి నియోజకవర్గం చినకాకాని ప్రాంతంలో అంజుమన్ ఇస్లామియా సంస్థకు చెందిన 71.57 ఎకరాల వక్ఫ్ భూమిని ఐటీ పార్క్ నిర్మాణం కోసమని కూటమి ప్రభుత్వం డీనోటిఫై చేసింది. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి' అని ముస్లిం సమాఖ్య వేదిక ప్రతినిధులు మాజీ సీఎం జగన్‌ను కోరారు. బుధవారం జగన్‌ను క్యాంపు కార్యాలయంలో కలిశారు. జగన్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు వైకాపా కట్టుబడి ఉందన్నారు. మైనారిటీలకు అండగా ఉంటామని చెప్పారు. జగన్‌ను కలిసిన వారిలో గుంటూరు తూర్పు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి షేక్ నూరిఫాతిమా, ముస్లిం సమాఖ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్, ప్రధాన కార్యదర్శి సర్దార్ ఖాన్, కోశాధికారి అబ్దుల్ కలాం తదితరులున్నారు.

స్త్రీలకన్నా ముందే పురుషుల్లో గుండె జబ్బు సూచనలు

దిల్లీ: గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ధమనులు మూసుకుపోవడం మహిళల కన్నా కొన్నేళ్ల ముందే పురుషులలో మొదలవుతుందని అమెరికాలోని నార్త్ వెస్ట్రన్ విశ్వవిద్యాలయ వైద్య కళాశాల అధ్యయనం తేల్చింది. ఈ లింగపరమైన తేడా 30 ఏళ్ల వయసు నుంచే ప్రారంభమవుతుంది. పురుషులు మద్య, ధూమపానాలు చేయడం, అధిక రక్తపోటు, మధుమేహానికి గురవడం వంటి కారణాల వల్ల హృదయ-రక్తనాళ వ్యాధి వస్తుందనే మాట నిజమే కాని.. ఇటీవలి కాలంలో స్త్రీలలోనూ ఇవే అలవాట్లు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ మహిళలకన్నా ఏడేళ్ల ముందే పురుషుల్లో గుండె జబ్బు సూచనలు బయటపడుతున్నాయి. పక్షవాతం ముప్పు మాత్రం ఉభయులకూ సమానమే. 1980ల నుంచి 2020 వరకు 18-30 ఏళ్ల వయసులోని 5,100 మంది స్త్రీపురుషులపై జరిగిన అధ్యయనం ద్వారా పై అంశాలు తెలియవచ్చాయి.

కార్తీక దీపం వివాదంపై సుప్రీం నోటీసు

దిల్లీ: మదురైలోని తిరుప్పరం కుండ్రం కొండపై సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద కార్తీక దీపం వెలిగించడానికి అనుమతించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్‌పై కులమతపరంగా దుర్భాషలాడిన నిరసనకారులపై చర్యలు తీసుకోవాలంటున్న పిటిషన్‌పై తమిళనాడు ప్రభుత్వ సమాధానాన్ని సుప్రీంకోర్టు కోరింది. సుప్రీం ద్విసభ్య ధర్మాసనం బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికీ, పోలీసు డైరెక్టర్ జనరల్, చెన్నై పోలీసు కమిషనర్‌లకు నోటీసులు జారీచేసింది. తిరుప్పరం కుండ్రం ఆలయం ఎదురుగా ఉన్న దీపస్తంభంపై భక్తులు కార్తీక దీపం వెలిగించవచ్చని, దీపస్తంభానికి దర్గా 50 మీటర్ల దూరంలో ఉంది కాబట్టి దీపం వెలిగించడానికి ఆక్షేపణ లేదని జస్టిస్ స్వామినాథన్ నిరుడు డిసెంబరు 1న తీర్పు చెప్పారు. తన ఉత్తర్వు అమలు కాకపోవడంతో కేంద్ర బలగం సీఐఎస్ఎఫ్ అండతో భక్తులు దీపం వెలిగించవచ్చని డిసెంబరు 3న ఉత్తర్వు జారీచేశారు. దీన్ని తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది.


అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై పిల్

- విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు


దిల్లీ: గతేడాది జూన్ 12న అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కూలిన ఘటనపై అధికార దర్యాప్తు జరుగుతున్న తీరు జీవించడానికీ, సమానత్వానికీ, వాస్తవ సమాచారాన్ని తెలుసుకోవడానికీ పౌరులకున్న ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తోందంటూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారణకు స్వీకరించింది. ఈ వ్యాజ్యాన్ని సేఫ్టీ మ్యాటర్స్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్)పై పిటిషన్ల విచారణ ఇవాళ్టితో ముగిసిపోతుందనీ, ఎయిరిండియా దుర్ఘటనపై పిల్ విచారణకు త్వరలోనే తేదీ ప్రకటిస్తామని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌కు తెలిపింది.

ఎంతనేది కాదు.. ఎక్కడ ఉందనేదీ ముఖ్యమే!

- శరీరంలో కొవ్వు పేరుకుపోవడంపై ఓ అధ్యయనం హెచ్చరిక



దిల్లీ: శరీరంలో కొవ్వు ఎంత పరిమాణంలో ఉందనేదే కాకుండా అది ఏ భాగంలో నిల్వ ఉందనే అంశం కూడా ఊబకాయంతో వచ్చే ముప్పును నిర్ధారిస్తోందని తాజా అధ్యయనం తేల్చింది. కొన్ని ప్రాంతాల్లో కొవ్వు పేరుకుపోతే మెదడు వయసు మళ్లడం, నిర్ణయాలు తీసుకునే శక్తి సన్నగిల్లడం తదితర సమస్యలు వస్తాయని హెచ్చరించింది. చైనాలోని ద అఫిలియేటెడ్ హాస్పిటల్ ఆఫ్ గ్జువాహు మెడికల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు యూకే బయోబ్యాంక్‌కు చెందిన 26 వేల మంది డేటాను ఇందుకోసం కోసం విశ్లేషించారు. ఎమ్మారై స్కాన్ ఫలితాలను ఉపయోగించి వారి శరీరంలో ఏఏ భాగాల్లో కొవ్వు నిల్వ ఉందో గమనించారు. గతంలో బీఎంఐ ద్వారానే ఊబకాయం, చికిత్సపై అధ్యయనాలు జరుగ్గా తాజా పరిశోధనలో శరీరంలో కొవ్వు పంపిణీపై ఉన్న డేటా ఆధారంగా ముందుకెళ్లారు. "క్లోమం చుట్టూ కొవ్వు పేరుకుపోయినా, సన్నగానే ఉంటూ శరీరంలో కొవ్వు శాతం ఎక్కువగా ఉన్నా తీవ్రమైన దుష్పరిణామాలు ఉంటాయని మా పరిశోధనలో తేలింది. ఈ రెండూ కూడా నరాల సంబంధిత సమస్యలను సృష్టిస్తాయి. మెదడు వయసు పెరగడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం క్షీణించడం తదితర సమస్యలు వస్తాయి. సమస్య ఏమిటంటే ప్రస్తుతం వైద్యులందరూ కాలేయం చుట్టూ ఉన్న కొవ్వుపైనే దృష్టి పెడుతున్నారు. అదే సమయంలో క్లోమం చుట్టూ కొవ్వు పేరుకుపోయినా చాలా సందర్భాల్లో ఆ వ్యక్తి ఊబకాయంతో ఉన్నట్లు కాకుండా సన్నగానే కనపడతాడు. దీంతో సమస్య గుర్తించడం కష్టమవుతుంది. సన్నగా కనిపిస్తూ శరీర బరువు సూచీ(బీఎంఐ) నిర్దేశిత పరిమితుల్లోనే ఉన్నవారిలోనూ కొవ్వు, కండరాల నిష్పత్తి చాలా ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వారికి మెదడు సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదముంది" అని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. ఊబకాయం నిర్ధారణకు, చికిత్సకు ఇప్పుడున్న సంప్రదాయ పద్ధతులు సరిపోవని.. శరీర బరువు, రూపు కాకుండా కొవ్వు ఎక్కడెక్కడ పేరుకుపోయిందనే అంశంపైనా ఆధారపడి వైద్యులు ముప్పును అంచనా వేయాలని సూచించారు.



దిల్లీలో బుధవారం పార్లమెంటు ఆవరణలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో ముచ్చటిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

భారత్‌తో ప్రేమలో పడ్డాం

- డచ్ జంట సైకిల్ యాత్ర



ఈటీవీ భారత్: భారతీయ సంస్కృతిని అధ్యయనం చేసేందుకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి ఇటీవల సైకిళ్లపై బయలుదేరిన నెదర్లాండ్స్‌కు చెందిన డచ్ జంట జునాగఢ్‌కు చేరుకొంది. 9,000 కి.మీ.ల యాత్ర లక్ష్యంగా క్లాస్, మారియెట్ దంపతులు ఈ సాహస కృత్యానికి శ్రీకారం చుట్టారు. జునాగఢ్‌లో స్థానికంగా ప్రసిద్ధమైన ఫఫ్దా (పాపడ్ లాంటిది), గరియా (శనగపిండితో చేసే చిరుతిండి)లను వీరు రుచి చూశారు. అహ్మదాబాద్ నుంచి బయలుదేరాక మార్గమధ్యంలో ద్వారక, పోర్‌బందర్‌లను సందర్శించారు. "భారతీయులు విశాల హృదయులు. ఇటువంటి దేశంతో ప్రేమలో పడకుండా ఎవరూ ఉండలేరు. ఈ గడ్డపై పుట్టిన మహాత్ముడు ప్రపంచానికి స్ఫూర్తిదాతగా నిలవటం అసాధారణమైన విషయం" అని క్లాస్ అన్నారు. జునాగఢ్ తర్వాత దీవ్, తమిళనాడు మీదుగా యాత్ర కొనసాగిస్తామని తెలిపారు.

అజిత్, ఖాలిదాలకు ఉభయ సభల నివాళులు

దిల్లీ: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖాలిదా జియాతో పాటు ఇటీవలి కాలంలో మృతి చెందిన మాజీ ఎంపీలకు ఉభయ సభలు బుధవారం నివాళులర్పించాయి. రాష్ట్రపతి ప్రసంగం పూర్తయిన వెంటనే.. ఏర్పాటైన లోక్‌సభ సమావేశంలో అజిత్ పవార్, ఖాలిదా జియా, షాలినీ పాటిల్, భాను ప్రకాశ్ మిర్ధా, సత్యేంద్రనాథ్ బ్రహ్మో చౌధరీ, సురేశ్ కల్మాడీ, కబీంద్రా పురకాయస్తల మృతి విషయాలను స్పీకర్ ఓం బిర్లా సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సభ్యులందరూ నివాళులర్పించారు. అటు రాజ్యసభలోనూ బంగ్లా మాజీ ప్రధాని ఖాలిదా జియా, మాజీ ఎంపీలు ఎల్.గణేశన్, సురేశ్ కల్మాడీల మరణవార్తను ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ రాజ్యసభకు వివరించారు. అనంతరం సభ మౌనం పాటించి నివాళులర్పించింది.

నరేగా, సర్‌లపై పార్లమెంటులో నిరసనలకు విపక్షాల నిర్ణయం

దిల్లీ: 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' (ఎంజీనరేగా) రద్దు, ఓటర్ల జాబితా 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్)లపై పార్లమెంటులో లేవనెత్తి నిరసనలు తెలపాలని విపక్షాలు నిర్ణయించాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై, కేంద్ర బడ్జెట్‌పై జరిగే చర్చలో ఈ అంశాలపై గళమెత్తాలని తీర్మానించాయి. ఇండియా కూటమిలోని వివిధ విపక్షాలకు చెందిన నేతలు బుధవారం రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే ఛాంబర్లో సమావేశమయ్యారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహంపై చర్చించారు. బడ్జెట్ సమర్పణ సమయంలోనూ నిరసనలు కొనసాగించాలని నిర్ణయించారు. లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీతో పాటు టి.ఆర్.బాలు (డీఎంకే), అరవింద్ సావంత్ (శివసేన యూబీటీ), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), ఎన్.కె.ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్పీ), జావెద్ అలీఖాన్ (సమాజ్‌వాదీ), ప్రేమ్‌చంద్ గుప్తా (ఆర్జేడీ), పి.సందోష్ (సీపీఐ) తదితరులు దీనిలో పాల్గొన్నారు. తృణమూల్, ఆప్ నేతలు హాజరుకాలేదు. ఎంజీనరేగాను పునరుద్ధరించాల్సిందిగా డిమాండ్ చేయడానికి ప్రజాస్వామ్యయుత విధానాలన్నింటినీ వాడుకుంటామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా తెలిపారు.

చండీగఢ్‌లో 26 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

చండీగఢ్, రాజ్‌నంద్‌గావ్: పంజాబ్, హరియాణా సంయుక్త రాజధాని చండీగఢ్‌లో బుధవారం దాదాపు 26 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపులొచ్చాయి. సెక్టార్ 25, 19, 45, 16లలోని పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు ఆయా యాజమాన్యాలు పోలీసులకు సమాచారం అందించాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు విద్యార్థులను పాఠశాలల నుంచి ఖాళీ చేయించారు. పాఠశాలలకు వచ్చిన వారిని తిరిగి వెనక్కు పంపించారు. జాగిలాలు, బాంబు నిర్వీర్య దళాలు పాఠశాలలకు చేరుకుని తనిఖీలు చేపట్టాయి. తనిఖీల్లో అనుమానాస్పదంగా ఏదీ లభించలేదని ఎస్ఎస్పీ కన్వర్‌దీప్ కౌర్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి సెక్టార్ 17లోని పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని మూడు జిల్లా కోర్టులకు బుధవారం గుర్తుతెలియని ఈ-మెయిళ్ల ద్వారా బాంబు బెదిరింపులొచ్చాయి. రాజ్‌నంద్‌గావ్, అంబికాపుర్, జగదల్‌పుర్ జిల్లా కోర్టుల అధికారిక ఈ-మెయిళ్లకు ఈ బెదిరింపులు అందాయి. ముందుజాగ్రత్త చర్యగా కోర్టు ప్రాంగణాల్ని ఖాళీ చేయించి తనిఖీలు చేపట్టారు. అయితే అనుమానాస్పద వస్తువులేవీ లభించలేదు.

ఆధార్‌ను తిరస్కరించడం సరికాదు

- 'సర్' పిటిషన్ల కేసులో సుప్రీం వ్యాఖ్య



దిల్లీ: ఓటరు జాబితాల్లో మార్పుచేర్పులు ఎన్నికల సంఘం చేపట్టే సవరణ కసరత్తులో భాగమేనని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. బిహార్‌లో జరిగిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్)పై దాఖలైన 19 పిటిషన్లపై విచారణను కొనసాగిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఫోర్జరీకి అవకాశం ఉందన్న కారణం చూపి ఆధార్‌ను ఓటరు నమోదుకు కావాల్సిన ప్రామాణిక పత్రాల్లో ఒకటిగా గుర్తించకపోవడం సరికాదని స్పష్టం చేసింది. "చట్టం గుర్తించిన పత్రాన్ని జారీ చేసే ప్రక్రియలో ప్రైవేటు సంస్థ ప్రమేయం ఉందన్న కారణంగా ఆ పత్రానికి గుర్తింపు నిరాకరించడం సరికాదు" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలు పేర్కొన్నారు. పాస్‌పోర్టును జారీ చేసే ప్రక్రియలోనూ ప్రైవేటు సంస్థల ప్రమేయం ఉందని గుర్తు చేశారు. ఓటరు జాబితా నుంచి భారీగా ఓటర్ల పేర్లు తొలగించారని సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ పేర్కొనగా "ఓటరు జాబితా సవరణ కసరత్తులో మార్పు చేర్పులు భాగమే" అని న్యాయమూర్తులు అన్నారు.

రిటైరవుతున్న రైల్వే అధికారులకు ఇక వెండి పతకాలు ఇవ్వరు

దిల్లీ: రైల్వేలో పనిచేసి పదవీ విరమణ పొందే అధికారులకు బంగారం పూతపూసిన వెండి పతకాలు ఇచ్చే పద్ధతికి బుధవారం నుంచి స్వస్తిపలికారు. ఇప్పటికే కొనుగోలుచేసి, అందుబాటులో ఉంచిన పతకాలకు లెక్కచెప్పి, ఇతర అవసరాలకు తగినరీతిలో వాడుకోవచ్చని అన్ని జోనల్ రైల్వేలు, ఉత్పాదక విభాగాలకు జారీ చేసిన ఉత్తర్వులో రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ నిర్ణయానికి కారణాలేమిటనేది వెల్లడించలేదు. పతకాల నాణ్యత నాసిరకంగా ఉంటుండటం, వెండి ధర పెరిగిన నేపథ్యంలో ఖర్చు తగ్గింపుపై దృష్టిపెట్టడం ఈ నిర్ణయానికి దారి తీసి ఉండవచ్చని భావిస్తున్నారు. పదవీ విరమణ చేసేవారికి 99.9% స్వచ్ఛతతో 20 గ్రాముల వెండిపతకాన్ని బంగారం పూతతో ఇవ్వడాన్ని 2006లో ప్రారంభించారు.

నేవీకి ఉత్తమ కవాతు దళం అవార్డు

గణతంత్ర దినోత్సవ శకటాల్లో మహారాష్ట్రకు..

దిల్లీ: గణతంత్ర దినోత్సవం నాడు దిల్లీలోని కర్తవ్య పథ్‌లో నిర్వహించిన కవాతులు, ఊరేగించిన శకటాల్లో అత్యుత్తమమైన వాటికి కేంద్ర ప్రభుత్వం బుధవారం అవార్డులు ప్రకటించింది. మూడు సైనిక విభాగాల కవాతులో నేవీ దళం; రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన శకటాల్లో గణేశ్ నిమజ్జనం ఇతివృత్తంతో రూపొందించిన మహారాష్ట్ర శకటం ఉత్తమ బహుమతికి ఎంపికయ్యాయి. మంత్రిత్వ శాఖలు, విభాగాల కేటగిరీలో 150 ఏళ్ల వందేమాతరం ఉద్యమాన్ని కళ్లకు కట్టిన సాంస్కృతిక మంత్రిత్వ శాఖ శకటం విజేతగా నిలిచింది. ఈ పురస్కారాలను ఈ నెల 30న అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

కృష్ణవేణి జీవితం ఈ తరానికి మార్గదర్శకం

అలనాటి నటి జీవితచరిత్రను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి



కృష్ణవేణి జీవిత చరిత్ర 'మీర్జాపురం రాణి-కృష్ణవేణి'ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో గుమ్మడి గోపాలకృష్ణ, నందమూరి రామకృష్ణ, భగీరథ, అనురాధా దేవి, టీడీ జనార్దన్ తదితరులు

ఈనాడు, అమరావతి: అలనాటి నటి దివంగత కృష్ణవేణి జీవిత చరిత్రపై 'మీర్జాపురం రాణి- కృష్ణవేణి' పేరుతో సీనియర్ పాత్రికేయుడు భగీరథ రాసిన పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. సచివాలయంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. కృష్ణవేణి జీవితం ఈ తరానికి మార్గదర్శకమని, ఈ పుస్తకం ఆవిష్కరించడం సంతోషంగా ఉందని సీఎం పేర్కొన్నారు. కృష్ణవేణి కుమార్తె అనురాధాదేవి, ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, నిర్మాతలు డీవీకే రాజు, ఉమామహేశ్వరరావు, పర్వతనేని రాంబాబు, కాకాణి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ విజయవాడ రాక

ఈనాడు, అమరావతి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం రాత్రి విజయవాడ చేరుకున్నారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో గురు, శుక్రవారాల్లో నిర్వహించే సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అవుతారు. శుక్రవారం సాయంత్రం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

'వీబీ జీ రామ్ జీ'కి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర బడ్జెట్ 2026-27లో 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, ఆజీవికా మిషన్(గ్రామీణ)' (వీబీ జీ రామ్ జీ) అమలుకు రూ.10 వేల కోట్లు ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం రూ.6 వేల కోట్లు(60%) కేటాయిస్తే.. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.4 వేల కోట్లు(40%) ఖర్చు చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. వీబీ జీ రామ్ జీ అమలుకు సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులపై ఆర్థికశాఖ ఉన్నతాధికారులు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి ప్రతిపాదనలు కోరారు. ఉపాధి హామీ పథకంలో లేబర్ బడ్జెట్, మెటీరియల్ పనుల కోసం ఏటా రాష్ట్రంలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. అదే పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీ జీ రామ్ జీకి కూడా ఆ స్థాయిలోనే బడ్జెట్‌లో కేటాయింపులు చేయనున్నారు.

వసతిగృహాలు, గురుకులాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

సచివాలయంలో మంత్రులు డోలా, సవిత, ఫరూక్ భేటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల నిర్వహణపై మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, సవిత, ఫరూక్ బుధవారం సచివాలయంలో సమావేశమై చర్చించారు. మెనూ అమలు తీరు, పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్య భద్రతతో పాటు సాంకేతిక విద్య అందించడంపై సమాలోచనలు జరిపారు. కార్పొరేటు విద్యాసంస్థలకు దీటుగా వసతిగృహాలు, గురుకులాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఈ సందర్భంగా మంత్రులు తెలిపారు. సాంకేతిక విద్య కోసం కంప్యూటర్లు, సీసీ కెమెరాలు, ఇన్వెర్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

22ఏ పేరిట పేదల భూముల కబ్జా

వైకాపా నేతలపై ఎమ్మెల్యే మాధవీరెడ్డి మండిపాటు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో ప్రజల భూములను 22ఏలో పెట్టి వైకాపా నేతలు కబ్జా చేశారని, అల్లకల్లోలం సృష్టించారని కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. సర్వే రాళ్ల మీద జగన్ బొమ్మలు వేసి రూ.700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.

పరిశ్రమలశాఖ విజిలెన్స్ అధికారిగా సుధాకర్

ఈనాడు, అమరావతి: పరిశ్రమల శాఖ డైరెక్టరేట్ కార్యాలయం విజిలెన్స్ అధికారిగా జాయింట్ డైరెక్టర్ సుధాకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన పరిశ్రమలశాఖ డైరెక్టర్ ఓఎస్‌డీగా ఉన్నారు.

పీఏసీఎస్‌ల త్రిసభ్య కమిటీలు పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 2,024 వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీలను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 1,903 సంఘాల్లో అనధికార కమిటీలు, మరో 96 సంఘాల్లో అధికారిక కమిటీలను కొనసాగించనున్నారు. 3 సంఘాల్లో అనధికార కమిటీల్లో కొత్త వారిని నియమిస్తారు. 4 సంఘాల్లో అధికార కమిటీల్లో కొత్త వారిని నియమించనున్నారు. 16 సంఘాల్లో ఇద్దరు సభ్యుల అనధికార కమిటీల్లో కొత్త వారిని, 2 సంఘాల్లో అధికార కమిటీల్లో అనధికార కమిటీలను నియమించేలా రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ ఉత్తర్వులిచ్చింది.

గొట్టా బ్యారేజ్ మరమ్మతులకు రూ.16.49 కోట్లు

ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం జిల్లాలో వంశధారపై ఉన్న గొట్టా బ్యారేజ్ దిగువ ఆప్రాన్, వరద కట్టలకు రక్షణ చర్యల పనులు చేపట్టేందుకు రూ.16.49 కోట్లకు పరిపాలన అనుమతులిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి సాంకేతిక అనుమతులిచ్చే ముందు నిబంధనలు, రవాణా దూరం, రేట్లు వంటివి పరిశీలించాలని ఆ ప్రాంత చీఫ్ ఇంజినీర్‌ని ప్రభుత్వం ఆదేశించింది.

మహోన్నత సాహిత్యాన్ని సృజించిన తెలుగుతేజం వేటూరి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



వేటూరి సాహిత్య పుస్తకాలు ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో రాధాకృష్ణన్, ఆకునూరి శారద, ఆదిత్య, జొన్నవిత్తుల, తనికెళ్ల భరణి, మండలి బుద్ధప్రసాద్, వేటూరి సీతామహాలక్ష్మి, తోటకూర ప్రసాద్, విజయసారథి, సతీశ్‌రెడ్డి, శ్రీరామ్, మాధవపెద్ది సురేశ్, చంద్రబోస్, మా శర్మ, ఎర్రాప్రగడ రామకృష్ణ, రామజోగయ్యశాస్త్రి, భారవి

రాయదుర్గం, న్యూస్‌టుడే: మహోన్నత సాహిత్యాన్ని సంగీత ప్రపంచానికి అందించిన తెలుగు తేజం వేటూరి అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. ఆయన పాటల తోటమాలి అని అభివర్ణించారు. మాదాపూర్ శిల్పకళా వేదికలో బుధవారం అమెరికా వేటూరి సాహిత్యాభిమాన సమితి ఆధ్వర్యంలో.. 'ఈటీవీ' సమర్పణలో 'కవికులాలంకరణ వేటూరి సాహితీ మహోత్సవం' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు సంపుటాల (ఎనిమిది పుస్తకాలు) వేటూరి సినీ, సినీయేతర సాహిత్యాన్ని ఆవిష్కరించారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. సినిమా వ్యాపారం మాత్రమే కాకూడదని, భాష, సంస్కృతిని పరిరక్షించే మాధ్యమంగా నిలవాలన్నారు. సినిమాల్లో సామాజిక దృక్పథం ఉండాలన్నారు. పురాణ, ఉపనిషత్తుల సారాంశాన్ని రెండు ముక్కల్లో చెప్పగల గొప్ప సాహితీవేత్త వేటూరి అని ప్రస్తుతించారు. తెలుగు భాష పరిరక్షణకు ఆయన అనునిత్యం తపించేవారని గుర్తుచేశారు. అమెరికా వేటూరి సాహిత్యాభిమాన సమితి అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ తెలుగు భాష సంరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రసంగిస్తూ.. తెలుగు భాషకు ప్రాచీన హోదా కల్పించకపోవడంతో జాతీయ పురస్కారాన్ని తిరస్కరించడమే కాక, ఆ హోదా సాధించేందుకు పోరాడిన ఉద్యమ దీప్తి వేటూరి అని అన్నారు. సినీ గేయ రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ.. వేటూరికి సాహిత్యంతోపాటు సంగీతంపైనా అపారమైన పరిజ్ఞానం ఉందన్నారు. మరో గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. ఏడు రకాల కవిత్వాన్ని పుణికి పుచ్చుకున్న గొప్ప కవి వేటూరి అని కొనియాడారు. వేటూరిపై రాసిన ప్రశంసాపత్రాన్ని తనికెళ్ల భరణి చదివి వినిపించారు. వేటూరి సతీమణి సీతామహాలక్ష్మి, కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సలహాదారు జి.సతీశ్‌రెడ్డి, సంగీత దర్శకులు మాధవపెద్ది సురేశ్, కోటి, మణిశర్మ, కేఎం రాధాకృష్ణన్, ఆధ్యాత్మిక గురువు శ్రీరామ్, రచయితలు ఎర్రాప్రగడ రామకృష్ణ, విజయసారథి, సినీ గీత రచయిత రామజోగయ్యశాస్త్రి, డైరెక్టర్ వీఎన్ ఆదిత్య, గాయని శారద తదితరులు పాల్గొన్నారు. వేటూరి రచించగా.. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పలు గీతాలను ఎస్పీ చరణ్, ఎస్పీ శైలజ, పలువురు యువ గాయకులు ఆలపించి అలరించారు.

ఐజీఓటీలో చరిత్ర సృష్టించిన ఏపీ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరోసారి జాతీయస్థాయిలో చారిత్రక విజయాన్ని అందుకుంది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక కమిషన్ కర్మయోగి కార్యక్రమంలో భాగంగా నడుస్తున్న ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్(ఐజీఓటీ) ప్లాట్‌ఫాంపై రాష్ట్రం నుంచి కోటి కోర్సులకు నమోదు చేసుకోగా.. 80 లక్షల కోర్సులు పూర్తిచేసిన తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచింది. ఈ అసాధారణ విజయం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్య వృద్ధి, నిరంతర శిక్షణ, ఆధునిక పాలనా విధానాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రజలకు మరింత సమర్థంగా, పారదర్శకంగా సేవలు అందించాలనే దృఢ సంకల్పాన్ని స్పష్టం చేస్తోంది. ఐజీఓటీ కర్మ యోగి వేదిక ద్వారా రాష్ట్రంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాలనా నైపుణ్యాలు, ఆర్థిక నిర్వహణ, సాంకేతిక జ్ఞానం, ప్రజా సేవ, నాయకత్వం, విధాన రూపకల్పన లాంటి కీలక రంగాల్లో శిక్షణ పొందుతున్నారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు సంస్థాగత సామర్థ్యాన్ని పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ప్రజా కేంద్రీకృత పాలన దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నాలకు ఇది బలమైన పునాదిగా నిలుస్తోంది. రాబోయే రోజుల్లో మరిన్ని విభాగాల వారీగా ప్రత్యేక కోర్సులు, ఆధునిక టెక్నాలజీ ఆధారిత లెర్నింగ్ మాడ్యూళ్లు, అదనపు శిక్షణ కార్యక్రమాలను అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

దిల్లీ సదస్సుకు ఏపీ భాజపా మహిళా ప్రతినిధులు



దిల్లీలోని భాజపా కేంద్ర కార్యాలయంలో జరిగిన జాతీయ మహిళా సమన్వయ సదస్సులో యామినీ శర్మ, ఇతర మహిళా ప్రతినిధులు

ఈనాడు, అమరావతి: దిల్లీలోని భాజపా కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన జాతీయ మహిళా సమన్వయ సదస్సులో ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ నుంచి మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాధినేని యామినీశర్మ, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిదా రాజు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని రాష్ట్రం నుంచి హాజరయ్యారు. మహిళల కోసం మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, మహిళల పట్ల భారతీయ దృష్టికోణం, అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం, నాయకత్వ లక్షణాల పెంపు తదితర అంశాలపై సదస్సులో చర్చ జరిగిందని యామినీశర్మ తెలిపారు. కేంద్ర మహిళా- శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి, భాజపా జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, రాష్ట్రీయ సేవికా సమితి కేంద్ర పదాధికారి చందాతాయ్ పలు అంశాలపై మాట్లాడారని వెల్లడించారు.

స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమాల్లో డైరెక్టర్లు పాల్గొనాలి

సంస్థ ఛైర్మన్ పట్టాభిరామ్

ఈనాడు, అమరావతి: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర అవగాహన కార్యక్రమాల్లో డైరెక్టర్లు చురుగ్గా పాల్గొనాలని స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలోని స్వచ్ఛాంధ్ర సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఛైర్మన్ మాట్లాడారు. 'రాష్ట్రంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కెపాసిటీ బిల్డింగ్, ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ కార్యక్రమాల నిర్వహణకు రూ.103 కోట్లు కేటాయించాం. పట్టణ ప్రాంతాల్లో రెండు ఏజెన్సీలకు వీటి నిర్వహణను అప్పగించాం. పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించనున్నాం' అని పట్టాభిరామ్ వివరించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్, సంచాలకులు సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్, సంస్థ డైరెక్టర్లు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పీజీ మెడికల్ సీట్లకు అర్హుల జాబితా వెల్లడి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నీట్ పీజీ కటాఫ్ మార్కులు తగ్గించిన తర్వాత 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్, డీఎన్‌బీ సీట్లకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం వెల్లడించింది. పీజీ మెడికల్ సర్వీస్ విభాగంలో 359 మంది, నాన్ సర్వీస్ విభాగంలో 352 మంది, డీఎన్‌బీ కోర్సుకు 86 మంది అర్హత సాధించారు. ఆయా పేర్లను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపర్చింది.

చిన్నారులను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచాల్సిందే

- తరచూ ఫేక్ పోస్టులు పెట్టేవారిపై కఠిన చర్యలు
- మంత్రి లోకేశ్ నేతృత్వంలో మంత్రుల బృందం సమావేశం



సోషల్ మీడియా నియంత్రణపై చర్చించడానికి మంత్రి లోకేశ్ అధ్యక్షతన సమావేశమైన మంత్రుల బృందం. చిత్రంలో మంత్రులు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, అనిత, సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: నిర్ణీత వయసుకు లోబడిన మైనర్లను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంచే విషయమై విధివిధానాలను రూపొందించాలని మంత్రి నారా లోకేశ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సామాజిక మాధ్యమ జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంపై మంత్రి లోకేశ్ అధ్యక్షతన సచివాలయంలో బుధవారం మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, హోం మంత్రి అనిత, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు. లోకేశ్ మాట్లాడుతూ... చిన్నారులకు సంబంధించి సామాజిక మాధ్యమాల వాడకాన్ని నిషేధం విధించే అంశంపై సింగపూర్, ఆస్ట్రేలియా, మలేసియా, ఫ్రాన్స్‌లలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని, సుప్రీం కోర్టు మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ... మలేసియాలో మై డిజిటల్ ఐడీ, పాస్‌పోర్ట్ వివరాలతో ఈ-కేవైసీ అనుసంధానం ద్వారా 16 సంవత్సరాల పైబడిన వారికి మాత్రమే సోషల్ మీడియా యాక్సెస్ ఉందని తెలిపారు. చిన్నారులను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలన్న విషయమై మంత్రుల బృంద సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. అయితే ఎంత వయోపరిమితి విధించాలనే విషయమై వివిధ దేశాల్లో చట్టాలను పరిశీలించాలని మంత్రుల బృందం అధికారులకు సూచించింది.

కులం, మతం, ప్రాంతం అంటూ విద్వేషం చిమ్మితే కఠిన చర్యలు

సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వార్తలు పోస్టు చేసే వారితో పాటు కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే హ్యాబిచ్యువల్ అఫెండర్స్‌ను కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. దీనిపై చర్చించేందుకు గూగుల్, మెటా, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫాం కంప్లయన్స్ ఆఫీసర్లను కూడా వచ్చే సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సెక్షన్-46 ఐటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రస్థాయి ఎడ్జుడికేటింగ్ ఆఫీసర్ నియామకంపై నోటిఫికేషన్ విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని సహయోగ్ పోర్టల్ ద్వారా కొన్ని కేసుల విషయంలో చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కార్మిక చట్టాల అమల్లో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం పెరగాలి

- దక్షిణ భారత ప్రాంతీయ సదస్సులో అధికారులు
- ముగిసిన కార్మిక, ఉపాధి, పరిశ్రమల శాఖల కార్యదర్శుల సమావేశం

ఈనాడు, అమరావతి: కార్మిక చట్టాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మరింత పెరగాలని కార్మిక, ఉపాధి, పరిశ్రమల శాఖల కార్యదర్శులతో విజయవాడలో నిర్వహించిన దక్షిణ భారత ప్రాంతీయ సదస్సులో అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు జరిగిన సదస్సు బుధవారం ముగిసింది. అసంఘటిత రంగ కార్మికుల కోసం అమలు చేస్తున్న చట్టాల పురోగతిని ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ-శ్రమ్ ద్వారా కార్మికుల వివరాల నమోదుతో పాటు వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవడం, రాష్ట్రాల్లో కొత్త ఉద్యోగావకాశాల సృష్టి, నైపుణ్య శిక్షణపై చర్చించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన నిబంధనలను సరళతరం చేయడం, పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడంపైనా చర్చించారు. కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమల్లో రాష్ట్రాల సన్నద్ధత, స్థానిక అవసరాలకు అనుగుణంగా పారిశ్రామిక విధానాల్లో మార్పులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు సమాలోచనలు చేశారు. ఈ ప్రాంతీయ సదస్సులో ఏపీ, కర్ణాటక, తెలంగాణ, దిల్లీ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల కార్యదర్శులు పాల్గొన్నారు. రాష్ట్రంలో లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఏపీ కార్మికశాఖ కమిషనర్ గంధం చంద్రుడు తెలిపారు. కార్యక్రమాల అమలుపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఐఆర్ కోడ్-2020 ప్రకారం ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్లను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోకి మారుస్తున్నామని, మొబైల్ యాప్ ద్వారా మోటర్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల పనివేళల నమోదు, భవన నిర్మాణ కార్మికుల క్లెయిములు, ఫిర్యాదుల పరిష్కారం డిజిటల్ విధానంలో చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆయా రాష్ట్రాల కార్మిక శాఖ కార్యదర్శులు, ఉన్నతాధికారులు నూతనంగా తీసుకొచ్చిన కార్మిక చట్టాల(కోడ్) అమలుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

నోటిపై వ్యాధిగా కుష్ఠు

ఈనాడు, అమరావతి: కుష్ఠు రోగాన్ని నోటిపై వ్యాధిగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రైవేట్ వైద్యశాలలు కూడా ప్రతి కుష్ఠు కేసును తప్పనిసరిగా ప్రభుత్వానికి నివేదించాలని పేర్కొంది. 2030 నాటికి సంక్రమణ వ్యాధులను నిర్మూలించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

గోరంట్ల మాధవ్ అసభ్య వీడియోపై ఎందుకు నోరు మెదపలేదు?

మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్ అసభ్య వీడియో రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపినా.. ఆ పార్టీలోని మహిళా నేతలు కనీసం నోరు మెదపలేదని మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారిని సస్పెండ్ చేయాల్సింది పోయి, వారిని వెనకేసుకొచ్చే సంస్కృతి వైకాపాదని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు.

సీసీ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వైకాపా నేతలు

తెదేపా కేంద్ర కార్యాలయంలో గ్రామస్థుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: గ్రామంలో సీసీ రహదారి నిర్మాణానికి అడ్డుపడుతున్న వైకాపా నాయకులు, కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా లింగసముద్రం మండలం నరసింహాపురానికి చెందిన సురేశ్ కోరారు. ఈ మేరకు మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. తన స్థలాన్ని ఆక్రమించిన వైకాపా నేతలపై చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం చక్రాయపాలేనికి చెందిన జయరాంనాయక్ కోరారు.

ఏదైనా కల్తీ చేయగల ఘనులు వైకాపా నేతలు

మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి

ఈనాడు, అమరావతి: వైకాపా నేతలు దేన్నైనా కల్తీ చేయగల ఘనులని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తప్పులు చేసి ఎదుటివారిపై రుద్దడం వైకాపా నైజమని అన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యితో భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. రసాయనాలతో తయారుచేసిన నెయ్యిలో జంతు కొవ్వు అవశేషాలు కూడా ఉన్నాయని తెలుస్తోందన్నారు. ఈ కుంభకోణంలో నాటి తితిదే ఛైర్మన్, జగన్ బాబాయి వైవీ సుబ్బారెడ్డి పీఏకు రూ.4 కోట్లు అందినట్లు సిట్ విచారణలో తేలిందని గుర్తుచేశారు. కమిషన్ కోసం కక్కుర్తిపడి శ్రీవారి ప్రసాదాన్ని సైతం వైకాపా నేతలు కల్తీ చేశారని మండిపడ్డారు. ఈ కుంభకోణంలో వాస్తవాలు త్వరలో బయటకు వస్తాయన్నారు. తిరుమల వెంకన్నపై భక్తులకు ఉన్న విశ్వాసాన్ని వైకాపా నేతలు అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. డిక్లరేషన్‌పై సంతకం పెట్టాల్సి వస్తుందనే జగన్ తిరుపతి వెళ్లడం మానేశారని ఆరోపించారు. వైకాపా చరిత్ర మొత్తం అరాచకాలేనని.. చట్టాలపై గౌరవం ఉంటే జగన్ న్యాయస్థానం ఎదుట హాజరు కావాలన్నారు.

బీచ్ కుస్తీ పోటీలకు డా.బీఆర్.అంబేడ్కర్ గురుకులం విద్యార్థి

ఈనాడు, అమరావతి: థాయ్‌లాండ్‌లో జరగనున్న బీచ్ కుస్తీ పోటీలకు పల్నాడు జిల్లా యడ్లపాడు డా.బీఆర్.అంబేడ్కర్ గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థి శివ మల్లికార్జున ఎంపిక కావడం పట్ల సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయంలో తనను కలిసిన విద్యార్థిని మంత్రి అభినందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని మంత్రి పేర్కొన్నారు.

నిందితులతో పరేడ్ నిర్వహణను అడ్డుకోండి

హైకోర్టులో పిల్ దాఖలు

ఈనాడు, అమరావతి: నిందితులను పోలీసులు వీధుల్లో నడిపిస్తూ పరేడ్ నిర్వహించడం, మీడియా ముందు ప్రవేశపెట్టడం హైకోర్టు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధమని హైకోర్టులో పిల్ దాఖలైంది. పరేడ్ నిర్వహించకుండా చట్ట నిబంధనలను పాటించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ, ఎన్విరాన్‌మెంటల్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు పరస సురేశ్‌కుమార్ ఈ పిల్ దాఖలు చేశారు. నిందితుల హక్కులను హరిస్తూ.. వారిని అవమానానికి గురిచేస్తున్నారన్నారు. నిందితులను రహదారులపై నడిపించుకుంటూ తీసుకెళ్తున్నట్లు పత్రికలు, ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలను పిల్‌తో జతచేశారు. హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల ఎస్పీలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

'విద్యాంజలి' పేరుతో నకిలీ ఏజెన్సీల మోసం

సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో 'విద్యాంజలి' కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు చెప్పారు. విద్యాంజలి ద్వారా వస్తు రూపంలోనే విరాళాలు స్వీకరించాలని, స్థానిక దాతలు, పూర్వ విద్యార్థుల భాగస్వామ్యంతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం దీని ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'విద్యాంజలి పోర్టల్ పేరుతో నకిలీ ఏజెన్సీలు సమాంతరంగా నియామకాలు చేపడుతూ నిరుద్యోగ యువతను మోసగిస్తున్నాయి. ఇలాంటి సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఈ విషయంలో ఇప్పటికే పలు కేసులు నమోదు చేయించాం. ప్రభుత్వం ఇచ్చిన రూ.కోట్ల విలువైన ఆస్తులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులదే. పాఠ్య పుస్తకాల బోధనకే పరిమితం కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి' అని సూచించారు.

జ్యోతి యర్రాజికి ప్రోత్సాహం మంజూరుపై హర్షం

ఈనాడు-దిల్లీ, అమరావతి: రాష్ట్ర క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జ్యోతి యర్రాజికి గ్రూప్-1 ఉద్యోగం, విశాఖలో 500 గజాల ఇంటి స్థలం మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేయడంపై క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

◆ జ్యోతి యర్రాజికి రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో 500 గజాల ఇంటి స్థలం, గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వడం పట్ల విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నారనడానికి ఇదో నిదర్శనమని వ్యాఖ్యానించారు. జ్యోతికి ఇటీవల ముంబయిలోని తెలుగు అసోసియేషన్ కూడా అండగా నిలిచిందని గుర్తుచేశారు. రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం తర్వాత ఆయన జ్యోతితో ఫోన్‌లో మాట్లాడి అభినందనలు తెలిపారు.

జాబ్ క్యాలెండర్ కోసం ఉద్యమిస్తాం: డీవైఎఫ్ఐ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 15వ తేదీలోపు జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న తెలిపారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని కోరుతూ విజయవాడలో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల ఖాళీలు లక్షల్లో ఉన్నా పట్టించుకునే నాథుడే లేరు. నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్న దుస్థితి నెలకొంది. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంది. దొడ్డిదారిన కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పోస్టులు భర్తీ చేస్తున్నారు. దీనికితోడు పదవీవిరమణ వయసు పెంచుకుంటూ పోతున్నారు' అని మండిపడ్డారు.

నెడ్‌క్యాప్‌నకు 73.41 ఎకరాల దేవాదాయ భూముల లీజు

ఈనాడు-అమరావతి: చిత్తూరు జిల్లాలో మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం దేవాదాయశాఖకు చెందిన 73.41 ఎకరాలను నెడ్‌క్యాప్‌నకు లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వు జారీచేసింది. దాసరపల్లిలోని ధర్మరాజులస్వామి ఆలయం, తవణంపల్లి మండలంలోని అరగొండలో అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయం, రామకుప్పం మండలం తిమ్మసముద్రంలోని కోదండరామస్వామి ఆలయాలకు చెందిన భూములను 30 ఏళ్ల పాటు లీజు కింద కేటాయించారు. ఎకరాకు ఏడాదికి రూ.30 వేల చొప్పున నెడ్‌క్యాప్ చెల్లించనుంది.

తితిదే పరిధిలోకి ప్రైవేటు ఆలయాలు

కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, వాటి ఉప ఆలయాలను (ప్రైవేటు ఆలయాలు) తితిదే పరిధిలోకి తీసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విజ్ఞప్తి మేరకు ఈ ఆలయాలను తితిదేలోకి తీసుకునేందుకు వీలుగా తితిదే బోర్డు గత ఏడాది అక్టోబరులో తీర్మానం చేసింది. దీనికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

మాన్సాస్ ట్రస్ట్‌కు చెల్లింపుల నుంచి మినహాయింపు

విజయనగరంలోని మాన్సాస్ ట్రస్ట్.. దేవాదాయశాఖకు చెల్లించాల్సిన పలు నిధుల నుంచి పదేళ్లపాటు మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. దేవాదాయ పరిపాలన నిధి (ఈఏఎఫ్), సర్వ శ్రేయోనిధి (సీజీఎఫ్) చెల్లింపులు నుంచి, వీటి బకాయిల నుంచి మినహాయింపులు, అర్చక సంక్షేమ నిధి చెల్లింపుల నుంచి మినహాయింపు ఇచ్చారు.

రామచంద్రమోహన్‌కి ఏడీసీ-1 బాధ్యతలు

దేవాదాయశాఖ అదనపు కమిషనర్-1 చంద్రకుమార్ ఈ నెలాఖరుకు పదవీ విరమణ చెందనుండగా, ఆ పోస్టులో అదనపు కమిషనర్-2 కె.రామచంద్రమోహన్ అదనపు బాధ్యతలు చూడాలంటూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ప్రస్తుతం రామచంద్రమోహన్ ఇన్‌ఛార్జి దేవాదాయ కమిషనర్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.